AOUA101B134

దేశభక్త
కొండ వేంకటప్పయ్య పంతులు
స్వీయచరిత్ర

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
1175

द्वितीयभागमु

देशभक्त

कोंडा वेंकटप्पय्यपंतुलु की आत्मकथा

द्वितीय भाग

प्रकाशकुलु ;
आंध्र राष्ट्र हिंदी प्रचार संघमु,
विजयवाड-2.

సర్వోదయగ్రంథమాల - ఆరవపుష్పము.

ప్రథమవారం 1955

ప్రతులు 1000

923.254
VEN

EL JAIHOM... ALIBRARY ... DELHI

వెల

రెండురూపాయల పావలా

ముద్రాపకులు :

ఆంధ్ర హిందీ ప్రచార ప్రెస్,

విజయవాడ-2.

కృతజ్ఞత

దేశభక్త కొండ వెంకటప్పయ్యపంతులు గారు ఆంధ్రరాష్ట్ర హిందీప్రచారసంఘమునకు యావజ్జీవితము అధ్యక్షులుగానుండి మహోపకార మొనరించిరి. 1948 ఆగష్టు 15న వారు దేహము చాలించిన వెనుక, వారి కుమార్తెలు ఈ సంస్థయందలి అవ్యాజానురాగమువల్లను, తమ తండ్రిగారియందలి భక్తివల్లను, స్వీయ చరిత్రను ప్రచురించుకొనుటకు ఈ సంఘమునకు అనుమతి యిచ్చినందులకు వారికి కృతజ్ఞులము.

పంతులుగారి స్వీయచరిత్ర మిగుల రసవంతమగుటయే గాక ఎన్నో అపురూపములగు చారిత్రిక విశేషములతో నిండి యున్నది. ఆంధ్రరాష్ట్రోద్యమమును, స్వరాజ్యోద్యమమును పంతులుగారిజీవితముతో పెనవేసుకొనియున్నవి. 1918వ సంవత్సరము వఱకు నడచిన ఆ చరిత్రను 1952లో మొదటి భాగముగా ప్రచురించ గలిగితిమి. ఆ గ్రంథ ప్రతులన్నియు ఆంధ్రుల ఆదరాభిమానములచే విడుదల అయినందుకు సంతసించుచున్నాము. పంతులుగారి స్వీయచరిత్ర మొదటిభాగమును చదివిన పాఠక మహాశయులు రెండవభాగమునుసయితము తొందరలో ప్రకటింప వలసినదని మమ్ము ప్రోత్సహింపసాగిరి. అందువలన రెండవ భాగమును ఇప్పుడు ప్రకటింపగలుగుచున్నాము.

ఈ రెండవభాగములో 1919నుండి 1932వఱకుగల పంతులు గారి చరిత్ర వర్ణితమయి యున్నది. అనగా ఉప్పుసత్యాగ్రహము వఱకు స్వీయచరిత్ర వ్రాయబడినది. అనంతరము పంతులుగారు తమ15 సంవత్సరములు జీవితచరిత్ర వ్రాయవలసియుండిరి. ఆ చరిత్రను గూడ వారు వ్రాసియుండిన యెడల ఇంకను ఎన్నో చారిత్రిక విశేషములు మనకు అందియుండెడివి. కాని ఇంతలోనే వారికి కాలము తీరిపోయినది. కనుక ఈచరిత్ర అసమగ్రముగానే ఉండిపోయినది. పూర్వమువలె ఆంధ్రమహాజనులు ఈ రెండవ భాగమును సముచితము ఆదరింతురని విశ్వసించుచున్నాము.

ఈ సంస్థయందుగల అభిమానముచే గ్రంథమునకు తొలి పలుకు వ్రాసియిచ్చిన స్వామిసీతారామునకు మా కృతజ్ఞతాభి వందనములు పాఠకుల సదుపాయము కొఱకు మొదటి భాగములోని తొలిపలుకును, విజ్ఞప్తి మరల నీ రెండవభాగ ములో సముచితము ప్రకటించుచున్నాము.

విజయవాడ.
15-8-55

విధేయుడు.
ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య.
కార్యదర్శి :
ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘము. విజయవాడ-2.

తొలిపలుకు

శ్రీ దేశభక్త కొండ వెంకటప్పయ్యపంతులుగారు భారతదేశమునను, విశేషముగా ఆంధ్రదేశమునను మిక్కిలి ప్రఖ్యాతిగాంచిన పురుషవరేణ్యులు. ఆంధ్రోద్యమజనకుడు అయన యని చెప్పనొప్పును. బాల్యమునుంచి, ప్రేమతో, జాగరూకతతో, దూరదృష్టితో దానిని పెంచి, పెద్దచేసి, సుప్రతిష్ఠిత మొనర్చెను.

దృఢమైన ఆస్తిక్యబుద్ధియు, నిర్మలమైన ప్రవర్తనయు, అకుంఠితమైన ధైర్యమును, నిశ్చలమైన దీక్షయు, అరమరికలేని అమాయకత్వమును, ఉన్నత ఆశయములును కలిగిన నిరాడంబర ఆదర్శజీవి ఆయన. ఆ సద్గుణములచేతనే లోకోత్తరుడైన గాంధిమహాత్ములవారి ప్రేమకు పాత్రుడయ్యెను. స్వరాజ్యసంగ్రామములో అన్ని ఘట్టములలో ముందంజవేయుచునేయుండెను. శాసనసభా బహిష్కారములో, వృత్తివిసర్జనములో, పన్నుల నిరాకరణలో, ప్రభుత్వధిక్కారములో, కారాగారకష్టపరంపరాసహిష్ణుతలో పేరెన్నికగన్న పెద్ద ఆయన. కార్యోత్సాహములో, నిరంతరకృషిలో, యువకులను వెనుకకునెట్టు, భీతిలచేయు, కర్తవ్యపరాయణుడు. వయసుపెరుగుచున్నను, కార్యాసక్తి తరుగచుండలేదు సరికదా, ఆ రెండునూ—వయస్సు, ఆసక్తి—ఒండొరులలో పోటీపడుచున్నట్లునూ కనపడును. సహస్రమాసములు సంతోషసంభరిత జీవితము గడపిన సన్మార్గవర్తి.

ఇట్టి అనఘుని ఆత్మకథ నీతిబోధకమును, ఉత్తేజికరమునుఅలయియున్నది. దానిని అచ్చొత్తించి ప్రకటించు భాగ్యము ఆంధ్రరాష్ట్ర హిందీప్రచారసంఘమున కబ్బుట సవ్యమే. అనేకసంవత్సరములు ఆయన అధ్యక్షులుగనుండి దానిని రక్షించిరి. ఈ సంఘమును, ఆత్మకథయు తోబుట్టువులు. పరస్పర శ్రేయోభిలాషులు.

దీనికి తొలిపలుకు వ్రాయు అవకాశము దొరకినందులకు నాకునుఆనందము కలుగుచున్నది. పితృతుల్యుని సంస్మరణము సంతోషకారణముగదా!

భౌతికదృష్టితో ఆంధ్రరాష్ట్ర అవతరణమును ఆయనచూడజాలకపోయినను దివ్యదృష్టితో దానిని దర్శించుగాక!

విజయాశ్రయము
ఖరనామ సంవత్సర మాఘబహుళ
నవమి, సోమవారం

సీతారాం

గాంధీశకం
౧౮—౬—౫౫

విజ్ఞప్తి

వీరేశలింగంపంతులు స్వీయచరిత్రతో మన భాషలో స్వకథాకథనము పరిపాటియైనది. రాయసం, చిలకమర్తి, టంగుటూరివారల స్వీయచరిత్రలును, దేశభక్తుని యీ స్వీయచరితయు 19వశతాబ్ది చతుర్థచరణముతో మొదలిడి, యించుమించుగా ఈ శతాబ్ది మధ్యభాగమువరకు నడచినవి. ఈ డెబ్బది యెనుబదేండ్లలో మనదేశమున ఎన్నోయుగ్యములు తలచూపినవి. మన సంఘవ్యవస్థ కొత్తరూపు దాల్చినది. పరప్రభుత్వము గూడ ఒత్తిగిలిభారతమునస్వతంత్రప్రభుత నెలకొన్నది. ఈ మార్పు లన్నిటభాగస్వాములై, వాటికిరూపురేఖలుదిద్దినఆంధ్రమహాపురుషులలో దేశభక్త వేంకటప్పయ్యపంతులుగా రగ్రగణ్యులు.

పంతులుగారు తనువెత్తిచాలించులోపల మూడుపురుషాంతరములుగడచినవి. ఈ మూడుతరములవారికోను పంతులుగా రెప్పటికప్పు డగ్రగాములై నిలిచిరి. మదరాసులో కళాశాలావిద్యార్థుల సమ్మేళో వారిదే ముందంజ. బందరున మొదటి వితంతూద్వాహమున వారిదే ప్రథమతాంబూలము. కృష్ణాజిల్లాసంఘముతో సారంభించిన పంతులుగారి రాజకీయజీవనము స్వరాజ్యలబ్ధివరకు ఒక్కతీరున సాగినది. కృష్ణాపత్రిక వారి కూరిమిబిడ్డ. ఆంధ్రజాతీయకళాశాలా స్థాపకులలోను పంతులుగారున్నారు. స్త్రీ విద్యకై శారదానికేతన సంకల్పము వారిది. వృత్తివిసర్జనమొనర్చి, జీవితమును ప్రజారాధనకంకితమొనర్చిన మొదటి ఆంధ్రులు పంతులుగారు. 1887లో మదరాసున మూడవ కాంగ్రెసుమహాసభ జరిగినపుడే అచట విద్యార్థిగానున్న వెంకటప్పయ్య తన చేతికి కాంగ్రెసుతోరము కట్టుకొనెను. అది మొదలు స్వరాజ్యలబ్ధివరకు గడచిన ఏబదేండ్లలో ఆంధ్రజీవననౌక నాయనయే కర్ణధారియై నడిపించెను. ఇవి యన్నియు నొకయెత్తు. ఆయన స్వయముగకనిపెంచిన ఆంధ్రోద్యమ మొకయెత్తు. ఆంధ్రరాష్ట్రి మాంధ్రరాష్ట్రిమని జపించుచునే వీరపుంగవుడగు దేశభక్తుడు తనువు చాలించెను. ఇట్లు బహుముఖముల విస్తరించిన పంతులుగారి స్వీయచరిత్రయే ఈ డెబ్బదేండ్ల ఆంధ్రదేశచరిత్ర. పంతులుగారి ప్రజారాధన ప్రవణత తెలుగునేల యెల్ల లతిక్రమించినదిగాన భారతదేశచరిత్రగూడ నిందు అల్లుకొనియున్నది.

పంతులుగారి ఆకారప్రజ్ఞాబలగంపద లంతచెప్పికోదగ్గవికావు. విద్యలో వాచాలతలో వారిని మించిన తెలుగువారున్నారు. భోగరాజువారిప్రజ్ఞాప్రకర్షగాని, టంగుటూరివారి సాహసరసికతగాని, కాశీనాథునివారి వితరణవీరముగాని కొండ వారికిలేవు. అట్లయ్యా, వీటినన్నిటిని మించిన సత్యతత్పరత, ఆస్తిక్యము, వినయము, నిరంతరసేవాసక్తి, ఆత్మవితరణము—ఇవి దేశభక్తుని సమానులలో ఉత్తమశ్లోకు నొనర్చినవి. పంతులుగారి హృదయము కుసుమకోమలము. కావుననే వజ్రకఠోరతనపేక్షించు రాజనీతి ధౌరంధర్యము వారి కలవడలేదు. పంతులుగారి జ్ఞానశక్తికంటె క్రియాశక్తి దొడ్డది. క్రియాశక్తికంటె భక్తిపరిప్లావితమగు వారి ఆర్ద్రచిత్తత దొడ్డది. కనుకనే వారి సేవాశీలము మాత్సర్యము నెఱుగదు. వారి ప్రభుత ఘృణాకలితమై, పట్టువిడుపులు నేర్చికొని, యుదారచరిత కాస్పదమైనది. గాంధీజీ పిలుపు పంతులుగారి గోపికాహృదయమునకు వేణునాదమైనది. చిన్న నాటనే నాటకములలో స్త్రీపాత్ర మభినయించిన పంతులుగారికి రసతత్పరత వెన్నతోబెట్టినవిద్య. కవిగాదగిన పంతులుగారు రాజకీయజంఝాలమున బడినను ఒడలు బురదగాకుండ సాధుహృదయమును సంరక్షించుకొనిరి.

ఈ గ్రంథమున పంతులుగారి కలము కావ్యపాకము నందికొన్న ఘట్టము లెన్నియో యున్నవి. దాపరిక మెరుగని వారి సత్యసంధత, మాయ మర్మము లెఱుగని వారి అచ్ఛశీలము, చేటుపాల్లెఱుగని ఉత్సాహశక్తి—అడుగడుగున నిందు ప్రత్యక్షమగును. పంతులుగారు హాస్యరసమునుగూడ నిందు ఎడనెడ చవి చూపిరి. ఆంధ్రభాషకు, చరిత్రకు అలంకారప్రాయమైన ఈ స్వీయచరిత్ర పరిపూర్తినందక 1932తో నాగిపోవుట మన దురదృష్టము. అమూల్యమగు ఈ గ్రంథప్రచురణభాగ్యము మా సంఘమునకు గల్పించిన పంతులుగారి కుటుంబమునకు గృతజ్ఞులము.

కాటూరి వేంకటేశ్వరరావు,
సాహిత్యశాఖాధ్యక్షులు.
ఆంధ్రరాష్ట్రహిందీ ప్రచారసంఘము

విజయవాడ,
2—2—1952

విషయసూచి

		పేజీ
1.	స్వరాజ్యోద్యమము – – –	1
2.	రౌలటు శాసనము – – –	2
3.	కడప – – –	7
4.	హోమురూలు – – –	10
5.	శాసనసభాప్రవేశం – – –	13
6.	గాంధీజీ అవతరణం – – –	29
7.	సబర్మతీ తపోవనం – – –	36
8.	పల్నాటికథ – – –	39
9.	కారాబంధనము-విడుదల – – –	46
10.	శాసనసభా బహిష్కారము – – –	58
11.	వృత్తిత్యాగములు – – –	60
12.	బెజవాడ సభలు – – –	64
13.	మహాత్మునితో సంచారం – – –	67
14.	గృహకృత్యములు – – –	77
15.	రెండవ కుమార్తెవివాహము – – –	84
16.	పన్నుల నిరాకరణము – – –	93
17.	వెదనందిపాటి బారతము – – –	99
18.	ఉద్యమ విరమణము – – –	110
19.	కారాగారవాసము – – –	116
20	శారదానికేతనము – – –	123
21.	రోగితో సంచారము – – –	129
22.	కాంగ్రెసు పీఠాధిపత్యము – – –	134
23.	కాకినాడ కాంగ్రెసు – – –	143
24.	సుఖదుఃఖములు – – –	153
25.	లాభనష్టములు – – –	158
26.	ఉప్పు పంటలు – – –	162

దేశభక్త

కొండవేంకటప్పయ్యపంతులు

స్వీయచరిత్ర

ద్వితీయ భాగము.

స్వరాజ్యోద్యమము.

ఈ మధ్యకాలములో కాంగ్రెస్ వ్యవహారములు చాల నడిచిపోయినవి. శ్రీ దాదాభాయి నౌరోజీ అధ్యక్షత వహించి, భారతజాతియొక్క రాజకీయప్రమావధి 'స్వరాజ్య'మని ఎలుగెత్తి వక్కాణించిరి. ఈ స్వరాజ్యశబ్దము మనవారి నత్యంతోత్సాహ పూరితులను గావించి నూతన ప్రయత్నమునకు పురికొల్పినది. దేశమునందంతట ఆబాలవృద్ధముగా అపూర్వమగు ఆవేశమును కల్పించినది. కాని ప్రభుత్వమువారిని కోపోద్దీప్తులను చేసినది. "స్వరాజ్య" మని పల్కినవారిని శిక్షాపాత్రుల జేయసాగిరి. కాకినాడ కళాశాల విద్యార్థులు గోడమీద స్వరాజ్యమని వ్రాసినందుకు శిక్షింపబడిరి. శ్రీ బాలగంగాధరతిలక్ వ్రాతలలో స్వరాజ్యపద ముపయోగించుటయు నేరమాయెను.

రౌలట్ శాసనం

ఇట్లుండగా 1914లో మహాయుద్ధము సంప్రాప్తమైనది. జర్మనులు పెచ్చుపెరిగి ఇంగ్లాండుమీద దాడి వెడలుదురను భయము ఆంగ్లేయుల నావహించెను. భారతీయసైనికులు ఫ్రాన్సు రంగములో ఘోరముగ పోరాడి, జర్మను శతఘ్నులు కురిపించు అగ్నిగోళములను లెక్కచేయక జర్మనుపై దుమికి వారి గర్వ మడంచి శతఘ్నుల వశపరచుకొని, అనన్యమగు వీరప్రతాపమును ప్రదర్శించిరి. అపుడు ఆంగ్లేయ ప్రముఖులు పార్లమెంటులో మన సైనికుల ప్రభావమును వేయినోళ్ళ ప్రస్తుతించి, ఆదరవచన ములు పలుకటయేగాక భారతభూమికి స్వాతంత్ర్యమీయనలసి నదేయని చెప్పుచు పేరాశలను కల్పించిరి. యుద్ధము ముగిసిన పిమ్మట ఆమాటలుమరచిపోయిరి. భారతదేశమున రాజద్రోహము పెరిగిపోవుచున్నదను మిషతో "రౌలట్ శాసనము" అను రాక్షస చట్టమును ప్రచురించి అమలులో పెట్టసాగిరి. రాజ ద్రోహులని అనుమానించి ఎందరినో చెరలోబెట్టి నారంభించిరి. ఆ నేరములను ప్రత్యేక న్యాయస్థానములో విచారణలు జరిపించి శిక్షలు వేయుచుండిరి.

ఈ రౌలట్ శాసనము ప్రవేశపెట్టకపూర్వమే పునహాలో బొబ్బలవ్యాధి వ్యాపించి పలువురు చనిపోవుచుండిరి. ప్రజలు ఇండ్లలో వ్యాధిగ్రస్తులను దాచిపెట్టిరనుమిషతో ఆంగ్లసైనికులు ఇండ్లలో ప్రవేశించి దుండగములు చేయుచుండిరి. ఆంగ్లసేనాని ఆ విషయమున జరుపుచున్న దౌష్ట్యమును లోకమాన్యతిలక్ ఖండించుచు పత్రికలలో వ్రాసిరి. బహిరంగ సభలు గావించి సైనికుల ఘోరకృత్యములను బాహాటముగ, నిర్భయముగ

ఆక్షేపించుచుండిరి. అంతట ప్రభుత్వము తిలక్ గారిపై అభియోగ
మును బెట్టి విచారణప్రారంభించెను. ఆ విచారణలో తిలక్ గారు
స్వయముగనే శాంతముతోడను, ధైర్యముతోడను, నిపుణత్వము
తోడను ప్రతివాదము చేసి తమధీరోదాత్తతయు, అమేయబుద్ధి
వైశద్యమును ప్రకటించిరి. తుదకు వారికి ఆరుసంవత్సరములు
కఠినమగుకారాగార శిక్ష విధించి, బర్మాదేశములోని మాండలి
పట్టణమున చెరసాలలో నుంచిరి.

తిలకు మహాశయులు రాజకీయములందు తీవ్రవాదులు. రహస్యముగ ఆంగ్లేయోద్యోగుల హత్యలుగావించిన రాజకీయ పక్షమువారికి వీరు చేయూత నొసంగుచుండిరను ప్రతీతిగలదు. బాంబుల నిర్మాణ విధానమునుగూర్చి వీరుపత్రికలలో ప్రకటనలు గావించియుండిరి. ఇందునలననే పునహాలో జరిగిన "రాండు" సేనాని హత్యలో వీరికి సంబంధము కలదని అపవాదు ఏర్పడుట సంభవించెను. ప్రభుత్వమునకు వీరు సింహస్వప్నముగ నుండిరి. గోఖ్లేగారివలె వీరు శాసనసభా సభ్యత్వమునకు ప్రయత్నించక "మహారాష్ట్ర" అను నొక పత్రికను ప్రకటించుచుండిరి. వీరికి శ్రీ కేల్కార్ అను మరియొక విద్వాధికులు, దేశసేవానిరతులు, తోడ్పడి కార్యదర్శిగా పనిచేయుచుండెను.

గోఖ్లేగారు కేంద్రశాసనసభలో ప్రాధాన్యమువహించి ప్రభుత్వవిధానమునందు దోషములను బయల్పరచి నిర్భయముగ ఖండించుచుండిరి. వీరిరువురును నిరుపమాన దేశభక్తులైనను ఆచరణయందు వేరగుచుండిరి. కావుననే దేశములో మితవాదులు. అతివాదులు అను రెండు కక్షలేర్పడుటకు కారణమయ్యెను.

సూరతులో వీరిమధ్య కలహము జగగుటయు కాంగ్రెసు రెండు పక్షము లగుటయు తటస్థించెను. గోఖ్లేగారు 1916లో గతించిరి. అంతట మితవాదులబలము చాలవరకు క్షీణించెను. కాంగ్రెసులో మాత్రము వారింకను పాల్గొనుచునేయుండిరి. డాక్టరుఆసీబిసెంటు మతప్రచారమునకు దోడు రాజకీయప్రచారముగూడ నారంభించెను. దివ్యజ్ఞానసామాజికులు పలువురు ఆమెకు తోడ్పడసాగిరి. హైకోర్టులలో న్యాయమూర్తులుగా నుండిన సుబ్రహ్మణ్యయ్యరు గారు ఆమె అనుచరులలో ముఖ్యులు. ఆమె న్యూఇండియాఅను పత్రికను నడిపించి ప్రబోధము గావించుచుండెను.

కౌలట్ శాసనమునుఖండించుచు పత్రికావ్యాసములును, బహిరంగసభలును ఆసేతుహిమాచలము తీవ్రముగ సాగెను. పంజాబులో అమృతసరు పట్టణమున జలియనువాలాబాగ్ అను తోటలో డాక్టరు కిచ్లూ, డాక్టరు సత్యపాల్ అనువారు కౌలట్ శాసనమును ఖండించుచు మహాసభలో ఉపన్యసించుచుండిరి. వేనవేలు పురుషులు, స్త్రీలు, పిల్లలును ఆ సభలో సమావేశమై ఉపన్యాసము వినుచుండగా డయ్యర్ అనునొక ఆంగ్లేయసేనాని ఆంగ్లేయ సిపాయిలచే ఆ మహాజనముపై ఫిరంగులు కాల్పించెను. ఆ తోటకు చుట్టును గోడలుండి, యొకటి రెండు మార్గము లుండుటచే గుండు దెబ్బలుతప్పించుకొని పారిపోవుట కైన త్రోవ లేదాయెను. వందలకొలది జనులు గుండ్లదెబ్బలు తిని ప్రాణములు గోల్పోయిరి, ఆ యిరువురు కాంగ్రెసు నాయకులను పట్టుకొని ప్రభుత్వమెటకో పంపివేసెను. ఈ వార్త విని ప్రజలు వేనవేలు వివశులై, రైలుస్టేషను తగులబెట్టిరి. బ్యాంకుపై దాడిచేసి, బ్యాంకి మానేజరును చంపివేసిరి. మరికొన్ని ప్రభుత్వ

కచ్చేరీలను తగులబెట్టిరి. అంతట ఆ పట్టణమును సివిలుఉద్యోగుల స్వాధీనమునుండి తప్పించి సైనిక శాసనమును అమలులోపెట్టి ప్రజలను పడరాని యిడుములపాలేసిరి.

ఇట్లు సాగించిన అనమానములు పంజాబుదురంతములని దేశ మంతట మారుమ్రోగెను. డైయరుసేనాని గావించిన ఈ రాక్షసకృత్యమును గూర్చి కాంగ్రెసుపక్షమున కొందరు విచారణ గావించి, ఆతని నపరాధి యని నిర్ణయించి, ఉద్యోగమునుండి తొలగించవలెనని నివేదిక సిద్ధముచేసిరి. ఆయన ఈదేశమునుండి వెడలిపోయినపిమ్మట ఆంగ్లదేశపు గౌరవమును కాపాడిన మహా నీయుడని ఆ దేశస్థులు శ్లాఘించి ఒక ఖడ్గమును పారితోషికముగ నిచ్చి బహూకరించిరి.

ఈ భయంకరోదంతము ఆంగ్లేయుడు సాగించుటయు ఆంగ్లప్రజలు వానిని బహూకరించుటయు గాంధీజీకి విపరీత ముగ తోచెను. ఆంగ్లేయ ప్రభుత్వమెట్లున్నను ఆంగ్లేయులు ఉదారస్వభావులను విశ్వాసము ఆయన హృదయమున తొల్లి నాటుకొని యుండెను. అందువలననే 1914లో యుద్ధసమయమున లోకమాన్యతిలక్ వలదని చెప్పినను వినక గాంధిమహాత్ములు ప్రభుత్వము మహోపద్రవములోనున్నపుడుతోడ్పడుటయేన్యాయ మని ప్రతివాదము గావించిరి. తాము ప్రత్యేకముగ చిన్నపటాల మును సమకూర్చి ఆంగ్లేయులకు సహాయముగ పంపించిరి. కాని జలియన్‌వాలా దురంతములతో ఆ విశ్వాసము గాంధీజీకి బొత్తుగ మాసిపోయెను. ఇదియే అసహాయోద్యమము సాగించుటకు కారణము.

ఇంతలో ప్రభుత్వము మాంటేగు అను రాజకీయవేత్తను సింగారించి భారతదేశమున కంపెను. అప్పుడు రాజప్రతినిధిగా నున్న ఛమ్స్‌ఫర్డ్ ప్రభువుతోగలసి ఆయన వివిధరాష్ట్రములలో సంచారముచేసి రాజ్యాంగసంస్కారమునుగూర్చి ప్రజాభిప్రాయమును విచారింప జొచ్చెను. వారిరువురును చెన్నపట్టణమునకు వచ్చినప్పుడు ఆంధ్రమహాసభాపక్షమున నొక ప్రతినిధి సంఘమును సమకూర్చి వారియొద్ద ఆంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకతను నిరూపించుచు నివేదికను అందించితిమి. ఆంధ్రమండలములలో ముఖ్య పట్టణములకుబోయి సమ్మతులు తీసుకొని, ఆంధ్రమహాసభా స్థాయీ సంఘమును సమావేశపరచితిని. ఆ సభలో మోచర్ల రామచంద్రరావుగారు, పట్టాభిసీతారామయ్యగారు, వరహగిరి జోగయ్యగారు మొదలగువారు హాజరైరి. నివేదికను రామచంద్ర రావుగారే వ్రాయించిరి. అందరును ఆమోదించిరి. ఆ ఉపసంఘమునకు ప్రధానులుగా న్యాయపతి సుబ్బారావుగారిని నియమించిరి. మాంటేగు ఛమ్స్‌ఫర్డులను దర్శించి నివేదిక నందిచ్చితిమి. ఈ నివేదికలో కేవలాంధ్రరాష్ట్ర నిర్మాణమునుగూర్చియే గాక భారతదేశమందలి వివిధభాషాప్రాంతములనెల్ల ప్రత్యేక రాష్ట్రములుగ నిర్మించుట యవసరమని నిరూపించబడినది. మాంటేగూఛేమ్స్‌ఫర్డులును వారితో వచ్చిన పార్లమెంటు సభ్యులును సానుభూతితో దానిని గైకొని కొన్ని ప్రశ్నలడిగి దానినిగూర్చి యోచించెదమని సమాధానవచనములు చెప్పిరి. ఈ సంభాషణల ఫలితముగ ఆ యారాష్ట్రములలోని శాసన సభలలో భాషాప్రయుక్తరాష్ట్రనిర్మాణమును ఆమోదించుచు తీర్మానములు చేసినయెడల అట్టిరాష్ట్రములు నిర్మించబడునని

నిబంధన యొకటి నూతన భారతరాజ్యాంగ చట్టమునందు కూర్చబడినది.

కడప

1917లో ఆరవ ఆంధ్రమహాసభ నంద్యాలలో జరుగ వలసి యుండెను. నంద్యాలవారు ఉత్సాహపూరితులైయున్నను అచట కలరా జాడ్యముప్రబలుటచే మహాసభను రాయలసీమకు గడపగానున్న కడపలో జరుపుట యుక్తమని యెంచి శ్రీ కె.గుండు రావు మొదలగు అచటిప్రముఖులతోసంప్రదించితిని.అచ్చటి నగర ముఖ్యులను సమావేశపరచి రాయలసీమలో జరుపుటకు నిశ్చయింపబడినసభ మరలవెనుకకుబోవుటన్యూనతయనిచెప్పి ప్రత్యేక రాష్ట్రప్రబోధ మీ సీమప్రజలకు సలుపుటవశ్యము గాన సభ కడపలో జరిపించవలసినదనివక్కాణించితిని. వారునుఅంగీకరించి, తా మొక వెయ్యిరూపాయలకంటె సమకూర్చ జాలమనియు, ప్రొద్దుటూరివారుగూడ తోడ్పడినచో ఈ యత్నమునెరవేరు ననిరి. ప్రొద్దుటూరివారిని సమ్మతింప జేయుడని నన్నేకోరిరి. నేను ప్రొద్దుటూరు సమీపమున రైలుదిగునప్పటికి పండ్రెండు గంటలు మిగిలిపోయెను. అచ్చట నొక బ్రాహ్మణ బసలో విచారించగా వారింట తద్దినముగాన ఆలస్యమగునని చెప్పిరి. కనుక భోజన సమిత్తము వేచియుండి కాలము వ్యర్థముచేయుట కిష్టములేక పుచ్చకాయ ముక్కలు రెండు తిని నీరు త్రాగి, ప్రొద్దుటూరు చేరునప్పటికి మూడుగంటలు మిగిలినది. అది వేసవికాలమగుటచే కోర్టు మూసివేసిరి అదివరకు గుర్తెరిగిన యొక న్యాయవాదిగా

రింటికి పోతిని. ప్లీడరుగారు లోపల నిదురించుచుండిరి. గుమస్తా గారు నన్ను జూచి భోజన మయినదా యని ప్రశ్నించిరి. "ఇంత వరకు భోజనముచేయకుందురా ఎన్నైన?" అని సమాధానము చెప్పితిని. పిమ్మట నొకమిత్రుని యింటికి పోగా, ఆయన యింట లేడు. అచట నొక సన్యాసి యుండగా ఆయనతో ఆధ్యాత్మిక విషయములు ముచ్చటించుచు కాలముగడిపితిని. ప్రొద్దుతూలి, అయిదుగంట లయినది. నేను మొదటవెళ్ళిన యింటి యజమాని నేను నచ్చిన సంగతి తెలిసికొని నా కొఱకచటికి వచ్చి క్లబ్బుకు రమ్మని పిలిచి వెంట తీసికొనిపోయిరి. అచ్చట పురప్రముఖులను కలుసుకొంటిని. సంభాషణలో చుట్టుప్రక్కల గ్రామములలో జరుగుచుండు ప్రాణహత్యలనుగూర్చి చెప్పుకొనుచు నొక యూరిలో లోగడ దినము జరిగిన హత్యల విషయము వివరించిరి. ఆ యూరివా డొకడు మరియొకని జంపెనట. తనపై నేర్పును ఖూనీకేసు దాఖలు అగునుగాన దానికి ప్రతిహతముగ తన యింటిలో నొక ముసలమ్మను తానే చంపి, ఆమెను ప్రతికక్షులు హత్యచేసిరని కల్పన చేసెనట. ఆ జిల్లాలో క్రిమినలు కేసులే విశేషము. ఈ క్రిమినల్ కేసులలో శ్రీ వసంతరావుగారు కను మర్థ్వాలు చాలద్రవ్యము నార్జించిరని నే నావరకేవినియుంటిని.

నన్ను క్లబ్బుకు తీసికొని వెళ్ళిన స్నేహితుని యింటనే ఆ రాత్రి భోజనముచేసితిని. మధ్యాహ్న భోజనమెక్కడనని వారు నన్ను ప్రశ్నించిరి. ఆ రోజున కదియే భోజన మంటిని. వారు మిక్కిలి నొచ్చుకొనిరి. మరుసటి దినము ఆ యూరిలో ముఖ్యులగువారినందరిని సమావేశపరచిరి. శ్రీ వసంతరావుగారే అధ్యక్షత వహించిరి. కడపలో ఆంధ్రమహాసభ జరుగుటకు

ప్రొద్దుటూరివారి సహకారము ముఖ్యమని విన్నవించితిని. వారునూ అంచుకంగీకరించి కడపవారితో సంప్రతించి తగిన ఏర్పాటులు చేయుదుమని అభయహస్తమిచ్చిరి. శ్రీ వసంతరావుగారివలన యుత్తరము తీసికొని మరల కడప కేగి అచ్చట జరిగిన విషయములు తెలిపితిని. ఇట్లు సభా సమావేశము నిశ్చయపరచుకొని,అధ్యక్షపదవికి శ్రీ నెమలిపట్టాభిరామారావుగారికి ప్రాసి వారి ఆమోదమును సొంచుటయ్యెను. శ్రీ పట్టాభిరామారావుగారు సెటిల్‌మెంటు శాఖలో పెద్దయుద్యోగము చేసి, పిమ్మట కొచ్చిన్ సంస్థానములో దివానుగా పనిచేసి యుండిరి. రాయలసీమలో గొప్ప ప్రముఖులుగా పరిగణింప బడుచుండిరి.

ఆంధ్రరాష్ట్రము కాంగ్రెసువ్యవహారములకొఱకై ప్రత్యేక సరిహద్దులుగా నేర్పడిన కారణమున చెన్నరాష్ట్ర కాంగ్రెసుసంఘము నుండి విడిపోయి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమేర్పడెను. న్యాయపతి సుబ్బారావుపంతులుగారిని అధ్యక్షులుగ, నన్ను కార్యదర్శిగ ఎన్నుకొనిరి. కాన ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు మహాసభ గూడ ఆ యేడు ప్రత్యేకముగ కడపలోనే జరుపుట కేర్పాటు చేయబడెను. ఆ సభకు విశాఖపట్టణ వాస్తవ్యులును, శాసనసభా సభ్యులునగు శ్రీ భూపతిరాజు వెంకటపతిరాజుగారు అధ్యక్షులుగ నుండుటకు సమ్మతించిరి. ఈ రెండు మహాసభలును కడపలో నిర్విఘ్నముగ నడచినవి. ఆంధ్రమహాసభలో రాష్ట్రనిర్మాణ విషయమున ఆక్షేపణలు రాలేదు. ఈ సభలలో ఆంగ్లభాషలో ఉపన్యసించు అభ్యాసము మానలేదు. తెలుగున ముచ్చటించు అభ్యాసము లేకపోవుటచే చక్కగ భాషించలేమను భయము

ఎక్కువగా నుండెను. కాని ప్రేక్షకులలో తెలుగు మాత్రమే తెలిసిన వా రెక్కువగా నుండుటచే తెలుగు భాషణలయందే అభిమానముఅతిశయిల్లుచుండెను .శ్రీపట్టాభిరామారావుపంతులు గారిబంధుగురాలు రుక్మిణమ్మగారు ఇంటరు పరీక్షలో కృతార్థురాలైయుండిరి. వారుఆంధ్రమహాసభలో ఆంగ్లమునధారాళముగ నుపన్యసించిరి. ఆంధ్రయువతి మహాసభలో సంభాషించుట యపూర్వమగుటచే ఆమెను సభాసదులు హెచ్చుగమెచ్చుకొనిరి.

హోమురూలు

డాక్టరు ఆనీబీసెంటు "హోమురూలు లీగు" అను ఉద్యమము ప్రచారముచేయ నారంభించెను. ఆమె వాడియీమున్నగు ప్రధాన శిష్యులతోగూడ గుంటూరువచ్చి, నాయింటనే బస చేసిరి. దేశ సేవానురక్తితోపాటు వారియండు కొంత భోగ పరాయణత్వము ప్రకటితమగుచుండెను. మా యింట మేడమీద ప్రత్యేకముగ వారు తెచ్చుకొనిన వెండిపళ్లెరములలో భుజించు చుండిరి. ఈ హోమురూలు సమితిలో తిలకుమహాశయులు సహితముచేరి ప్రచారము సాగించుచుండిరి. ఈ సమితిపక్షమున మాంటేగు ఛమ్స్‌ఫర్డుల కొక నివేదికనిచ్చుట కుపసంహుము ఏర్పరచి, అందు నన్నుగూడ సభ్యునిగచేర్చినకారణమున నేను దానికొరకు ఢిల్లీకి పోతిని. అచ్చటికి తిలకు మొదలగు ప్రముఖులు గూడ విచ్చేసిరి. ఆనీబీసెంటుగారే నివేదిక తయారుచేసి, ఉదయమున మా కందరకు చదివివినిపించెను. ఆమె హోమురూలు లీగునకు అధ్యక్షురాలుగను తిలకుగారు ఉపాధ్యక్షులుగ నుండిరి.

ఆ నివేదికను వినిపించిన పిమ్మట దానిని ఎవరు సమర్పించుట యను ప్రశ్న వచ్చినపుడు తానే చదివి అందిచ్చెదనని ఆమె చెప్పుచుండెను. ఆ సమయమున నేను తిలకుగారి ప్రక్కనే యుంటినిగాన తాము స్వదేశ ప్రముఖులుగాన తామే చదివి వారి కిచ్చుట యుక్తమని మెల్లగ వారితో పల్కితినిగాని, ఆమె కుతూహల పడుచున్నదిగాన ఆమె కోర్కెయే నెరవేగనిమ్మని వారు నాకు సమాధానము చెప్పిరి.

ఆ మధ్యాహ్నము మేము మాంటేగు ఛమ్స్‌ఫర్డులను కలుసుకొనబోగా అచ్చటికి గాంధిమహాత్ములుగూడ వచ్చి యుండిరి. వారు ధరించిన ముతుక దుస్తులు చూచినవారికికొంత విపరీతముగ చూపట్టెను. పెద్ద ఖద్దరు తలగుడ్డ రహితులు చుట్టు కొనుసట్లు చుట్టుకొని, ఖద్దరుదుప్పటి కప్పుకొని, కాళ్ళకు పల్లెటూరి చెప్పులు తొడుగుకొని యుండిరి. మే మందరము లాగులు, కోట్లు తొడుగుకొని సరిగపాగలు చుట్టుకొనియుంటిమి. మేము కట్టు కొనిన ధోవతులు స్వదేశీ మిల్లులవి. కోట్లు ఇంగ్లీషుటైప్‌వి, ఆల్ పేకాలతో చేయబడినవి. తిలక్ మహాశయుడు గుడ్డబొంచులు గల తెల్ల అంగరాయును జల్తారుకుచ్చుగల ఎఱ్ఱని పగడీని ధరించి యుండెను.

హోమురూలు ప్రచార సందర్భములో డాక్టరు ఆనీబీ సెంటును ప్రభుత్వముపట్టుకొని ఉదకమండలములో నిర్బంధముగా నుంచిరి. అంతట దేశమున కొంత అలజడి ప్రారంభమైనది. శ్రీ ఎస్. సుబ్రహ్మణ్యయ్యర్ గారు ఆనీబీసెంటు అనుచరులలో ముఖ్యులుగాన చాలతీవ్రమగు వ్యాకులత నొందిరి. అమెరికా

సంయుక్తరాష్ట్రములు అధ్యక్షుడు విల్సన్ గారికి పెద్ది యుత్తరము వ్రాసి, అందులో భారతదేశములో ఆంగ్లేయప్రభుత్వము సాగించు చున్న దుర్నయములను వారు వివరించిరి. ఆ యుత్తరములో శ్రీ దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులుగారును, నేనునుగూడ సంకేతములు చేసితిమి. ఈ యుత్తరము వ్రాసినందుకు ప్రభుత్వము కొంత చర్య జరుపనెంచియు పిమ్మట మిన్నకుండెను. అయ్యరుగారు ప్రభుత్వము తన కిచ్చిన 'సర్' బిరుదమును త్యజించి తిరస్కారభావమును వెలిబుచ్చిరి. పిమ్మట కొన్ని మాసములకు ఆసీబీసెంటుగారి మీద నిర్బంధము తొలగించిరి.

ఇంతలో భారత రాజ్యాంగ స్వరూపమునగూర్చి కాంగ్రెసు సభ ప్రభుత్వమునకొక ప్రణాళిక నంపెను. అందు రాష్ట్రములకు సర్వస్వతంత్రమును, కేంద్ర ప్రభుత్వమున గవర్నరు జనరల్‌గారి నామమాత్రాధిపత్యమును కోరబడెను. ఆసీబీసెంటు గారు భారతభూమికి ప్రజాపరిపాలన ఒసంగవలెనని తెలుపుచు, ఆంగ్లేయరాజ్యమునకు, భారతభూమికి శాశ్వతమైన అనుబంధ ముండవలెనని స్పష్టపరచుచు తా మొక ప్రణాళిక స్వతంత్రముగ రచించి ప్రకటించిరి. ఇది భారతీయనాయకులలో పలువుర కసమ్మతముగ నుండెను. ఆమె ఆంగ్లేయప్రభుత్వ పక్షపాతియని పలువు రనుకొనునుండిరి. ఇట్లు వ్రాతల్తును చర్చలును జరుగుచుండగనే పార్లమెంటులో నూతన భారత రాజ్యాంగ చట్టము ఆమోదింప బడి ప్రకటించబడెను. దీనిని కాంగ్రెసు సంఘములు దేశమంతటను సభలుగూడించి అసమ్మతి తీర్మానములను ప్రకటించెను.

శాసనసభా ప్రవేశం

కాంగ్రెసువారు శాసనసభలలో సభ్యత్వము నంగీకరించ కూడదని నిషేధము చేయలేదు. కావున అన్ని రాష్ట్రము లందును కాంగ్రెసు సభ్యులుకూడ స్వతంత్రముగ సభ్యత్వమునకు పోటీచేయుట సంభవించినది. ఇంతకుముందు గంజాముసుంచి శ్రీ బయ్యా నరసింహేశ్వరశర్మ, ఆకెళ్ల సూర్యనారాయణరావు భూపతిరాజు వెంకటపతిరాజు,సి. నరసింహరాజుగార్లును, గోదావరి నుంచి శ్రీ కృత్తివెంటి పేరరాజు, గంజాము వెంకటరత్నము పంతులు, న్యాపతి సుబ్బారావు పంతులు, మోచర్ల రామచంద్ర రావు పంతులుగార్లును నెల్లూరునుండి ఆమంచర్ల సుబ్బకృష్ణ రావుగార్లును శాసన సభలో ఉత్తరజిల్లాల తరపున సభ్యులుగా నుండి ఖ్యాతిగాంచిరి. వీరుగాక ప్రభుత్వమువారు నియామకము చేసిన సభ్యులు శ్రీ పిఠాపురపురాజాగారు మొదలగువారు కొందరుండిరి. వీరిలో నెవ్వరుగాని కృష్ణా గుంటూరు జిల్లాల వారు లేరు. గోదావరి కృష్ణా గుంటూరు జిల్లాలుమూడును కలసి, ఒక్క సభ్యుని ఎన్నుకొను సంయుక్తప్రదేశముగా నిర్ణ యింపబడినది.మునిసిపాలిటీ,జిల్లాబోర్డు, తాలూకాబోర్డు సభ్యులు మాత్రమే ఓటర్లుగానుండిరి. అంతకుపూర్వపు ఎన్నికలలో శ్రీ గంజాము వెంకటరత్నము పంతులు, కృత్తివెంటి పేరరాజుగారి విషయములో నేనును కొంత ప్రయత్నము చేసియుంటిని. అప్పటికే రామచంద్రరావుగారికి రెండుసార్లు తోడ్పడి వారి సభ్యత్వము నెగ్గించగల్గితిమి. ఈ మూడవసారిగూడ వారేయుండ వలెనా మరియొకరు ఉండకూడదా యను ప్రశ్న బయలుదేరినది. మన కృష్ణాగుంటూరు జిల్లాలలో నెవ్వరినైన నిలుపకూడదాయని

చర్చ ప్రారంభమైనది. నన్ను నిలువవలసినదని సలహాలు రా సాగి నవి. గత ఎన్నికలలోగూడ నన్ను ప్రయత్నము చేయనలసినదని కొందరు మిత్రులు ప్రోత్సహించిరి గాని రామచంద్రరావుగారు మిక్కిలిసమర్థతతో సభ్యత్వధర్మము నిర్వహించుచుండగా నే నెందుకని యెంచి, ఆ ప్రయత్నము తలపెట్టుకొనలేదు. ఈ సారి యెప్పుడు నొక్కరే యుండుటకంటె నితరులకుగూడ ననకాశ ముండుట యుక్తమని నాకనుతోచినది. కాని నాకంటె అనుభ వము సమర్థతయు నున్న శ్రీ పురాణము వెంకటప్పయ్యపంతులు గారు నిలుచుట బాగుండునని తలచి నేను స్వయముగ బందరు పోయి వెంకటప్పయ్య పంతులుగారిని నిలువనలసినదని కోరితిని. బహుదూరము వారిని ఒప్పించుటకుప్రయత్నించితినిగాని ఆయన సమ్మతించక, నన్నే నిలువనవలసినదని ప్రోత్సహించసాగిరి. అంతట మరల ఇంటికి జేరి, మిత్రులలో నెవరిని సంప్రదించబోయినను నన్నే నిలువుమని సలహా ఇచ్చుచు మరెవ్వరి విషయమును చెవిని చొరనీయకుండిరి. ఇట్లుండగా రామచంద్రరావుగారితో నేను పోటీ చేయుట యుక్తమాయను సందియము మనస్సున బాధించుచుండెను.

ఈ లోపల ఈ కృష్ణాడెల్టాలో తాటితూములు గాజుతూ ములు వివాదతలమెత్తెను. రహితులలో చాలకలవరము వ్యాపిం చెను. అప్పటి ఎగిక్యూటీవు యింజనీయరు ఆంగ్లేయుడు. రహితుల మొర చెవిని చొరనీయక తన కచ్చేరీలోకూర్చుండి ప్లానులపై ఆరరు వేయుచుండెను. కావున ఈ విషయమున రహితులకు తోడ్పడవలసిన అవసరము ఏర్పడినది. గుంటూరు జిల్లా సంఘము ఏర్పడి దానికి నేను అధ్యక్షుడుగ నుండిన కారణమున మరింత

బాధ్యత నాకు ఏర్పడినది. ఈ లోపల చెన్నపురి గవర్నరు గుంటూరుకు విచ్చేసిరి. వారిని సన్మానించు పౌరసంఘ కార్య దర్శిగా నన్నేర్పరిచిరి. నేనుసన్మానపత్రము కొత్తతూములవలన జిల్లాలో మాగాణిహితులకు కలుగుచున్న కష్టనష్టములను వివరించితిని. అధికారుల లోపములను నిర్భయముగ నెలిబుచ్చి నందుకు ప్రజలు సంతసించిరిగాని గవర్నరుగారు నా వాక్యము లను ప్రసంగించుచు కొంచెపు లోపములను గొప్పగాచేసి ప్రభుత్వ చర్యలనుగూర్చితీవ్రముగ నిందించుట సరికాదని కొంత కఠినముగ పలికిరి. మిత్రులొకరు నా యొద్దకు వచ్చి సన్మాన సంఘ కార్య దర్శిగా పనిచేసినందుకు మీకు ఏదో బిరుదు వచ్చును అనుకొం టిమిగాని ఇక నెప్పటికిని ఏ బిరుదము రాదని నుడువుచు, నేను నిర్భయముగ సత్యమును ప్రకటించి నందుకు నన్ను చాల మెచ్చుకొనిరి.

ఈ తూములను గూర్చిన ఘోషమాత్రము నానాట పెరుగసాగెను. ప్రభుత్వమువారు శ్రీరామచంద్రరావుగారిని, మరియొక ఆంగ్లేయోద్యోగిని ఉపసంఘముగా నేర్పరచి ఈ తూములను గూర్చిన యాక్షేపణలు విని, నివేదిక పంపుటకు ఏర్పాటు గావించిరి. ఒకనాడు బెజవాడలో బందరుకాలువ దరిని రహదారి బంగళా ఎదుట విశాలమైన మైదానములో నొకపెద్ద సభ జరిగెను. రెండువేలనరకు పెద్దపెద్ద రఘుపతులు హాజరయిరి. వారి పక్షమున విషయములను నేను కమిటీ సభ్యులకు తెలిపితిని. నేను చెప్పిన వాక్యములను విన్న గహితులందరు ఏక కంఠముగ సత్యము సత్యమునని ఉద్ఘోషించిరి. ఆ ఎగిక్యూటివు ఇంజనీయరు గారు నేను చెప్పినదానిని రుజువుపరచుట కొక్క దృష్టాంతము

చూపుమనిరి. పొలములమీదికి పోయిన యెడల దృష్టాంతమును చూపించెదనని బదులు పల్కితిని. అంతటితో సభముగిసెను. కమిటీవారు వెడలిపోయిరి. ఆ కాలములో జయంతి రామయ్య పంతులుగారు ఈ జిల్లాలో డెప్యూటీ కలెక్టరుగా నుండిరి. వీరొక రోజున చెన్నపట్టణపు కాల్వమీదుగా పడవనెక్కి పోవుచుండగా సమీపగ్రామములోని రహితు పరుగెత్తుకొనిపోయి వారిని దర్శించి తన భూమికి క్రొత్తతూములవలన నీళ్ళు పారుదలగాక నష్టము కలిగినదని మొరపెట్టుకొని, స్వయముగా వచ్చి పొలము తనిఖీ చేయుడని కోరెను. అయన వెళ్ళి తూమును పరికించగా తూము పల్లమున పెట్టబడి భూమి ఎత్తుగా నున్నదిగావున నీరు భూమిమీదికి పారుట లేదు. ఇది ప్రత్యక్షముగ వారు చూచిరి. ఆ సమయమునే ఎగిక్యూటీవు ఇంజనీరు ఆ కాలువమీద పోవుచుండెను. అప్పుడు ఆయనను పిలిచి, ఆ తూమునుండి నీరు భూమిపై కెట్లు పారించవచ్చునో చూడుడని రామయ్యగారు గట్టిగా ప్రశ్నించిరి. ఈ వృత్తాంతము ప్రజలలో ప్రాకిపోయెను. నేను రహితుల పక్షమున చేసిన వాదన సత్యమని బాగుగ ధృవపడెను.

ఇదిగాక అడవుల పుల్లరి వసూలుచేయుటలో అధికారుల వలన కలుగుచున్న బాధలను విచారించుటకు ప్రభుత్వమువారొక ఉపసంఘము నేర్పాటు చేసిరి. అందు మోచర్ల రామచంద్రరావు గారును గుత్తి కేశవపిళ్ళైగారును సభ్యులుగా నుండిరి. ఆ సంఘము నెదుట కాంగ్రెసు సంఘ పక్షమున నేను సాక్ష్యమిచ్చియుంటిని. ఈ పై నుడివిన కారణములచే నేను ప్రజలలో కృతపరిచయుడనైతిని. ఆంధ్రోపకార్యమ ప్రచారమును బట్టియు ఆంధ్రరాష్ట్ర

సంఘములో కార్యదర్శిగా నుండుటచేతను ఆంధ్రజిల్లాలలో ప్రజలకు నే నెరుకబడినవాడనైతిని. ఇది యంతయు శాసన సభా సభ్యత్వము నాకు సమకూర్చిపెట్టునని మిత్రులు ప్రోత్స హించుచుండిరి. గుంటూరు జిల్లానుండి ఇంతవరకు నెవ్వరును సభ్యులు గాకపోయిరను ముద్ధ ముఖ్యముగ గుంటూరుజిల్లా ప్రముఖుల మనస్సులలో బాధించుచుండెను.

కాని నేనును మరికొందరు మిత్రులుగూడ రామచంద్ర రావుగారే సభ్యత్వమునకు అర్హులని ఎంచుచుంటిమి. ఇట్లు కొంత కాలము గడచినది. నామినేషనులు పడవేయవలసిన సమయము ఆసన్నమయ్యెను. అంతట నేనే స్వయముగా రామ చంద్రరావుగారిని ఏలూరుకో కలుసుకొని ప్రశ్నించగా వారు స్పష్టముగ తేల్చక "మీరు నిలచినట్లయిన మీ జిల్లాలో సమ్మ తులు రావచ్చునుగాని గోదావరి కృష్ణాజిల్లాలలో సమ్మతులు మీ కిచ్చెదరా" యని నన్ను బహులుప్రశ్నలువేయసాగిరి. "మీరు నిలచినయెడల ఆసంశయము నిజమేగాని మీరుగాక మరి యెవ్వరు నిలచినను అట్టి సందేహము పడవలసిన అవసరము లే" దని పలువురి అభిప్రాయమని నేను సమాధానము చెప్పితిని. ఆ విషయమున రూఢిచేసుకొనవలసినదని చెప్పుచు, తాము నిలుచుటో లేదో స్పష్టీకరించకపోయిరి. అంతట నేను వారితో ముచ్చటించి ప్రయోజనము లేదని నిశ్చయించుకొని, బెజవాడ వచ్చి అచ్చటి మిత్రులతో సంప్రదించితిని. వారు తప్పక నన్నే నిలువవలసినదని చెప్పసాగిరి. శ్రీ కొతా సూర్యనారాయణగా రనువా రొకరు ఇనుపన ర్తకమువలన చాలసొమ్మ్ము నార్జించి, బెజవాడలో కాపురము చేయుచుండిరి. వారి తండ్రిగారి కాల

ములో వారిపట్టిమున నేనొక అప్పీలులో పనిచేసి వారికి అనుకూలముగ నెరవేర్చితిని. పూర్వము గుంటూరు కాపురస్తులుగా నుండి, రైసుఫ్యాక్టరీవల్లను ఇనుపవర్తకమువలనను వారును వారి సోదరులునుగూడ ధనవంతులై పేరుప్రతిష్ఠలు సంపాదించిరి. నామినేషను పంపవలసినవాయిదా ఆసన్నమైన కారణమున శ్రీ సూర్యనారాయణగారే శాసనసభ్యత్వ దరఖాస్తు నమోనా తెప్పించి, అది పూర్తిచేయవలసినదని నన్ను ప్రోత్సహించిరి. నేను దానిని పూర్తిచేసితిని. కొందరు సమ్మతిదారులు గూడ సంతకములుచేసిరి. బెజవాడనుండియే నా దరఖాస్తు చెన్నపురికి పోస్టుద్వారా పంపబడెను.

ఏలూరు నుండి శ్రీ కూర్మా వెంకటరెడ్డినాయుడుగారు గూడ సభ్యత్వమునకు దరఖాస్తు పెట్టినట్లు తెలిసినది. మాదిరెడ్డి వెంకటరత్నమునాయుడుగారను మరియొకరుగూడ దరఖాస్తు పెట్టినట్లు చెప్పిరి. జస్టిస్‌పార్టీ ఉద్యమము అప్పటికే చెన్న రాష్ట్రమున పాకినాగినది. బ్రాహ్మణనాయకత్వమున కాంగ్రెస్ ఉద్యమము నానాట దక్షిణదేశమున బలపడుచుండెను. ప్రభుత్వ విధానములను ధైర్యముతో ఖండించి ఎదుర్కొనుటలో బ్రాహ్మణులే దారిచూపుచుండిరి. ఆ రోజులలో చెన్నపురిలో డాక్టరుపని చేయుచు, పలుకుబడి సంపాదించి శాసనసభలో సభ్యుడుగానున్న డాక్టరు నాయరుగారు బ్రాహ్మణాధిక్యమును నిరసించుచు పత్రికలలో వ్యాసములువ్రాసిప్రకటించియు, బహిరంగసభలలో నుపన్యసించియు కొంత ఆందోళన సాగించిరి. మరి కొందరు బ్రాహ్మణేతర ప్రముఖులును సానుభూతితో ప్రసంగింప సాగిరి. ఈ సందర్భములు గన్నెట్టి ప్రజలలో చీలిక లేర్పరచి

తమ కార్యములు నెగ్గించుకొనుటకు జాతీయోద్యమమును భంగ పరచుటకు ఇది మంచి మార్గమని ఎంచి చెన్నపురి గవర్నరు కార్యవర్గసభ్యులలో ముఖ్యులగువారు బ్రాహ్మణేతరనాయకు లను జేరదీసి, బ్రాహ్మణేతరోద్యమమును ప్రోత్సాహపరచిరి. బ్రాహ్మణేతరులు విద్యాబుద్ధులందు చాల వెనుకబడియున్నారు గనుక వారినభివృద్ధిచేయుట యను సదుద్దేశమే ఈ యుద్యమపు ముఖోద్దేశమని నాయకులు బహిరంగ ప్రసంగములలో చెప్పు చుండిరి. కాని ప్రభుత్వ ప్రాపకమును సంపాదించుకొని ధనమును గౌరవమును పలుకుబడిని సమకూర్చు అధికారాదిస్థానములు బ్రాహ్మణేతరులకు లభింపచేయవలెనను సంకల్పము ప్రధానముగ ఉద్యమనాయకుల హృదయములందు నాటుకొనిపోయెను. అట్టి సమయమునందే నేను శాసనసభాసభ్యత్వమునకుపోటీచేయవలసి వచ్చినది. కనుక శ్రీ కూర్మా వెంకటరెడ్డినాయుడుగారికి గోదావరి జిల్లాలో ఈ యుద్యమమునూలకముగా సమ్మతు లెక్కువనవచ్చు నేమో యనియు, ముఖ్యముగా బ్రాహ్మణేతరులైన ఉద్యోగుల సహాయము ఆయనకు లభించుననియు వాదుకలు పుట్టినవి. కాని రామచంద్రరావుగారు అభ్యర్థిగా నిలువలేదుగనుక నాకు రెడ్డి నాయుడుగారిపోటీవలన ఆటంకము హెచ్చుకాదనుకొంటిని.

అప్పుడు ఓటర్లసంఖ్య మూడుజిల్లాలమీద సుమారు 500 మాత్రమేయని జ్ఞాపకము. అయిదువందల పోస్టుకార్డుల మీద నే నొక విజ్ఞప్తిని అచ్చువేయించి ఓటర్లకు పోస్టుద్వారా పంపితిని. ఇక ఓటర్లను స్వయముగా కలిసికోవలసియున్నది. కాని నేను గుంటూరు కృష్ణాజిల్లాలలో అట్లు చేయుటనావశ్యమని తలంచి, గోదావరి జిల్లాలో ఓటర్లనుమాత్రము

చూడ నుద్దేశించితిని. ఈ కార్యములో రాయసం వెంకటశివుడు గారు తోడుగా వచ్చిరి. వారు గోదావరి జిల్లావా రగుటవలన, భీమవరములో వారిసోదరుడు వెంకటార్నిమయ్యగారును, నరసాపురమున మరియొక సోదరుడును న్యాయవాదులుగా నుండిరి. భీమవరము నరసాపురములలోసభలు గావించి, అమలాపురమునకు బోయి అచ్చట ప్రముఖులను కలుసుకొంటిమి. ఆ సమయమున హైకోర్టు వకీలు శ్రీ పేరి నారాయణమూర్తిగారు వేసవి సెలవలగుటచే అమలాపుర సమీపగ్రామములో నివసించు చుండిరి. నా యం దభిమానులగుటచే వారును కొన్నిచోట్లకు నాతోవచ్చి నన్నుగూర్చి ముచ్చటించిరి. మేము శ్రీ నారాయణమూర్తిగారింతోగూడ వారునసించు అగ్రహారమున కేగితిమి. అచట వేదాధ్యయనపరులు పలువురు కనపడుదురను కొంటినిగాని అట్టి విశేషములేనియు కనుపడలేదు. అచ్చటను సమీప గ్రామములలోను ఇండ్లగోడలమీద 'లిప్టన్ టీ' అని బోర్డులు కట్టబడియుండెను. మే మొక యింటి సమీపమునకు బోవునప్పటికి నారాయణమూర్తిగారి నెఱిగిన ఒక బ్రాహ్మణ వితంతువు సుమారు ఏబది సంవత్సరములు వయస్సు చెల్లిన యామె మమ్ము బిలచి కూర్చుండబెట్టి 'టీ'పుచ్చుకొనవలసినదని బలవంతపెట్టి టీ తయారుచేసియిచ్చెను. ఇంత పెద్దదైన వితంతువుకు సహితము టీ విషయమై అభిమానముండుట నాకు ఆశ్చర్యముగ తోచెను. వేదాధ్యయనపరులచే సుప్రసిద్ధమై శిష్టాచారములు ప్రబలియుండవలసిన ఈ ప్రాంతములోగూడ టీ యభ్యాసము నాకు శోచనీయముగనుండెను.

అమలాపురములో శ్రీ ముక్కామల వేంకటేశ్వర్లుగారు (శ్రీ కళా వెంకట్రావుగారి మేనమామగారు)నన్ను చాల మన్నన చేసిరి. అచ్చట నాకు ఆకస్మికముగ జ్వరమువచ్చుటచే సభకు పోజాలకపోతిని. వేంకటశివుడుగారే సభలో నుపన్యసించిరి. నేను జ్వరపీడితుడనై ముక్కామలవారి యింటిలోనే కొన్నిరోజు లుండ వలసివచ్చెను. అమలాపురమునుండి గుంటూరుజేరి పిమ్మట బందరు వెళ్ళితిని. ఎన్నికలరోజున నే నక్కడనే యుంటిని. ఓటర్లు తాలూకా కచ్చేరీలో ఉత్సాహముతో సమ్మతులను పెట్టెలలో వేయుచుండిరి. పలువురు నాకే సమ్మతులను వేసిరని తెలియ వచ్చెను. నేను ఏ కారణమునకో విశాఖపట్టణము వెళ్ళితిని. అక్కడ నుండగనే ఎన్నికలలో నాకు విజయముకల్గెనని తంతి వార్త వచ్చినది. అచ్చటి మిత్రులు శ్రీ భూపతిరాజు వెంకట్రాజు మొదలగువారు సభగావించి అభినందనములతో సన్మానించిరి. ఈ ఎన్నికలలో మొదట పోటీచేసిన శ్రీ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు ఇక్కడపర్యటన్నము మానుకొని ఇంగ్లాండువెడలి పోయిరి. రాజమహేంద్రిసరకాపురస్తులు శ్రీ మాదిరెడ్డి వెంకట రత్నంనాయుడుగారుకూడ పోటీచేసి కులబలముమీద ఆధార పడిరిగాని ప్రయోజనము లేకపోయెను. గుంటూరువచ్చినపిమ్మట కొన్నిరోజులకు పౌరమహాసభయొకటి సమావేశపరచి ప్లీడర్లు, వర్తకులు మరియితర సంఘములవారు అందరును ఉత్సాహంపు చేసి, విందుగావించి,సన్మానపత్రిముల నొసంగి మిక్కిలిప్రేమతో గౌరవించిరి. శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారు అత్యంతరమణీ యములును ఉల్లాసరసోదంచితములగు పద్యములు రచియించి నన్నభినందించిరి.

ప్రభుత్వమువారికి నేను పంపులేఖలు పైపుచేయించి పంపు టకును వార్తాపత్రికలలో రాజకీయార్థికవిషయములనుగూర్చిన వ్యాసములనుండి కత్తిరించి భద్రపరచుటకును నావ్యాసములను శాసనసభాప్రసంగములను పైపు చేయుటకును,. ఒక పైపిస్టు గుమాస్తాను ఏర్పరచుకొంటిని. ప్రథమ శాసనసభకు వెళ్లినపుడు చక్రవర్తిగారికి విధేయవిశ్వాసప్రమాణము చేయనలసివచ్చెను. కాని ఆదినములలో ఆప్రమాణముచేయుటగౌరవహానిగా నెన్నివారు సాటించియుండలేదు. కాంగ్రెసు శాసనసభాప్రవేశము అంగీకరించిన పిమ్మట సభ్యులు అట్టి ప్రమాణములను చేయుటగూర్చి కొంతవాదము నడచెను గాని తుదకు సమ్మతించి ప్రమాణము చేసిరి. అపుడు లార్డు విల్లింగ్డను చెన్నరాష్ట్రపు గవర్నరుగా నుండిరి. సర్ రాజగోపాలాచార్యులుగారు కార్యనిర్వాహక వర్గములో ప్రథమ సభ్యుడుగా నుండిరి. ప్రజలచే నెన్నుకో బడిన సభ్యులుగాక కొందరు ప్రభుత్వముచే నియమింపబడిన సభ్యులును మరికొందరు ప్రభుత్వ శాఖాధికారులుగూడ శాసన సభలో సభ్యులుగానుండిరి. కాబట్టి ప్రభుత్వ నియుక్తులును, ఉద్యోగి సభ్యులును జేరి ప్రభుత్వ పక్షమేవహించి సమ్మతుల నిచ్చుచుండిరి. ఎన్నికలవలన సభ్యులుగా నేర్పడిన మా పక్షము నకు నేలము వాస్తవ్యులును నిక్కమగు కాంగ్రెసువాదియునైన శ్రీ నరసింహయ్యరుగారు నాయకుడుగా నుండిరి.నరసింహయ్యరు ముందు చర్చలో దారితీయుచు ఉపన్యసించుచుండిరి. పిమ్మట విశాఖపట్టణజిల్లాప్రతినిధి శ్రీ భూపతిరాజు వేంకటపతిరాజుగారును బళ్లారి ప్రతినిధి శ్రీ శివరావుగారును ప్రసంగించుచుండిరి. వారిపిమ్మట నేనుభాషణగావించుచుంటిని. నా భాషణములు

దీర్ఘ లుగాక అతిక్లుప్తములుగ నున్న నని మిత్రులు నాతో చెప్పుచుండిరి. నరసింహయ్యరుగారుమాత్రము నా పరిసరగము లను మెచ్చుకొనుచుండిరి. కానినాభాషణములు నాకే సంతృప్తికర ములు గాకుండెను. మే మందరము ఏకగ్రీవముగ సమ్మతుల నిచ్చి నను తక్కినవా రందరు బహుసంఖ్యాకులుగా నుండి, ప్రభుత్వ పక్షమునకే సమ్మతుల నిచ్చుటచే ప్రభుత్వమువారికే జయము సమకూరుచుండెను. ఒకానొకప్పుడు అరుదుగా ప్రభుత్వము వారే అనుకూలురుగా నుండిన విషయములలో తప్ప ఇతరత్ర మా కపజయము నిశ్చయమే. మా విధి మే మెనర్చుచుంటి మనుసంతృప్తి యొక్కటిమాత్రిను మాకు లభించుచుండెను.

ఎస్. శ్రీనివాసయ్యంగారను హైకోర్టు వకీలు మహా మేధావి. అప్పుడు అడ్వకేటు జనరల్‌గా నుండుటచే వారు గూడ అప్పుడప్పుడు శాసనసభలో పరిసంగించుచుండిరి. శాసన సభలో ప్రజాప్రతినిధులమైన మే మందరము నొక్కమాటమీద నిలచి పరిసంగించుచుండుట చూచి వారు మమ్ము నుగ్గడించిరి. నేను క్రిమక్రిమముగ శాసనసభాకార్యములందు అనుభవమును సంపాదించుకొనుచుంటిని. మునిసిపల్ చట్టమును సవరణచేయు నుపసంఘమున నన్నొక సభ్యునిగా చేర్చిరి. సర్ రాజగోపాలా చార్యులుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు. కొన్ని సవరణలు నే నుపపాదించితిని. రాజకీయాందోళనలో దండింపబడినవారికి మునిసిపాలిటీసభ్యులుగా నుండుటకుగాని, ఎన్నికలలో సమ్మతు లిచ్చుటకుగాని అర్హతలేదని చట్టములో నిబంధన ఏర్పడి యుండెను. అట్టి నిర్బంధము తీసివేయవలసినదని సవరణ పెట్టితిని గాని అది ఉపసంఘములో అంగీకరింపబడలేదు. శాసనసభలో

చట్టము చర్చకు వచ్చినప్పుడు నా సవరణ మగల పరివేశ పెట్టితిని. ఆ సవరణ విషయము ఆలోచనకు వచ్చునప్పటికి సాయంకాలము చీకటి పడిపోయెను. కాని గవర్నరుగారు ఆనాడు చర్చలుపూర్తి చేయవలెనని పట్టుపట్టి సభసాగించిరి. నేను నా సవరణనుగూర్చి కొంత దీర్ఘముగ ప్రతికక్షులవాదమును ఖండించుచు, ఇంగ్లాండు మొదలగు దేశములలో ఇట్టి నిషేధము లేదనియు, సహజమగు పౌరసత్వమును నిషేధించుట న్యాయవిరుద్ధమనియు, కొంత ఉద్రేకముతో సంభాషించితిని. అప్పటికే చాల ప్రొద్దుపోయినది. నా వాదము గవర్నరుగారికి కేవలము అసమ్మతముగ నుండెను. అంతట ఆయనే లేచి, నాకు ప్రత్యుత్తరమేదో అసంబద్ధమగు ధోరణిలో నిచ్చిరి. నేను చాల వాగ్విజృంభణము గానించితినని ప్రశంసారూపమైన హేళనగావించెను. సమ్మతు లిచ్చుటలో ప్రభుత్వ పక్షమే గెలిచెను.

మరియొకసారి శాసనసభలో వంగోలు పశువుల సంతను ఆపివేయవలసినదని యొక తీరుమానమును నేను పరివేశ పెట్టితిని. ఆ సంతలో పశువులను అమెరికానుండియు, ఆస్ట్రేలియానుండియు వర్తకులు వచ్చి మిక్కిలి హెచ్చుధరలు పెట్టికొని, తమతమ దేశములకు రవాణాచేయుచుండిరి. బలిష్ఠములై, సుందరములై యుండు ఈ పశువులను వారు భక్షణమునకై వినియోగింతురను వాదు ఈ దేశమున ప్రాకిపోయెను. రహితులు దర్శించుచే ఈ సంతలో ఏటేట ఉత్తమజాతి పశువులను విదేశవర్తకుల కమ్మకము చేయుచుండిరి. అందువలన దేశమునందు పశుసంపద నష్టమగు చుండెను. కాబట్టి ఆసంతనుగూర్చి ప్రభుత్వాధికారులలోనున్న విషయములను పత్రికావ్యాసములను, ప్రజాభిప్రాయములు మొద

లగువానినిగూర్చివివరముగ తెలుపుచు చాలదీర్ఘముగను మిక్కిలి పట్టుదలతోను ఉపన్యసించుచుంటిని. ప్రభుత్వనియోజిత సభ్యులు సహితము కొంత యభిరుచితో వినుచుండిరి శ్రీ స్వామికన్నుపిళ్లై యను నొక ప్రభుతోద్యోగి నా ఉపన్యాసములోని యంశము లను వ్రాసుకొనుచుండెను. ఇట్లు నా సంభాషణ జరుగుచుండగనే గవర్నరుగారును రాజగోపాలాచార్యులుగారును వేదికమీద ఆసీనులై వారిలోవా రేదియో మెల్లగ మాట్లాడుకొనుచుండిరి. నా యుపన్యాసమధ్యమునసే అల్పాహార సమయమయినందున సభ నిలిపి, గవర్నరు మొదలగువారందరు లేచిపోయిరి. రాజ గోపాలాచార్యులుగారు క్రిందకుదిగి నా యొద్దకువచ్చి "నేనును గవర్నరుగారును ఏమి మాట్లాడుచుంటిమో తెలియునా" యని నన్ను ప్రశ్నించిరి. ఏమి మాట్లాడితిరని నే నడిగితిని. శాసనసభ్యు లందరిలో నేను పిన్నవయస్సువాడననియు, సుమారు 15 సంవత్స రము లుండుననియు గవర్నరుగా రన్నట్లును, "కాదు హెచ్చుగా నుండు" ననియే తాము చెప్పినట్లును వాక్రుచ్చి, "మీ నయ స్సెంత" యని నన్నడిగిరి. నా కప్పుడు ఏబదిసంవత్సరములని చెప్పితిని. "నేను అట్లే గవర్నరుగారికి చెప్పితిననిరి. కనుక నా భాషణాలోని విషయములు వారి కేమాత్రము మనస్సున పట్టెనో యదిస్పష్టమయ్యెను. అంత ప్రధానవిషయము ప్రసంగింపబడు చుండగా వారికి దానియందులక్ష్యము లేక నా వయస్సునుగూర్చి ముచ్చటించుచుండుట విచిత్రముగ తోచెను.

శ్రీరామచంద్రయ్యగారు రను హైకోర్టువకీలు,మాతోడి సభ్యులు.నా ప్రసంగమునుగూర్చి ముచ్చటించుచు "చాలకృషి సల్పి విషయమును అనుపూర్వముగ తెలుసుకొని ఆవశ్యకమగు

అంశములు నన్నిటిని పూసగ్రుచ్చినట్లు సభ్యులకు శ్రుతపరిచితి" నని శ్లాఘించి, నా తీర్మానమును బలపరచిరి. ప్రభుత్వపక్షమున శ్రీస్వామికన్ను పిళ్ళైగారు "శ్రీరామచంద్రయ్యరుగారు చెప్పిన విషయము వాస్తవమేగాని రహితులకు సంతలో పశువ్రుల అమ్మకమునలన ఎంతోసొమ్ము లభించె" నని ఆ విషయమును వివరించి ఈ సంతవలన పశువులను వృద్ధిచేయుటకు ప్రోత్సాహము కలుగుచున్నదిగాని నష్టములేదని ఉపన్యసించెను. నా తీర్మాము వీగిపోయెను. కాని స్వల్పకాలమునకే సంత ఆగిపోయినది. మరల ఇటీవల వంగోలులో సంత ప్రారంభమైనట్లు వార్తాపత్రికలలో చదివినాను. తెనాలిలో కొన్ని సంవత్సరములక్రిందట శ్రీ దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులుగారి ఆధిపత్యమున సంతయొకటి ప్రారంభించబడినది. అది ఇప్పటికిని ప్రతి సంవత్సరము జరుగుచున్నది. ఈ సంత పెద్దపట్టణములలో జరుగు చుండు గుఱ్ఱపుపందెములవంటిది. ధనాఢ్యులగు రహితులు ఒకటి రెండు ఎద్దులను బాగుగమేపి, ఏనుగులవలె నుండునట్లు తయారు చేసి సంతకు తెచ్చెదరు. పెద్దరాతిని లాగుట మున్నగు భారహానకార్యములు ప్రదర్శించుచు ఆ ఎద్దులమీద పందెములువేసి గెలుచుటయు ఓడుటయు జరుగుచున్నది. ఈ పందెములు జూదములవంటివి. ఇంత పెద్దబరువును లాగిన ఎద్దు విశేషకాలము జీవించదు. ఈ పందెపుటెద్దులు పందెపుపోటీలకొఱతప్ప సాధారణముగ వ్యవసాయమునకు అంతగాఉపయోగించబడవు. కనుక ఇట్టి సంతలు దేశమునకు నష్టదాయకము లనియే యెంచతగియున్నది.

శాసనసభలో అల్పసంఖ్యాకులమగు మేముచేసెడి ప్రసంగములు అరణ్యరోదనగనే యుండెను. ఇంతలో పదునెనిమిది మాస

ములలో నా సభ్యత్వము ముగిసిపోయెను. గాంధిమహాత్ముని సహాయ నిరాకరణోద్యమమునుగూర్చి కలకత్తా కాంగ్రెసులో తీరుమానము అంగీకరింపబడుటచే కాంగ్రెను సభ్యులు పలువురు శాసనసభాసభ్యత్వములను రాజీనామాల నిచ్చిరి. ఈ నా సభ్యత్వము ముగియులోపల రెండు చిన్న విషయములలో కొంత ప్రయోజనము లభించెను. అందు గ్రంథాలయోద్యమ మొకటి. ఈ గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమందే హెచ్చుగానున్నదని ఇతరరాష్ట్రములవారు శ్లాఘించిరి .కాని గ్రంథాలయములు ధనాభావముచే అభివృద్ధికాకుండెను. కాన గ్రంథాలయమునకు ప్రతి సంవత్సరము కొంతధనసహాయము చేయవలసినదని తీర్మానమును శాసనసభలో ప్రవేశపెట్టితిని. అదిప్రభుత్వమువారంగీకరించి కొన్ని పరతులమీద ధనసహాయము చేయుచుండిరి. అట్టి గ్రంథాలయములలో రాజకీయవిషయములైన గ్రంథములుండరాదని నిషేధించుటవలన ఆ ధనసహాయము అన్ని గ్రంథాలయములును స్వీకరించుటకు అంగీకరించలేదు.

రెండవది స్త్రీవిద్యను గూర్చినది. ఆంగ్లేయభాష నభ్యసించి మెట్రిక్యులేషను పరీక్షలో కృతార్థులు కావలెనని బాలికలకు కోర్కెయున్నను వారి తలిదండ్రులు తమ కుమార్తెలను బాలుర పాఠశాలలలోనికి పంపుట కంగీకరింపకుండిరి. కాబట్టి స్త్రీలు బడికి పోకపోయినను పరీక్షనిచ్చుట కర్హత నిప్పించవలసిన దని తీరుమానమును శాసనసభలో ప్రవేశపెట్టితిని. ప్రభుత్వపక్ష సభ్యులు వ్యతిరేకముగ నుండిరి. తీర్మానము నెగ్గలేదు. కాని నాఫ్ అను గవర్నమెంటుకార్యనిర్వాహకసభ్యుడు లేచి, తీర్మానము గెల్వకపోయినను తాను కొంతఅనుకూలమైన ఏర్పాటు

చేసెదనని చెప్పుచు, "ఈ తీర్మానమును ప్రవేశపెట్టిన సభ్యుడు కేవల రాజకీయాందోళనపరుడుగాక త్రికరణశుద్ధి కలవాడు గనుక ఈ తీర్మానము బొత్తుగ నిరాకరించతగదు. నేను కొంత వరకు దాని నంగీకరించెద"నని వాక్రుచ్చెను.ఆ ప్రకారమే స్త్రీలు బడిలో చదువనకుండనే మెట్రిక్యులేషన్ పరీక్షకు బోవుటకు అవ కాశము కల్పించెద నని అట్లే ఏర్పాట్లు గావించెను.

ఆ కాలములో శాసన సభ్యులకు జీతములులేవు. సభా దినములలో సభకు హాజరైనవారికి దినము 1కి ఏడురూపాయలు మాత్రము భత్యము నిచ్చుచుండిరి. రాకపోకలకు రెండవతరగతి ప్రయాణపుఖర్చు లిచ్చుచుండిరి. ప్రతి శాసనసభ్యునకు "గౌరవ నీయు"లను బిరుదమును పేరునకు సంధించుచుండిరి.అప్పటి శాసన సభ్యులపట్ల ప్రజలును ప్రభుత్వసభ్యులును ఎక్కువ గౌరవము జూపుచుండిరి. శాసనసభలోనున్న కాలమందే గవర్నరు విల్లింగ్డను శాసనసభ్యులకొక విందుగావించెను. ఆ విందు వారిభవనమునందే జరిగినది. నేనును శ్రీ రామానుజాచార్యులుగారు అను మరి యొక సభ్యులును భోజనపుసావడిలోనికి పోకుండ, ప్రక్కను మరియొక సావడిలో కూర్చుంటిమి. మా యిరువురకును ఆ భోజ నము చేయుట కిష్టములేక గవర్నరుగారు పిలిచినప్రదు పోవకుండిన బాగుండదనియెంచి, వారి యింటికి మాత్రము పోతిమి. తక్కిన సభ్యులందరును భోజనములుచేసిన పిమ్మట మన దేశీయగారడి విద్యాప్రదర్శనము చేయించిరి. అప్పుడు మేమును అందరితో కలసి వినోదమునుఁ చూచితిమి.

గాంధీజీ అవతరణం

జలియనువాలాబాగ్ దురంతములు నడిచిన పిమ్మట గాంధిగారికి బ్రిటిషువారిపై నదివరకుండిన విశ్వాసము పూర్తిగా నశించినదని చెప్పితిని. భారతదేశములో రాజ్యాంగవిధానము నానాట నిరంకుశమై ప్రజలను అజ్ఞానులను దరిద్రులను జేసి, కష్టములపాలు చేయుచున్నది. ముప్పదిసంవత్సరముల పైకాలము నుంచి కాంగ్రెసు చేయుచున్న కార్యక్రమములన తగినంతప్రయోజనము లేకపోయెను. యుద్ధముచేసి బ్రిటిష్ప్రభుత్వమును లొంగదీయుటమష్కరమగుటఅట్లుండ యుద్ధము అహింసా సత్య మార్గములకు విరుద్ధము. కావున తాను దక్షిణాఫ్రికాలో ప్రయోగించిన సత్యాగ్రహమార్గమున బ్రిటిషుప్రభుత్వముతో పోరాటము సాగించుటకు నిశ్చయించుకొనెను. కాంగ్రెసులో ఆంగ్లేయ విద్యాధికులతోపాటు సాధారణప్రజలనుగూడ కూడగట్టుకొనిరానలెనని తలంచెను. ఈ కార్యసాధనకై మున్ముందు ప్రభుత్వమువారి అంగీకారమును పొందకుండగనే సత్యాగ్రహమను పైకోసయిలు పత్రిక ప్రకటింపదొడగెను. అది అచ్చువేసినదికాముగాన ప్రభుత్వము మిన్నకుండవలసివచ్చెను. ఇంతలో పంజాబు దురంతములను ఖండించుచు ఢిల్లీపట్టణములో పెద్దసభయొకటి జరిగినది. దాని నాపివేయవలెనని ప్రభుత్వోద్యోగులు తీవ్రప్రయత్నములు సాగించిరి. కాని ప్రజలు పోలీసులను తిరస్కరించి సభలో గుమి గూడుచుండిరి. ఇట్లు కొంత అలజడి ప్రారంభమైన పిమ్మట సైనిక దళము గూడ ప్రజలపై బడి దౌర్జన్యము సాగింపజొచ్చెను. ప్రజలను శాంతింపజేయుటకు స్వామి శ్రద్ధానందజీ ఎలుగెత్తి హెచ్చరించుచుండిరి. ఆయనను సైనికులు తుపాకీసన్నీలతో

పొడువవచ్చిరి శ్రద్ధానందస్వామి "ఎట్లుపొడిచెదరో పొడువు"డని తన ఎమురురొమ్మునిచ్చి ధీరుడై నిలిచెను. ఆ భటులు విభ్రాంతి చెంది చేతులాడక యూరకుండిరి.

ఢిల్లీలో కల్లోలము ప్రారంభమైనదని విని శాంతి నెలకొల్పనెంచి, బొంబాయినుండి మహాత్మా గాంధి బయలుదేరి వచ్చుచుండగా ప్రభుత్వము మార్గమధ్యముననే వారి నడ్డగించి మరల బొంబాయికి పంపివేసెను. రౌలట్ శాసనవిధానము దేశ ములో నడచిపోవుచుండెను. ఈ సమయమున కలకత్తాలో ప్రత్యేక కాంగ్రెసు మహాసభ సమావేశమయ్యెను. ఆ సభలో సర్వరాష్ట్ర ములనుండి ప్రతినిధులుసమావేశమైరి. అపుడుప్రతినిధులసంఖ్యకు నియామకములేదు. ప్రతినిధులు ప్రేక్షకులు గలసి ఇరువదివేల మంది కూడియుండిరి. సభ్యులు క్రోధావేశపూరితులై యూగిపోవు చుండిరి. కార్యవర్గసభలో మహాత్ముడు ప్రవేశపెట్టిన తీర్మాన మునుగూర్చి తీవ్రముగ వాదప్రతివాదములు జరిగెను. మహా సభలో గాంధీజీ అసహాయోద్యమతీర్మానమును పరివేశపెట్టెను. ప్రభుత్వాధికారము దేశమున చలామణియగుటకు సాధనభూత ములైన శాసనసభలను, ప్రభుత్వ కార్యాలయములను, కోర్టులను, కళాశాలలను మనము బహిష్కరింపవలెనని గాంధీజీ ప్రబోధ గావించిరి. అంతట మహానాయకు లొక్కొక్కరే లేచి, తీవ్ర ముగ తీర్మానమును ఖండింపజొచ్చిరి. లజపతిరాయ్, పటేలు, కేల్కారు, సేలము విజయరాఘవాచారి, జిన్నా మొదలగువా రందరు వ్యతిరేకపక్షము వహించిన వారైరి. లోకమాన్యుడును గాంధీగారితో నేకీభవింపకకొంతదూరముగనే ప్రవర్తించుచుండిరి. ఆ ప్రత్యేక మహాసభకు వారు రాలేదు. ఇట్లు కాంగ్రెసు నాయకు

లందరు ప్రతిఘటించినను ఇంచుకయైన తొణకక, సంశయించక, వెనుదీయక మహాత్ముడు వారి ప్రసంగములకు శాంతముగ సమాధానము చెప్పుచు మహోపన్యాసము గావించెను. మన సహకారమువల్లనే ప్రభుత్వము సాగుచున్నదనియు ఆ తోడ్పాటు నుపసంహరించుకొంటిమేని దానియాట కట్టునని యు వివరించి ఈ యుద్యమము సత్యాహింసలమీదనే ఆధారపడియున్నదని తెలిపి, దీని నణచివేయుటకు ప్రభుత్వము కఠిన దండనకు పూనుట తథ్యమని చెప్పి, ఆ బాధలన్నిటిని ధైర్యముతో భరించుటయే ఈ శాంతి సమరసైనికుని ధర్మమని ఘంటాపథముగ నక్కాణించెను. అపూర్వ భావపూరితమైన మహాప్రసంగమును ముగించుచు ఈ తీర్మానము నందు పూర్ణవిశ్వాసము కలవారుమాత్రమే సమ్మతులీయవలసిన దని ప్రతినిధులను హెచ్చరించెను.అంతట మహాసభలో మహాత్మా గాంధీకి జై యను జయఘోషలు మిన్నంటెను. ప్రతిరాష్ట్రము నుండి వచ్చిన ప్రతినిధుల సమ్మతులను తీసికొనుటకు ఆ యా రాష్ట్రనాయకు నొకని నియమించిరి. ఆంధ్రరాష్ట్రములో ముప్పది మంది మాత్రము వ్యతిరేకులును తక్కినవారందరును అనుకూలురే. నేను మాత్రము ప్రతికూలురలో నొక్కడను. గాంధి మహాత్ములు శ్రుతపరచిన సిద్ధాంతము మిక్కిలి సహేతుకముగ నున్నను దానిని అనుష్ఠించువారు పలువురుండజాలరు గాన అది ఆచరణ సాధ్యము కాదని నా యభిప్రాయము. మొత్తమున వ్యతిరేకుల సంఖ్య అతి స్వల్పమగుటచే తీర్మానము జయజయ ధ్వానములతో నంగీకరించబడెను.

ఇకను దేశమును నడిపించగల మహానాయకుడు గాంధి మహాత్ముడొక్కడే యని స్పష్టపడినది. ఈ సభజరిగిన వారము

లోపలనే తీర్మానమును ప్రతిఘటించిన నాయకులందరు మహాత్మునకు తోడుగా నిలచి, ఉద్యమమున పనిచేయుటకు సమ్మతించినట్లు పత్రికలలో ప్రకటించబడెను.

నేను కలకత్తానుండివచ్చుచుండగదారిలోనే శ్రీగొల్లపూడి సీతారామశాస్త్రి, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలగు మిత్రులు నన్ను ఉద్యమమున చేరవలసినదని బలవంతపెట్టసాగిరి. గుంటూరు చేరినసిమ్మట సహితము పలుమారు మాడభూషి వేదాంతం నరసింహాచార్యులు, ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలగు వారు దినదినము మా యింటికివచ్చి ఉద్యమమున ఏల చేరరాదని ప్రశ్నించి, చేరవలసినదని ప్రోత్సహించుచుండిరి. నేను మాత్రము వారి సలహాల నంగీకరించలేదు. ఉద్యమమున చేరని యెడల ప్రాణాపాయముకల్గునని బెదరింపులతో ఉత్తరములుగూడ రాసాగినవి. నేను వానిని లెక్కించలేదు. ఆ యుత్తరములసంగతి మరెవ్వరికిచెప్పనులేదు. కాని మిత్రులు పలుమారు బలవంతపెట్టుచుండుటచే నేను వారితో నిట్లంటిని. "నే నిదివరకే న్యాయవాద వృత్తినివదలివేసితిని. కళాశాలలలో చదువుబిడ్డలునా కెవ్వరులేరు. కాన అసహాయ తీర్మానము ననుసరించి నేను త్యజించవలసినది శాసనసభా సభ్యత్వ మొక్కటి మాత్రమే మిగిలియున్నది. ఆ సభలోనుండి ఇంకను చేతనైన దేశసేవ చేయవలెనని యున్నది. దానిని త్యజించి యింట కూర్చుండిన మాత్రమున ప్రయోజనము లేదు. కాని మన గుంటూరు జిల్లాలో తొమ్మిది తాలూకాలు గలవు. తాలూకాకొకరు చొప్పున తొమ్మిదివుంది త్యాగ మూర్తులు తమ వృత్తులుమాని ప్రాణములర్పించుటకైన సిద్ధపడి నిష్కల్మషహృదయులై పనిచేయునెడల నేనును వారితో

కలసి పని చేయుదును." నేనుచెప్పినది సమంజసముగ నున్నదని మారుపలికి, వెడలిపోయిరి. మరునాడే శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారు, శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు, శ్రీ మాడభూషి వేదాంతం నరసింహాచార్యులుగారు, శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహా రావుగారు, శ్రీ పోలిశెట్టి హనుమయ్యగుప్తగారు మొదలగు న్యాయవాదులు తమవృత్తులను విసర్జించిరి. ఉన్నవలక్ష్మీనారాయణగారు ఆరితేరిన సంఘసంస్కర్త. బారిస్టరీపరీక్షలో కృతార్థులై హైకోర్టులోగూడ కొంతకాలము న్యాయవాదిగా పనిచేసి, అప్పటినుండి గుంటూరులోనే పనిచేయుచుండిరి. శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారు మంచి ఆదాయము నార్జించుచు వృత్తియందు పైకి వచ్చుచుండిరి. శ్రీ నరసింహాచార్యులుగారు అప్పుడప్పుడే వృద్ధికి వచ్చుచుండిరి. లక్ష్మీనరసింహారావుగారును, గుప్తగారును, క్రొత్తగా బారిస్టరులైన యువకులు. ఇట్టివారు తమవృత్తులనుత్యజించి దీక్షాపరులై పనిచేయుటకు సంసిద్ధులైన పిమ్మట నేనును నా శాసనసభా సభ్యత్వమునకు రాజీనామా నిచ్చితిని. శ్రీ భూపతిరాజు వెంకటపతిరాజుగారు, శ్రీ సీ. నరసింహరాజుగారు, శ్రీ నరసింహయ్యరు మొదలగువారు పలువురు శాసన సభాసభ్యత్వమునకు రాజీనామాలనిచ్చిరి.

ఈ అసహాయోద్యమములో నేను చేరినపిదప ఆంధ్రోద్యమమును వదలవలసివచ్చినది. ప్రభుత్వోద్యోగములను వదలవలెననియు, శాసనసభాసభ్యత్వమును మానవలెననియు తీర్మానించి, మరల ఆంధ్రరాష్ట్రమును స్థాపింపుడని ప్రభుత్వమును కోరుట స్వవచనవ్యాఘాత మనవలసియున్నది. నావలెనే మరికొందరును మానివేసిరి. శ్రీ జోగయ్య పంతులు మొదలగువారు స్థాయీ

సంఘసభ్యులుగనే యుండి, నా బదులు మరియొకరిని కార్యదర్శిగ నేర్పరచుకొని, మొత్తమున దాదాపు ఏటేటను మహాసభలు సమావేశపరచుచు తీర్మానములు గావించి ప్రభుత్వమునకు పంపుచునేయుండిరి. సహాయనిరాకరణోద్యమము కాంగ్రెసులో అంగీకరించబడిన కారణమున శ్రీ న్యాపతి సుబ్బారావుపంతులు గారు ఆంధ్రరాష్ట్రకాంగ్రెసుఅధ్యక్షపదవికి రాజీనామానిచ్చుటచే నన్ను అధ్యక్షునిగ నెన్నుకొనిరి.

1920లో నాగపురమున కాంగ్రెసు మహాసభ నడిచినది. శ్రీ జమ్నాలాలు బజాజను కోటీశ్వరుడు ఆ సభకు సన్మానాధ్యక్షుడుగను శ్రీ సేలం విజయరాఘవాచార్యులవారు అధ్యక్షులుగ నుండిరి. నేను పలువురు మిత్రులతో కలసి, ఆ సభకు వెళ్ళి యుంటిని. ఆ సభలో అసహాయోద్యమ తీర్మానమును శ్రీ పండిత మోతీలాల్ గారు అంగీకరించి మహాత్మునకు తోడై నిలచిరి. అప్పటికి కాంగ్రెసుసంస్థ పూర్ణముగ గాంధీగారి అధ్వర్యముక్రిందకు వచ్చెను. శ్రీ మోతీలాల్జీ నెలకు ముప్పదివేలు వచ్చుచున్న న్యాయవాద వృత్తిని విసర్జించిరి. వారు గొప్పవక్తలు, పలుకుబడిగల వారును. తొల్త అసహాయోద్యమము వారికీ సమ్మతము గాకున్నను కుమారుడు జవహర్లాల్ గాను ఆయనను సమ్మతిపరచిరని చెప్పుదురు. పండిత జవాహరులాల్ ఉత్సాహపూరితుడైన యువకుడు. విశేష బుద్ధికౌశల్యము, విషయపరిజ్ఞానము, మంచి వక్తృత్వము గలవాడు. రాజకీయముల అప్పుడే పట్టుదలతో పని చేయ నారంభించెను. పండిత మోతీలాల్ కాంగ్రెసు కార్యదర్శి పదవి స్వీకరించెను. మహాసభ ముగిసినతోడనే నాగపురములోనే

కార్యనిర్వాహకవర్గము నేర్పరచిరి. ఆ వర్గమునందు లాలా లజపతిరాయ్, విఠల్ భాయిపటేలు, కేల్కర్ మొదలగువారితో నన్ను గూడ సభ్యునిగా గైకొనిరి.

నాగపురికి కాంగ్రెసు మహాసభనిమిత్తము వెళ్ళిన ఆంధ్రులము బొంబాయిమీదుగనే ప్రయాణముచేసి యిల్లుచేరితిమి. ఆ రోజులలో గ్రాండు ట్రంక్ ఎక్స్‌ప్రెస్ లైను నిర్మాణము కాబడలేదు. రైలుబండి నాగపురినుండి వచ్చుచుండగా మధ్య స్టేషనులో శ్రీ జమ్నాలాల్ బజాజ్ మేము ఉన్న బండికివచ్చి నా రెక్క పట్టుకొని, నొక్కుచు ప్రేమపూర్వకమైన వాక్యములు పలికి, సన్నభినందించిరి. ఆయనగూడ కాంగ్రెసువర్గములో సభ్యులగుటచే పిమ్మట వారితో పలుమారు నేను కలసిమెలగుట తటస్థించెను. ఈయన చాల ధర్మబుద్ధిగలవారు. గాంధితత్త్వమున పూర్ణవిశ్వాసము గలిగి, వారి ఆజ్ఞానుసారము నడచుకొనెడి వారు. ఇట్టి ధనికుని సహకారము మహాత్ముడు తలపెట్టిన కార్యములు జయప్రదముగ సాగుటకు అవకాశ మొసగెను. జమ్నాలాల్‌గారే గాక పలువురు వర్తకులు బొంబాయి, అహమ్మదాబాద్ పట్టణములవారు గాంధిజీకి విరివిగ విరాళముల నిచ్చుచుండిరి. అహమ్మదాబాదు పట్టణములో సబర్మతీ నదీతీరమున అరువది డెబ్బది యకరముల పొలమునుతీసికొని, అందుకొన్ని పెంకుటిండ్లు కట్టించి, ఆశ్రమము స్థాపించి, అందు గాంధిజీ భార్యాపుత్రులతో, శిష్యులతో నివాసము చేయుచుండిరి.

సబర్మతీ తపోవనం

ఈ యాశ్రమ వాసులంధరు రాట్నమునిమోద నిత్యము నూలు వడకుచుందురు. పత్తి వితనములు తీసి, దూదిగా చేసి, దానిని ఏకి, ఏకులుచేయు పద్ధతి నేర్పుచుండిరి. ఏకులు స్వయముగా చేసుకొనుచుండిరి. వడుకునూలును మగ్గములమోద నేయుట కొందరు నేర్చుచుండిరి. ప్రాతఃకాలమున నాలుగు గంటలకే ఆశ్రమవాసు లందరు మేలొకొని, కాలకృత్యములు తీర్చుకొని, ప్రార్థనకు సిద్ధముగా నుండవలెను. భగవద్గీతలోని స్థితప్రజ్ఞుని గూర్చిన శ్లోకములు కంఠస్థము చేసుకొని అందరును కలసిపాడుచుండిరి. మహారాష్ట్ర బ్రాహ్మణులొకరు తంబుర మీటుచు పరమేశ్వర ధ్యానరూపమైన పాటలు అతిపవిత్రమును ప్రశాంతమునగు ఆ యాశ్రమమునందు చల్లని ఉదయమారుతము మెల్లగ వీచుచుండ, నిరాడంబరముగ నిశ్చించల మనస్కులై పాడుచుండ వినినవారి హృదయములు భక్తిరసప్రవాహమున నొక కొంతవడి యోలలాడుచుండును. గాంధిజీ ఆశ్రమములో చిన్న పెంకుటింటిలో తాము మాత్రమేయుండి రాట్నము వడుకుచు, ఉత్తర ప్రత్యుత్తరములు వ్రాయుచు, తమ్ముజూడవచ్చినవారితో సంభాషించుచు నుండిరి. వీరికి వ్రాతపనులలో మహాదేవ దేశాయిగా రను నొక మహారాష్ట్ర బ్రాహ్మణుడు సహాయము చేయుచుండెను. దేశాయిగారు నిశితమైన బుద్ధిబలముగలవారు. వ్రాతలో మిక్కిలి సమర్థులు. గాంధిమహాత్ములు ప్రకటించుచుండిన "యంగు యిండియా" పత్రికకు వ్యాసములు వ్రాయుచుండెడివారు.

మరియొక మహారాష్ట్ర బ్రాహ్మణుడు శ్రీ వినోబాభావే యను గొప్ప సంస్కృత పండితులు ఆశ్రమవాసిగనే యుండిరి. ఈయన బ్రహ్మచారి. వేదాంతగ్రంథములు చదివినవారగుటచే మహాత్మాజీతో ఏకాంతగోష్ఠి చేయుచుండిరి. ప్రతిదినము ఉదయమున ప్రార్థనయైన పిమ్మట కొంతకాలము వీరితో మహాత్మాజీ సంభాషించుచుండిరి. ఆశ్రమములో నివసించు పెద్దలును, పిన్నలును బ్రహ్మచర్యము దీక్షతో నడుపవలెను. భార్యతో కలసి నివసించువారు సహితము ఈ దీక్షను తప్పగూడదు. తప్పినవారికి ఆశ్రమములో నుండుటకు తావులేదు. ఆశ్రమవాసులకు సొంత యాస్తి యుండగూడదు. డబ్బుకూడబెట్టి దాచగూడదు. ఒకప్పుడు శ్రీమతి కస్తూరిబా దగ్గిరబంధువులో మరెవ్వరో ప్రేమతో నిచ్చిన రెండుమూడువందల రూపాయలను ఏదియో పెట్టెలో దాచిపెట్టుకొనెను. ఈ విషయము మహాత్మాజీకి తెలిసినతోడనే విచారణచేసి, అది నిజమని తెలుసుకొని, ఒక సంవత్సరకాలము ఆమెచేతి సొమ్ముకాని ప్రతాగనని నియమముపట్టి తక్కిన ఆశ్రమవాసులమధ్య ఆమె గౌరవమునకు హానికల్గుననియైన పాటింపక శిక్షించెను. ప్రేమపాత్రయై తనతో సర్వకష్టములననుభవించిన భార్యయైనను నియమవిరుద్ధముగ ప్రవర్తించినందుకు నిర్దాక్షిణ్యముగ శిక్షించుట మహాత్ముని కే చెల్లెను. దక్షిణాఫ్రికాలో ఫినిక్సు ఆశ్రమమునం దున్నపుడు గూడ మహాత్ముడు కస్తూరిబా నొకపరి ఇట్లే కఠినముగ శిక్షించెను. మహాత్ముల హృదయములు కుసుమ కోమలములు, వజ్రకఠోరములు నగునుగదా!

ఆశ్రమములో రోగపీడితులకు మహాత్ముడే తొట్టిస్నానములు మొదలగు చికిత్సలు జరుపుచు, ప్రత్యేక శ్రద్ధతో పథ్య

పానముల నేర్పాటుచేయుచుండెను. ఈ ప్రకృతి చికిత్సపై గాంధిజీకి గాఢాభినివేశము కద్దు. ఆయనకు మారుడు మణిలాలు కొకప్పుడు విషజ్వరము పట్టుకొని తీవ్రరూపము దాల్చెను. డాక్టర్ ఔషధములవలన ప్రయోజనములేకపోగా కోడిగ్రుడ్డును, కోడిపిల్ల మాంసరసముతో చేయబడిన చారునుమాత్ర మిచ్చి చుండవలెనని చెప్పినందున తనకు పూర్ణవిశ్వాసముగల జల చికిత్సను చేయుటకు నిశ్చయించుకొని పుత్రునిప్రాణముకంటె తమ నియమవ్రతములే ముఖ్యమని యెంచి, అందరు వలదని ఎంత మొత్తుకొన్నను వినక ఆ చికిత్సనే చేసిరి. అదృష్టవశమున ఆ బాలుడు బ్రదికెను.

సబర్మతీ ఆశ్రమము సత్యాహింసల నాచరించుచు, బ్రహ్మ చర్యమును నడపుచు, ఆస్తులను త్యజించి, అర్థచింతనలేక, విరా గులై కాయకష్టము చేయుచు, దైవమును నమ్మి చరించు స్త్రీ పురుషులకు నివాసస్థానమై ఋష్యాశ్రమమై విరాజిల్లెను. తొల్లిటి మన ధర్మములు ప్రతిష్ఠాపితము లగుచున్నవని ప్రజలలో నూత నోత్సాహము పొడచూపెను. పాశ్చాత్యనాగరికతా వ్యామో హము సన్నగిలి, మన పూర్వనాగరికతపై గౌరవము హెచ్చ సాగెను. ఈ మహాత్ముని ఆశ్రమ పుణ్యభూమినుండియే దేశోద్ధర ణకు కారణమైన మహోద్యమములెల్ల ప్రారంభింపబడి ప్రచారి తములయ్యెను. ఈ యాశ్రమమే మహత్తర యజ్ఞభూమిగా రూపమెత్తి పిమ్మట భారతభూమి నంతటి నొక యజ్ఞవాటిక గావించెను. భారతీయులనేకులు ఈ యాగాగ్నిలో నాహుతులైరి. ఈ యజ్ఞగుండమునుండియే స్వరాజ్యలక్ష్మి యుద్భవమందెను.

—

పల్నాటి కథ.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము 1921లో వెంకటగిరిలో శ్రీ కటికినేని వెంకటరామారావు, రమణారావుగార్ల యింటిలో సమావేశమైనది. ఈ సోదరులు కాంగ్రెసు కార్యములందుత్సాహముతో పాల్గొనుచుండిరి. వీరు వెంకటగిరి జమీందారులకు బంధువులగుటచే, వారు వీరి పూర్వులకొక గ్రామములో చాల భూమిని దానముగ నిచ్చిరి. కాని, ఈ సోదరులు కాంగ్రెసులో పాల్గొనుచున్నారను కారణమున ఇప్పటి జమీందారుగారు వ్యాజ్యము వేసి వీరి భూములను ఇతరులకు అమరకపరచిరి. గుంటూరుజిల్లా పల్నాడులో అడవి పుల్లరినిగురించి అటవీశాఖాధికారులు ప్రజలను పీడించుచున్నారను కారణమున ప్రజలు రోషపూరితులై పుల్లరిని అసలేచెల్లింపక తిరుగుబాటుచేయ నారంభించినందున ప్రజలకును ప్రభుత్వోద్యోగులకును మధ్య కొంతకలహ కారణమేర్పడి, కల్లోలము సాగినందున ఆ విషయమై విచారణ చేసి, నివేదిక పంపవలెనని శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణపంతులు గారిని, శ్రీ మాడభూషి వేదాంతం నరసింహాచార్యులవారిని నియమించుచు ఆ సభలో తీర్మానము గావించబడెను. ఆ తీర్మానము ననుసరించి వారు పల్నాడులో మాచర్ల గ్రామమునను, ఆ సమీప గ్రామములలోను సంచారముచేసిరి. నేనును అంతకుపూర్వమే యొకపర్యాయముమాచర్ల కేపోయి, కాంగ్రెసు పన్నుల నిరాకరణ విధానమును అమలులో పెట్టుటకప్పటి కింక అంగీకరించలేదుగనుక పుల్లరి చెల్లించవలసినదని చెప్పితిని. కాని ప్రయోజనము లేకపోయెను. శ్రీ లక్ష్మీనారాయణగారును,

శ్రీ నరసింహాచార్యులుగారును వెళ్లినపిమ్మట ప్రజలలో ఆందోళనము పెరిగిపోయెను. ప్రభుత్వాధికారుల కెవ్వరికిని పూట కూళ్ళబసలలోనైనను భోజనము పెట్టకూడదనియు, ఆహార సామగ్రిలైన అమ్మగూడదనియు దీక్షపట్టి సంఘబహిష్కార మును తీవ్రముగ సాగించిరి. ఈ బహిష్కారము నింత తీవ్ర ముగ సాగించుటకు గాఢప్రయత్నములుచేసి, ప్రజలను దిట్టపర చిన శ్రీ రంగా చెంచయ్య అను వైశ్యవర్తకుని దేశభక్తియు, ధైర్యసాహసములును నేర్పును పేర్కొనదగినవి. మాచర్లలో డెప్యూటీ తహశీలుదారుగారి యింటిలో పసిపిల్లలకు పాలుకూడ పుట్టకపోయెను. ఇట్టిపరిస్థితులలో గుంటూరునుండి జిల్లా కలెక్టరు షీల్డు అనునాయన మాచర్ల వెళ్ళి ఊరు వెలుపల తోపులో డేరావేయించుకొని నివాసముండెను. ఆయనకు కానల సిన కోడిగుడ్లు సహితము గుంటూరునుండియే తెప్పించుకొన వలసినచ్చెను ప్రజలలో ఈ ఆందోళన శ్రీ లక్ష్మీనారాయణ నరసింహాచార్యులిరువురు కల్పించుచున్నారను కారణమున వా రిరువురకును "నెమ్మదికి భంగము జరుపకుండుటకు జామీను ఏల ఇయ్యకూడదో సమాధానము చెప్పుటకు తననద్దకు హాజరు కావలసిన" దని వాయిదావేసి నోటీసు జారీచేయించెను. లక్ష్మీ నారాయణగారు మాచర్లలోనే యుండుటవల్ల వారికి వెంటనే నోటీసు జారీచేయబడెను. నరసింహాచార్యులుగారు గ్రామాంతర ములో సంచారము చేయుచున్నందున నోటీసు అందుట ఆలస్యమయ్యెను.

మాచర్లలో దండోరా వేయించుటకు కలెక్టరు గ్రామ మునసబును బిలిపించి, తప్పెటను తెప్పించుమనికోరగా, ఆయన

కొంతతడవు ఆగి, మాల కలెక్టరుగారియొద్దకు వచ్చి,"తప్పెటలు చినిగిపోయినవని తప్పెటలవాండ్రు చెప్పుచున్నారుగాన తప్పెట దొరకలే"దని మనవిచేసెనట. కాని శ్రీ లక్ష్మీనారాయణపంతులు గారు హాజరైననాడు వారిని గజల గుఱ్ఱముమీద నెక్కించుకొని, తప్పెటలు మోగించుచు, ఊరేగింపుతో ప్రజలు కలెక్టరుగారి డేరాయొద్ద దింపిరి. ఆ ప్రజల యుత్సాహోద్రేకములు చూచి, తాను ఒక తప్పెట కావలెననిన లేదని, నేడు ఇన్ని తప్పెటలతో ఊరేగించుచు వచ్చుట తలపోసి (They say that Swaraj will come someday, but now I see Swaraj around me)"ఎప్పుడో స్వరాజ్యము వచ్చు నందురు, ఇదుగో! ఇప్పుడే నా చుట్టును స్వరాజ్యము కన్పించుచున్న" దని బిగ్గరగ పలికెనట.

లక్ష్మీనారాయణగారిని, నరసింహాచార్యులుగారిని శాంతి భంగము కావించకుండుమని ఒక్కొక్క సంవత్సరమునకు పూచీ పత్రము వ్రాయవలసినదని కలెక్టరు కోరెను గాని వారందుకు సమ్మతించనందున ఒక్కొక్క సంవత్సరము విడిఖైదుశిక్షవిధించెను. వారిని జైలుకు పంపుటకు పోలీసులు రైలుమీద గుంటూరు తీసుకొనివచ్చిరి. రాజకీయనేరములక్రింద శిక్షల కదియే ప్రారంభము. అందులో న్యాయవాదులుగానుండి సంఘములో పేరుగాంచిన వారికి శిక్షలు వేయుట మరింత విపరీతముగ నుండెను. వారిని గుంటూరుకు తీసుకొనివచ్చుచున్నా రనువార్త పట్టణములో వ్యాపించి, ప్రజలు వేనవేలు రైలుస్టేషనులోను, చుట్టుప్రక్కలను క్రిక్కిరిసి గుంపులుగూడి ఆతురతతోవేచియుండిరి. రైలుస్టేషనుకు వచ్చినప్పటికి ప్రజలుఆవేశపూరితులైరి. లక్ష్మీనారాయణగారిని, నరసింహాచార్యులుగారిని చూడవచ్చిన లక్ష్మీనారాయణగారి

భార్య శ్రీమతి లక్ష్మీబాయమ్మగారిని చూచినప్పుడు నా చిత్తము వ్యాకులత నొంది, దుఃఖపూరితుడనై తిని. నా పక్కన నప్పుడు నిలబడియున్న శ్రీ కోలవెన్ను రామకోటేశ్వర రావుగారు "పెద్దలైన వారు మా బోటి చిన్నలకు ధైర్యము చెప్పి, దారిచూపవలసిన వా రిట్లు చింతించుట తగవుకా" దని నన్ను హెచ్చరించిరి. నాకు కలిగిన పరితాపము క్షణిక మైనను చిన్నవాడైన కోటేశ్వర రావు పలికిన పలుకులు సత్యములని గ్రహించితిని. శ్రీమతి లక్ష్మీబాయమ్మగారు ధైర్యము వీడక, యుత్సాహపూరితురాలై యుండెను. అంతవరకు నామె మాటి మాటికి అనారోగ్యస్థితిలో నుండెడిది. భర్త దేశహిత కార్యమునందు దండింపబడినందుకు ఆమె ఆనందముతో నుప్పొంగి,అప్పటినుండియు దీనితో జాతీయో ద్యమములో దిగి పాటుపడెను.

శ్రీ లక్ష్మీనారాయణగారిని, శ్రీ నరసింహాచార్యులుగారిని రైలుబండినుంచి దించి, గుంటూరు సబ్ జయిలుకు తీసుకొనివెళ్లి మరునాడు వేలూరుకు వారిని పంపించవలెనని పోలీసులు ఏర్పాటు చేసికొనిరి. కాని రైలుస్టేషనులో క్రిక్కిరిసియున్న జనులమధ్యగా వారిని తీసుకొనివెళ్ళుటకు పోలీసధికారులు భయ పడుచుండిరి. జనులు ఆవేశపూరితులై యున్నారుగాన తమపై దుండగము జరుపుదురని భయముతోచి, ప్రజలలోగుండ దారి చూపుడని నన్నుకోరిరి. నేను ముందు నడచి, రైలుస్టేషనునుండి జయిలువరకును వారితోనుండి, అచ్చట విడిచిపెట్టితిని. దారి పొడవునను జనులు గుంపులుగూడియున్నను దారియిచ్చిరి. నేను జయిలులోవారిని వదలివచ్చుచుండగా, ఎదురుగ నొక తెల్లజాతి మనుష్యుడు బైసికిలు నెక్కి, ప్రజలలోగుండ రోడ్డుమీద వచ్చు

చుండెను. అతనిని వా రేమిచేయుదురో యని భయముకలిగెను గాని నెమ్మదిగ ఆయన పోవుట కెడమిచ్చిరి.

జయిలు సమీపముననే పొలములో అపుడే సభ గావించి లక్ష్మీనారాయణ నరసింహాచార్యులుగార్లకు శిక్షవేసిన విధాన మును చెప్పి, స్వరాజ్యపోరాటమున నిట్టికష్టములుపడి, త్యాగము చూపిననేగాని స్వరాజ్యము లభించదనియు, ప్రభుత్వము వారేమి చేసినను మనము శాంతమువహించి సహాయనిరాకరణోద్యమము తీవ్రముగసాగించుటయే కర్తవ్యమనియు, సహాయనిరాకరణోద్య మము తీవ్రముగ సాగించగలమేని ఇప్పుడు ఖైదు చేయబడిన మన సోదరులను ఖైదునుండి విడిపించగలమనియు చెప్పితిని. మరికొం దరు మిత్రులుగూడ నుపన్యసించిరి.

ఆ సాయంకాలమే మరియొక పెద్దబహిరంగసభ సమా వేశ పరుపబడెను. ఎక్కడ నుండియో సర్కసువారువచ్చి పెద్ద డేరాయొకటి వేసుకొనియుండిరి. ఆ ప్రక్కలను అడ్డముగాగట్టిన తెరలను తీసివేసి, డేరాను సభ నిమిత్తమిచ్చుటకు సర్కసువా రంగీకరించిరి.ఆరోజున నెవ్వరి నేమిచేయమన్ననుకాదనునట్టులేదు. ఆ సభకు గ్రామములోని వర్తకులు, ప్లీడర్లు, మరి ఇతరపనుల వా రెందరో వేలకొలది హాజరైరి. శ్రీ లక్ష్మీనారాయణ నరసింహాచార్యులు గార్లను శిక్షించుట అన్యాయము, నిరంకుశము నని ప్రభుత్వ విధానమును ఖండించి, పల్నాడులో అధికారులు గావించిన అక్రమములును ప్రజలకు కలుగు చున్న కష్టములను వివరించి, ఈ యన్యాయ పరిపాలనను అంతముచేసి, స్వరాజ్యము స్థాపించుటకు సహాయనిరాకరణమే

సాధనమని వక్కాణించి, ఆయుద్యమమును బలపరచవలెనని ప్రజలను ప్రబోధించుచు ఉపన్యాసము లీయబడెను. నన్నే ఆ సభకు అధ్యక్షునిగా జేసిరి. ఇప్పుడు శిక్షించబడిన మన సోదరులను విడిపింపజేయుటకును శిక్ష విధించినందుకు పౌరుల యసమ్మతిని స్పష్టీకరించుటకును పట్టణములోని వర్తకులు తమ కొట్లన్నియు కట్టివేసి, వారము రోజులు సమ్మె జరుపవలసినదని నేను వర్తకులను ప్రబోధించితిని. ఈయోచన అపుడు నాప్రక్కనున్న శ్రీ ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్యగారు చేసిరి. మొదట ఈ సమ్మెను ప్రేరేపించుటకు సంశయించితిని గాని నేను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమునకు అధ్యక్షుడననియు, అఖిలభారతకాంగ్రెసు సంఘ కార్యవర్గములో సభ్యుడననియు గుర్తించియైన నా వాక్యములను ప్రజలు గౌరవించకపోరని తలంచితిని. నా ప్రబోధమును వర్తకులందరు ఆజ్ఞవలెనే పాటించి, మరునాటి యుదయమున కొట్లన్నియు మూసివేసిరి. బియ్యపుదుకాణ మొకటియు, ఉప్పు, మిరపకాయ చింతపండు మొదలగు చిల్లర సరుకుల దుకాణ మొకటియు మాత్రమే తెరచియుంచిరి. ఈ సమ్మెకట్టు అపూర్వము, మున్ను ప్రజలెవ్వరు ఎఱిగినది కాదు. ప్రభుత్వోద్యోగులు విభ్రాంతి చెందిరి. దేశమున ఈ సమ్మెకట్టు ఆశ్చర్యమును కల్పించెను. ఈ సమ్మెవార్త విని, పల్నాడునుంచి జిల్లాకలెక్టరు మరల గుంటూరుకు వచ్చెను. ప్రభుత్వోద్యోగులెట్లయిన ఈ సమ్మెను భగ్నము చేయవలెనని పట్టుబట్టిరి. నేనును మిత్రులును దాని నెట్లయిన సాగించవలెనని తీవ్రముగ ప్రబోధము చేయుచుంటిమి. అప్పుడు వర్తకులలో - పలుకుబడిగల మద్ది వెంకట సుబ్బయ్యగారును, చీమకుర్తి బసవయ్యగారును మాతో గలసి

ప్రచారము చేయుచుండిరి. శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రి, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, చట్టి నరసింహారావు, నడింపల్లి నరసింహారావు, బారిష్టరు గుప్త మొదలగువారు నాతో కలసి ప్రతిదినమును ఉదయ సాయం సమయముల బజారులవెంట తిరిగి కొట్ల నెవ్వరును తీయకుండునట్లు భద్రపరచుచుండిరి. కొట్లను, ఫ్యాక్టరీలను కట్టివేసిన కారణమున కార్మికులు ఊరక బజారుల నెట గుంపులు గుంపులుగ తిరుగుచుండిరి. కాన వీరి వలన నెమ్మదికి భంగము కల్గించు సంఘటన ఏమైన సంభవించు నేమోయని భయపడి ఈ పనివాండ్ర నందరిని బిలచి మహాసభ గావించి, పనిలేనికారణమున కష్టపడుచున్న యెడల కొంతసొమ్మ్ము జమచేసి యిచ్చెదము గనుక బజారులవెంట తిరుగక ఎవరింట వారుండవలసినదని కోరితిమి. కొట్లు తెరచుటతోడనే తమ పనులు తాము చేసుకొందుమనియు ఈ లోపల తమకు సొమ్మేమియు నియ్యవలసిన యవసరములేదనియు కొట్లు మూయుట వలన దమకు నష్టము లేదనియు అంతటినుండి బజారులలో తిరుగకుందుమనియు వారు గట్టిగ వాగ్దానముచేసిరి. అప్పటినుండి బజారులలో పురుగైనను లేక పాడుబడినట్లుండెను. ఉదయమున మిత్రులతో కలసి బజారులలో వరుసగ తిరుగుచుంటిమి. కలెక్టరు పోలీసు సూపరింటెండెంటు మొదలగు ఉద్యోగులను వెంటబెట్టు కొని వారొక ప్రక్కనుండి తిరుగుచు కనబడిన వర్తకులను కొట్లను తెరువవలసినదని బలవంత పెట్టుచుండిరి. మేము తెరువవలదని వారి యెదుటనే చెప్పుచుంటిమి. ఇట్లు ముఖాముఖి అన్యోన్యవ్యతిరేక ప్రచారము జరుగుచుండెను. ఇట్లయిదు దినములు ఏకదీక్షితో శాంతముగ సమ్మె సాగినది.

ప్రభుత్వోద్యోగుల బెదరింపులను వర్తకులు లక్ష్యము చేయరైరి. శ్రీ మగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు మరికొందరు శాంతి సైనికులను వెంటబెట్టుకొనిఉత్సవముగ బయలుదేరి, హైస్కూళ్లు, కాలేజీలయొద్దకు సర్కారు కచ్చేరీలయొద్దకునుబోయి, వారివారి కార్యాలయములను కట్టివేయనలసినదని చెప్పుచుండిరి.

కారాబంధనము-విడుదల.

ఆరవరోజు ఉదయముమామూలుప్రకారము మిత్రులతో కలసి, బజారులో తిరిగి, కొట్లన్నియు కట్టివేసియుండుట చూచుకొని, మరల పదిగంటలకు లోపలనే ఇంట్లకుచేరితిమి. మాయింటి కానా డొక మిత్రుడు వచ్చినంమన వారితో గలసి భోజనము చేయుచుంటిని.ఆ రోజులలో గుంటూరివారి సత్రమునకు ట్రస్టీగా నుంటిని. ఆ సత్రపు గుమాస్తా పరుగుపరుగునవచ్చి పెద్దబజారులో పోలీసుస్టేషనులో శ్రీభట్టిప్రోలుసూర్యప్రకాశరావుగారినిపోలీసులు బంధించిరనియు, అక్కడ డెప్యూటీ మాజిస్ట్రేటు గుండురావుగారున్నారనియు, పోలీసుస్టేషనును ప్రజలు ముట్టడించి, ఏదో దౌర్జన్యముచేయబూనుకొన్నారనియు,ఒక పోలీసుసబ్ ఇన్‌స్పెక్టరు కత్తితో ప్రజలనుకొట్టుచున్నాడనియు, కొందరు చిన్నవాండ్రు ఆ దెబ్బలుతిని పడిపోవుచున్నారనియు స్టేషనును ప్రజలు నిప్పుపెట్టి కాల్చివేయుదురేమోయనియు మిక్కిలియుద్వేగముతోపలెక్కను. నే నంతట వెంటనే భోజనమునుండి లేచి, వచ్చుచున్నాను పరుగిడిపోయి, మద్ది వెంకటసుబ్బయ్యగారితోను, గొల్లపూడి

సీతారామశాస్త్రిగారితోను చెప్పి, పోలీసుస్టేషను దగ్గరనున్న ప్రజలను పంపివేయవలసినదని చెప్పవలసిన'' దని ఆయనను తొందరగ పంపించి, నే నొక గొడుగు చేతబట్టుకొని బయలు దేరితిని.అదిమధ్యాహ్నసమయము. నేను మా యింటినుండి బౌను హైస్కూలుచెంత బోవుసప్పటికి స్టేషనువద్దనుండిన ప్రజలే ఇపుడు గాంధీపార్కు అని పిలువబడుచున్న ఖాళీస్థలము ప్రక్కనున్న కట్టమీదుగనడచి వచ్చుచుండిరి.వారిని''ఏల ఇటు వచ్చుచున్నా'' రని యడుగగా ఏదో సభ జరుగునని విని వచ్చుచున్నామని జవాబు చెప్పిరి. ''ఈ మధ్యాహ్నపు వెండలో సభ జరుగునను మాట నిజముకాదు. మీ రిండ్లకు పోవలసిన'' దని వారితో బిగ్గరగా చెప్పుచుంటిని. మన మిత్రులు పోయి చెప్పినమీదట స్టేషను చెంతనుండి తిరిగి వచ్చుచున్న ఈ ప్రజతో నేను మాట్లాడుచుండగనే ఆరోడ్డుమీద నా కెదురుగ స్టేషనువైపునుండి ఒక జట్కాబండి వచ్చుచుండెను. దానిలో జట్కావానిసరసను బిళ్ళజవాను కూర్చుండియుండెను. అందులో ఎవరో ఉద్యోగి యుండెనని తలచితినేగాని వా రెవ్వరైనది నాకు గుర్తులేదు. కట్టమీదనున్న ప్రజకు మాత్రము బండిలో నున్నవా రెవ్వరో తెలిసియేయుండును. ఆ బండి హైస్కూలు సమీపమునకు వచ్చినప్పటికి ప్రజలు కేకలువేయ నారంభించిరి. గుఱ్ఱము బెదరి స్కూలువైపునకు తిరిగెను. బండివెనుక భాగము ప్రజలవైపు నుండెను. వా రంతట రోడ్డుప్రక్క కుప్పగా బోసియున్న రాళ్ళను బండిపై రువ్వసాగిరి. నేను బండికిని ప్రజలకును నిలువబడితిని. "రాళ్లు రువ్వ"ద్దని నేను చేయెత్తి టిని. అది ప్రమాద సమయముగ గన్పట్టెను. మ

నా మాట లెక్కచేయక రాళ్లు రువ్వుచునేయుండిరి. బండిలో నున్నవారు గుండురావుగారని అపుడు తెలుసుకొంటిని. బండిని తోలుకొని పొం డని నేను మాటి మాటికి బిగ్గరగ చెప్పుచుంటిని. "నీవు ప్రజలను ప్రోత్సహించి రాళ్లు వేయించుచున్నా"వని ఉగ్రముగ న న్నాయన నిందింపసాగెను. వర్షమునలె పడుచున్న రాళ్ళను రువ్వవద్దని చేయెత్తి చెప్పుచున్న నా ప్రేళ్ళకు రాళ్లు తగిలి గాయము లగుచుండెను. కాని ఆయనమాత్రము బండిని తోలించుకొని పోక పోలీసువాండ్ర నిమిత్తము ఈల వేయు చుండెను. ఇంతలో పెద్దగడ్డయొకటి నా నెత్తిమీదుగ బండిలో నొకమూల బడెను. దైవానుగ్రహమువలన నాకుగాని ఆయనకు గాని హాని కలుగలేదు. బండి తోలించుకొనిపొండనియు, నేను వారిని రక్షింప యత్నించుచుంటినిగాని రాళ్లువేయించుటలేదనియు హెచ్చరించితిని. పోలీసువారెవ్వరును రాలేదు. అంతట బండి తోలించుకొని ఆయన వెడలిపోయెను. ప్రజలు చేసిన దుండగ మునకు మిక్కిలి చింతించుచు ఇంతటనైన ఇండ్లకు పొండనివారిని పంపి, నే నింటికి చేరితిని.

నే నా యుదయమున బాజాగునుండి ఇంటికి వచ్చినపిదప భట్టిప్రోలు సూర్యప్రకాశరావను నొక కాంగ్రెసు ప్రచారకుడు హైస్కూలు గేటు దగ్గిర నిలచి, స్కూలులోనున్న బాలురను [illegible]లు వదలిరండని కేకలు వేసి పిలచుచుండిరట. ప్రధానో [illegible]యులు "వెళ్ళిపోవలసిన"దని చెప్పిననుపోక, కేకలువేయు [illegible] వారు పోలీసువారిని పిలిపించిరట. పోలీసులువచ్చి [illegible]కొనిపోయిరట.ఆయుత్తరువు డిప్యూటీమాజస్ట్రేటు [illegible]చేసియుండురు. సూర్యప్రకాశరావును పోలీసు

స్టేషనులోకి తీసుకొని వెళ్ళినతోడనే ప్రజలు స్టేషను చుట్టుముటి అల్లరి చేసిరి. వాకే తిరిగివచ్చుచు రాళ్ళు వేసినవారు. ఈ సూర్యప్రకాశరావుగారు చాల స్వతంత్రుడు. నియమములకు సాధారణముగ బద్దుడగువాడుకాడుగాని కాంగ్రెసుపనులు ఉత్సాహముతో చేసెడివాడు. జయిలుబాధలుగూడ అనుభవించినాడు.

గుండురావుగారు న్యాయపతి హనుమంతరావుగారియింటిలో కాపురముచేయుచుండిరి. నాతో స్నేహభావముతోనే ప్రవర్తించుచుండిరి. నేను శాసనసభాసభ్యుడుగా నున్నపుడు మా యింటికి వచ్చి ముచ్చటించుచుండిరి. వారింటికి నేనుబోవువాడను. వీరు సౌమ్యస్వభావులే. కాని, సహాయనిరాకరణ ప్రారంభమైన కొలదికాలమునకు వారికచ్చేరీలో వారే ఆబ్కారీ దుకాణములు పాటలు పాడించుచుండిరి. కాంగ్రెస్ ప్రచారకుల నెవ్వరిని లోనికిపోనిచ్చుటలేదు. పాటదారులను పోవద్దని చెప్పినను వినక లోనికి పోవుచున్నారుగాన మీరు రండని నాకు కబురంపిరి. నాకు అస్వస్థతగానుండి పండుకొని యుంటిని. ఈవర్తమానము వచ్చినపిమ్మట పోకతప్పదనితలచి, గుండురావుగారికచ్చేరీకిపోతిని. మిత్రులు చాలమంది కచ్చేరీ దగ్గర నిలచియున్నారుగాని మేడమీదికి పోనిచ్చుటలేదు. నేను సరాసరిమేడమీదికిత్వరపోతిని. పోలీసులు నన్నాటంకపరచలేదు. నాతో మిత్రులు గూడ పైకివచ్చిరి. గుండురావుగారు నన్ను చూ... రండు రండని తన దగ్గరగా నొక కుర్చీవేయించి ... కోరికిగాని నేను అటుపోక, ఆయన కెదురుగ

బల్లమీద కూర్చుంటిని. నాతోవచ్చిన మిత్రులును నా ప్రక్కనే కూరుచుండిరి. పాటలుపాడనచ్చినవారు హాలంతయు నిండియుండిరి. పోలీసుసబ్ ఇన్‌స్పెక్టరును, తహశీలుదారును మరికొందరు పోలీసుజవానులుగూడ హాలులో నుండిరి. నే నచ్చట కూగ్చుండుట వారి కందరికిని కొంత అనుమానము కల్పించినది. నేను కూరుచుండియే పాటదారులను సంబోధించి, నీతి వాక్యములు చెప్పుచు పాటలు పాడవలదని ప్రబోధము గావించి హెచ్చరించితిని. ఇంత నిర్భయముగ ఫస్టుక్లాసు మేజస్ట్రేటు నెదుట కూరుచుండి ప్రభుత్వాధికారమును తృణీకరించి, అట్టి ప్రసంగము చేయుట వారి కాశ్చర్యముగ నుండెను. నేను ప్రసంగించుచుండ మధ్యమధ్య గుండురావుగారు ఆ ప్రకారము చెప్పగూడదని అది సర్కారు కచ్చేరీగాని ఉపన్యాసములిచ్చుతావుగాదని న న్నడ్డగించుచువచ్చిరి. వారి మాటలు లెక్కచేయక పాటలు బహిరంగముగ పాడుచున్నందున అది బహిరంగస్థలమే యనియు అచ్చట ప్రజలను ప్రబోధించుటకు నాకు హక్కుకలదనియు నేను ప్రతివాదము చేయుచు, నా ప్రసంగమును సాగించుచుంటిని. నన్ను వెలుపలకు వెళ్ళనలసినదని చెప్పుమని ఒక పోలీసుజవానును నా యొద్దకు పంపించెను. ఆ జవాను వచ్చి, "అయ్యగారు లకు వెళ్ళమనుచున్నా" రని చెప్పెను. నేను వెళ్లనని జవాబు చెప్పితిని. అక్రమము జరుగుచున్నపుడు దానిని కు వారికిగల అధికారము నాకునూ కలదని మొండి ని. అంతట నన్ను నెట్టివేయవలసినదని జవానుతో చెప్పిరి. జవాను నా దగ్గరకు రాగానే నా యకూడదని నేనుబిగ్గరగా గదమాయించితిని.

అంతట మేజస్ట్రేటుగారే స్వయముగ నావద్దకువచ్చి, నా చేయి పట్టుకొనెను. నే నా పట్టు వదలించుకొని మరల ఆయన నన్ను పట్టుకొన వచ్చుచుండగా ఆయనను త్రోసివేసితిని. ఆయన పెద్ద లావైన జవాను. నేను సన్నని పీలమనిషిని. కాని ఆ సమయమున నాకు గల బలము సింహమునకుగూడ లేదన్నట్లు తోచెను. ఈ దృశ్యము చూచిన వా రందరు నిశ్చేష్టితులయిరి. గుండురావు గారు మరల పీఠముమీదికేగి, కాగితములమీద నేదియో వ్రాయుచు, "మీ మీద ప్రొసీడింగ్సు వ్రాయుచున్నా" నని నన్ను హెచ్చరించిరి. వ్రాసుకొనుడని తృణీకరించితిని. ఏమేమో వ్రాసి, రెండుమూడుసార్లు వ్రాసిన కాగితములను చించివేసెను. ఆయన చాల కలవరము చెందెను. సహజముగ మంచివాడగుటచే జరిగిన విచిత్రచర్య చూచి, ఏమి చేయుట కును తోచక, మనస్సు చీకాకు నొందుటచే వ్రాయదలచుకొన్నది గూడ చక్కగ వ్రాయలేక కాబోలు మానుకొని మరల పాటలు పాడింప నారంభించెను. ఒక్కొక్క దుకాణముపేరు చదివి, పాటలు పెట్టనలసినదనికోరగా, ఎవ్వరును పాట పెట్టుటకు సాహసించలేదు. ఒకటిరెండు దుకాణము లెవరో బహుస్వల్ప మొత్తములకు పాడుటవలన పాట నిలిపివేయవలసివచ్చెను. మాజస్ట్రేటుగారును పోలీసధికారులును పాటదారులను ప్రోత్స హించిరిగాని ఎవ్వరును పాట పెట్టకపోయిరి. నేను మధ్యమధ్య పాడవలదని కేకలువేసి గట్టిగ హెచ్చరించుచుంటిని. ఇట్లు కొ దూరము నడచిన పిమ్మట పోలీసు ఇనస్పెక్టరు పాటదా సంబోధించి "మీరు పాటలు పెట్టదలచిన యెడ నుండుడు, లేనిచో లేచిపొం" డనెను. ఇదే సం

ఒక్క–మ్మడి లేచిపోయిరి. నేనును నా మిత్రులును అధికారులు మాత్రమే చివరవరకు నిలచియుంటిమి. "ఈ నాడు మీరు జరిపిన చర్య చాల దుండగముగ నున్న" దని నన్ను గుండురావుగారు హెచ్చరించిరి. నాకు ధర్మమని తోచినకార్యము చేసితినని బదులు చెప్పితిని. అంతట నా మిత్రులును, నేనును క్రిందికి దిగివచ్చితిమి. ఆనాటి చిత్రకథ యంతయు నూరిలో ప్రాకి పోయెను. కాని, నామీద ఏ విధమైనచర్యయు జరుపబడలేదు.

గుండురావుగారు తన బండిమీద జనులు రాళ్ళుపువ్వుట ఆధారము చేసుకొని నేనే ప్రజలను ప్రేరేపించి రాళ్ళుపువ్వించి, పట్టణములో నెవ్వరికి భంగము కలుగచేయుటకు ముఖ్యకారణ భూతుడనైతినని ఆనా డింటికి వెళ్ళుటతోడనే కలెక్టరుకు రిపోర్టు ప్రాసెను.

ఆ సాయంకాలమో, మరునాటి సాయంకాలమో, నన్నును, మద్ది వెంకటసుబ్బయ్య; చీమకుర్తి కుమారస్వామి, బారిష్టరు గుప్త, మరియిద్దరి నెవ్వరినో ఒకేపర్యాయము పట్టుకొని తాలూకా జైలులో పెట్టిరి. ఈ వార్త పట్టణములో వెంటనే ప్రాకిపోయినది. జనులు గుంపులుగుంపులుగ జయిలుదగ్గరను వీధులలోను గుమిగూడి, ఆశ్చర్యముతోచెప్పుకొనుచుండిరి. వార్త చుట్టుపట్ల గ్రామములకు తెలిసినతోడనే వందలాదిగ [illegible]ళ్లెక్కియు, నడచియు గుంటూరుచేరిరి. మహాసభ [illegible]న్ కాలేజీ మైదానములో సమావేశమయ్యెను. [illegible]తారామశాస్త్రిగారు ఉద్రేకపూరితులై ప్రభుత్వ

చక్కను తీవ్రముగ ఖండించుచు ఉపన్యాసము నిచ్చిరి. మరికొందరు మిత్రులుగూడ భాషించిరి. మమ్మ్మ జయిలులో నుంచినరోజు శుక్రవారమని జ్ఞాపకము. మమ్మ్మ జయిలునకు తీసుకొనివెళ్ళిన పిమ్మట కొద్దిసేపటికే జిల్లాకలెక్టరు తాలూకా కచ్చేరీలోనే మా పైన విచారణ ప్రారంభముచేసిరి. గుండురావుగారే ప్రథమసాక్షి. నేను నా మిత్రులు సమ్మె చేయించి, దారుణ్యమును ప్రోత్సహించి, శాంతిభంగకారుల మైతిమని సాక్ష్యము చెప్పిరి. కాంగ్రెసు నిర్ణయ ప్రకారము మేము సాక్షులను అడ్డు సవాళ్ళు వేయలేదు. కాంగ్రెసు కార్య నిర్వాహకవర్గములో ఈ నిర్ణయముజరిగినప్పుడు మహాత్మాజీకో నేకీభవించి, ప్రతివాదము చేయకూడదన్న వారిలో నే నొకడను. ఆ సందర్భమున పూనావాస్తవ్యులు తిలక్ గారి ముఖ్యానుచరు లొకరు ప్రతికూలాభిప్రాయమును తెలిపి, సభనుండి వెడలి పోయెను. ధర్మమును ప్రతిపాదించినచో తప్పేమియని వారివాదన. కాంగ్రెసువాది సత్యవాదియగుటచే అతని స్టేటుమెంటే పరమ ప్రమాణము. దాని కితర సాక్ష్యమవసరములేదని గాంధీజీమతము. అది యట్టులుండనిండు.

గుండురావుగారి సాక్ష్యమైన పిదప ఒకరిద్దరు పోలీసు ఉద్యోగులను విచారించి,ఆ రోజుకు విచారణముగించిరి. ఇక్కడ విచారణ జరుగుచుండగనే పట్టణములో కొన్ని విశేషములు నడచుచుండెను. నన్ను పోలీసులుపట్టుకొనిపోయిరను వార్తవిన్న తోడనే మాకుదూరబంధువగు శ్రీ దిగుమర్తి రామస్వామిగారు తమ సబుకోర్టు సిరస్తాదారు పదవికి రాజీనామా నిచ్చివేసిరి.

కలెక్టరుకచ్చేరీ గుమాస్తాలను చాలమందినిచేర్చి, తనవలెనే ఉద్యోగములకు రాజీనామాలీయనలసినదని ప్రబోధించెను. వారందుకు సమ్మతించి సుమారునూరుగురుతీరుమానము చేసుకొనిరి. ఆ నాడు నెలలో ఆఖరు దినము. మధ్య ఆదివారము వచ్చినది, కాబటి సోమవారమునాడు జీతములు తీసుకొని రాజీనామాలు దాఖలు చేయుటకు నిశ్చయించుకొనిరి. ఇదిగాక కోర్టులో న్యాయవాదులందరును సభకూడి ఆరుమాసములు తమ వృత్తి కార్యములుకట్టిపెట్టుటకునిర్ణయించి, గట్టిగా సమ్మెప్రారంభించిరి.

ఈ సంఘటనలు పట్టణములలోనననేల, దేశమందంతట మితిలేని కలవరము కలుగజేసెను. ప్రజలలో ఆవేశము ప్రబల మయ్యెను. వర్తకులు దుకాణములు ఆనాటితో తెరవవలసి యున్నను, మా నాయకులను జయిలునుండి విడుదలచేయువరకు కొట్లను కట్టివేసియుంతుమని ప్రభుత్వోద్యోగులకు తెలిపిరి. ఈ వార్తలు పత్రికలలో ఆసేతు హిమాచలము ప్రకటితము లయ్యెను. మహాత్ములు కార్యవర్గసభలో కూర్చుండియుండగా నన్ను జయిలులోపెట్టిరనువార్తవినిరట. వెంటనే ఉత్సాహముతో యించుక లేచి, "I wish he was shotdown" అని పల్కెనట. (ఈ విషయము శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులుగారు బొంబాయిసభలో నుండినందున, వారు చెప్పిరి.) ఆ సాయంకాలమే బొంబాయిలో బహిరంగసభలో ("The Andhra lion is fighting there single handed") "ఆంధ్రసింహము ఒంటరియై విక్రమించుచున్న"దని చెప్పినట్లుగూడ వార్తాపత్రికలలో ప్రకటించబడినది.

ఈ యలజడి నంతయు నాలోచించియే కాబోలును, మరునాడు ఆదివార ముదయమునసే మరల కలెక్టరు విచారణ ప్రారంభించి, ముందుగ "నేరము చేసితివా లేదా" యని నన్నడిగి నా వాజ్మూలమును వ్రాసుకొనెను. నేను కొట్లుమూసివేయించుట మొదలు విశేషముల నన్నిటిని జరిగినవి జరిగినట్లు వివరించితిని. నేను చెప్పిన దంతయు నిదానముగ వ్రాసుకొని, ఒకటన ముద్దాయి అనగా నేను, చెప్పిన వాక్యములు నిజమని తాను నమ్మినట్లును పట్టణములో నెమ్మదికి భంగము చేసినట్లు చెప్పుట న్యాయము కాదనియు, నెమ్మదికి భంగము కలుగకుండుటకే ప్రయత్నము చేసెనుగాన నిడుదలచేయుటకు ఉత్తరువు చేయుచున్నానని తీర్పు వ్రాసి వినిపించెను. అంతట నేను విడుదలచెంది, కోర్టులోనే నాతోనున్న మిత్రులనుగూర్చి మాజస్ట్రేటుతో ఇట్లు పల్కితిని. "నేను చెప్పిన వాజ్మూలమును విశ్వసించి నన్ను విడుదలచేసినారు గనుక నాతోడి ముద్దాయిలు నేను చెప్పిన ప్రకారము చేసినారు గావున వారినిగూడ విడిచివేయుట న్యాయముకదా?" యని చెప్పితిని. ముందు చూచెదముగాక అని మాజస్ట్రేటుగారు ప్రత్యుత్తరము చెప్పిరి. కలెక్టరు తన కచ్చేరీలో దాదాపు నూర్గురుగుమాస్తాలు రాజీనామాలిచ్చుటకు సిద్ధముగా నుండుట తెలుసుకొని అలజడిని తగించనలెనను ఉద్దేశముతో ముందుగా నన్ను విడుదలచేసెనని యూహించితిని. పిమ్మట నా మిత్రుల మీద విచారణ సాగించెను. కాలేజీ ప్రిన్సిపాలు మున్నగు సాక్షులు ముద్దాయిలమీద ప్రత్యేకముగ నేరము ఆపాదింపరైరి. ఇట్లు విచారణ చేయుచుండగా ప్రజలు కచ్చేరీచుట్టుపట్ల వేలకొలది గుంపులు కూడియుండిరి. గుంటూరులోని పోలీసులుగాక విశాఖ

పట్టణము మొదలగు ప్రాంతములనుండి కొంత సిబ్బందిని తెప్పించిరి. వారు కచ్చేరీచుట్టు నిలచియుండిరి.విచారణపూర్తి చేసి మాజస్ట్రేటు నా మిత్రులనుగూడ ఆ సాయంకాలము వదలి వేసెను. అప్పు డొక పెద్ద బహిరంగసభ జరిగెను. ప్రజలు వేల కొలది గ్రామగ్రామములనుండి వచ్చియుండిరి. ఆ సభకు పెద్ద సర్కారుఉద్యోగులుకూడ వచ్చి దూరదూరమున ప్రజలచాటున నిలచి ఉపన్యాసములను వినుచుండిరి. నేనును సీతారామశాస్త్రులు మొదలగువారు దీర్ఘముగను అత్యుత్సాహముతోడను మా విజయమును పురస్కరించుకొని ఉపన్యసించితిమి. అప్పటినుండి రోజురోజు మహాసభలు బహిరంగముగ మైదానములోనే జరుపుట సామాన్యమయ్యెను.

రాజీనామా నిచ్చుటకు తీరుమానము గావించుకొన్న గుమాస్తాలు మమ్మును వదలివేయుటతో పట్టువీడి, రాజీనామా లను ఉపసంహరించుకొనిరి. శ్రీ దిగుమర్తి రామస్వామిగారి రాజీనామాను అంగీకరించక సబ్ జడ్జి శ్రీ గంగాధరసోమయాజులు గారు ఉపసంహరించుకోవలసినదని ఎంత బోధించినను ఆయన వినకపోయిరి. ఈ వెంకటరామస్వామిగారు డిస్ట్రిక్టుమునసబు ఉద్యోగమును కొలది దినములలో పొందుటకు సిద్ధముగానుండిరి. ఈయన అన్నగారు హనుమంతరావుగారు గాంధీమహాత్ముని ప్రియశిష్యుడు. నెల్లూరుదగ్గర పల్లెపాడులో ఆశ్రమము స్థాపించి యుండెను.మమ్ములజయిలులోపెట్టినమరునాడు తెల్లవారుచుండగనె మమ్ము వెలుపలకు తీసుకొనివచ్చిన సమయమున శ్రీ గంగాధర సోమయాజులుగారును, శ్రీ వెంకటరామస్వామిగారును కలసివచ్చి

ఉభయులును నన్ను కౌగలించుకొని, ఏమియు మాటలాడకుండ మౌనముతోనే, మరియెవ్వరైన చూచిపోవుచున్నారేమో యను భయముచేకాబోలు త్వరితముగ వెడలిపోయిరి. సోమయాజులు గారుగూడ ఉద్యోగమును వదలుకొనవలెనని తలంచెనట. కాని పిమ్మట నెమ్మనివిూద ఆ యుద్రేకము అణగిపోయెను. వెంకట రామస్వామిగారు మాత్రము ఉద్యోగమును వదలి కాంగ్రెసు ఉద్యమములో గుంటూరులోనే పనిచేసెను.

గుంటూరులో జరిగిన యీ సంఘటన లన్నిటిని గాంధి గారికి ఉత్తరములద్వారా తెలిపితిని. జనులయందు శాంతితత్త్వము గాఢముగా లేక అహింసా సిద్ధాంతమును పూర్ణముగ అనుష్ఠించ లేని పరిస్థితులలో సమ్మె కట్టుట క్రమముగాదని ఆక్షేపించుచు జనులు గుండురావుగారివిూద రాళ్లు రువ్విన విషయము నా ఉత్తరములో వివరించినభాగమును యంగుఇండియా పత్రికలో ఎత్తివ్రాసిరి.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమునకు 1921వ సంవత్సర మునగూడ నన్నే అధ్యక్షునిగా నెన్నుకొనిరి. శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారిని కార్యదర్శిగా ఎన్నుకొనిరి. వీరి సహాయ ముతో కాంగ్రెసు కార్యములు మిక్కిలి చురుకుగ రాష్ట్రమునం దంతట సాగించబడెను. గుంటూరు న్యాయవాదులు ఆరుమాస ములు వృత్తిని కట్టిపెట్టుటకు తీర్మానించుకొన్న వార్త వినిన తోడనే తెనాలి, బాపట్ల, నరసారావుపేట, ఒంగోలుగ్రామముల లోనిన్యాయవాదులలో పలువురు తమ వృత్తి కొంతకాలము మానివేసిరి. అందువలనకోర్టులకు కక్షిదారులు పోవుట తగ్గిపోయి

నందున అవి పాడుపడినశ్లోకనుపడుచుండెను. గుంటూరులో నొక న్యాయస్థానము స్థాపించి, శ్రీ దిగుమర్తి వెంకట్రామస్వామిగారిని తదధిపతిగా కాంగ్రెసు సంఘము నియామకము చేసి వ్యాజ్యములు పరిష్కారము చేయుంపసాగెను.

శాసనసభా బహిష్కారము

1919లో భారత రాజ్యపాలనా విధానమునందు కొన్ని మార్పులుచేసి, పార్లమెంటు రాజ్యాంగచట్టమును ప్రకటించెను. ఆ సంస్కరణలను కాంగ్రెసు తిరస్కరించెను. నూతన చట్టమును ననుసరించి ప్రభుత్వము శాసనసభలకెన్నికలు జరిపెను. చాల మంది జస్టిసు పార్టీవారును, కాంగ్రెసునుండి విడిపోయిన మిత వాదులును శాసనసభా సభ్యత్వమునకు పోటీచేసిరి. కాంగ్రెసు మహాసభ ప్రజలు తమ ఓట్లు నీయగూడదని ప్రకటించెను. నేను ఆంధ్రరాష్ట్ర మంతటను ముఖ్యముగా రాయలసీమలో ప్రచారము చేసితిని. నంద్యాల, కర్నూలు, కడప, అనంతపురము బళ్లారి, హిందూపురము, తాడిపత్రి, హోసుపేట మొదలగు పట్టణము లన్నిటిని దర్శించి సభలుగావించి, సమ్మతుల నియ్యగూడదని ప్రబోధించితిని. బళ్లారికి పోయినపుడు శ్రీ కోలాచలం వెంకటరావుగారియింటికి బోయి, నేను వచ్చినపని మనవిచేసి పౌరమహాసభ సమావేశము చేయుంపుడని కోరితిని. వారు అందుకు చాల విముఖులుగా నుండిరి. ఆ యూరి కాంగ్రెసు సభ్యులలో ముఖ్యులగు శ్రీమునిగారు కోర్టులో న్యాయవాదులతో మాట్లాడి

నచ్చెదనని వెళ్ళి, తిరిగివచ్చి న్యాయవాదు లెవరును అభిముఖులుగా లేరని నాతో చెప్పిరి. అప్పటికి సాయంకాలము మూడు గంటలు గడచినది. శ్రీమని గారిని తీసికొని, అంగళ్ళబజారునకు వెళ్ళి యొక దుకాణమునొద్ద కూర్చుండి, మహాత్మాగాంధిగారిని గూర్చియు, అహింసా సిద్ధాంతములనుగూర్చియు, సహాయ నిరాకరణోద్యమమును గూర్చియు కొంత ముచ్చటించుచుండగా సమీపమున నున్న కొట్లవారందరు గుమిగూడిరి. నేను వచ్చిన కార్యము తెలిపి, ఆయూరిలో సభచేయుట కేనియు ప్రముఖులెవ్వరును సమ్మతించలేదని నా సంతాపము తెలిపితిని. అంతట వారు అప్పటికప్పుడే చుట్టుప్రక్కల దుకాణములవారిని పిలిచి, ఒక సభగావించిరి. నన్ను మరునాడుగూడ మరియొకసభగావించ వలెనని బలవంతపెట్టిరి. నేను హోసుపేటనుండి తిరిగివచ్చునప్పుడు బళ్ళారిలో మరల దిగి ఉపన్యసించెదనని వారికి తెలిపితిని. నేను ఆ రాత్రియే హోసుపేటకు వెళ్ళితిని. అచ్చట సాండూరు సంస్థానములో పెద్ద యుద్యోగముచేసిన తెలుగు నాయుడుగారు సభకు అధ్యక్షత వహించిరి. ఓట్ల నెవ్వరు నీయగూడదనుతీర్మానము గావించిరి. మరునాడు సాయంకాలము 5 గంటలకు బళ్ళారి చేరునప్పటికి స్టేషనువద్ద వర్తకులు హాజరుగానుండి నన్ను అంగళ్ళ దగ్గరకు తీసికొని వెళ్ళిరి. అచ్చట మహాసభ యొకటి నా రాక కెదురుచూచుచుండెను. ఉపన్యాసము వినుటకు కొందరు న్యాయవాదులుగూడవచ్చి దూరదూరమున నిలిచి వినుచుండిరి. శాసనసభలో నాతోగూడ పనిచేసిన శివరావుగారును సభకు వచ్చిరి. ప్రజలు మహోత్సాహముతో ప్రసంగము వినిరి. సభ ముగించి రైల్వేస్టేషనునకు పోవలెననుకొనుచుండగా నగుదూరి

నారాయణరావుగారను వకీలు నా యొద్దకువచ్చి ఆహ్వానించిరి. నాటి రేయి వారియింట భోజనమిడి, తమ బండిమీదనే ర్లై లు స్టేషనుకు పంపిరి. తుద కీమాత్రము సానుభూతి చూపి ఆదరించి టలనందుకు నారాయణరావుగారిని ఇప్పటికిని కృతజ్ఞతతో తలచు కొనుచుందును. శివరావుగారు శాసనసభలో ఎంతయో ఐకమత్యముతో మెలంగినవారైనను నన్ను పలుకరింపరైరి. అన్ని చోట్లను రాష్ట్రములో ఇట్టి ప్రచారమే చేసియుండుటచే ఓట్ల పెట్టెలు చాలవరకు ఖాళీలుగనే యుండెను. కాని, శాసన సభలు ఖాళీలు గాలేదు.

వృత్తిత్యాగములు.

సహాయనిరాకరణ ప్రచారఫలితముగ న్యాయవాదులు తమ పనులు కట్టిపెట్టుటనుగూర్చి పైన తెలిపితిని. ప్రభుత్వో ద్యోగమును మానుకొన్న వారిలో శ్రీ దిగుమర్తి వెంకటరామ స్వామిగారుగాక కొలదిమందికలెక్టరుకచ్చేరీ గుమాస్తాలును ఒక రిద్దరు పెద్ద ఉద్యోగులు నుండిరి. శ్రీ రావూరి రంగారావుగారను రెవిన్యూ ఇనస్పెక్టరును, తహసీల్దారుదా రగుటకు సిద్ధముగానున్న శ్రీ వడ్లమూడిముక్తేశ్వరప్రసాదరావుగారునుతమయుద్యోగములు మానుకొని కాంగ్రెసులో ప్రవేశించి చాల సేవచేసిరి. ముక్తేశ్వర ప్రసాదరావు కొంతకాలము ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కార్యస్థాన మున మానేజరుగానుండిరి. రాట్నముమీదను, తక్లీమీదను

నూలువడకుటేగాక మగ్గమువీాద గుడ్డనేయుటనుగూడ నభ్య
సించిరి. ఈయన మిక్కిలి సత్యప్రియుడు. ధర్మనిష్ఠాపరుడు.
మిక్కిలి విశ్వాసపాత్రుడు. గృహచ్ఛిద్రములలోజిక్కి జీవనము
జరుగుట కష్టముగా నున్నను దేశసేవ కంకితుడైన ధీరుడు. శ్రీ
గుండ్లపల్లి రామకృష్ణయ్యగారు గుంటూరు మిషన్ కళాశాలలో
ఆచార్యత్వమును త్యజించి కాంగ్రెసులో సత్యదీక్షతో పని
చేయుచుండెను. ఇంకను కొందరు ఉపాధ్యాయపదవిని వదలిన
వారు గలరు.

శ్రీ బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యముగారు రాజమహేంద్ర
వరములో డాక్టరుగ పనిచేయుచు చాలసొమ్మ్ము సంపాదించు
కొనుచున్నవారు కాంగ్రెసులోచేరి, అతి తీవ్రమైన త్యాగముతో
ద్రవ్యమును వ్యయముచేసి ప్రచారకులకు సహాయముచేయుచు
దీక్షతో పనిచేయుచుండిరి. ఈయన తల్లిగారు చాల ఉత్సాహ
పరురాలు. ఖద్దరు గుడ్డలను తీసుకొని వెళ్ళి ఊళ్ళవెంట తిరిగి
ప్రచారము చేయుచుండెను. వీరి యుభయుల సేవా త్యాగము
లపూర్వములు. సుబ్రహ్మణ్యముగారి సోదరుడు సీతారామయ్య
గారు సూళ్ళయినస్పెక్టరుగానుండి,ఆ యుద్యోగమును మానుకొని జాతీయపాఠశాలలో పనిచేయుచుండిరి. సుబ్రహ్మణ్యము
గారు కొంతకాలమునకు గోదావరీతీరమున సీతానగరములో
సత్యాగ్రహాశ్రమమును స్థాపనచేసి ఖద్దరుత్పత్తి
నిర్మాణకార్యములను విరివిగ సాగించి ప్రసిద్ధి
రోజులలో పలువురు వీరితోజేరి ఆశ్రమ ని
ఆశ్రమకార్యములను ఉత్సాహముతో నెరవే

నేను కాకినాడకు ప్రచారము నిమిత్తము పోయిన కొత్త రోజులలో శ్రీ బులుసు సాంబమూర్తిగారింటికి బోవుచుంటిని. వారి యింటిలో నొకసారి భోజనము చేయుచు ప్రస్తావవశమునవారిని కాంగ్రెసులో చేరవలసినదని ప్రోత్సహించితిని. అంగుకువారు నాకు సమాధానము చెప్పక యూరకుండిరి. ఆ సాయంకాలము పైడావారి మైదానహాలుఆవరణలో పౌరమహాసభ సమావేశ పరచబడెను. ఆ సభలో పలువురు న్యాయవాదులును పౌరులును హాజరైరి. నేనుసహాయనిరాకరణోద్యమమునుగూర్చి చాలవరకు ప్రసంగించి, న్యాయవాదులు సంఘములో ప్రముఖులుగాన వారు నడుముకట్టుకొని కాంగ్రెసుద్యమములోదిగి దేశమును నడిపించుట అవసరమని కొంత ఆవేశముతో ఉపన్యసించితిని. అంతట సాంబమూర్తిగారు లేచి, తాను న్యాయవాద వృత్తిని మానికాంగ్రెసులో పనిచేయ నిశ్చయించుకొన్నానని ప్రకటించిరి. ఆ మహాత్యాగమునకు సభయంతయు జయధ్వానములు సల్పెను. నెమ్మది నెమ్మదిగ గోదావరి కృష్ణాజిల్లాలలో న్యాయవాద వృత్తులను, డాక్టరుపదవులను కొందరుమానివేసిరి. రాజమహేంద్రవరములో బారిస్టరుగానుండిన నాయుడుగారు తమ వృత్తిని వదలిరి. ఇట్లే రామచంద్రపురములో, రాజోలులో, పెద్దాపురములో, బందరులో నెందరో న్యాయవాదులు వృత్తి విసర్జనము చేసిరి. బెజవాడలో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు [redacted] యవాదులలో నాయకాగ్రణిగానున్నవారు. కాంగ్రెసు [redacted] నాయకత్వము వహించిరి. నరసారావుపేటలో [redacted]కోటేశ్వరరావుగారను యువకులు తమ న్యాయ [redacted]నాడి కాంగ్రెసుకార్యములలో మిగుల

తోడ్పడుచుండిరి. పిమ్మటికాలమున ఈ సచ్ఛీలుడు త్రివేణీయను ఆంగ్లపత్రికను ప్రచురించుచు పేరందెను.

ఇట్లు సహాయనిరాకరణోద్యమము సాగుచున్నరోజుల లోనే డ్యూక్ ఆఫ్ కానాట్ (ఆంగ్లేయచక్రవర్తి సోదరుడు) మన దేశమునకు వచ్చిరి. ఆయన సన్మానములో కాంగ్రెసువాదులు పాల్గొనకూడదని నిషేధింపబడెను. ఆ సమయమునందే కలకత్తాలో కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గసభ శ్రీ సి. ఆర్ దాసుగారి యింట జరిగెను. సభ్యు లందరు హాజరుకాకమున్ను గాంధి మహాత్ముడును దాసుగారును నేనుమాత్రమే యుంటిమి. డ్యూక్ ఆఫ్ కానాట్ రాకనుగూర్చి చెప్పుచు, వారికి గాంధి గారు ఒక సన్మానలేఖ వ్రాయనారంభించిరి. దాసుగారు వ్రాయ వద్దని నివారించుచున్నను గాంధిగారు వ్రాయుచుండిరి. దాసు గారు నన్నుజూచి నా అభిప్రాయమును చెప్పుమనిరి. నేనును వ్రాయదగ దంటిని. గాంధిమహాత్ములు ఉత్తరము వ్రాసి, మాకు చదివి వినిపించిరి. "మీరు మాదేశమునకు వచ్చిన ఈ సమయ మున మీ వ్యక్తిని పురస్కరించి మిమ్ము నభినందించి సన్మా నించుచున్నా" నని రెండు వాక్యములతో ముగించిరి. అప్పుడే ఆ యుత్తరమును డ్యూకుగారికి పంపివేసిరి. దాసుగారు ఆ దివ్య భవనములో భోగభాగ్యముల ననుభవించు మహాభోగి వృత్తిని వదలి, ముతక ఖద్దరు బట్టను కట్టుకొని ఖద్దరుచొక్కా తొడుగు కొని యుండెను. ఆయన ఆజానుబాహువును స్థూలశరీరుడు. ఆ రాష్ట్రములో అప్పుడు తయారగు ఖద్దరువస్త్రము ముతకగా నుండుటేకాక వెడల్పులో మన కొల్లాయిగుడ్డవలె నుండెనుగాన

అట్టి గుడ్డలను కెంటినిచేర్చి కుట్టినగాని ఆయునకు చాలకుండు
టచే అట్లు కుట్టినబట్టనే ఆయున కట్టుకొనియుండెను.

——

బెజవాడ సభలు.

1921 సంవత్సరము మార్చి 30వ తేదీని బెజవాడలో అఖిలభారత కాంగ్రెసు సంఘసభ జరుపబడినది. ఈ సభకు గాంధిమహాత్ముడును, పండిత మోతీలాలు, మౌలానాషౌకతాలీ మహమ్మదాలీగార్లును, సి. ఆర్. దాసు మొదలగు కాంగ్రెసు ప్రముఖులు పలుప్రకునువచ్చియుండిరి. గాంధిమహాత్ముని నేనును శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారును జగన్నాథములో నెదురొక్కని మనరాష్ట్రమునకుతీసికొనిరావలెననిముందువెళ్ళితిమి. జగన్నాథములో సభముగించిరి. ఆంధ్రరాష్ట్ర ప్రయాణమునకు సిద్ధముగనుండిరి. బీహారునుంచి రాజేంద్రప్రసాద్ గారును వచ్చి యుండిరి. మమ్ము నిరువురను జూచుటతోడనే గాంధీజీ రాజేంద్ర బాబుతో "ఇదుగో! జయిలరువచ్చినాడు. పాతజయిలరునొద్దనుండి ఒప్పగించుకొనుట"కని హాస్యమాడుచు మమ్ముగూర్చి ఆదర వచనములు పల్కిరి. దారిలో బరంపురములో మొదట దిగితిమి. సాయంకాలము ఆరుగంటలలోపల సభకు పోకముందు శ్రీమతి కస్తూరిబాయి రొక్కెముక్కలనుఒకపళ్ళెరములో గాంధిజీకిచ్చెను. పళ్ళెమును చేతబుచ్చుకొని ఇతరులతో ముచ్చటించుచు ఒక్కముక్కను నోటబెట్టుకొని, వెంటనే అసహ్యించుకొని, ఆ ముక్కలను తినకుండ వదలివేసిరి. గాంధీజీకి వెన్నయు నేయియు

నిషిద్ధమని బరంపురమువా రెరుగక ఆ ముక్కలకు పోపము, వెన్నరాచితెచ్చిరి. కస్తూరిబాయిగారు ఆ సంగతి చెప్పుట మరచి పోయినారు. గాంధీజీ సభకు పోవలెనని లేచిరి. "పౌరపాటు జరిగినది. ఇప్పుడే మరియొకరొట్టు నేయులేకుండ తయారుచేసి యిచ్చెదరుగాన పుచ్చుకొనవలసిన"దని అందరును ప్రార్థింప పడిరి. నేనుగూడచాలదూరము టిమించవలసినదని బ్రతిమాలితిని. కాని ఆయన శాంతవచనములతోనే తాను ఏమియు పుచ్చుకొన ననియు, నోటబెట్టుకొనకముందు తాము ఏమితినబోవుచున్నామో విచారించకుండ తినుట తమదే గొప్ప తప్పిదమనియు, ఆ తప్పిద మునకు ప్రాయశ్చిత్తముగా తాము ఉపవాసముండెదమనియు గట్టి పట్టుబట్టి పౌరసభకు పయనమైరి. సభ ముగించినపిమ్మట బయలు దేరి అనకాపల్లిలో తెల్లవారుటకునుపే దిగితిమి. అచ్చటనుండి బయలుదేరి మధ్యస్టేషనులలో నెక్కడను దిగకుండ బెజవాడకు జేరితిమి. బెజవాడలోగొప్పసన్మానముగావించిరి. కాంగ్రెసు మహా నాయకులగు పండిత మోతీలాల్, సి. ఆర్. దాసు, మౌలానా షౌకతాలీ, మహమ్మదాలీ మొదలగువారందరు సభకువచ్చిరి. అఖిలభారత మహాసభ ఆంధ్రరాష్ట్రములో జరుగుట కదియే ప్రథమము. జిల్లాలనుండి ప్రజలు వేలకొలది రైళ్లు పట్టుకుండ ప్రయాణములు చేసివచ్చిరి. టిక్కట్లు తీసికొను మాటయేతలపక చాలమంది తండోపతండములుగ వచ్చిపడిరి. అన్ని వేలజనుల కొక్కసారి టిక్కట్లిచ్చుటయు సాధ్యముగాదు. కాబట్టి రైలు చట్టము కట్టిపెట్టబడినది.

ఆనాటి సభలో మిక్కిలి ముఖ్యమై చేయబడెను. ఈ మహోద్యమము సాగించుట

నిధి యనుపేర కోటిరూపాయలు సంపాదించుటకును పేదసాదల కన్నవస్త్రములు కల్పించుటకై కోటి రాట్నములు నెలకొల్పుట కును నిశ్చయించిరి. దీనికి బెజవాడ తీర్థానమని ప్రసిద్ధికలిగెను. కాంగ్రెసు సమావేశము ముగిసిన పిమ్మట మరునాడు పౌరసభ నొక మైదానములో జరుపుటకు పుదిళ్ళు వేయబడెను. ప్రజాసమూహములచే ఆ ప్రదేశమంతయు గిక్కిరిసి పోవుటచే కోలాహలము హెచ్చిపోవుచుండెను. దూరమునుండి ప్రజలింకను వచ్చిపడుచుండిరి. సభామండపముపైకొక్కెక్కరే మహానాయ కులు వచ్చునప్పటికి ప్రజల జయజయధ్వానములచే దిక్కులు మారుమ్రోగుచుండెను. గాంధిమహాత్ముడు సభాస్థలికి చేరుటయే కష్టసాధ్యమయ్యెను. సభామండపముపై వారి దర్శనమైనతోడనే వారి పాదపద్మములనంటి కన్నుల కద్దుకొనవలెనను ఆశతో ప్రజలు ఆవేశపూరితులై మహాసముద్రతరంగము పొంగిపొరలినట్లు ఒక్కసారిగ సభామండపమువైపునకు ప్రోసుకొనివచ్చుచుండిరి. మహాత్ముడక్కడ నుండుట మిక్కిలి ప్రమాదముగ తోచుటచే వారిని కాంగ్రెసు ప్రచారకు లెట్లో ఆ మూకలనుండి తప్పించి తీసుకొనిపోయిరి. అంతట ప్రజాసమూహమంతయు విఫలమనో రథమై వెడలిపోయెను.

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు కొందరు కాం పచారకులను రామదండు అనుపేరుతో సేవాసంఘముగ రాత్రి రామదండు సహాయముతో ఆ మైదానమున నీళ్ళు లేర్పరచి, సభలో స్త్రీలకును, పురుషులకును యించి, తగినపర్యాటులు గావించెను. సభ

మరుసటి దినము శాంతముగ జరిగిపోయెను. ఆంధ్రమహాజనులు ప్రదర్శించిన ఉత్సాహము స్థిరమై కార్యరూప మెత్తినయెడల ఆంధ్రులొక్కరే స్వరాజ్యమును సాధించగలరని పొగడుచు నాయకులు ఆశ్చర్యమును వెలిబుచ్చిరి.

మహాత్మునితో సంచారం.

మూడవదినమున జగన్నాథమునుండి వచ్చునపుడు వదలిపెట్టిన ముఖ్యస్థలములను దర్శించుటకు మరల గాంధీజీ ప్రయాణమైరి. నేనును వారితోడనే యుంటిని. రాజమహేంద్రవరము, కాకినాడ పట్టణములను సందర్శించితిమి. ఈ పట్టణములలో మహాసభలు మిక్కిలి దర్శనీయములుగ నుండెను. మహాత్మాజీ ఉపన్యాసము ముగించి, తిలక్ స్వరాజ్యనిధికి కానుకలిండని కోరగనే స్త్రీలు వారి బంగారపుగాజులను పడ్డాణములను, మెడలోని చంద్రహారములనుగూడనిచ్చిరి. పురుషులును కానుకలు సమర్పించిరి. ఈ రెండుపట్టణములందును ముఖ్యముగ స్త్రీలు చూపిన త్యాగముచే మహాత్ముడు ఆశ్చర్యమానసు డయ్యెను. కాకినాడనుండి ఏలూరు జాతీయకళాశాలాభవనమునకు శంఖు స్థాపన చేయుటకై ఆ రాత్రి అక్కడ శంఖుస్థాపనగావించి మరల బెజవాడ జేరితిమి. లక్షరూపాయలు ఏలూరివారు వసూలు జాతీయపాఠశాలను స్థాపించుట ఆంధ్రదేశము గౌరవమును సంపాదించెను. ఏలూరిలోనో వ జ్ఞాపకము చాలము. శ్రీ మాగంటి బాపినీడు

అన్నపూర్ణ స్వరాజ్యనిధికి తాను ధరించిన సర్వాభరణములును అర్పణజేసెను. బెజవాడనుండి బందరుకు మహాత్ములు పయనమైరి. శ్రీ పట్టాభిసీతారామయ్యగారికివారి నొప్పగించినేనుగుంటూరులో ఏర్పాటులు ఆలోచించుటకు వచ్చితిని. ఇక్కడ శ్రీ వద్ది వెంకటసుబ్బయ్యగారి యింటిలో వారికి బస నిర్ణయించిరి. బందరు నుండి ఉదయమునకే గుంటూరుకు మహాత్ముడు వచ్చునట్లు నిర్ణయమయ్యెను. ఉదయము ఏడుగంటలకే మేము ఊరిగుమ్మ మున వేచియుంటిమి. ఎంత వేచియున్నను రాలేదు. పదిగంటలు దాటినను మహాత్మాజీ రాలేదు. అందువలన సభకువచ్చిన స్త్రీ పురుషులు భోజనముల నిమిత్తము వారి వారి యిండ్లకు బోయిరి. పరగ్రామములనుండివచ్చినవారు పురవీధులలో మద్ది వెంకటసుబ్బయ్యగారి యింటి సమీపమున తిరుగులాడుచుండిరి.

సుమారు పదునొకండుగంటలకు మహాత్మాజీ గుంటూరులో ప్రవేశించిరి. వారు స్నానముచేసిన పిమ్మట భోజనము నిమిత్తము కావలసిన పదార్థములమర్చి వారి యెదుట నుంచబోయినపుడుఆరోజు వారు ఉపవాసదీక్షవహించితిమనిచెప్పి ఏమియును స్వీకరించలేదు. వెంకట సుబ్బయ్యగారికి మహాత్మని యందు మిక్కిలిభక్తి. గాంధీగారు వైశ్యులగుటచే ఆంధ్రదేశము లోని వైశ్యులు వారినిగూర్చి మిక్కిలి గర్వపడుచుందురు. కాని [illegible]నివారణ ప్రయత్నములు మాత్రము గాంధిగారిలో [illegible]గ వారు పరిగణింతురు. వెంకటసుబ్బయ్యగారికి [illegible]భిప్రాయ మున్నను మహాత్మునిదైవసమానునిగ [illegible]వారు తమ గడప త్రొక్కినమాత్రముననే

తమకు సర్వమంగళములును సమకూరునని వారికి విశ్వాసము. మహాత్ము డేమియును భుజింపక నిరాహారులుగానుండుట వారు సహింపలేకపోయిరి. పలుమారు "ఒక పండునైన పుచ్చుకొన వలసిన" దని మిక్కిలి ప్రాధేయపడిరి. ఉదకమునైప్ప మరేదియును వారు పుచ్చుకొనలేదు. వెంకటసుబ్బయ్యగారితో, యింటిలోని ఆడవారితో, ఇతర బంధువులతో కుశలప్రశ్నలు సలిపి ముచ్చటించి, పిల్లలను దగ్గరకుదీసి బుజ్జగించి యిట్టి యుదారకృత్యములచేత వారికి హృదయానందము గావించినపిదప నన్ను బిలిచి, ఆలస్యముగ వచ్చినందుకువగచుచు వెంటనే సమావేశముజరుపనలసినదని కోరిరి. ప్రజలు చాలకాలము వేచియుండి యిండ్లకుబోయిరనియు తాము అస్వస్థులై నిరాహారులుగా నుండిరిగాన నేడు విశ్రాంతి పొంది మరునాడు సభ జరిపించుట యుక్తమని తెలిపితిని. కార్యక్రమము సాధ్యమైనంతవరకు నిర్ణయప్రకారము నడుపుట అవశ్యముగాన గుంటూరులో పని నాడు పూర్తిచేసుకొని, మరునాడు నిర్ణీతస్థానము చేరక తప్పదనియు, సేనాధిపతియైనవా డొక్కచోట తాను పన్నిన వ్యూహమున లోపమువచ్చినంత మాత్రమున అస్థానముకొరకు వ్యూహములోనితక్కినస్థానములను తారుమారుచేయునాయనియునాకుసమాధానము చెప్పిరి. వెంటనే సభ జరుగునని ప్రచారకులు నలుదెసల చాటగనే సభాస్థలము జనముచే క్రిక్కిరిసిపోయెను. గాంధిజీ ప్రసంగమును నేనే తెలుగు ప్రేక్షకులకు శ్రుతపరచితిని. పౌరులు కానుకల నొసంగిరి. స్త్రీ ఆభరణములను దక్షిణగా సమర్పించిరి.

సాయంకాలమునకు బాపట్లలో సభ జరుపవల మహాత్ముడును, నేను నొక మోటారు నెక్కి

కస్తూరిబాయియు, గాంధిగారి కార్యదర్శి మున్నగువారు మరి రెండు మోటారుల నెక్కి వెనుక వచ్చుచుండిరి. మహాత్మాజీ నిమిత్తము రొట్టెయును పాలును కస్తూరిబాయి తమ కారులో తెచ్చుచుండిరి. రొట్టెను కాగితములోచుట్టి, ఆమె చేతికీయ వచ్చినపుడు కాగితములో చుటిపెట్టినందుకు వారు అసహ్యించు కొనిరి. కాగితము లెట్లు చేయుదురో పాపము వీరెరుగరు. మురికి గుడ్డపీలికలు మొదలగు అపరిశుద్ధ వస్తువులచే చేయబడు కాగిత ములలో భోజనము నుంచుట తగదని వారి అభిప్రాయమై యుండును. మేము చేబ్రోలు సమీపించునప్పటికి గొప్ప ప్రజా సమూహము మా కెదురుగ తప్పెట్లతోడను, డోలుసన్నాయి మేళములతోడను వచ్చుచుండెను. వారిలో పలువురు ఆజానుబాహువులు, దృఢశరీరులు, నల్లని నేరేడుపండునలె నిగనిగలాడెడు దేహచ్ఛాయగలవారు ఖద్దరు ధోవతులను కట్టు కొని, ఖద్దరు తరీయములు వల్లెవాటుగ ధరించి, వైష్ణవనామములు పెట్టుకొని, ఆవేశపూరితులై పెద్దయెత్తడి పళ్ళెములో పసుపు గుడతో గల రూపాయలమూట బెట్టుకొని కర్పూరహారతులు వెలిగించుచు మా మోటారు నొద్దకు వచ్చి ఆ పసుపుగుడ్డ మూటను కానుకగా సమర్పించిరి. అందు ఏడువందల రూపాయ లుండెను. ఇట్లు భక్తిప్రేమలతో ఆవేశపూరితులైన పల్లెప్రజలను ఈ దృశ్యము అపూర్వమని గాంధిజీ మెచ్చుకొనిరి. ఈ రింతవరకు చాలభాగము జస్టిసుపార్టీ వారని తెలిపి, ఇప్పుడు వీరు కాంగ్రెసు ఉద్యమాభిమాను లాచకమని మనవిచేసితిని.

అచ్చట సభ ముగించుకొని, ప్రయాణమైపోవుచు రోడ్డు ప్రక్కల పందిళ్ళు వేసుకొని సభలు తీర్చి మహాత్ముని రాక కెదురు చూచుచున్న మునిపల్లె, పొన్నూరు మున్నగుచోట్ల ఆగితిమి. పొన్నూరుదాటిన కొంతసేపటికి సూర్యుడు క్రుంకబారుచుండెను. మహాత్మాజీ తన నియమపరికారము సూర్యాస్తమయము లోపల ఆహారము పుచ్చుకొనవలసియుండెను. అంతవరకు నుప వాసముచేయుచు మధ్యమధ్యనెన్నిచోట్లనో ఉపన్యాసములిచ్చుచు మిక్కిలి అలసటచెందిన దేహము ఆహారము కోరుచుండెను. వెనుక వచ్చుచున్న వనుకొనిన మోటారు లేవియును కానరా వయ్యెను. మార్గమధ్యమున లభించిన పండ్లను ఎప్పటి వప్పుడే మోటారు దగ్గర చేరిన పిల్లలకు పంచిపెట్టివేసిరి. కావున బండిలో ఫలములేవియు లేకపోయెను. ప్రక్కగ్రామమునకుబోయి పాలు తెచ్చెదనని మహాత్మాజీకి చెప్పితిని. వా రందుల కంగీకరించలేదు. బాపట్లకు వెంటనే చేరవలెనని తొందరపడుచుండిరి. మోటారు సాగుచునేయుండెను. వారి కిట్టి సమయమున నేమియు చేయలేక పోతినని నేను మిక్కిలి వగచితిని. మోటారులో నొక నారింజ మిగిలియుండగా నది యొలిచి, ఒక బద్ద నోటబెట్టుకొని "ఇది తిన దగిన ఫలమేనా" యని నన్ను మహాత్మాజీ ప్రశ్నించిరి. అది నారదబ్బకాయ"ఊరుగాయలకేగాని తినుటకుపయుక్తమై నదికా" దని తెలిపి, ఆ ఫలము తినుటకెట్లున్నదని ప్రశ్నించితిని. "ఆకలి రుచి ఎరుగదు గదా" యని నవ్వుచు సమాధానము [illegible]. బాపట్ల పదిమైళ్ళదూరమున నున్నదనగా భట్టిప్రోలు ప్రకాశరావుగారు బైసికిలునెక్కి మా కెదురుపడిరి. వచ్చుచున్నారుగాన వారి నిమిత్తము ఫలాహార[illegible]

వలసినదని అచ్చటివారితో చెప్పుమని తెలుగున ఆయనతో చెప్పి పరుగిడనలసినదని ఆయనను వేగిరించితిని. మేము బాపట్ల చేరునప్పటికి చీకటి పడుచుండెను. వెంటనే దేశిరాజు బాపయ్యగారి యింటికి తోడ్కొనిపోయిరి. అచ్చట కారుదిగినవెంటనే కాళ్లు చేతులును ముఖమును కడుగుకొని మహాత్మాజీ లోపలకు బోయిరి. తివాచీమీద వాగుకూర్చుండినపిమ్మట పెద్ద వెండి పళ్ళెమునిండ బత్తాయి నారింజపండ్లబద్దలు మహాత్మాజీ యెదుట నుంచి భుజింపుడని బాపయ్యగారి కుమారుడు లక్ష్మీనారాయణ గారు కోరిరి. తిలకు స్వరాజ్యనిధికి కట్నము చెల్లించిననేగాని తాము భుజించుటలేదని మహాత్మాజీ స్పష్టపరచిరి. అంతట వెయ్యి రూపాయలను మరియొక వెండిపళ్ళెమునబెట్టి కాన్క సమర్పించిరి. వా రంతట కొన్ని పండ్లబద్దలను పుచ్చుకొని తుదారిని మాన్చుకొని, మహాసభకు పోయిరి. నేను మాత్రము వెనుక నిల్వనలసివచ్చెను. గుంటూరునుండి వచ్చుమార్గములో గ్రామముల వా రొసంగిన కానుకల ద్రవ్యము ఎప్పటికప్పుడు లెక్కపెట్టుకయే నా యుత్తరీయములో వేసి మూటగట్టుకొనుచుంటిని. బాపయ్యగారింటిలో నిచ్చిన వెయ్యిరూపాయలతో మూట బరువెక్కెను. లెక్కపెట్టుట కవకాశము లేకపోయెను. ఆ రోజులలో కానుకలు విశేషభాగము రొక్కరూపముగనే యుండెడివి. ఇచ్చిన వారి మాటనుబట్టి యింతమొత్తము వచ్చిన దనుకొనుటే సంభవించెను. అంతవరకును వచ్చినసొమ్మును, పీడర్లు వసూలుపరచిన రు 7000ల తో కలిపి యుత్తరీయములోనేమూటగట్టి దేశిరాజు కృష్ణయ్య గారియింటిలో భద్రపరచితిని.

బాపట్లలో బొరసభ ముగిసిన పిమ్మట చీరాలకు పయన మైతిమి. సొమ్మ ఏమి చేసితివని మహాత్మాజీ నన్నడుగలేదు. నేను వారితో చెప్పనులేదు. చీరాలకు పోవులోపలనే చీరాల సమీపమున ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్యగారు రామనగరమును నిర్మించియుండిరి. ఆ రామనగరులో చుట్టుపక్కలపల్లెలలోని ప్రజలు కొన్నివేలు చేరియుండిరి. మహాత్మాజీ మోటారును ఒంటరి ఇనుకలో ప్రజలు త్రోసికొనుచు తీసుకొనిపోయిరి. నేను వారు త్వరలోనే ముగించుకొని రాగలరని రోడ్డుమీదనే నిలచి పోతిని. కాని చాల ప్రొద్దుపోవువరకు రామనగరులోనే కాలము గడచిపోయెను. మేము చీరాల పోవునప్పటికి రాత్రి పదిగంటలు సమీపించుచుండెను. చీరాలలో వైశ్యవర్తకులు పలువురు ధనవంతులుండిరి. కాన మహాత్మాజీని ఎక్కువ మొత్తమును కానుకగానిచ్చినవారియింటికి తీసికొనిపోవునట్లుపర్యాటు చేసుకొని వారు పాటపాడి, పదమూడువందలరూపాయల పాటపాడిన వర్తకుని యింటికి తీసుకొనిపోయిరి. అచ్చట నా రూపాయలు తీసికొని, పురమధ్యమున సమావేశమైన మహాసభకు వచ్చితిమి.

ఆ దినములలో చెన్నరాష్ట్రమున జస్టిస్ పార్టీ ప్రభావము ఎక్కువగ సాగుచుండెను. ఆ పార్టీ వారిప్రేరణచే చీరాల పేరాల గ్రామములను ఆ గ్రామవాసులు వలదు మొర్రో యనుచున్నను పట్టుబట్టి మునిసిపాలిటీ [illegible]త్వమువారు హూర్చిరి. ప్రజలెంత ప్రయత్నముచేసిన [illegible]రు వారిమొర నిరాకరించిరి. శ్రీ దుగ్గిరా[illegible] పేరాల పౌరుల [illegible]ఘమును

రద్దుపరచవలసినదని తీర్మానములు చేయించి, ప్రతిఘటించినను ఉపయోగించలేదు. అంతట వారు సహాయనిరాకరణ ప్రవేశపెట్టు పద్ధతిని మెలమెల్లగ ప్రజలలో ప్రయత్నములు సాగించుచుండిరి. వీధులప్రక్క చిన్న చిన్న చిల్లరదుకాణములు పెట్టుకొనువారుసహితము సుంకము చెల్లించవలెనని మునిసిపాలిటీనిర్బంధింపగా వారిని గోపాలకృష్ణయ్యగారి ప్రేరణచేకొందరు సుంకము చెల్లింప నిరాకరించిరి. వారిపై మేజస్ట్రేటుకోర్టులో కేసులుపెట్టినందున మాజస్ట్రేటులు ఖైదుశిక్ష విధించుచుండెను. విచారణ సమయములో నేరస్థులు హాజరుగానిచో వారంట్లమీద పోలీసులు పట్టుకొని బలవంతముగ కోర్టుకు తీసుకొని వెళ్ళునపుడు ప్రజలు నందలాది వెంట బోవుచుండిరి. నేనును ఆ వాయిదాలకు కొన్నిటికి హాజరగుచుంటిని. మాజస్ట్రేటు కొందరికి జైలుశిక్షగూడ విధించుచుండెను. ఈ కేసులలోనెవ్వరును ప్రతివాదముచేయక కాంగ్రెసునియమమును చక్కగ పాటించుచుండిరి. ఇట్లు శిక్షింపబడిన వేదవారిలోమిక్కిలి వృద్ధురాలైన ఒక స్త్రీకి గూడ జైలుశిక్ష విధించిరి. గాంధీగారు చీరాల వచ్చినాటికి ఆమె శిక్షననుభవించి అచ్చటికి వచ్చియుండెను. ఆమెను గాంధీజీయొద్దకు తీసికొనివచ్చి ఆమెచే పూలదండ వేయించి సన్మానింపజేసి, ఆమె చరిత్రను వారికి శ్రుతపరచిరి. ఆమె ధైర్యమును దేశభక్తికిని గాంధీజీ మెచ్చుకొని ఆదరించిరి.

ఆ సభలో మహ[illegible] ముగించిన పిమ్మట పుర పాలక స[illegible] యనిరాకరణ

మేరలుదాటించి, పురము వెలుపల కాపుగములు పెట్టించవలె
నను తన యుద్యమమునుగూర్చి మహాత్మాజీ అభిప్రాయమును
గోపాలకృష్ణయ్యగారు కోరిరి. ''మీరు చేయు కార్యము జయ
ప్రదమైనయెడల కాంగ్రెసు మిమ్ము అభినందించును. కాని
మీరు అపజయము పొందునెడల ఆ బాధ్యత కాంగ్రెసు తనపై
పెట్టుకొన''దని యుక్తిగ జవాబుచెప్పిరి. ఈ ప్రయత్నము సాగినను
తగినంతకాలము గ్రామమునుండి కదలసపోవుటసాగదని నేను
అభిప్రాయపడుచున్నను పలుమారు చీరాలపోయి, సభలలోను,
ఉత్సవములలోనుపాల్గొనుచుంటిని.సభముగించుకొని మహాత్మాజీ
నెల్లూరికి పోనుద్దేశించిరి. కాని ప్యాసింజెరు రైలు అప్పటికే
చీరాల వచ్చి వెడలిపోయెను. మెయిలుబండి వేటపాలెములో
నాగును.కావున అచటికి ప్రయాణము సాగించితిమి. వేటపాలెము
మహాత్మాజీ కార్యక్రమములో చేర్చబడినదికాదు. మేము
వేటపాలెము సమీపించునప్పటికి దివిటీలతో మేళతాళములతో
పౌరులు ఎదురుగానచ్చిరి. అనుకొనని ఈ స్వాగతమునకు మేము
ఆశ్చర్యము నొందితిమి. గ్రామములో ఉత్సవముతో ప్రవేశించి
ఒకొక్కయింటియెదుటనేవేసియున్న పందిళ్ళలో 116 రూపా
యలు చొప్పున కానుక లందుకొంటిమి. పిమ్మట రైలుస్టేషను
కేగి, కొంతవడి విశ్రమించి, మెయిలులో మూడవతరగతి బండి
లోనే ప్రయాణముచేసి తెల్లవారునప్పటికి నెల్లూరు జేరితిమి.

బందరునుండి ఉదయము సుమారు ఏడుగంటలకు
మోటారువిూద ప్రయాణమై మధ్యమధ్య గ్రామములలో బండి
దిగుచు ఎక్కుచు సభలలో ప్రసంగించుచు జ్వరముగానున్నను

లెక్కచేయక 11 గంటలకు గుంటూరు చేరి, నిరాహారిగానుండి, జలములుమాత్రము పుచ్చుకొని, ఇంచుక విశ్రమించుటతప్ప ఇతర విరామములేక ప్రయాణముచేయుచు బడలిక చెందినట్లు కనుపడక, వేటపాలెములో రాత్రి రెండుగంటలవేళ రైలెక్కుటవరకు ఒడలువాల్చక కార్యక్రమమునుపూర్తిగావించుకొన్నమహాత్ముని దీక్షాపటిమ వర్ణనాతీతము.

నెల్లూరులో శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారి మేడలో మహాత్మునకు బస ఏర్పాటుచేసిరి. రామిరెడ్డిగారును శ్రీమతి పొనకా కనకమ్మగారును కాంగ్రెసుద్యమములో దీక్షతో సేవచేయుచుండిరి. శ్రీ ఓరుగంటి వెంకటసుబ్బయ్యగారు కాలిలో ప్లీడరు పనిచేయుచు సంఘ సంస్కరణ ప్రియులుగా నుండి, కాంగ్రెసుద్యమప్రచారములో దిగి, వృత్తినిమానిని, ఖద్దరు, జాతీయవిద్యలను ప్రోత్సహించుటేగాక, తాటిచెట్లగీత మాన్పుటకై తాటిచెట్లనుఅనేకగ్రామములలో నరికించి ప్రభుత్వము వారితో తీరనిపోరుసాగించుచుండెను. ఈ విషయమున నెల్లూరిలో జరిగిన ప్రయత్నముగాని జయముగాని భారతదేశమున మరి యెచ్చటను జరిగియుండలేదు. దీనికి ముఖ్యకారకుడు శ్రీ వెంకట సుబ్బయ్య. శ్రీవెన్నెలకంటి రాఘవయ్యగారను వకీలుగూడ వృత్తి మాని కాంగ్రెసులో తీవ్రదీక్షతోపనిచేయుచు, నిచటి యేనాదుల అభివృద్ధి నిమిత్తము కృషి సల్పుచుండిరి. నెల్లూరులో మహాసభ జరిగినది. తగినట్లు సన్మానముగావించి కానుకలిచ్చిరి. ఉదయమున చెన్నపట్టణమునుంచి హిందూపత్రికాధిపతి శ్రీ కస్తూరి రంగయ్యంగారును మరికొందరును మహాత్మాజీని పట్టణమునకు

Acc 00 77 11753

తీసికొని వెళ్ళుటకు నెల్లూరుకు వచ్చియుండిరి. గాంధిమహాత్ముడు వారితో చెన్నపురికి వెళ్ళినపిమ్మట నేను గుంటూరునకు వచ్చితిని. చీరాలలోను పిమ్మటను వసూలైన సొమ్ము గాంధిమహాత్ముల కిచ్చివేసితిని. దేశిరాజు కృష్ణయ్యగారియొద్దనుంచిన మొత్తమును చెక్కు-ద్వారా మహాత్మునకు పంపివేసితిని. గుంటూరులో స్త్రీలు సమర్పించిన ఆభరణములు ఇచ్చటి బంగారు వర్తకులను పిలిపించి మిత్తులయెదుటనే వేలమువేసి, వచ్చినసొమ్మును గాంధిమహాత్మునకు పంపితిని.

గృహకృత్యములు.

ఇచ్చట నా గృహకృత్యములవిషయము కొంత వ్రాయవలసియున్నది. నా కప్పటికి నిలిచిన సంతాన మిర్వురుకుమార్తెలు మాత్రమే. అందు పెద్దపిల్ల చిగంజీవి బుచ్చిలక్ష్మమ్మ వివాహము బందరులో నే నున్న రోజులలోనే జరిపితిని. రెండవపిల్ల పార్వతీదేవికి పెండ్లియాడు వచ్చినను కాంగ్రెసు వ్యవహారములలో తిరుగుచు నుపేక్షించుచుంటిని. అప్పటి కింకను శారదాశాసనం పుట్టలేదు. వ్యక్తురాలుగాకమునుపు పిల్లకు వివాహము చేసి తీరవలెను. మా పార్వతికి పదునొకండు సంవత్సరములు దాటిపోవుచున్నవి. నా భార్య పినతండ్రికుమారుడు కామరాజు రాఘవయ్యలను చిన్నవాడొకడు మాయింటనేయుండి కొన్ని కళాశాలలో ఇంటరుక్లాసు చదువుచుండెను. నాకు పుత్రసంతానము లేదుగనుక నా కుమార్తెను వానికిచ్చి ఇల్లటమముంచుకొన

V.R. NARAYANA MEMORIAL LIBRARY D.R.T. Acc. No.

వలెనని అనుకొంటిని. నా భార్యయును తక్కిన బంధువులును ముచ్చట పడుచుండిరి. నేను 1915లోనే న్యాయవాదవృత్తిని విసర్జించనున్నపుడు నన్ను తొందగపడి వృత్తిమానవలదనియు, తాను. బి. ఎల్. పరీక్షలో కృతార్థుడై న్యాయవాదియగువరకు ఆగినచో నాకు విరామము కల్పించెదననియు, నా భార్యతో చెప్పెనట. ఇట్లు వాడు మా యింట నుండగనే వానికి జ్వరము వచ్చి, కీళ్ళు పట్టుకొనిపోయి కొన్నాళ్లు బాధపెట్టినది. అప్పటి నుంచి ఆరోగ్యము కొంతచెడిపోయినది. పిమ్మట క్షయవ్యాధిగ పరిణమించుటచే అకాలమృత్యువువాత పడిపోయెను. వానికి క్షయవ్యాధి ఏర్పడినపిమ్మట వాడచేవు సముద్రతీరమగుటచే అచ్చట కొన్నాళ్లుంచుట యుక్తమని అచ్చటికి పంపివేసితిని. అచ్చట జాడ్యము హెచ్చుతగ్గులు లేక మామూలుగనే యున్న దని వర్తమానములు నచ్చుచుండెను. ఇంతలో నాకు వేసవి సెలవులు వచ్చినందున వాడచేవు వెళ్ళి వానినిచూచి అచ్చట ప్రయోజనములేదని తలంచి బెంగళూరుకు తీసికొనిపోవుటకు నిశ్చయించితిని. వానికి పథ్యపానములకై నా భార్యనుగూడ వెంటదీసికొని పయనమై చీరాల చేరి వాడచేవుకు బండికోసరము యత్నించుచుండగా రాఘవుడు ఆ ప్రొద్దుటనే చనిపోయినట్లు వార్త వచ్చెను. మే మిద్దరమును వెంటనే వాడచేవుచేరి శ్మశాన భూమిలో వాని రూపమును జూచితిమి. మమ్మును జూచుటకో యన్నట్లు వాని నేత్రములు తెరుచుకొనియేయుండి మమ్మే చూచుచున్నట్లే కనుపించెను. నా భార్య దుఃఖముచే నేడ్వసాగినది. నాకును ఆ సమయమున మనస్సు వికలమయ్యెను. దుఃఖాక్రాంతులమై తిరిగి గుంటూరు చేరితిమి.

మాకు మగ సంతానము కలుగునను ఆశ తీరిపోయెను. కాన ఇల్లటముండెడి చిన్నవానికిచ్చి మా పిల్లను వివాహము చేయవలెనని సంకల్పించితిమి. అప్పటికింకను మాకు అనుకూలమైన నివాసగృహమేర్పడలేదు. బందరులో నుండినకాలమునసే గుంటూరులో అరండల్ పేటసమీపమున కోడూరి చంద్రశేఖరము గారినిమిత్తమును, నా కొరకును యకరముభూమిని రు 150 లకు కొంటిని. గుంటూరులో న్యాయవాదిగ ప్రవేశించిన పిమ్మట అర యకరము నాకు చాలదని తోచి ఆ యకరమును మొత్తముగ చంద్రశేఖరముగారికిచ్చి, నా నిమిత్తము ఆ సమీపమునసే రెండు యకరములభూమి రు 500 లకు తీసికొంటిని. పిమ్మట కొంతకాలమునకు దానిలో నొకబావి తీయించి, చుట్టును వేప చెట్లువేయించి, కొన్ని తాటివిత్తనములుగూడ నాటి, నూజవీడు నుంచి నాజూక్ బదన్ మల్లో బామామిడియంట్లును జామ, దబ్బ, నారింజ కరివేప మొదలగుచెట్లును, మల్లెఅంట్లును, అరటిచెట్లును కొన్ని కొబ్బరిచెట్లుగూడ వేయించి సుందరమైన ఉద్యానముగ చేయించితిని.

నేను వృత్తి వదలునాటికి దాదాపు నలుబదివేల రొక్కము నేర్పరచితిని. అది యంతయు లోకులకు బాకీలుగానిచ్చినదే. ఇదిగాక మా తండ్రిగారిచ్చిన భూములు వదివేలరూపాయల కిమ్మతుగలవి మాత్రమే యుండెను. ఆ భూములనలన సాలుసరి అయిదారువందల రూపాయలు మాత్రమే వచ్చుచుండెను. కాన మరికొంతభూమి సంపాదించవలెనని యనుకొనుచుంటిని. 1916లో కాబోలును మంగళగిరియొద్ద నిడమర్తి గ్రామములో అడవిబంజరు

సర్కారువారు వేలము పాడుచుండిరి. ఆ భూమి యకరము రు 20/; 30/ లకు రాగలదని తలచి, ఏబది యకరములు తీసికొనవలెనని గుంటూరు తాలూకాకచ్చేరికి పోగా, అక్కడ ఆసామీలు గుంపులుగా చేరి, పాటలు పాడుచు ధరలు పెంచు చుండిరి. ఈ పోటీలో కొనజాలనని ఊరకుంటిని. తాడికొండ ఆసామీయొకరు నా యొద్దకువచ్చి, "మీరు పాట పాడుట ప్రారంభించినచో వ్యర్థముగ ధర హెచ్చిపోవుటయేగాని ప్రయోజనముండదు కాన, మాలో కొందరము పాడి, మీకు కావలసినభూమి నిచ్చెదము. మీ కెంతభూమి కావలయునో చెప్పనలసిన"దని కోరిరి. ఏబది ఎకరములు కానలె నంటిని. ఇరువది యకరములీయగలమని వారు వాగ్దానముచేసిరి అంతియే చాలునని అచ్చట నిలువక యింటికి వచ్చితిని. పిమ్మట వారు 20 యకరములు నా కిచ్చివేసిరి. పాటదారుపేరనే ఆ భూమికి పట్టాపుట్టినను భూమి నా క్రిందనే యుండి, నేనే అమరకపరచు కొంటిని. నాకు యకరము రు 90 ల చొప్పున ధర కట్టియిచ్చిరి. సరసరావుపేటలో శ్రీ కాకుమాను హనుమయ్యగారినే నర్తకుని యొద్ద రెండువేలు తెప్పించి, తర్వాత కొంతకాలమున కాయనకు తిరుగ చెల్లించితిని.

ఈ యిరువది యకరములును అడవిప్రదేశముగనుక నా భూమికి సమీపముననే కొనిన పెదపరిమి కాపురస్తుడు కటికల సాంబిరెడ్డిద్వారా చెట్లుకొట్టించి బాగు చేయించితిని. ఆయన ద్వారానే యకరము ఒకటికి నాలుగురూపాయల చొప్పున కొన్ని సంవత్సరములు మక్తా కిచ్చివేసితిని. మరికొన్ని సంవత్సరములు

ఆ సాంబిరెడ్డిగారే పాలికి చేయించి, ఆ నాలుగు రూపాయల ప్రాప్తినే ఫలసాయము ముట్టచెప్పుచుండెను. పాలికిచ్చుటచే లాభములేదని యెంచి, సాంబిరెడ్డిగారి నడుగగా యకరము ఒకటికి రు 4 ల కంటె మక్తారాదని నాతో గట్టిగాచెప్పెను. అన్యథా విచారించగా పన్నెండు రూపాయలచొప్పున మక్తా యిచ్చెదరని కొందరు చెప్పిరి. ఇంతలో నీరుకొండ ఆసామీలు నా యొద్దకు వచ్చి, ఆ భూమికి రు 495/-లు మక్తా యిచ్చు లాగున రిజిష్టరుకవులు వ్రాసియిచ్చి భూమి స్వాధీనపరచుకొనిరి. అప్పుడు సాంబిరెడ్డిగారు నా యొద్దకు వచ్చి, "నాతో చెప్పకుండ గనే మక్తాకు ఇచ్చివేసితిరే నే నంతకు ఇప్పించక పోతినా? నాకు ముందుగ కబురైన చేయకూడదా? మీ భూమిని బాగు చేయించి, మీకు సహాయపడితినిగదా" యని నిష్ఠురములు పలికెను. వాస్తవములో నతని కెట్టిహక్కు లేకపోయినప్పటికి, స్వల్ప ఫలసాయమును నాకు ముట్టజెప్పుచు అదియైనను సక్రమముగ నీయక చిక్కులుపెట్టుచుండినను ఆ నీరుకొండ ఆసామీలతో చెప్పి, వారికిచ్చిన అయిదు సంవత్సరముల కవులు ఏడు సంవత్సరములుగ హెచ్చుచేసి, రెండుసంవత్సరములపాటు మొదటనే సాంబిరెడ్డిగారి కిండని కోరితిని. వారు మొదటి రెండు సంవత్సరము లిచ్చుట కిష్టపడక తర్వాత రెండు సంవత్సరము లిచ్చుటకు సమ్మతించిరి. కాని సాంబిరెడ్డిగారికి నమ్మకములేక పోయెను.

ఇల్లు గట్టించుటకు నేను లెక్కయించలేకుగాని పంద్రాయిరము వేల రూపాయలు వ్యయమై యుండునని తలంచెదను. ఇంటికి

V.R. NARLA MEMORIAL LIBRARY V.R. NARLA & BROS. I.

దూలము లెత్తించుటకు ముహూర్తము పెట్టినసమయమునకు బొంబాయిలో కాంగ్రెసు కార్యనిర్వాహకసభకు వెళ్ళవలసి వచ్చినందున్న శ్రీ న్యాపతి హనుమంతరావుగారే దగ్గరనుండిదూలము లెత్తించిరి. 1916 వేసవిలో ఇంటి కట్టడమును నేను చెంతనుండి చేయించితిని. 1917 ఫిబ్రవరి నెలకు సరియైన కాళయుక్తి మాఘ బహుళ తృతీయనాడు గృహప్రవేశమును మరునాడు సమారాధనయు జరిపించితిని. ఆ సమారాధనకు మిత్రులను చాలమందిని ఆహ్వానముచేసి రాత్రి విందుగావించితిని. అప్పుడు శ్రీ పంగులూరి తల్పశాయిగారిని శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారు మొదలగువారినిగూడ పిల్చితిని. వీ రింగ్లండు వెళ్ళివచ్చిరిగాన వీరిని భోజనములకు పిలుచుట మానివేసిరి. నేను సాహసించి వారినిగూడ పిలిచితిని. నేను పిలిచినవా రందరును వచ్చిరి. లోపల హాలులోను మధ్యహాలులోను పూర్వాచారపరులుగా నుండువారు ముందుగనే వచ్చి కూర్చుండిరి. వాకిటిముందు హాలులోను, దానికి ఆనుకొనియున్న గదిలోను తక్కిన మిత్రులు కూర్చుండిరి. బారిస్టరు మిత్రులు వెలుపలగదిలోనే కూర్చుండి "మీరు మమ్ము భోజనమునకు పిలిచినందుకు సంతోషమేకాని మేము మాతో భుజించుటకు ఆక్షేపణగలవారితో కూర్చుండి, శాంతిభంగము గావించుట కిష్టములే" దని అచటనే భోజనము చేసిరి. శ్రీ కామరాజు మన్నారు కృష్ణారావుపంతులుగారు కొంచె మాలస్యముగ వచ్చి "లోపల హాలులో ఎవరు కూర్చుండి"రని అడిగి, ఆ లోపలకుబోయి, వారితో భుజించిరి. ఎవరికేమి ఆక్షేపణలున్నను విందుకు భంగము లేకుండ సలక్షణముగ జరిగి పోయినది. ఆ రోజు విందుకు మాత్రము రు 500 లు ఖర్చయి

నవి. ఇల్లు కట్టించుటకు వేలు ఖర్చుచేసి లెక్కవ్రాయలేదుకాని ఒక్కరోజు జరిగిన వింతకైన లెక్కమాత్రము బాగుగ జ్ఞాపకమున్నది.

గృహప్రవేశ సమారాధన జరిగిన ఆరు రోజులకే మా తండ్రిగారి ఆబ్దికము పెట్టవలసివచ్చినది. కొత్తగా ప్రవేశమైన యింటిలో తద్దినము పెట్టుట శుభప్రదముగాదని పలువురు చెప్ప సాగిరి. కాని నేను లక్ష్యముచేయక తండ్రిగారి ఆబ్దికముగూడ శుభకార్యమేయని మా యింటనే దానిని జరిపితిని. సామాన్యముగ జీవితములో శుభాశుభములనునవి సంభవించుచునే యుండును. అని యెుకప్పుడు ఒకయింట చేయతగినవియును, ఆ యింటనే మరొకప్పుడు చేయతగనివియు ననుటసమంజసముగ తోచుటలేదు ఆబ్దికము చనిపోయిన ఆత్మబంధువును స్మరించుచు వారిపేరుతో బ్రాహ్మణసత్కారము గావించు పవిత్ర మగు పితృదినము, దీనిని అశుభమని నిరసించుట సహేతుకముగ గన్పించదు. ఈ ఆబ్దికముల నిప్పుడు నూతన సంస్కరణాభిమా నులు మానివేయుచున్నారు. చనిపోయినవారు మరల జన్మమెత్తు లోపల మనకు అదృశ్యములైన రూపములుధరించియుందురనియు మన కొక సంవత్సరము వారికొక దినమనియు, ఆ దినమున వారికిగాను శిష్టులగు బ్రాహ్మణులను మంత్రయుక్తముగ పూజించినచో పితరులు తృప్తిపొందుదురనియు మనవారి విశ్వాసము. ఇందలి సత్యాసత్య విచారణ చాల అగాధమైనది. నాయట్టివానికి అసాధ్యమైనది. కాని ఆధునికము లైన ఆంగ్లేయ గ్రంథములు చదువుటవలనను, సైకికల్ రిసెర్చి

వారు ప్రచురించు శాస్త్రపరిశోధనావిషయములనుబట్టియు కొంత సొంత అనుభవమునుబట్టియు మనపూర్వగ్రంథములు పునర్జన్మను గూర్చి చెప్పబడినవిషయములబట్టియు మానవులు చనిపోయిన పిమ్మట సూక్ష్మరూపమునకొంత కాలముండురని నాకువిశ్వాసము కలదు. కాని వారికి మనము ఆబ్దికములు పెట్టి తృప్తి కలిగించ గలమా? వారికి అట్టి సత్కారము అనవసరమా? ఎంతకాలము వారు ఆ సూక్ష్మరూపములో నుందురు అను ప్రశ్నలకు సమాధానము నాకు కుదరలేదు. మా తల్లిగారికిడెబ్బదిరెండుతద్దినములు పెట్టితిని. ఇంకను అమె జన్మయెత్తకయుండెనా, యని నాకు సంశయ మున్నను తద్దినములు పెట్టుటలో గతించినవారిని స్మరించుచేయని తలంచుచు ఇదియు మానసికపూజ యనియే భావించి, మూఢవిశ్వాసముతో చేయుచున్నాను. యథార్థము నిశ్చయించలేనప్పుడు దానివలన ఎవ్వరికిని హానిగానిఅపకారముగాని లేనప్పుడుఅనాది సిద్ధమైనఆచారమునుతొలగత్రోయుటన్యాయము కాదని నా అభిప్రాయము. బ్రాహ్మణులు భుజించుట అనగా పితరులు భుజించుచుండుని నేను విశ్వసించను. వారిపేరుతో నా బ్రాహ్మణులను సత్కరించుట మాత్రమేయని నా తలంపు. తక్కిన పితృకర్మలనుగూర్చియును, ఇట్టి విశ్వాసమే నామనస్సున నున్నది.

రెండవకుమార్తెవివాహం

నా రెండవకుమార్తె వివాహప్రయత్నమునుగూర్చి మరల నెత్తికొంటిని. గుంటూరులో కేతరాజువారిది పేరు

పొందిన కుటుంబము. అందులో నొక కుఱ్ఱవాడు మెట్రిక్యులేషను చదువు కొనుచుండెను. తండ్రిమంచి ఆస్తిపరుడు. పిల్లవాడును రూపసియే. నా తమ్ముని భార్యకును, వారికిని సమీప బాంధవ్యముకలదు. కాబట్టి ఆ చిన్నవానికి పార్వతి నియ్య వలసినదని నా భార్యతోవారు చెప్పిరి. ఊరిలో సంబంధము, పేరుపొందినవంశము, స్థితిగతులు మంచివి. పిల్లవాడు నెమ్మదియైన వాడును రూపసియునగుటచేనాభార్య కాసంబంధముసమ్మతముగ నుండెను. నాకు అంతసౌముఖ్యము లేకున్నను నా భార్య మొదలగువారి కెక్కువ మక్కువగనుండుటచే నేనును సమ్మతించితిని. ఆ పిల్లవానిపేరు వెంకట్రామయ్య. తండ్రి సీతా రామయ్యగారు. గుంటూరులోనే వీడరు. డబ్బు వ్యయము చేయుటలో ఆయనది చాలపెద్దచేయి. సీతారామయ్యగారి పెదతాతగారు జగన్నాథము పంతులుగారు గుంటూరు జిల్లాకోర్టు సిరస్తాదారీయుద్యోగము చేసియుండిరి. వీరికి ప్రజలలో పలుకుబడి చాల ఎక్కువ. ఆ కాలములో జడ్డికంటెనతిశయముగా ఆయన ప్రభావము చెల్లుచుండెనట. గుంటూరులో పెద్దచెరువులు రెండున్నను త్రాగుటకు తగిన శుద్ధజలములు ముఖ్యముగ వేసవి కాలములో కరువుగా నుండెను. ప్రజలకు ఈ కష్టము నివారించు టకు నల్లచెరువుప్రక్కనే పెద్దకోనేరును జగన్నాథముపంతులుగారు త్రవ్వించబూనుకొనిరి. అప్పుడు పెద్దజయిలొకటి యీగ్రామములో నుండెను. తన పలుకుబడి వినియోగించి ఆ జెయిలుకూలీలచేత కోనేరుత్రవ్వించెనట. కోనేటికి మెట్లుకట్టుటకు కొండవీడు ఖిల్లాను పడగొట్టించి, ఆ రాతిబండలను బండ్లపై తోలించి, ఆ బండలను చెక్కించి, మెట్లుగా సమర్చి, చెరువులోని నీళ్ళు కోనేటిలోనికి

పారునట్లు చెరువునుండి తూములు పెట్టించెను. ఇందువలన కోనేటిలో ఏకాలములోను నీరు సమృద్ధిగానుండెను. చుట్టు ప్రక్కల యిండ్లవారు దొడ్లలో బావులు త్రవ్వించుకొని, రుచికర మైన నీళ్ళను త్రాగుచుండిరి. పట్టణములో దూరభాగములవారు సహితము ఈ కోనేటినీరు తెచ్చుకొనిత్రాగుచుండిరి. ఇప్పటికిని ఆ కోనేటినీరు జనులకు చాలప్రయోజనకారిగనున్నది. గుంటూరులో ఈ జగన్నాథముపంతులుగారు కృష్ణాగుంటూరుజిల్లాలలో కొన్ని ధర్మసత్రములుకట్టించిరి. అవి కొన్ని నేడు లోకల్ ఫండు సత్రము లుగామారిపోయినవి. ధాతసంవత్సరక్షామములో ఈపంతులుగారు పేదలకు భోజనములు పెట్టి, వస్త్రములిచ్చిన మహాదాతయట. వీరికి దయనచ్చినపు డెంతమేలు చేయుదురో కోపమువచ్చినపుడు అంతటి యపకారముగూడ చేయగలిగియుండిరట. పాత గుంటూరులో పొత్తూరువారు ధనికులని పైన వ్రాసియుంటిని. జగన్నాథముపంతులుగారి యింటియెదుట నరసింహాస్వామి యుత్సవములు జరుగునప్పుడు స్వామిని పీఠముపైవేంచేయింపుచేసి భజన జరుపుట ఆచారముగనుండెను. భోగమేళములుగూడ స్వామియెదుట ఆడుచుండెడివి. ఈ యుత్సవసమయములో అమ్మ వారి యలంకారము నిమిత్తము పొత్తూరివారి యింటినుంచి ఆభరణములు తీసికొనివచ్చి, ఊరేగింపు పూర్తి అయినతోడనే ఆ రాత్రియే ఆభరణములనుపొత్తూరివారియింటికి పంపుచుండిరి. ఒకరోజు ఉత్సవములో అమ్మవారికి రత్నములుచెక్కిన ముక్కు పోగు నలంకరించిరి. మామూలుప్రకారము స్వామిని జగన్నాథము పంతులుగారి యింటియెదుట వేంచేయింపుచేసియున్నపుడుఎదుటి మేడలో నున్న వేశ్య ఆ ముక్కుపోగు ధగధగలాడుచు

ప్రకాశించుటచూచెను. ఆ భోగముది జగన్నాథముపంతులుగారి యుంపుడుకత్తె. ఆ రాత్రి పంతులుగారు దానిని కలిసినప్పుడు "అమ్మవారికి పెట్టిన ముక్కుపోగు ఒకపర్యాయము తాను చూచుటకు తెప్పించవలసిన" దని కోరెనట. పంతులుగారంతట ముక్కుపోగు నిమిత్తము పొత్తూరివారియింటికి వర్తమానము పంపగా వారు స్వామికొరకు ఉత్సవకాలములలో పంపింతుమేగాని ఇతర సమయములందు పంపవీలులేదని తెలియజేసిరట. అంతట పంతులుగా రీ తిరస్కృతికి ప్రతిక్రియగానొకయెత్తువేసిరి. పొత్తూరి వారు శ్రీ వెంకటాద్రిజమీందారుగారియొద్ద దివానులుగానుండి, చాల వృద్ధికి వచ్చిరి. జమీందారుగారు జమీను పోగొట్టుకొని దరిద్రదశకు వచ్చినను పొత్తూరివారు సంస్థానీకులైరి. అప్పుడు వెంకటాద్రినాయుడుగారి కుమారుడు ప్రభుత్వమువలన భరణము పుచ్చుకొనుచు కాలముగడుపుచుండెను. ఆయననుజగన్నాథము పంతులుగారు పిలిపించి, "పొత్తూరివారుతమయొద్ద దివానులుగా నుండి, తమయొక్క విలువగలఆభరణములు అపహరించి అక్రమముగ అనుభవించుచున్నా"రనిచెప్పి వానినిరాబట్టుకొనుట కొక వ్యాజ్యమును జిల్లాకోర్టులోపొత్తూరివారిమీద దాఖలుచేయించి వెంటనే వారి యింటిలోని ఆస్తి నంతయు జప్తుచేయించి, తెప్పించుటకు, ఉత్తరువు చేయించెను. పొత్తూరివారి కీవర్తమానము కొంచెము ముందుగనే తెలిసినందున వారు తమ యింటిలో విలువగల ఆభరణములు మొదలగు సామాను లన్నియు నిరుగు పొరుగువారియిండ్లకును, తమ నౌకర్ల యిండ్లకును పంపించేసిరి. జప్తుచేయుట కేమియు దొరకదాయెను. కాని ఇతరులచేతదాచిన వస్తువులు చాలభాగము మరల చేరనందున పొత్తూరివారు చాల

నష్టపడిపోయిరి. ఒక్కముక్కపోగు నిమిత్తము జగన్నాథము పంతులుగారు వారి కుటుంబస్థితిని పాడుచేసిరి.

ఆ జగన్నాథముపంతులుగారి అన్న మనుమడు సీతా రామయ్యగారు. వారి కుమార్తెను తోలేటి సీతారామయ్యగారి కుమారున కిచ్చి, వివాహముచేయుటకు నిశ్చయించుకొనిరి. వరకట్నము రు. 4000/- లేర్పరచుకొనిరి. ఇరి, నేను కట్నములు బేరమాడువారికి నాబిడ్డ నీయ దలంచలేదు. మా తమ్ముడు సూర్యనారాయణ సీతారామయ్యగారి కీ విషయము స్పష్టపరచెను. మాయింటికి వచ్చి, సంబంధము నిశ్చయించుకొన్నపుడు కట్నకానుకల విషయము వారు నాతో ప్రసంగించలేదు. నేనును పిల్లకు ఆభరణములమాట ప్రశ్నించలేదు. అప్పటి మర్యాద ననుసరించి వెండిచెంబులు, పట్టుబట్టలుసహా వెయ్యినూటపదారు లిచ్చుటకు నిశ్చయించుకొంటిని. సీతారామయ్యగారు కుమార్తె వివాహము చేయుటకు తగిన యింటివసతి లేకుండుటచే వారి వియ్యంకుడు తోలేటి సీతారామయ్యగారు మాయింటిలోనే ఆ వివాహము జరుపవలసినదని కోరెనట. అందువలన సీతా రామయ్యగారు తనకుమార్తె వివాహమును మాయింటనే చేయుటకు నిశ్చయించుకొనెను. ఉభయవివాహములు అయిదు రోజులు మాయింటనే సాగినవి. కనుక కేతరాజు సీతారామయ్య గారు తమ వియ్యాలవారికి జరుపనలసిన మర్యాద లన్నియు మాయింటిలోనే జరుగుటచే నాలుగువేలరూపాయలు వరకట్న మిచ్చుటతప్ప తక్కిన భోజనాదిఖర్చులు వారికి తగులుబడి లేకుండపోయినవి.

ముహూర్తము చాల ఆలస్యమెనందున పెండ్లికి వచ్చిన కొందరు మిత్రులు వెడలిపోయిరి. మద్ది వెంకటసుబ్బయ్య చీమకుర్తి బసనయ్య, కాకుమాను హనుమయ్య అను వైశ్యమిత్రులు వివాహము పూర్తియగువరకు నుండిరి. వారిని భోజనమున కుండవలసినదని కోరితిని. వారు బ్రాహ్మణులతో పాటు ఏకకాలములోనే పెట్టించినచో భోజనముచేయుదు మనుటచే వారికి ప్రత్యేకపు టేర్పాటులు చేసితిని. బ్రాహ్మణు లకు పెద్దపందిరిలో భోజనములు జరుపనెంచి, వారి నక్కడ కూర్చుండబెట్టి ఉభయ వివాహబంధువులకు ఇంటిలో పీటలు వేయించితిని. సాయంకాలమునాలుగుగంటలు దాటిపోవుచున్నందు నను, మేఘముబట్టివర్ష మువచ్చునట్లు కనబడినందునను వియ్యంకు లుభయులకొఱకు వేచియుండక పందిరిలోని బ్రాహ్మణులకు ఔపోసనము వేసితిని. వారు ప్రాణాహుతులు చేయుచుండగనే వియ్యంకు లిరువురు మాయింటివెలుపలి ద్వారమునొద్దకు వచ్చి, బ్రాహ్మణులకు తాము రాకముందే భోజనములుసాగించిరని కోపముతో వారిబసలకు మరలిపోయిరి. వారిని మాతమ్ముడు పిలిచినను రాకుండిరి. "పోతే పోయినా" రని నేను నిర్లక్ష్యము చేసితినని మరియొక కారణముకూడ పెట్టుకొని వారు బిగిసినందున నేనును భోజనములేకుండనే ఉపవాసముచేసెదనని తెల్పితిని. పిమ్మట వారు మిక్కిలి బలవంతముమీద భోజనమునకు వచ్చిరి. దీపములు పెట్టినమీదట వారు వచ్చువరకు కనిపెట్టుకొనియుండి వారితో కలసిభోజనముచేసితిని. నేను సహజముగకోపదారినైనను సందర్భములనుబట్టి శాంతమువహించి వారి నేమియుననకనాచేత నైనంతవరకు సఖ్యవచనములతోడనే ముందుగ బ్రాహ్మణులకు

ఓపోసనవడ్డించుటకు కారణము తెలిపితిని. మొత్తమున నెట్లో ఆరోజు గడచినది. రెండవరోజుసరసముగనే వెళ్ళినది. మూడవరోజు సదస్యమునకుసకాలములో రాక, కేతరాజు సీతారామయ్యగారు చిక్కులుపెట్టిరి. శెడింబిహానుమంతరావును,మరికొందరుమిత్రులును ఎట్లో సమాధానపరచి వారిని తీసికొనివచ్చిరి. సదస్యముగూడ నెట్లో నడచినది. అప్పటినుండి ఆయన భోజనమునకు రాక, చిక్కులుపెట్టసాగెను. అయిదవనాడు అప్పగింత లగుటతోడనే పిల్లను గృహప్రవేశమునకుతీసికొనివెళ్ళకయేమాతో చెప్పకుండనే వారియింటికి పిల్లవానితో వెడలిపోయిరి. అప్పటినుండి ఆదువారు వచ్చుచుబోవుచుండిరిగాని ఆయనమాత్రము రాలేదు. పిల్లను వారి యింటికి తీసికొనిపోను లేదు. నేను వివాహసమయ మున వెండిచెంబులు, వెండిపళ్ళెము, పట్టుబట్టలు కలుపుకొని వెయ్యినూటపదునాఱురూపాయలు ముట్టచెప్పితిని. వారు పిల్లకు మంగళసూత్రముతప్ప మరి ఏ యాభరణములు నీయలేదు. పెండ్లినాల్గవరోజు పెద్ద పూలపాలకీలు కట్టించి, ఊరేగింపు జరిపిరి. ఆపాలకీలలో వధూవరులను కుర్చీలువేసి కూర్చుండ బెట్టిరి. మా అమ్మాయి కూర్చుండిన కుర్చీ ఊరేగింపుమధ్య ఎందువలననో కదలుటచే పిల్ల భయపడినది. ఆమరునాటినుండి జ్వరము ప్రారంభమైనది. ఈజ్వరమే ఆమెను ఏడెనిమిదిసంవత్సర ములు బాధించిన వ్యాధికి కారణమైనది.

వివాహము సాంప్రదాయముల ననుసరించి అయిదు రోజులు సక్రమముగ జరిగినను పెట్టుకొన్న ముహూర్తమునకు మాత్రము వివాహము జరుగలేదని నామనస్సు బాధచెందెను.

నాకు మన పూర్వశాస్త్రములందు పెద్దల పరిచయమునుబట్టియు, కొలదిగా మన మతగ్రంథములను చదువుటచేతను, అనుభవమును బట్టియు కొంతవిశ్వాసముకద్దు. క్రైస్తవమతాభిమానము చిన్ననాడు పూర్ణముగ కలిగినను పిమ్మటికాలములో క్రమముగ సన్నగిల్లినది. క్రైస్తవధర్మములలో నుత్తమమైన నైతికసూత్రములయెడలను, క్రీస్తు సద్బోధలందును అమహనీయుని మహత్తర త్యాగమునుగూర్చియు నాకిప్పటికిని మిక్కిలి లక్ష్యము గలదు. ఏసుక్రీస్తుద్వారాగాని ముక్తి సిద్ధించదను సిద్ధాంతముమాత్రము నాకు సహేతుకముగ తోచుటలేదు. మరియు క్రైస్తవమత బోధలలో కొన్ని మన యాధ్యాత్మికవిజ్ఞానమే వారికిని మార్గముజూపినదని నా నమ్మకము. అతి పురాతనకాలముననే మన సిద్ధాంతములు పాశ్చాత్యదేశములలో ప్రాకెననుట నిస్సందేహము.

నాకు జ్యోతిశ్శాస్త్రమునం దభిమానము కలదు. జ్యోతిష్కజ్ఞులు చెప్పిన ఫలములు తప్పిపోవచ్చునుగాని శాస్త్రము మాత్రము సత్యమని చెప్పదగును. ఈశాస్త్రమునందు కలిగిన విశ్వాసము మనపూర్వశాస్త్రవిశ్వాసమునుమరింతదృఢపరచినది. ఇట్లని పూర్వగ్రంథములలో ప్రవాసినముక్కలన్నియు నేను అంగీకరించినా నని యర్థముగాదు. సునిశితమగు హేతువాదమునకును, ఆత్మానుభవమునకును ఆగెడి సిద్ధాంతములుమాత్రమే అంగీకృతములు గావలెనని నా యభిప్రాయము.

ఋషిభిః బహుధా గీతం ఛందోభి ర్వివిధై ర్పృథక్
బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః ॥

అను గీతాశ్లోకమునుబట్టి జ్ఞానవిషయమున హేతువిచారము అనసరమైనట్లే కనపడుచున్నది. హేతుజ్ఞానముగూడ సర్వత్ర పనిచేయజాలదు. ఆదిశంకరాచార్యులు హేతువునకు మించిన విషయములపట్లనే వేదములు ప్రమాణమని స్పష్టీకరించిరి. నేను గాంధిమహాత్మునితో పరతత్త్వమునుగూర్చి మాట్లాడునప్పుడు వారు పరమాత్మ హేతుజ్ఞానముచే తెలియసాధ్యమైన వాడుకాడనియు, కేవలాత్మానుభవవేద్యుడనియు,వక్కాణించిరి.

మా అల్లుడు పెండ్లినాటికి ఎస్. ఎస్. ఎల్. సి. చదువు చుండెను. నా అల్లుడనిపించుకున్నపిమ్మట సహాయనిరాకరణ విధానమునసరించి ఇచ్చటిపాఠశాలలో ప్రవేశించక తండ్రిగారి బలవంతముమీద కాబోలు కలకత్తాలో చదువనారంభించెను. ఈ విషయము నాకు కొంతకాలమునకు తెలిసినది. ఇంతలో ఢిల్లీలో నఖిలభారతకాంగ్రెసుసంఘ సమావేశము జరిగి, అందు సహాయనిరాకరణోద్యమములో చివరిమెట్టగు పన్నులనిరాకరణము, నవలంబించుటకు నిశ్చయింపబడినది. అందుకుగొన్ని షరతులు విధించిరి. ఎచ్చటిప్రజలు అహింసనే నమ్మికొని, ఖద్దరు వస్త్రములే ధరించుచు, అస్పృశ్యతను ఎంతమాత్రము పాటింపకుందురో అట్టి ప్రాంతముల దప్ప ఇతరత్ర పన్నుల నిరాకరణ చేయకూడదు.

పన్నులనిరాకరణము

ఈ తీర్మానమునుగూర్చి చాల తీవ్రమైనచర్చ జరిగెను. కొందరు సభ్యులు వితండవాదములు గావించిరి. నేను మహాత్మ్ముని ప్రక్కనే కూర్చుండియుంటిని. మహాత్మ్ముని యనుమతితో కార్యనిర్వహసభ్యులు కొందరుమాట్లాడిరి. మహాత్మ్మునిసమాధానము విన్నమీదట తీర్మానమంగీకరింపబడెను. రాబోవుడిశంబరునెలలో కాంగ్రెసుమహాసభలో ఆ తీర్మానము ప్రవేశపెట్టుటకు నిశ్చయింప బడెను.

ఆంధ్రజిల్లాలలో కాంగ్రెసుప్రచారము చురుకుగనే జరుగు చుండెను. 1921 డిసెంబరు ప్రారంభములో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసభాధ్యక్షుడైన నేనును, కార్యదర్శి గొల్లపూడి సీతారామశాస్త్రిగారును ధర్మవరములో ప్రభుత్వవిధానమును ఖండించుచు తీవ్రముగ ఉపన్యసించితిమి. అచ్చటినుండి గుంటూరు వచ్చినప్పటికి ప్రభుత్వము మమ్ముభయులను ఖైదులో పెట్టునను వాడుక హెచ్చుగానుండెను. అంతట మే మిర్వురము గుంటూరు జిల్లాను పన్నులనిరాకరణముకొఱకు సిద్ధపరుపవలెనని యుద్దేశించి, మమ్ము ప్రభుత్వము బంధించులోపల చేతనైనంతవరకు గ్రామములలో సంచారముచేయనెంచితిమి. ప్రతిదినము ఉదయ మేడు గంటలలోపలనే భోజనముచేసి చెరియొక మోటారుకారు నెక్కి, తూర్పుతాలూకాలలో రోడ్డుప్రక్కగానున్నగ్రామములకు సీతారామశాస్త్రిగారును, పశ్చిమతాలూకాగ్రామములవెంట నేనును బయలుదేరి రాత్రివేళ ఏడెనిమిదిగంటలకు గుంటూరు

ప్రవేశించుచుంటిమి. అంతనరకు హిందూహైస్కూలు మైదాన
ములో సమావేశమై వేచియున్న సభలో మేమునుకొన్నిమాటలు
చెప్పి, సభముగించి, యిండ్లకు బోవుచుంటిమి. ఇట్లు రమారమి
పదునైదుదినములు నడచునప్పటికి అహమ్మదాబాదులో జరుగ
నున్న కాంగ్రెసుమహాసభకు వెళ్ళనలసివచ్చెను. నేను ఒకటి
రెండు రోజులు ముందుగనే కార్యవర్గసభనిమిత్తము వెళ్ళుట
యావశ్యకముగ నుండెను. ఈ లోపలనే మమ్మ్మ బంధింతురను
వార్త నిజముకా దని తెలిసినది. అప్పటికే మేముగ్రామములలో
ప్రచారము చాలవరకు పూర్తిచేసితిమి. కాంగ్రెసుమహాసభ
పన్నుల నీయవలదని తీరుమానించునని మా విశ్వాసము గావున
ఆ సభాతీర్మానము అగువరకు పన్నులీయకవేచియుండవలెననియు
సభానంతరము పన్ను లిచ్చుటో మానుటో సలుపదగుననియు
అంతవరకు చెల్లింపక నిల్పినంచున కలుగబోవు నష్టమేమియు
లేదనియు మేము ప్రజలకు బోధించితిమి. జనులును అందుకు
ఉత్సాహముతో సమ్మతించిరి. ఈ ప్రకారము ప్రచారము
ముగించుకొని, అహమ్మదాబాదునకు మేమిరువురమును మరి
కొందరు మిత్రులును కలసి వెళ్ళితిమి. ఈ తీవ్రప్రచారమువలన
కొంచెము జ్వరము ఇంటియొద్దనే ప్రారంభమయ్యెను. దానిని
లక్ష్యముచేయక ప్రయాణముచేసితిని. దారిలో రైలుబండిలో
నుండగనే జ్వరము హెచ్చెను. బొంబాయిలో దిగినపిమ్మట
స్నానముచేసి, పూటకూలిబసలో భుజింపజూచితినిగాని సహింప
దయ్యెను. పాలుమాత్రము కొంచెము పుచ్చుకొని మరల రైలు
ప్రయాణముచేసి, అహమ్మదాబాదుచేరితిమి. అప్పటికే కాంగ్రెసు
శిబిరములో నొక పాకలో కార్యవర్గసమితిసమావేశమైయుండెను.

నేనును ఆ సభకు పోతిని. మహాత్ములు తీర్మానములను విషయ నిర్ణయ సభలో ప్రవేశపెట్టుటకుగాను ప్రాయుచుండిరి. ఆసభకు జయకరుగారుకూడ వచ్చియుండిరి. గాంధీజీ తీర్మానము ప్రాయుటలో ఆలస్యముచేయుచుండిరి. సరియైన పదముల నిమిత్తము తడవుకొనుచున్నట్లు నాకు దోచెను. గాంధిజీ ఇంత శ్రమపడుటేలయని జయకరుతో మెల్లగ పల్కితిని. జయకరు "ఏలనో నాకును తెలియకున్న" దని మారు పల్కెను. ఈ మాటలు విని, గాంధీజీ "ఎట్లుప్రాయవలెనో మీరుచెప్పరాదా" యని ఇంచుక విసిగికొనిరి. తీర్మానములన్నియు సిద్ధమగువరకు నే నచ్చట నుండలేక ఆంధ్రరాష్ట్రప్రతినిధుల పాకలకు వచ్చి, పండుకొంటిని. జ్వరము హెచ్చయ్యెను.కండ్లు పసికరలుగ్రమ్మెను. తినుట కేమియు నిష్టములేకుండెను. బొత్తుగలేవలేని పరిస్థితి యేర్పడెను. మలమూత్రవిసర్జనమునకు దొడ్లయొద్దకు పోజాలక పోతిని. దక్షిణదేశమున హిందీప్రచారముచేయుచున్న శ్రీ హరిహరశర్మగారును, మరియొకరును వారంతట వారే వచ్చి, నాకు పరోపచారములు నెబ్బెరికము లేక చేయుసాగిరి.

మహాసభాసమావేశమునకు గాంధీజీ అధ్యక్షత వహించిరి. ఆ సభలో పన్నులనిరాకరణతీర్మానము ఆమోదింపబడినది. నేను సభకు పోజాలకనేపోతిని. జ్వరముఅతిశయించుచుండెను. నారింజ రసము వేసి విరచినపాలు నాకు ఆహారముగ నిచ్చుచుండిరి. కాంగ్రెసు మహాసభ ముగిసినపిదప క్రొత్తకార్యవర్గము నేర్పరచు టలో నన్ను కార్యదర్శిగా నేర్పరచవలె ననుకొనిరట. ఇండియా కార్యదర్శి పార్లమెంటులో భారతరాజకీయ సంస్కరణములను

గూర్చి చేసిన విమర్శనిూద నొకవ్యాసము ఇంగ్లీషులో వ్రాసి పంపవలసినదని రెండుసారులు మహాత్ములు నాకు వర్తమాన మంపిరి. నేను జ్వరపీడితుడనై యుండుటచేతను, సహజభీరుత్వము చేతను, వ్యాసమును వ్రాసి పంపలేకపోతిని. "దీర్ఘ వ్యాస మకరలేదు, సంగ్రహముగా నాలుగు మాటలు వ్రాసి పంప వచ్చు" నని తెలిపినను నేను ఆప్రయత్నము చేయనైతిని. అంతట నింకొకరిని కార్యదర్శిగా నియమించి, నన్ను మరల కార్యవర్గసభ్యునిగా నేర్పరచిరి. ఆ సమయమునసనే యొకదినము ఆంధ్ర ప్రతినిధి శిబిరములో గాంధీజీ మన ప్రతినిధులతో ముచ్చటించి, కొన్ని హితోక్తుల నుపన్యసించిరి. నా శరీరమపు డనారోగ్యముగా నున్నదిగాన నాకు దగిన యుపచారము చేయ వలసినదని వారిని ప్రోత్సహించిరి. నన్ను గూర్చి శ్లాఘ్యవచనములే చెప్పుచు అస్పృశ్యతానివారణవిషయమున మాత్రము నాకు బట్టుదల లేదనియు, నా యుపన్యాసములలో తక్కిన విషయము లనే చెప్పుచుంచమునుగాని అస్పృశ్యతనుగూర్చి చెప్పుటలేదనియు తెలిపి సభ ముగించిన పిదప నేనున్న పాకలోనికివచ్చి, నా స్థితి నరసి ఇక నచ్చట నుండవలదనియు, సబర్మతికి పోవలసినదనియు, తామునుమరునాడే వచ్చెదమనియుఉత్సాహవచనములు పల్కుచు నాతో ఒకవిషయముమాట్లాడవలసియున్నదనికూడ తెలిపిరి. నేను సబర్మతికిఆసాయంకాలమే వెళ్ళితిని. మరునాటికివారునువచ్చిచేరిరి.

మూడవనాటి యుదయమునకాబోలును గాంధీజీ శ్రీ విఠల్ భాయిపటేలుగారితో నాయొద్దకువచ్చిరి. నేను జ్వరముతో బాధపడుచుంటిని. నా పడకమీద విఠల్ భాయికూర్చుండిరి.

మహాత్మాజీ నా మంచము ప్రక్కనే కుర్చీపై కూర్చుండి, నన్ను కుశలప్రశ్న లడిగినపిమ్మట "ఒక్కవిషయము మీతో మాట్లాడుటకు వచ్చినా" నని చెప్పుచు, "అస్పృశ్యతావిషయమై మీకు తగినంత ఉత్సాహము లేదనియు, అందునుగూర్చి ప్రజలకు ప్రబోధము చేయుటలేదనియు వింటిని. మీ అభిప్రాయమేమి" యని ప్రశ్నించిరి. నేను లేచికూర్చుండి మహమ్మదీయుల యెడల పలువురు సాధారణముగ నెట్లు ప్రవర్తించుచున్నారో అట్లే హరిజనులయెడలను ప్రవర్తించుచున్నారనియు, మహమ్మదీయుల వలెనే హరిజనులనుగూడ ఇండ్లలోకి రానిచ్చి, వారితోచేరి కూర్చుండుటమాత్రమే అస్పృశ్యతానివారణగపరిగణించుచున్నా నని తెలిపితిని. ఈ వాక్యములు మహాత్మాజీకి నా యెడల కొంత అయిష్టము కలిగించినవి. నాయకుడవుగా నున్నవాడవగుటచే ఈ విషయము స్పష్టముగ తెలియ వలసివచ్చినదని వక్కాణించి "రైలులో బోవునప్పుడు దాహమైనచో శూద్రులిచ్చిన నీళ్ళు త్రాగుదువా" అని ప్రశ్నించిరి. నేను త్రాగనని మారుపలికితిని. "ఓహో! అటులనా" యని కొంత ఆశ్చర్యమును వెలిబుచ్చిరి. ఇంతలో ఆ గదిలోనే క్రింద చాపమీద కూరుచుండియున్న శ్రీ భోగరాజు సీతారామయ్యగారు ఆ నీళ్ళలో కొంచెము మజ్జిగ వేసియిచ్చిన యెడల అవి త్రాగుటకు ఆయన కభ్యంతరము ఉండ" దని చెప్పి, మ్లేచ్ఛులు మొదలగువారు వాడుకొను బావిలోని నీరు త్రాగుటకుగూడ ఆక్షేపణయుండదని నా ఆచారమునందలి న్యూనతనునిశితీకరించి, నన్ను హేళనచేయుచు వాక్రుచ్చిరి. తినుట-త్రాగుటలోనే మన ఐకమత్య మాధారపడి యున్నదనుట సరిగా కినుపడదనియు, ఒక్కతల్లి గర్భమునసేప్పుట్టి,

ఒక్కయింటనే పెరిగిన సోదరు లొకరితోనొకరు ఘోరముగా పోరాడుచుండుటచూచుటలేదా, ఐకమత్యమునకు హృదయము ప్రధానము గాని కలిసితినుట, త్రాగుట కాజాల'వనియు నేను చెప్పదొడగితిని. ఈ విషయములన్నియు ఎన్నిసారులో తాము పత్రికలలోను సంభాషణలలోను సమాధానములు చెప్పినవేగాన ఇప్పుడు వానినిగూర్చి ముచ్చటించుటచే ప్రయోజనము లేదని చెప్పుచు, అస్పృశ్యతానివారణ చేయలేనివారికి స్వరాజ్యము లభించనేరదని మహాత్మాజీ జవాబుచెప్పిరి. నేనుమాత్రమే గాదు, దక్షిణభారతమున నా వలెనే అభిప్రాయములు గలవారు వేల కొలదిగ నున్నారని తెలిపితిని. అట్లయిన దక్షిణభారతమునకు స్వరాజ్యము రానేరాదని కొంచెమెలుగెత్తి వక్కాణించిరి. జీవితములో ఇంతకాలము ఆదరించి, అనుష్ఠించిన విశ్వాసములు మారజాలవని నేను మారుబల్కితిని. అంతట పటేలుగారు ఇక ప్రశ్నించి ప్రయోజనముండదని వాక్రుచ్చిన పిమ్మట మహాత్మాజీ వెడలిపోయిరి. పటేలుగారు మాత్రము మరికొంత తడవు నా యొద్దనే యుండి, నా జీవితమున ఇంతకాలము అనుష్ఠించిన మార్గములు మానివేయుట దుస్సాధ్యమని చెప్పిన వాక్యములపట్ల కొంత సానుభూతి చూపి వెడలిపోయిరి.

ఆ మరునాడు గుంటూరుకు ప్రయాణమైతిని. శ్రీ పట్టాభి సీతారామయ్యగారు తోడుగానుండిరి. నేను వెళ్ళుచున్నానని గాంధీజీకి మామూలు చొప్పున కబురు పంపితిని. వారు వెళ్ళవచ్చునని తెలియజేసిరి. వారి చికిత్సలోనుండి, జాడ్యము నివృత్తి చేసుకొనకుంటిననికూడ వారికి అయిష్టముకలిగించినదనుకొంటిని.

శ్రీ కస్తూరిబాయి గారిని చూచి సెలవు పుచ్చుకొనగోరితిని. ఆమె పనిలో నున్నారుగాన నా యొద్దకు రాజాలరని జవాబు తీసికొనివచ్చిరి. అందువలన నే నప్పటికి వారి కందరికిని అయిష్టుడ నైతినని తలంచితిని. ఈ యాలోచన లన్నిటికంటె నా శరీరబాధ యెక్కువ కష్టముగ కన్పడుచుండెను. త్వరలో నిల్లు చేరవలెనను అపేక్ష అధికమాయెను.

పెదనందిపాటి భారతము

నేను అహమ్మదాబాదునుంచి జబ్బుపడివచ్చిన వార్తని నా మిత్రుడు డాక్టరు చౌదరిగారు ఆతురతతో మాయింటికి వచ్చెను. నెలదినములు ఆయన చికిత్సచేసినమీదట నాకు క్రమముగ జాడ్యము నయమయ్యెను. నేను జాడ్యగ్రస్తుడనై మంచముమీద నుండగనే పన్నులనిరాకరణోద్యమము ఆంధ్ర రాష్ట్రమున ప్రారంభించబడెను. కాంగ్రెసుమహాసభ చేసిన పన్నుల నిరాకరణ తీర్మానమును అమలులో పెట్టుటకు తగిన ప్రదేశముల నిర్ణయించు అధికారము రాష్ట్రములకే యొసగబడెను. ఆంధ్రరాష్ట్రసంఘము బెజవాడలో సమావేశమై, గుంటూరు,తూర్పుగోదావరిజిల్లాలలో నెచ్చట కాంగ్రెసు విధించిన షరతు లన్నియు పరిపూర్తిచెందెనో అట్టిచోట్ల పన్నులనిరాకరణ సాగించవచ్చునని తీర్మానించిరి. దాని ననుసరించి గుంటూరుల్లో పెదనందిపాడును, మరికొన్నిచోట్లును నిర్దేశించబడినవి. తూర్పుగోదావరిలో సీతానగరప్రాంతములో జరుపునట్లు ఆ జిల్లాసంఘము

V.R. NARAYANA MEMORIAL LIBRARY

నిర్ణయించెను. గుంటూరు జిల్లాసంఘము జిల్లాలో ఏ ప్రాంతములలో పన్నులనిరాకరణము సాగించవలెనో యోచించుటకు పొన్నూరులో సభ జరుపయత్నములు చేయుచుండగా జిల్లా మేజస్ట్రీటు పొన్నూరు పరిహద్దులమధ్య నెక్కడను సభ జరుగకూడదని నిషేధించుచు ఉత్తరువును ప్రకటించి దండోరా వేయించెను. ఆ ఉత్తరువును ధిక్కరించి జిల్లా సంఘ సభ్యులు పలువురు పొన్నూరులోనే సమావేశమై పెదనందిపాడు ఫిరంగిపురములలోను, మరికొన్ని స్థలములలోను పన్నులనిరాకరణ చేయవలెనని తీర్మానించిరి. పట్టణప్రదేశములా యుద్యమమునకు తగినవికావనియెంచి వానిని తొలగించిరి. ఆ సభలో పాల్గొన్నవారు పలువురు వీరావేశ పూరితులై ప్రసంగములు గావించిరి. నేను జాడ్యగ్రస్తుడనై యుండుటచే సభకు పోజాలకపోతిని. సభ పొన్నూరు సరిహద్దులు మాని, సమీపమున మరియొక చోట జరుపవలసినదని సలహా నిచ్చితినిగాని నా సలహా యెవ్వరికిని రుచించలేదు. వ్యర్థముగ ప్రభుత్వాధికారులచేతులలో పట్టుబడకుండ వీలైనంతవరకు మన కార్యము నెరవేర్చుకొనవచ్చుననియు, మిక్కిలి బాధ్యతతో గూడిన ఉద్యమమును ప్రారంభించుచు మొట్టమొదటనే ముఖ్యులైన కాంగ్రెసువారు జయిలులోకూర్చుండుట ఉద్యమ వ్యాప్తికి భంజకమగుననియు, నేను యోచించితినిగాని తక్కినవారికిది యుక్తముగ తోచలేదు. మరియు మంచమువీడ బడియున్న నా మాటలు ఉద్రేకపూరితులైయున్నవారికి లెక్కకు రాకుండెను. పొన్నూరులో సభ పూర్తియైనతోడనే పోలీసులు శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రి, మద్ది రాధాకృష్ణయ్య మొదలగు ముఖ్యులను బంధించి వెంటనే విచారణచేసి శిక్షలు విధించి, వేలూరు

జయిలుకు గొనిపోయిరి. విచారణ గుంటూరుజిల్లాకలెక్టరు కచ్చేరీలోనే జరుపబడినందున నేను మోటారుకారుమీద మెల్లగా అక్కడకు వెళ్ళి కారుమీదనేయుండి, జయిలుకు బోవుచున్న వారిని అభినందించుచుంటిని.

పెదనందిపాడులో పన్నులనిరాకరణకుబూర్వమే సహాయ నిరాకరణోద్యమము ననుసరించి గుంటూరు తూర్పు-పశ్చిమ గోదావరులలో గ్రామోద్యోగులగు మునసబు కరణములు, కొందరువెటివారు సహితము ఉద్యోగములకు రాజీనామాల నిచ్చిరి. అందు శ్రీనూచిరాజు రామమూర్తియను యువకులొకరు బాపట్లతాలూకా చందవోలు కరణము. ఆయన మిక్కిలి యుత్సాహముతో తన యుద్యోగమును మానుకొనుటయేగాక తక్కిన గ్రామోద్యోగులను ప్రోత్సహించి, సభలుగావించి ప్రచారముచేసి, ఆందోళన సాగించెను. పుసులూరులో నిట్టిసభ యొకటి జరిపినప్పుడు కొందరు కరణములు రాజీనామా లిచ్చిరి. నందిపాడు మొదలగు గ్రామములలోని ఉద్యోగులను పురి కొల్పుటకు శ్రీ పర్వతనేని వీరయ్యచౌదరిగారు భారమునహించి ఊళ్ళలో తీవ్రముగ ప్రచారముగావించిరి. ఈ యిరువురి ప్రేరణచే పెదనందిపాడు సిర్కా గ్రామములలోను, మరికొన్ని పరిసర గ్రామ ములలోను కరణములును మునసబులును ఉద్యోగములకు రాజీనామా లిచ్చివేసిరి. కాబట్టి ఆ గ్రామములలో పన్నుల నిరాకరణోద్యమము సుకరముగ సాగించుట కవకాశము హెచ్చుగానుండెను. ఈయుద్యమము మొదలుపెట్టి సాగించుటకు ముఖ్యసాధకుడు శ్రీ పర్వతనేని వీరయ్యచౌదరిగారనుట నిర్వివాదము.

పొన్నూరు లో జరిగిన సభాఫలితముగ సీతారామశాస్త్రి గారు ఖైదు చేయబడిరి. ఈయన రాష్ట్రనాయకులలో మిక్కిలి దిట్టరి. అనన్యత్యాగశీలుడు, ఉదాత్తభావ పూరితములైన మహోజ్జ్వల ప్రసంగములు చేసి, జనసమూహముల నాకర్షించు శక్తిగలవాడు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి. ఇట్టివాడు ఉద్యమమును సాగించనలసినవాడుముందుగనేచెరసాలలో చిక్కిపోవుట గొప్పలోపముగా నుండెను. ఆంధ్రకాంగ్రెసు సంఘాధ్యక్షుడ నగు నేను రోగపీడితుడనై యేమియు చేయలేని స్థితిలో నుండుటచే ఈ లోపము మరింతగా నుండెననుటస్పష్టము. ఇటులనే నాయకప్రముఖులైన ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారును, మాడభూషి వేదాంతమునరసింహాచారిగారును అదివరకే సత్యాగ్రహమున దండితులై జైలుకేగి యుండిరి. ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్యగారు చీరాల పేరాల సత్యాగ్రహములు నడుపు చున్న ఏకవీరుడు. వీరి ధైర్యము, త్యాగము, వాగ్విశారదత్వము ప్రజాకరణశక్తియు అనన్యము అపూర్వము నని చెప్పతగినవి. ఇరువదివేలమంది పౌరులను వశీకరించుకొని, ఒక్కతాటి నడిపించి, తరతరములనుండి కాఫురములుచేయు ఇండ్లువాకిళ్ళు నదలి పరస్థలమున పూరిపాకలలో వసింపజేసిన మహోదంతము హిమాచలమునుండి కన్యాకుమారివరకు ప్రజలహృదయముల నాశ్చర్యపూరితములు గావించినది. కాంగ్రెసు ఉద్యమమునకు నిరుపమానమగు బలము సమకూర్చినది. ఆంధ్రరాష్ట్రమునకు అపూర్వమగు గౌరవము కల్పించినది.

ఇట్టి నాయకశిరోమణిగూడ పన్నులనిరాకరణమునకు బూర్వమే జయిలులో చిక్కుబడియుండెను. పేరు పొందిన

నాయకు లెవ్వరును లేనిసమయము నీ యుద్యమము మేరమీరి పెరిగిపోయెను. అంతవరకును నాయకులుచేసిన కృషికి గాంధీజీ ప్రబోధ ప్రభావము పరిభంజనమునలె తోడ్పడుచుండెను. అన్నిటికంటె ముఖ్యముగ స్థానిక నాయకుడైన శ్రీ పర్వతనేని వీరయ్యచౌదరిగారి అమ్మతదీక్షాకౌశల్యమేదానికి పట్టుగొమ్మయై నిలిచెను. ఈయన పల్లెటూరిలో పెరిగి, పల్లెటూరి చదువు మాత్రము చిదివినవాడైనను కాంగ్రెసునందు పూర్ణవిశ్వాస మున్న ఉత్సాహశీలియగుటచే పెదనందిపాడు ఫిర్కా పరితి గ్రామమునందును పరిచారముచేసి, పన్నులు చెల్లించకుండ పరిజలను దిట్టపరచి, ఊరూర వందలకొలది శాంతిసైనికులను సిద్ధపరచెను. మిన్నులు మ్రోగబడినను తొణకక, ఎవ్వరేమిచేసినను చలింపక, పరిభుత్యోద్యోగులకుగాని పోలీసులకుగాని సైనికులకు గాని భయపడక వారేమిచేసినను కోపించక, మారుచేయుటకు యత్నించక, తనయాజ్ఞ పరికారము నడచుకొనునట్లు కట్టు దిట్టములు గావించెను. పరితిదినము గ్రామములలో జరిగిన వృత్తాంతములను తనకు తెలుపుటకు శాంతిసైనికులలో కొందరిని వార్తాహారులుగ నియమించెను. ఈ వార్తాహారులు రోజు రోజు నా యొద్దకు పగటివేళలను రాత్రులనుగూడ వచ్చుచుండిరి. గ్రామోద్యోగులు రాజీనామాలిచ్చినందున పన్నులు వసూలు చేయుట పరిభుత్వాధికారులకు సాధ్యము గాకుండెను. ఎవరివలన ఎంతపన్ను వసూలు కావలసినదియు తేల్చి వారెవ్వరును లేకుండిరి. పన్ను లెగబెట్టుట సులభమేగాని దానివలన కలుగు నష్టములు భరించుట కష్టము. రహితులు అట్టి భయమును విడనాడి పన్నులు చెల్లింప నిరాకరించిరి. జప్తుచేయుటకు వీలు

లేకుండ విలువగల వస్తువులను భద్రము చేసుకొనిరి. ధాన్యము గాని, తలుపులు మంచములు మొదలగు సామానులుగాని జప్తు చేసిన వాటిని వేలము వేయుటకై తాలూకాకచ్చేరికి మోసు కొనిపోవువారు దొరకకపోయిరి. పెదనంది పాడు ఫిర్కా మాత్రమేగాక చుట్టుపట్ల గ్రామములవారును పన్నులను చెల్లించకుండిరి. పల్లెజనులను భయపెట్టిరి. దౌర్జన్యముచేసి పన్నులు వసూలు చేయు వలెనని యుద్దేశించి, చెన్నపట్టణమునుంచి సైనికదళమును మందు గుండు సామానులతోను మరఫిరంగులతోను గుంటూరు పట్టణమునకు రప్పించిరి. కొంత సేన పెదనంది పాడునకు వెలుపలచింతల తోపులో విడిసియుండి, గ్రామములవెంట తిరుగుచుండెను. తాము వచ్చినప్పటికి ప్రతిగ్రామములోను వీధులవెంట శాంతిసైనిక భటులు వరుసలుతీర్చి నిలిచియుండుటగాంచి, సైనికులు వారిపై ఉమిసియు, తిట్టియు,అవమానపరచుచుండిరిగాని శాంతిసైనికులు శాంతమువీడక భరించుచుండిరి. జిల్లాకలెక్టరు వచ్చి, "మునసబు ఇల్లు ఎచ్చట నున్న" దనిన"ముందుకుబోయి విచారించుకొను" మని చెప్పువారలేగాని సరియైన సమాధానము చెప్పెడివారెవ్వరును లేరైరి. ఆ యూళ్ళలో తిరుగుచుండిన సర్కారుద్యోగులకు మంచినీళ్ళుకూడ పుట్టవాయెను. కోమటిండ్లలో ఉప్పుచింతపండైనను వారికి అమ్మబడలేదు. కనుక ఉద్యోగులు ఆ గ్రామములలో ఉండుటకు నీడలేక, తినుటకు తిండిలేక, వెంటనే ఊరు విడిచి పోవలసివచ్చుచుండెను. కాకుమానుగ్రామములో ఒక ఆసామి ఎద్దులను, మరియొక ఆసామీ బండిని, ఉద్యోగులు జప్తుచేసిరి. బండిని, ఎద్దులను నలుబదిమంది సైనికుల సహాయముతో పోలీ కొని పోవుటకై యత్నించిరి. ఆ యూరి ప్రజలు గుంపుగాచేరి,

యెద్దులను బండిని తోలుకొనిపోనియ్యక అడ్డుగావించిరి. సైనికులు దౌర్జన్యము సలుప సిద్ధమైనందున ప్రజలును కోపావిష్టులైరి. సైనికులు తుపాకులు ప్రేల్చుటకు సిద్ధమగుచుండిరి. ఇట్టి సమయంలో నెక్కడనుండియో వీరయ్యచౌదరిగారు గుఱ్ఱము మీద పరుగిడుచువచ్చి చేరిరి. అయిదారువందలమంది గ్రామ వాసులు తుపాకులుకాల్చనున్న సిపాయీలమీద కఱ్ఱలుతీసి కొని దుముకబోవుచుండ వీరయ్యగారు చేయెత్తి "ఆగుడాగుడు" అని కేకవేయునప్పటికి ప్రజలు వెనుకకు దగ్గి శాంతించిరి. సిపాయిలు ఎద్దులను బండిని తోలుకొనిపోయిరి. ఇట్లు వీరయ్య చౌదరిగారు గొప్పదళాధిపతివలెఅశ్వారూఢుడై గ్రామములవెంట తిరుగుచు ప్రజలెక్కడను దౌర్జన్యము జరుపకుండ భద్రపరచుచుండెను. చౌదరిగారివాక్యము జవదాటక ప్రజలు అణకువతో నా ప్రచండ వాతావరణమున జాగ్రతతో వర్తించుచుండిరి.

సత్తెనపల్లి తాలూకా గ్రామములనుండి కొన్నిదినములలో అర్ధరాత్రములందు మాయింటికి నచ్చి, వయస్సుమీరిన పెద్దరహితులు డిప్యూటీకలెక్టరును పోలీసులతో తమ గ్రామములకు వచ్చి, ఇండ్లలో ప్రవేశించి, దౌర్జన్యముగా ధాన్యపుబస్తాలు బయటవేయించియు, పశువులను కట్టుత్రాళ్ళనువిప్పితోలివేసియు, బండబూతులు దిట్టియు, భయపెట్టియు, అవమానపరచియు, కొందరిని కొట్టియు దురంతములు జరుపుచున్నారుగనుక మాకేమి సలహా చెప్పెదరని నన్ను అడుగుచుండెడివారు మనము స్వరాజ్యము నిమిత్తము చేయు శాంతి సంగ్రామముగాన యిట్టి కుచేష్టలును, దౌర్జన్యమును ప్రభుత్వము సల్పుట సహజము.

పన్నులీయనంకుకు భూములు వేలము పాడింతురు. బీదలగు హరిజనులు మొదలగువారికి స్వల్పవెలలకు కట్టిపెట్టుదురు. అందు వలన ఊళ్ళు మాలపల్లెలును, మాలపల్లెలు ఊళ్ళుగనుమాగును. మనమీ కష్టనష్టములు భరింపజాలమని నేను వారికి చెప్పుచుంటిని. వారు పరమోత్సాహముతో మిన్నులు మ్రోగ బడినను మేము వెనుదీయమని దృఢవాక్యములు పలుకుచు వెడలిపోవుచుండిరి.

ఇట్లునడచుచున్న సహాయజ్ఞా మునుగూర్చివార్తలు పత్రికలలోపడుటచే దేశమంతట వ్యాపించుచుండెను. ఇతర జిల్లాల వారుఈయుద్యమచర్యలను చూచుటకు వచ్చుచుండిరి. శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు (కృష్ణాపత్రిక సంపాదకులు) ఒక రాత్రి బందరునుండి నా యొద్దకు వచ్చి. "ఈ పన్నుల నిరాకరణ జరుగుచున్న పెదనందిపాడుగ్రామములలో కాంగ్రెసు నియమించిన అహింస, ఖద్దరు, అస్పృశ్యతా నివారణలనుగూర్చిన షరతులు ప్రజలు పూర్తిగా అనుష్ఠించుచున్నారా" యని నన్ను ప్రశ్నించిరి. "నాకు తెలిసినంతవరకు వారు చాలభాగ మనుష్ఠించుచున్నారనియే నాఅభిప్రాయము.అయినను మీరు ఆగ్రామములకుబోయి చూడవచ్చు"నని బదులు చెప్పితిని. కాని వారచ్చటికి పోకయే నా మాటలను విశ్వసించక వెడలిపోయిరి.

ఈ సమయమునసే మహాత్ముడు బార్డోలీలో పన్నుల నిరాకరణోద్యమము సాగించి, దానినిగూర్చి గవర్నరుజనరల్ గారికి లేఖ వ్రాయుచు అందు గుంటూరుజిల్లాలోగూడ ఇట్టి యుద్యమము నడచుచున్నదనియు, అవసరమైన అచ్చటికినిత్తాము

పోవుటమనియు వివరించిరి. ఈ లేఖ చే గుంటూరులోని ఉద్యమ విషయము మరింత ప్రాముఖ్యము వహించెను. నా మిాదను సీతారామశాస్త్రిగారిమిాదను కొందరు కొన్ని ఆరోపణలు చేసిరి. మేము మా భూములపై శిస్తులు చెల్లించి, జప్తులు వేలములు గాకుండ కాపాడుకొని ఏమియు నెరుగని రహితులను కష్టనష్టములకు గురిచేయుచుంటిమని ప్రవాదలు బయలుదేరెను. ఆనీబీసెంటుగారు ప్రకటించుచున్న న్యూఇండియా పత్రికలో ఈ విషయమై ప్రచురించిరి. దానికి సమాధానము వ్రాసి నేను ప్రకటించితిని. కాని ఈ వానకు కొంత కారణము లేకపోలేదు. నాకును, నా తమ్ములకును జాయింటుభూములు కొన్ని గుంటూరులో కలవు. ఆ భూమి మిాద శిస్తులో మొదటి కిస్తీ అయిదో ఆరో రూపాయలు మా తమ్ముడు సూర్యనారాయణ నాకు తెలుపకుండ చెల్లించెను. ఈ భూమి గుంటూరు కాంగ్రెసు కమిటీవారు ఉద్యమములో చేర్చకూడదని నిషేధించిన వానిలోదైనను కిస్తీ చెల్లించినట్లు నాకు తెలియగనే ఇక ముందు చెల్లించవలదని మా తమ్మునితో చెప్పి, భద్రపరచితిని. వంగోలు తాలూకా లింగమగుంటలో నాకు నా యత్తవారు ఏ యకర ముల భూమి నిచ్చిరి. ఆ భూమికి వారిభూములతోపాటు మా బావమరదిపేరనే కవులు కదపాలు జరుగుచుండెను. ఆ కవుళ్ళలో శిస్తులు ఆసామిలే చెల్లించునట్లు షరతులుండెను. కనుక ఆ భూమిమిాద క్వోటురెంటు సహితము ఆసామిలే చెల్లించిరి. నా కావిషయము బొత్తుగా తెలియదు. ఆ నంగోలు ప్రాంతము గూడ ఉద్యమములో చేరలేదు. అచ్చటి ఆసామిలెవ్వరును ఉద్యమము సాగించలేదు. పెదనందిపాడుసిర్కాలోను, చుట్టు

ప్రక్కలనున్న గ్రామములలో మాత్రమే ఉద్యమము సాగుచుండెను. మీదుమిక్కిలి నేను జాడ్యపీడితుడనై మంచమువీడ పడియుండి ఎవ్వరైన నా యొద్దకు వచ్చినచో సమాధానము చెప్పుచుంటినే గాని తక్కిన విషయములలో జోక్యము కలిగించుకొనుట కవకాశము లేకయుండెను.

ఇకను సీతారామశాస్త్రిగారు ఆ యుద్యమము జరుగు కాలములో జయిలులో నిర్బంధితుడై యుండిరి. వారి తమ్ములు భయంకర వ్యాధిచేపీడితులై హీనస్థితిలోనుండగా వారిని బెదరించి సర్కారుదోస్తులు కొంతశిస్తు వసూలు చేసిరట. ఆయన స్వల్ప కాలములోనే మృతినొందిరి. కాన శాస్త్రిగారిమీద వేసిననింద కేవలమక్రమ మనుట నిశ్చయము. గుంటూరులో మా కుటుంబ భూములమీద శిస్తుచెల్లించిన విషయమైనను శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మగారొక నాడు నా యొద్దకు వచ్చి "మీ భూమికి శిస్తుచెల్లించినారని చెప్పుచున్నారు, అది నిజమేనా" అని అడుగు వరకును నాకు తెలియలేదు. నా తాలూకు స్వంతభూము లున్నవిగాని వాని మీద శిస్తు నేను చెల్లించలేదు.

ఇట్లుండగా ఉద్యమము మిక్కిలి తీవ్రరూపముధరించెను. పెదనందిపాడు గ్రామములలో మాత్రమే గాక గుంటూరులో సహితము ప్రభుత్వము, సేనను మెషీనుగన్నులతో నిలిపి, ప్రతి దిన మును పూటపూట వీధులలో ఆయుధములతో త్రిప్పదొడగెను. పన్నులువసూలుకానందున తమసిబ్బందికి జీతములుచెల్లించుటకు బొక్కసమున రొక్కము లేక ప్రభుత్వము చిక్కులుపడుచున్న సమయములో ఉద్యమము ఆపివేయవలసినదని మహాత్ముడు

ఉత్తరము వ్రాసినను దానిని లెక్కచేయక నేను మూర్ఖించి, ఉద్యమము అక్రమముగ నడిపించుచున్నట్లు కరపత్రములు అచ్చువేయించి ఉద్యోగులు జిల్లాలలో పంచిపెట్టుచున్నారని నాకు తెలియవచ్చింది. ఉత్తరమేదియు నాకు మహాత్మునియొద్ద నుంచి రాలేదు. దానినిగూర్చి విచారణ చేయగా శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు మహాత్మునియొద్దకు బోయి ఇక్కడి ఉద్యమము మరతులకు భిన్నముగ నడిపింపబడుచున్నదని చెప్పి నందున వారిమాటనమ్మి, మహాత్ములు నాకు "ఉద్యమము ఆపివేయవలసిన" దని ఉత్తరము వ్రాసి, దానిని నా కందజేయ నలసినదని సీతారామయ్యగారిచేతికే యిచ్చినట్లును, ఆయన మరియెవ్వరిచేతికో నా కిమ్మని దానిని పంపగా, అది అధికారుల చేత చిక్కినందున వారు కరపత్రములు అచ్చొత్తించి ప్రకటించి నారని తేలినది. అంతట నేను గుంటూరులో శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహారావు గొల్లపూడి రామనాథయ్య మొదలగు ప్రముఖులను పిలిపించి, వారితో సుప్రదించి, పెదనందిపాడుకు మనుష్యులను బంపి, పరిస్థితులను మరల రూఢిచేసికొని ఒక తంతివార్త మహాత్మునకు పంపితిని. ఉద్యమము అప్పటికి బహు దూరము సాగినదనియు, అప్పుడు ఆపివేయుటయే సంభవించు నెడల ఆంధ్రదేశమును కాంగ్రెసునుండి బొత్తుగ తొలగించునే వచ్చుననియు ఖండితముగ తెలిపితిని. ఈ వార్తారావము దేశములో అసేతుహిమాచలము ప్రతిధ్వనించినది. వార్తాపత్రిక లలో ప్రకటింపబడినది. చీరాల పేరాల ఉద్యమమువలెనే, ఈ పెదనందిపాడు పన్నులనిరాకరణోద్యమముగూడ అంతకుమించిన సంచలనముగావించి ప్రభుత్వమును భయాక్రాంత మొనర్చెను.

మహాత్మునకు తంతితోపాటు ఇక్కడిపరిస్థితులు తెలుపుచు ఒక జాబుప్రాసి, నడింపల్లి నరసింహారావుగారిని పంపితిని. వారు దానికి బదులు ప్రాయుచు అచ్చటి స్థితిగతులు స్థానికులైనమీకు తెలిసినట్లు నాకు తెలియవు గాన ఆ బాధ్యత యంతయు మీదే యని స్పష్టపరచిరి. అప్పుడు చెన్నపట్టణములో గవర్నరుగానుండిన లార్డు వెల్లింగన్ పిమ్మట కొంతకాలమునకు ఇంగ్లాండుకు వెళ్ళినప్పుడు పెదనందిపాడు ఫిర్కాలోని పన్నులనిరాకరణోద్యమము బ్రిటిష్‌ప్రభుత్వమును కుంకుడుప్రేళ్ళతో కదలించినదని పార్లమెంటులో వాక్రుచ్చెను. నేను మహాత్మునకిచ్చిన తంతివార్తను గూర్చి ముచ్చటించుచు పార్లమెంటుసభ్యుడొకడు మన అధికారములో నున్న తంతి ఆఫీసునుండియే అట్టివార్త పంపుటెట్లు కలిగెనని ప్రశ్నించెనట. ఇంతటి సంక్షోభము కలిగించిన పెదనందిపాటి యుద్యమమునుగురించి కాంగ్రెసు చరిత్రకారులు కాంగ్రెసు చరిత్రలో నామమాత్రముగ సూచించి విడుచుట శోచనీయము.

ఉద్యమవిరమణము

గాంధిగారు ప్రాసిన లేఖను బట్టియే కాబోలు మాయింటనే ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు కార్యనిర్వాహకవర్గము సమావేశమై పెదనందిపాడుఫిర్కాలో జరుగుచున్న ఉద్యమపరిస్థితులను బాగుగ పరిశీలనచేసి, నివేదిక పంపుటకు కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు, టంగుటూరి ప్రకాశముపంతులు, శ్రీ దండు

నారాయణరాజు గార్లను ఉపసంఘముగా నియమించెను. వారు ఆ గ్రామములలో సంచారముచేసి, కాంగ్రెసు షరతులన్నియు ప్రజలు చక్కగ పాటించియే ఉద్యమము మిక్కిలి దీక్షతో జరుపుచున్నందుకు వారిని ప్రస్తుతించుచు, "ప్రభుత్వము ప్రజలపై దౌర్జన్యమును ప్రయోగించినప్పుడు తాళుకొనునంత నిబ్బరము వారియందు కలదని విశ్వసింపజాలకున్నార" మనియు "అందువలన ఉద్యమము నిలిపివేయుటేయుక్త" మనియు నివేదికను సిద్ధముచేసిరి. మరల జిల్లా కాంగ్రెసు కార్యవర్గము మాయింటిలోనే సమావేశమై ఆ నివేదిక విషయమై విమర్శచేయు సమయమునందే మహాత్ములువార్సిన చిన్న కాగితపు ముక్కనొకటి ఎవ్వరో అందిచ్చిరి. అందులో తాము బార్డోలీలో ఉద్యమము ఆ కాలములోనే సాగించుచున్నందున గుంటూరు ఉద్యమమెట్లు సాగుచున్నదో యను యోచనసహితము ఎప్పుడును మనస్సును కలతనొందించుచుండునుగాన అచ్చటి యుద్యమమును ఆపివేయ వలసినదని వ్రాయబడియుండెను. అది చదువుకొనినతోడనే నా హృదయము మిక్కిలి విచారముచే కుంగిపోయెను. అంత చక్కగ సాగుచున్న ఉద్యమమును బుద్ధిపూర్వముగఆపివేయుట నాకు ఇష్టము లేకపోయెను. అయినను గాంధిగారే తాము చేయు ఉద్యమమున కిది అడ్డము వచ్చుచున్న దనుభావము వెలిబుచ్చినప్పుడు నే నింక ముందుకు సాగించుట అవ్యక్తమని నాకు తోచెను. తక్కిన సభ్యులును ఆపివేయుటయే సమంజసమని అభిప్రాయపడిరి. కాన ఆపివేయక తప్పినదికాదు. ఈ కార్య నిర్వాహకవర్గ సభ జరుపుచుండగా పలువురు కాంగ్రెసువాదులు వెలుపల ఆవరణములో నిండియుండిరి. వారికి పరిస్థితులను

తెలుపుచు ఉద్యమమును ఆపివేయుటకు కారణములను శ్రీ టంగుటూరి ప్రకాశముగారు వివరించిరి. నేనును భాషించుచు నా ఆవేదనను మాత్రము ఆవేశముతో వెలిబుచ్చితిని. శ్రీ కొండూరి లక్ష్మీనారాయణగారు మొదలగువాగు "మా నాయకుడు జాడ్యపీడితుడై పడిపోయియున్నందున మీ రిట్లు తీర్మానము చేయగల్గితిరి. ఇది ఆంధ్రదేశపు దురదృష్ట"మని ఎలుగెత్తి నిందించిరి. నేనువారిని శాంతింపజేసితిని. కాని గాంధి గారియొద్దనుండి ఆ చిన్న కాగితపుముక్క నెనరు తెచ్చిరో, నాకే వా రేల యుత్తరము వ్రాయలేదో నేను విచారించలేదు. వారు రహస్యముగ నుండనలెనని యుద్దేశించి, అట్లు వ్రాసియుందురని తలంచితిని. పిమ్మటి కాలములోనైనను దాని యుధార్థమును తెలుసుకొనలేదు. వా రిట్లు వ్రాసిరను విషయము ఇతరులకు చెప్పినవాడనుకాను. అది రహస్యవిషయముగనే గ్రహించి, బయలు పరచుట యుక్తముకాదని తలంచితిని.

ఉద్యమము ఆపివేయబడినదనువార్త తెలియుటతోడనే కాంగ్రెసువారి ఆజ్ఞ అయినదిగాన పన్నులు చెల్లించనచ్చునని రహితులు గ్రహించి, పన్నులు పూర్తిగ చెల్లించిరి. జప్తుచేసిన పిమ్మట వేలమునకు ఇస్తిహారు వ్రాసి, నెలరోజులవాయిదాతో వేలము వేయింతుమని దండోరా చేయుట విధియైనను పెదనంది పాడులో ఉద్యమము తీవ్రముగ సాగించినపిదపనెలవాయిదాతో నిమిత్తము లేకుండ జప్తు చేయుటతోడనే వేలము వేయించు టకు అధికారము కల్పించుచుచట్టములో మార్పుగావించబడెను. రహితులు దానికిని భయపడక కాంగ్రెసుఆజ్ఞ తల నిడుకొని

పన్నుల నీయ నిరాకరించిరి. కాంగ్రెసు ఆజ్ఞాపించుటతో పన్నులు చెల్లించుటచే కాంగ్రెసునందు ప్రజలకుగల యభిమాన మెంతయో తెల్లమయ్యెను.

ఉద్యమము ఇట్లు ఆగిపోయినపిమ్మట ప్రభుత్వము నిరంకుశవిధానము పూర్తిగా నహించి, ప్రజలను పీడింపసాగెను. గుంటూరుజిల్లా కలెక్టరు రూథర్ ఫర్డు మిక్కిలి కఠినుడు. ప్రభుత్వాధికారము అపారమని ప్రజలహృదయములలో నాటించి, మరెప్పటికిని ఇట్టి ఉద్యమము సాగింపకుండ భయముకల్పించవలెనని ఉద్దేశించుకొనికాబోలు గవర్నరుగారి రక్షకభటులను రప్పించెను. పెదనందిపాడు చింతలతోప్పులో శిబిర మేర్పరచుకొని ప్రతిదినము తెల్లవారునప్పటికే తానొక పెద్దగుఱ్ఱము నెక్కి, కొతులను వెంటబెట్టుకొని, ఊరూర దిరుగుచు ఉద్యమములో పాల్గొన్నట్లు తనకుతోచిన వారిని పట్టుకొని, వారిని వాయిదా నాటికి పెదనందిపాడులో చింతలతోప్పులోని శిబిరమునకు రమ్మని ఆజ్ఞాపించుచు, వాయిదానాడు వారిపై విచారణ నామమాత్రముగ సలిపి, శిక్షలువేసి, జయిలుకు పంపించసాగెను. ముఖ్యముగ శాంతిసైనికులను దండించుచుండెను. శ్రీ వీరయ్యచౌదరిగారిని పట్టుకొని ఖైదుచేసి, గుంటూరు జయిలునకు తీసికొనివచ్చిరి. కొందరు ప్రముఖులగు కమ్మనారు ఆయనకు క్షమాపణగోరి శిక్ష తప్పించుకొనవలసినదని మరొత్తిచేయుచున్నారని విని, మెల్లగ బండిచేసుకొని గుంటూరు సబ్ జయిలులో నున్న వీరయ్య చౌదరిగారిని కలుసుకొని మాట్లాడితిని. కాంగ్రెసు గౌరవమును తమ గౌరవముగూడ కాపాడుకొనవలసినదని బహుదూరము చెప్పితిని. ఆయనయు నామాటల నంగీకరించినట్లే కనబడెను.

ఆయనమీాద కేసు విచారణ పెదనందిపాడుకే వాయిదా వేసిరి. నాకు అప్పటికి జాడ్యము తగ్గి, కొంచెము కొంచెము ఇంటింాో తిరిగెడి శక్తిమాత్రము కలిగెను. వాయిదానాడు బండిచేసుకొని పెదనందిపాడు ఉదయము పదిగంటలకు చేరితిని. నేను చేగుటకుముందే శ్రీ వీరయ్యగారు జామీానిచ్చి, వెడలిపోయిరని తెలియనచ్చినది. నేను చాల చింతించితిని. అంత ధైర్యముతో ఉద్యమము నడిపిన వీరు ఇంతలో లొంగిపోయెనుగదా యని విస్మయమునొందితిని. మహత్తర కార్యధురీణులగు చౌదరిగారి కీయపకీర్తి వాటిల్లెనుగదా యను విచారముచే నేను క్రుంగిపోతిని. నే నావార్త వినిన తోడనే గుంటూరుకు మరలిపోవలెనని తలంచితినిగాని ఆయూారిలో నొక కరణముగారును మరికొందరును అనాడు అక్కడ ఉండవలసినదని బలవంతపెట్టిరి ఆయూారిలోని రహితులు చాల భయమునొంది ప్రతిదినము పొల్లవారకమునుపే యిండ్లనుంచి బయలుదేరి, పొలములకు బోయి, రాత్రి ప్రొద్దుపోయి వచ్చు చుండిరనియు, వారికి భయముతీర్చి, ధైర్యముచేకూర్చుడనియు నన్ను కోరిరి కాబట్టి ఆ కరణముగారి యింటనే బసచేసితిని. కొందరు యునకులు ప్రక్కగ్రామములనుండి వాయిదామేరకు కలెక్టరునొద్ద విచారణనిమిత్తము హాజరగుటకు వచ్చి, నన్ను కలుసుకొని సలహా అడిగి వెళ్ళుచుండిరి. ఇట్లు వచ్చిన వారి కందరికి శిక్షవిధించి, కలెక్టరు జయిలుకు పంపివేయుచుండెను. ఒకనాటిరాత్రి ఎనిమిదిగంటలవేళ నొక కమ్మాయిసామి నాయొద్దకు వచ్చి, కుశలప్రశ్న లడిగి, ఉద్యమము పడిపోయినందుకు సంతాప పడినవానివలె నటించెను. ఉద్యమములో రాజీనామాపెట్టిన

ఒక మునసబుస్థానమున తాను నియమింపబడితిననియు ఆ రాజీ నామా ఇచ్చినవ్యక్తి మరల నుద్యోగములో చేరినందున తాను తొలగవలసివచ్చెనని యు, మరల నెక్కడనైన నుద్యోగమిప్పింపు డని డిప్యూటీ కలెక్టరు జగపాల వెంకటేశంగారియొద్దకు బోయి మనవిచేసుకొనుటకు వచ్చితిననియు చెప్పి కొంతతడవు ఏవియో మాటలాడి వెడలిపోయెను. రాత్రి చాల ప్రొద్దుపోయినపిమ్మట దాదాపు ముప్పదినుండి రయితులు నాయొద్దకు వచ్చిరి. వారికి భయపడనవలదనియు, ఉద్యమము అప్పటికితగ్గిపోయినను ఎప్పటికో మరల తలయెత్తగలదనియు, స్వరాజ్యము మనకు తప్పక లభించు ననియు, ధైర్యముతో దేశసేవచేయుటకు వారెల్లరు సిద్ధముగా నుండవలెననియు బోధించితిని. వారిలో నొకరు లేచి, యుద్ధము చేయక స్వరాజ్యము లభించునా? ఏదేశమందైన నిట్టి దృష్టాంతము గలదా? అని ప్రశ్నించెను. నేను గాంధిమహాత్ముని అహింసాసత్యముల పటిష్టతనుగూర్చి చెప్పితిని. అంతటితో సభ భాషణ ముగిసినది. ఆసామీలు వెడలిపోయిరి. నేను అచటనే నిద్రించి, మునా డుదయము గుంటూరు చేరితిని.

ఆసాయంకాలము దీపములు పెట్టినపిమ్మట నాకడకువచ్చి, మునసబుద్యోగమునిమిత్తము డిప్యూటీకలెక్టరుగారి నాశ్రయింప వచ్చినట్లు తెలిపిన ఆసామిచేత నాపైన రిపోర్టు తయారుచేయించి, నేను ఆరాత్రి ఆయూరిప్రజలను మరల పున్నూలనిరాకరణ చేయ్ప వలసినదని ప్రోత్సహించితిని వ్రాయించిపుచ్చుకొని, ఆరిపోర్టు మీద నన్ను మాయింటిలో నుండగనే పట్టుకొని పోలీసాలయ్యం దుంచిరి. రెండవరోజుననే జిల్లామాజిస్ట్రేటు రూథర్‌ఫర్డ్ నాపైన

కేసు విచారణ గావించెను. అబద్ధపురిపోర్టును వ్రాసియిచ్చిన ఆసామిని పాత్రీగా విచారణచేసెను. రిపోర్టులో బ్రిటిషుప్రభుత్వము మన స్త్రీల స్తనములను కోసివేయింతురని నే నుపన్యాసము చెప్పినట్లు వ్రాయబడెను. సాక్ష్యముచెప్పుటలోగూడ అవి నా వాక్యములైనట్లు ఆయన బలపరచెను. ప్రభుత్వము నాశ్రయించుకొని ఉద్యోగముచేయువారు కొందరు ఆరోజులలో స్వప్రయోజనము నిమిత్తము ఎట్టి యకృత్యములనైన చేయుచు, స్వాతంత్ర్యోద్యమమున చేరినవారికి, నితరులకు అపకారములు చేయుచుండిరి. పన్నులనిరాకరణము సాగుచున్నకాలములో దక్షిణ కన్నడజిల్లాలో ప్రభు అను నొక కాంగ్రెసునాయకుని ఆస్తి తహశీలుదారు జప్తుచేయుచు ఆయనభార్య మెడలోని తాళిబొట్టును సయితము జప్తుచేసి, బలవంతముగ నూడబెరికించెను. ఇట్టి దుండగములును అవమానములును పలుచోట్ల ప్రభుత్వోద్యోగులుగానున్న మనవారే జరిపించిరి.

కారాగారవాసము.

నేను కాంగ్రెసు నిబంధల ననుసరించి సాక్ష్యులను ప్రశ్నించుట మానివేసితిని. రిపోర్టులో వ్రాయబడిన విషయములు నిజముగావని తెలుపుచు, పెదనందిపాడులో జరిగిన సంగతులను వాస్తవముగ వివరించుచు వ్రాతమూలకమైన క్షమాపణమును దాఖలుచేసితిని. నేను అపరాధినని తీర్మానముచేసి, శాంతికి భంగముకలుగచేయకుండుటకు ఒకసంవత్సరము పూచీకత్తువ్రాసి

యీవలసినదని మాజిస్ట్రేటు కోరెను దానికి నేను సమ్మతింప నందున ఒక సంవత్సరము విడిఖైదు విధించెను. అంతట నన్ను రాజమహేంద్రవరము చెరసాలలో బెట్టిరి. ఈ కాంగ్రెసు ఉద్య మములో శిక్షింపబడినవారి నందరిని ఆచెరసాలలోనే యుంచుటచే మిత్రు లనేకులు అందు చేరుట సంభవించెను. శ్రీ సీతారామ శాస్త్రి, మద్ది రాధాకృష్ణయ్య మొదలగువారును అచ్చటనే యుండిరి. నే నచ్చట చేరినపిమ్మట రోజురోజు క్రొత్తవారిని ఖైదుచేసి తీసుకొనివచ్చుచుండిరి. శ్రీ బులుసు సాంబమూర్తి గారు మొదలగు స్నేహితులు అనేకులు వచ్చిచేరిరి. సీతారామ శాస్త్రి మొదలగువారిని కొందరి నప్పటికే కడలూరు జయిలుకు గొనిపోయిరి. కఠినశిక్ష విధించబడినవారిని మానుండి వేఱుపఱచి, మరియొకభాగమున బెట్టిరి. రాజకీయఖైదీలసంఖ్య హెచ్చిన పిదప నంట మాకందరికి ఒక్కటిగ నేర్పరచి, ఆవిచారణ మాకే యొప్పగించుటచే సాంబమూర్తిగారు మొదలగు మిత్రులు ఆ విచారణ పైనబెట్టుకొని నడపుచుండిరి. శ్రీ సాంబమూర్తిగారు కారాగృహాధికారులకును, మాకును మధ్య రాయబారిగా నేర్పడెను.

ఇట్లు కొంతకాలము జరిగినపిమ్మట మాకు పచ్చిబియ్యము నకుబదులు ఉప్పుడుబియ్యము వండిపెట్టవలసినదని అధికారులు ఏర్పాటుచేసిరి. సాంబమూర్తిగారు మాతో నెవ్వరితోడను సంప్రదించకయే అంగీకరించెను. ఆ ఉప్పుడుబియ్యము వండిపెట్టిన నాడు పలువురు తినలేక పోయిరి. అది ఆరోగ్యకరమని ప్రభుత్వాధి కారుల వాదము. సాంబమూర్తిగారు వారికి తోడుగా వాదింప నారంభించెను. మేము పలువురము మా కా యున్నము సరిపడదని

మొరపెట్టితిమి. ఆరోగ్యముమాట ఎట్లున్నను ఆసుర్వాసన భరింపశక్యముకాకుండెను. సాంబమూర్తిగారు దుర్వాసనపమియు లేదని తర్కించుచు ముద్దలు మ్రింగుచుండెను. తుదకు రెండు మూడురోజులలో జయిలుడాక్టరుగారు మమ్మునందరిని సమావేశపరచి మాఆక్షేపణలు వినిపిమ్మట ఉప్పుడుబియ్యము మాన్పించెను. అప్పటినుండి సాంబమూర్తిగారు వితండవాద ప్రియులని మేము నవ్వుకొనుచుందుము. తనమాట నెరవేర్చుకొనుట కా ముద్దలు మ్రింగిన ఆయన గట్టితనమునకు మెచ్చుకొంటిమి. సాంబమూర్తిగారికిని, మరికొందరు దృఢకాయులగు మిత్రులకు ఆ కొలముద్ద చాలెడిది కాదు. కొందరు తమ ముద్దలలోనుండి కొంచెము ప్రక్కవారికి సర్దుచుండెడివారము. అప్పటికిని కొందరు అర్ధాకలితోడనే కాలము పుచ్చుచుండిరి.

నేను దీర్ఘకాలము జాడ్యగ్రస్తుడనుగానుండి అప్పుడప్పుడే తెరుకొనుచుండుటచే జయిలునివాసము దుర్భరమైనను, మేమందరము విడివిడిగ కొట్లలో నిర్బంధితులమైనను, భోజనసమయమున కలియుచుండుటచే నొకకొంత యుత్సాహకరముగనే యుండెను. శ్రీ న్యాపతి సుబ్బారావుగారు మమ్ము జూడనచ్చి, ఆదరవచనములు పలికి, నా నిమిత్తము నిమ్మకాయఊరుగాయ పంపించిరి. శ్రీ రాయసం వెంకటశివుడుగారు గుంటూరునుండి వచ్చి, నన్ను చూచివెళ్ళిరి. నా కుమారులను, చిన్నయల్లుడును నన్ను చూడనచ్చిరి. నా ఆరోగ్యమునకు భంగము లేకుండ గడచుచున్నందుకు వారు సంతసించిరి. ఇంతలో మమ్ము చాలమందిని కడలూరుజయిలుకు గొనిపోయిరి. అచ్చట నున్న

వారిలో ఏలూరుకాపుకస్థులు ఆత్మకూరి గోవిందాచార్యులు గారు జాడ్యగ్రస్తులై ప్రమాదస్థితికి వచ్చిరి. ఈమార్పణగోరి విడుదలపొందనలసినదని మిత్రులు సలహా ఇచ్చిరి. ఆయన సమ్మతించకుండెను. నన్నుగూడ అట్టి సలహానియ్యవలసినదని బలవంతపెట్టిరి. కాని నేనీయజాలకపోతిని. తుద కాతడు బ్రతుక జాలడని ప్రభుత్వమువారే విడుదలచేసిరి. విడుదలయైనతర్వాత త్వరలోనే ఆయన ఆరోగ్యవంతుడయ్యెను. శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారును తరచు అనారోగ్యస్థితిలోనే యుండిరి. హృదయకోశములోని బలహీనతయే వీరుభయులకును కలిగిన లోపము.

ఆజయిలులో మాలో కొందరిని విడివిడిగొట్లలో నుంచి మరికొందరిని పెద్దసావడిలో పెట్టి, పగలు రాత్రులు తాళములు వేసి యుంచుటయేగాక సావిడిలోనుంచినవారి కందరికి నొక గొలుసు కాళ్ళకుకట్టివేయుటచేత ఎవ్వరుగాని స్వతంత్రముగ లేచి, నడచుటకు వీలులేకుండెను మలమూత్రవిసర్జనకు దగ్గరగా కుండలు పెట్టిరి. ఇది కఠినశిక్షపడినవారి కేర్పడిన దుర్భరబాధ. ఇట్లు కొన్నిరోజులు నడచినపిమ్మట అందరిని ఒక్కగొలుసున కట్టివేయుపద్ధతి మాన్పబడెను.

కాకినాడ కాపురస్థుడు బిచ్చమెత్తుకొను బ్రాహ్మణు డొకడుగూడ అట్టిశిక్షయే విధింపబడెను. ఆయన ప్రతిదినము ఒక బుంగెడునీళ్ళు నాకొట్టునొద్దకు తెచ్చియిచ్చుచుండెను. ఒక సామాన్యఖైదీ నేను స్నానముచేసివిడిచిన తడిబట్టలను ఉదికి ఆరవేసి నా కొప్పగించుచుండెను. నేను స్నానముచేసినతోడనే

శుభ్ర వస్త్రములు కట్టుకొని బ్రాహ్మణుడు తెచ్చియిచ్చిన నీటితో సంధ్య వార్చుకొనుచుండెడివాడను. ఇంతలో వేడివేడి గంజి పుచ్చుకొని, ఏదియో చదువుటయో, వ్రాయుటయో పనిగా నేర్పరచుకొని కాలముగడుపుచుంటిని. నాప్రక్కగదులలో పశ్చిమగోదావరినుండి వచ్చిన ముష్టి లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యము అను అన్నదమ్ములుండిరి. వీరిలో సుబ్రహ్మణ్యముగారు కఠినఖైదువేయబడినవారైనను వంటశాలలో పనిచేయుట కేర్పడినందున నాదగ్గరకు వలుమారు వచ్చి, నా భోజనసదుపాయముల నరయుచుండెడివారు.

నేను ఆరోజులలో కాలము వ్యర్థముచేయక, డబ్బి ప్రజాస్వామిక మను ఆంగ్లేయగ్రంథమును చదివి, దానిని తెలుగున వ్రాసితిని. దీని వ్రాతప్రతి వెయ్యిపుట లయ్యెను దానిని నేను అచ్చువేయించజాలకపోతిని. తేటతెలుగున హృద్యమగు శైలిలో పట్టుదలతో వ్రాసిన ఆగ్రంథము అచ్చుపడక మూలపడియున్నందుకు చింతించుచున్నాను. ఇదిగాక ఆప్పేనిఘంటువునందలి కొన్ని పదములు ఏర్చి, వానికి ప్రత్యేకముగ నిఘంటు వ్రాసితిని. ఆంగ్లగ్రంథములను ఆంధ్రభాషలో అనువదించువారికది ఉపయోగించునని తలంపుతో దానిని ప్రకటింపదలచితిని. ఈ నిఘంటురచన నాకు చాలకాలము పట్టెను. మిక్కిలి యోపికతో చేసిన యీ రెండురచనలు వ్యర్థప్రయత్నములుగనే పరిణమించినవి. డబ్బు చేతలేక ఇవి మూలబడినవి. ఇవిగాక ఈజయిలులో నున్నపుడో, మరియొకమారు జయిలులో నున్నప్పుడో జ్ఞాపకము చాలదు. వెల్సుపండితుని ప్రపంచచరిత్ర కొంతవరకు తెలుగున వ్రాసి,

అసంపూర్తిగ నడలివేసితిని జయిలునుండి వెలుపలకు వచ్చిన పిదప పూర్తిచేయుటకు మనసుగొల్పలేదు.

కడలూరుజయిలులో రాజకీయఖైదీలుగా ఆంధ్రులేగాక దక్షిణదేశమునుండియు పలువురు నచ్చియుండిరి. వారిలో యాకూబు హుశ్శేనుగారను నొక మహాహ్మదీయ వర్తకుడు గూడ నుండెను. ఆయనకు మాకంటె ఎక్కువ వసతు లేర్పరచి, ఎక్కువ గౌరవముతో అధికారులు చూచుచుండిరి.

ఆంధ్ర రాజకీయఖైదీలలో బ్రాహ్మణులసంఖ్య యెక్కువ గా నున్నందున వారందరు సాయంకాలములం దొకచోట చేరి, భజనలుచేయ నారంభించిరి. అధికారులకు అంతగా సమ్మతి లేకున్నను గట్టిగా అడ్డుపడకుండిరి. సాయంకాలము ఆరుగంటలకు లోపలనే ఖైదీలు కొట్లలోని కేగనలసియున్నను మనవారు భజనలుచేయుచు కొంత ప్రొద్దుపోవువరకు కొట్లలోకి పోకుండుటచే అధికారులకు కోపమువచ్చుచుండెను. ఈ భజనలు పండుగ రోజులలో నెక్కువగ జరుగుచుండెను. ఒకపండుగరోజున భజన చేయుచు జయిలులో వీధులగుండ ఉత్సవముగా తిరిగివచ్చి, ఒకచెట్టుక్రింద రాళ్ళతో చిన్న బొమ్మరిల్లువలె దేవాలయమును గట్టి, అం దొకరాతిని నిల్పి, దాని కేదో దేవునిపేరు పెట్టి, అచ్చట పూజలు, భజనలు, ప్రసాదములు పంచిపెట్టుట మొదలగునవి సాగించిరి. గోపాలుని రామలింగయ్యగారను ఒక ఖైదీ ఆ దేవునకు రెండెకరములభూమినిగూడ వ్రాసియిచ్చెను. ఆదేవుడు నాభూమియు నిప్పుడేమైపోయినవో!

రాజకీయఖైదీలు కొందరు ఇతరఖైదీలకు బట్టలు మొదలగు
న విచ్చి, వారిచే చాకిరిచేయించుకొనుచుండిరి. అందొకనితో
ఏదో తగాదా వచ్చినందున రాజకీయఖైదీ వానిని కొట్టుట సంభ
వించెను. జయి లధికారులు రాజకీయఖైదీమీద కేసు దాఖలు
చేయించి, విచారణకు తెచ్చిరి. ఫిర్యాదీని కొట్టుచుండగా అడ్డము
పోయిన మరియొక రాజకీయఖైదీ సాక్ష్యముగా వేసుకొనబడెను.
ఈసాక్షి తా నేమియు నెరుగనని చెప్పి తనస్నేహితుని నేరమును
తప్పించవలెనని నిశ్చయించుకొనెను. రాజకీయఖైదీ విడిఖైదీని
కొట్టినమాట నిజమని అందరు నెరిగినదే. తాను సత్యాగ్రహియై
యుండి, మరియొకని కొట్టుట తగదని అందరు నాక్షేపించుచుండిరి.
దానికి దోడుగా మరొక సత్యాగ్రహి ఆనేరమును కప్పిపుచ్చుట
అంతకంటె దోష మనిరి. కాని ఆసాక్షి అసత్యమాడ నిశ్చ
యించుకొనెను. వాయిదా సమీపించెను. సాక్షియు, ముద్దా
యియు దాక్షిణాత్యులే. ముద్దాయియే నేరము నొప్పికొనఁలసి
యుండెను. కొట్టినమాట నిజమని సాక్షియు చెప్పనలసియుండెను.
అట్లుచేయక యిరువురును అన్యాయమునకు దిగుట మాకందరకు
న్యాయవిరుద్ధమును, అప్రతిష్ఠాకరము నని తోచెను. సత్యము
వచింపకున్నచో నేను ఉపవాసదీక్ష సాగింతునని తెలిపితిని. నా
దీక్ష రెండురోజులు సాగునప్పటికి జయిలులో సంచలనము చెల
రేగెను. రాజకీయఖైదీలందరును ఆయిరువురిని తీవ్రముగ నిందింప
సాగిరి. యాకూబ్ హుస్సేనుగారుకూడ ఇందు ప్రవేశము కలుగ
చేసుకొని ఒకసభ గావించి, ఆ యిరువురిచర్యను ఖండించి,
నన్నుగురించి ఆదుర్దా వెలిబుచ్చెను. మూడవనాటి ఉదయమున
ఖైదీ లిరువురును సత్యమునే పలికెదమని వాగ్దానము చేసినందున

నేను ఉపవాసదీక్ష ఉపసంహరించుకొంటిని. ముద్దాయి నేరము నొప్పికొన్నమీఁదట కొంత శిక్షను విధించి, అతనిని మరియొక జయిలుకు మార్చివేసిరి.

ఇంతలో గాంధిగారినిగూడ పట్టుకొని శిక్షవిధించిరని వెలియవచ్చెను. ఆ విచారణ జగత్ప్రసిద్ధి గాంచెను. అది జీససు క్రీస్తుకు పైలట్ అను రోమన్ అధికారి శిక్షవిధించుటను పోలి యున్నదని కొందరు, "గాంధీజీని గాదు, సత్యదేవతనే బ-ధించి" రని కొందరు నిందించిరి. గాంధిజీ తాను అపరాధినని అంగీకరించి శిక్షాస్మృతి ననుసరించి ఎంతశిక్ష విధించవలెనో అంతశిక్షయు పూర్ణముగా విధింపుడని న్యాయమూర్తితో వక్కాణించెను. ఆరుసంవత్సరములు విడిఖైదును విధించి, వారిని ఎరవాడ జయిలునం చుంచిరి.

శారదానికేతనము.

వేటపాలెములో శారదానికేతన ప్రతిష్ఠ సాగకయే పోయెను. బంగాళాను, స్థలమును నొక పాఠశాలనిమిత్త మిచ్చి తినేగాని వాని మరమ్మతులభారము నామీఁదనే పడుచుండెను. రెండుమూడు గృహములు చెదలుబట్టి కూలిపోయెను. తోట లోని చెట్లపోషణకు తోటమాలిని బెట్టి జీతమిచ్చుటతప్ప చెట్ల వలన వచ్చెడిఫలము లేదయ్యెను. మామిడిచెట్లు కొన్ని కాయు చున్నను ఎప్పుడో యొకప్పుడు తోటమాలికి సరదాతోచినప్పుడు

పండ్లు మా కందిచ్చుటకై వేటపాలెమునుండి గుంటూరుకు వచ్చుచుండుటచే రాకపోకల ఖర్చులు తగులుబడి అగుచుండెను. వేటపాలెపుటాస్తి యిట్లు గొప్పభారముగా పరిణమించెను. ఇల్లు కట్టునప్పుడు సుమారు రెండువేలకు పైగా ఇతరులయొద్ద అప్పుగా బెచ్చితిని. ఇదిగాక నాచిన్నతమ్మునికి రెండువేలరూపాయలవరకు నేనీయవలసియుండెను. ఇంతలో సహాయనిరాకరణోద్యమములో నిమగ్నుడ నగుటయు, ఆరోగ్యముచెడుటయు సంభవించెను.

వేటపాలెముకాపురస్థుడు బండ్ల బాపయ్య అనుతడు ఋణములపాలై గంగూను కేగి, అక్కడ వర్తకము సాగించి, చాలద్రవ్యము సంపాదించి, మరల స్వగ్రామముచేరి, ఋణదాతలను పిలిచి, లిమిటేషనుపట్టిన బాకీ లన్నియు చెల్లించి, వారికి భోజనములు పెట్టి, వస్త్రములిచ్చి, పూజించి ధర్మాత్ముడని పేరు పొందెను. ఆయన ఆయూరిలోని పాఠశాలకు ద్రవ్యమిచ్చి పోషించుచుండెను. ఆపాఠశాలనిమిత్తము భవనము లేనందున కొన్ని సంవత్సరములనుండి నాబంగాళాలోనే పాఠశాల జరుపుచుండెను. తదుపరి పాఠశాలకు వేరొకచోట భవనమును కట్టించెను. నాబంగళాలను కొని, వైద్యశాలకు వినియోగించవలెనని యుద్దేశించుకొనెను. వైద్యశాల గవర్నమెంటువారిది. దానికి భవనము లేదుగాన దాని కిచ్చి, అద్దె వసూలుచేయవలెనని ఆయన యుద్దేశించుకొనెనట. అచట తోట శేషాద్రి నాయుడుగా రను మిత్రుడు నాగృహాదికమును బండ్ల బాపయ్యగారి కమ్మవలసినదని ప్రోత్సహించెను. ఆవిధముగా గ్రామములో వైద్యసహాయము ఏర్పడునుగాన ఆసత్కార్యమునకు మీరును

ఒకరీతిసహాయము చేసినవారగుదు రనెను. నా శారదానికేతన సంకల్ప మీడేరుమార్గము ఎట్లును గోచరింపనందున నేనును చేయునదిలేక బాపయ్యగారికి ఎనిమిదివేలరూపాయలకు అమ్మ కము చేసితిని.

నేను కడలూరుజయిలులో నుండగనే శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారును ఆయనభార్య లక్ష్మీబాయమ్మ గారును కలసి గుంటూరులోనే శారదానికేతనము స్థాపించినా రనియు, దానికి నన్ను అధ్యక్షునిగా నియమించిరనియు తెలియ వచ్చెను. నాకు లక్షిరూపాయలు ప్రోగుచేసి, ఎప్పటికైన శారదా నికేతనము స్థాపించవలెనను అపేక్ష వదలలేకుగాని గుంటూరు లోనే అది ప్రారంభించబడినదనుటతో నాఆశ నిరాశ యయ్యెను. నేను విడుదలయగువరకైనను వారు నిల్వక, సంస్థను ప్రారంభించి నందుకు నగచితిని. కాని, నేను చేయలేనిదానిని వారు చేయ సాహసించిరిగదా యని కొంత మనస్సున సమాధానముపొందితిని. విడుదలయై వచ్చినపిమ్మట అంతవరకు నేను వేయించుకొని వచ్చిన చందాలజాబితా వారికే ఇచ్చివేసితిని. కొన్ని చందాలు వారే జమచేసిరి. శారదానికేతనము ప్రారంభోత్సవము నాడు సభకు నాభార్యను అధ్యక్షురాలుగా కూర్చుండబెట్టిరట. ఆసంస్థకు కొన్నిసంవత్సరములు నేనే అధ్యక్షుడుగా నుంటిని. పిమ్మట శ్రీ మునగాల జమీందారుగారు అధ్యక్షులైరి. నన్ను ఉపాధ్యక్షునిగా నెంచుకొనిరి. శ్రీ రాజాగారు నేను ప్రారంభించిన చందాలజాబితాలో నాలుగువేలరూపాయల నిచ్చుటకు సమ్మ తించి, వారిపేరు జాబితాలో వ్రాసిరి. ఆప్రకారము సొమ్ము నేను వసూలుచేయలేదుగనుక ఆమొత్తము గుంటూరు శారదా

నికేతనమున కిచ్చుటకు వారు సమ్మతించిరి. కాని కొన్ని సంవత్సరములవరకు వా రాసొమ్ము నీయరైరి. వారికి గుంటూరులో మాయింటియొద్దనే రెండుయకరముల స్థల ముండెను. దానిని నాలుగువేలచందాక్రింద యిచ్చివేయుదుమనుచు చెప్పిరి అదియును దస్తావేజువ్రాసి పూర్తిచేయలేదు. ఒకసారి శ్రీ లక్ష్మీనారాయణగారే శ్రీ రాజాగారియొద్దకు వెళ్ళి, దస్తావేజు వ్రాయించితెచ్చెదమని చెప్పిరి. అందుకు నేను సమ్మతించితిని. ఆదస్తావేజు లక్ష్మీనారాయణగారు నాకు చూపరైరి. కారణము నాకు తెలియలేదు. రాజాగారి స్థలములో పూరిపాకలు వేసి, చుట్టును ప్రహరీగోడ కట్టించుకొని, నడుపుకొనుచు కొంతమూల ధనము చేకూరినపిదప స్థిరనిర్మాణము లేర్పరచుట యుక్తమని నేను చెప్పితిని. స్థిరనిర్మాణముకొరకు శ్రీ లక్ష్మీనారాయణ గారును, వారి సతీమణియు పూనుకొనిరి. సంస్థయొక్క ఆదాయ వ్యయముల వివరములు నాకుగాని తెక్కన కార్యనిర్వాహక సభ్యులకుగాని తెలుపకుండుట సంభవించెను. ఇందువలన వారితో నాకు సమాధానము కుదరక నేను నా అధ్యక్షపదవిని వదలుకొంటిని. కాని ఆసంస్థయందు అభిమానము మానలేదు.

నేను కడలూరిజయిలులో నున్నప్పుడే నా రెండవఅల్లుడు కలకత్తాలో చదువుచుండగా జబ్బుచేయుటచే నతడు గుంటూరు చేరినట్లును, ఆవ్యాధి క్షయసంబంధమని తేలినదనియు అతని తండ్రిగారి నిర్లక్ష్యముచే సరియైన చికిత్సయు, నితర సౌకర్యములు లేకున్నవనియు, మాయింటికి తీసికొనివెళ్ళనలెనని నా భార్య ప్రయత్నించినను సమ్మతించకపోయె ననియు తుద కా

కుఱువాడే తన ప్రక్కచుట్టను చేత దీసికొని, నాభార్యతో బండి యెక్కి, మాయింటికి వచ్చెనని యు తెలిసినది. డాక్టరు కుగ్లరు మాకుటుంబమునకు స్నేహితురాలగుటచే మదనపల్లి వైద్యశాలాధికారులకు వ్రాసి ప్రయత్నముచేయుగా నాభార్య అక్కడికి తీసికొనివెళ్ళి, బస ఏర్పరచి, చికిత్సలోఉంచెనట. నాకుమార్తె పార్వతియును అప్పుడప్పుడు జ్వరపడి నీరసించుచుండెను. తనభర్తను మదనపల్లి తీసుకొనివెళ్ళునప్పుడు తా నింట నొంటరిగనుండలేక కాబోలును, వారితోగూడ మదనపల్లి వెళ్ళెను. అక్కడ మరల జ్వరమువచ్చి బాధపడుచున్నందున ఆమెను తీసుకొని యింటికి వచ్చి నాభార్య అచిన్నవాని అమ్మమ్మ నాతనిదగ్గర నుండునట్లు ఏర్పాటుచేసి పంపించెను. నాకుమార్తెకు కుగ్లరుగారి ఆసుపత్రిలో చికిత్సచేయించుచుండెను.

నేను కడలూరుజయిలునుండి విడుదలపొంది, వచ్చినపుడు ఆయూరివారు నన్ను గొప్పగా సన్మానించిరి. పౌరమహాసభ సమావేశపరచి, ఉపన్యాసములు గావించిరి. ఊరిలో వీథులలోను ఇంటింటికినిగూడ తోరణములుగట్టి దీపములతో అలంకరించి, పురవీథులగుండ నన్ను ఉత్సవముతో గొనిపోయిరి.

అక్కడనుండి ఇంటికి రాక, దక్షిణదేశమున సంచారము చేసి, ముఖ్యపట్టణములలో కాంగ్రెసు ఉద్యమమునుగూర్చి ఆంగ్లేయములోనే ఉపన్యాసములిచ్చుచు ప్రచారముచేసితిని. ఆ సంచారములో పంతులయ్యరుతోను, డాక్టరు రాజన్‌గారితోను వెంకటామయ్యగారితోను, ఏ. వి. అయ్యర్‌గారితోను పరిచయముకల్గెను. కల్లాడికురిచిలో ఏ. వి. అయ్యరుగారు ఆశ్రమ

మును స్థాపించి, గాంధితత్త్వమున కాచరణప్రచారములు సమ
కూర్చుచుండిరి. ఆయనతోడి సంభాషణయు చెలిమియు నా
కెంతయు ఆనందమును కల్పించెను. ఆయునను మహాదాశయుడని
భావించితిని. తిరునల్వేలిలో సాధు వరదరాజం పంతులుగారితో
సంభాషించుట కలిగెను. ఈయన తెలుగువారు. న్యాయ
వాదులు. ఆంధ్రులయందును, ఆంధ్రభాషయందును మిక్కిలి
ప్రేమగలవారు. ఈసంచారములో శ్రీరంగనాథస్వామిని
దర్శించితిని. అర్చకులు మిక్కిలి ప్రేమతో నాకు సదుపాయ
ములు కల్పించుటచే గర్భగుడిలోపలికి పోయి, స్వామిని సాన్ని
ధ్యమున సేవించగల్గితిని. ఆరీతిగనే చిదంబరము, మధుర, కాంచీ
పురము మొదలగు దేవస్థానము లన్నిటిలో అర్చకులు మిక్కిలి
ఆదరము చూపిరి.

జయిలులో నున్నపుడు మా తలిదండ్రుల కాబ్దికములు
పెట్టలేదుగాన మాయవరములో మాకు దూరపుచుట్టమైన
లింగమగుంటవా రింటిలో ఆ రెండుకార్యములు జరిపితిని.
మొదటిరోజున దక్షిణామిత్తము చాలమంది బ్రాహ్మణులు
వచ్చిరి. కాని, ఆసాయంకాలమున సభలో అస్పృశ్యతానివార
ణనుగూర్చి ఉపన్యసించినందున రెండవరోజు బ్రాహ్మణులు
దక్షిణలకు రాలేదు.

నేను గుంటూరు వచ్చిననాడు ఆంధ్రరాష్ట్రికాంగ్రెసు
సంఘమువారు గుంటూరులో సమావేశమగుటకు ఏర్పరచుకొని,
నన్ను సన్మానించుటకు సభ కావించిరి. అదియే పౌరసభగా మారి
నది. నేను రైలు దిగునప్పటికి పురప్రముఖులు స్టేషనుదగ్గరకు వచ్చి,

నన్ను సత్కరించి, ఊరిలో ఉత్సవముతో తీసికొనివెళ్ళి మా యింటియొద్ద దింపిరి. పౌరసభ సాయంకాలము జరిగెను. రాగి రేకుమీద సన్మానపత్రము లిఖించి, నాకు దాని నొసంగి, గౌరవించిరి.

రోగితో సంచారము.

నా కుమార్తె పార్వతికి కుగ్లరుగారి ఆసుపత్రిలో చికిత్సచే కొంచెము మేలుగనే యుండెను. నేను వచ్చిననా డామె నింటికి గొనివచ్చి, తలంటి, స్నానముచేయించుటలో భృంగా మలకతైలను మాడుమీద గట్టిగా నంటిరట. ఆసాయంకాలమే దగ్గుట మొదలుపెట్టినది. నే నింటికి చేరునప్పటికి దగ్గు ఊపిరి సల్పుటకైన వ్యవధిలేకుండ అతితీవ్రముగ బాధించుచుండెను. ఆనాడు డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు మా యింటనే యుండుటచే పిల్లబాధ చూచి, చాల విభ్రాంతిచెందిరి. ఇంతకాలము ఇట్లు వదలియుండిన నాకు ఇంటికి వచ్చినతోడనే బిడ్డపడుచున్న బాధను చూచుట చాల కష్టముగ నుండెను. కుగ్లరుగారిని సంప్రదించగా క్షయవ్యాధిచిహ్నములు కనుపడు చున్నవిగావున వెంటనే మదనపల్లి తీసికొనివెళ్ళవలసినదని సలహా నిచ్చి, మదనపల్లి చికిత్సాలయాధికారులకు బసయొకటి ఏర్పరచ వలసినదని ఉత్తరమువ్రాసిరి. మార్గాంతరములేక మదనపల్లికి ఆమెను తీసికొని నేనును నాభార్యయు నాపెద్దకుమార్తెయును బయలుదేరితిమి. మదనపల్లిలో నాబిడ్డను పరీక్షించి, డాక్టరుగారు

క్షీయసంబంధమైన చిహ్నము లేవియు కనుబడుటలేదుగనుక పిల్లను తీసికొనివెళ్ళవలసినదని చెప్పిరి. ఆవైద్యశాలలోనే మరియొకడాక్టరు క్షీయవ్యాధిచిహ్నములు కొన్ని కలవని అభిప్రాయపడినట్లు నాకు తెలిసినది. నే నంతట పెదడాక్టరుగారితో, "ఇదివేసవి. ఏజాడ్యముతో నైననేమి బాధపడుచున్న చిన్నదాని నింత దూరము తీసికొనివచ్చుటయే కష్టము మరల వెంటనే తీసికొని పొమ్మన్నచో మేము వెంటనే పోజాలము. మాకు ఏర్పరచిన బంగళాలోనే యుండి, అద్దె యిచ్చుచుందుము. ఏదియైన మీకు తోచినమందు ఇచ్చి, సహాయముచేయుడు. డాక్టరు కుగ్లరుగారు సలహాయిచ్చినందున వచ్చితి"మని బహుదూరము చెప్పినమీదట వారు సమ్మతించిరి. ఇట్లు అల్లుడును, కుమార్తెయునుగూడ మదనపల్లిలో రోగులుగానుండుటయు, వారి పోషణనిమిత్తము మేము సంసారముతో నుండుటయు తటస్థించినది. అల్లునకు జాడ్యము బలముగనేయుండెను. దగ్గుమాత్రమే గాక ఊపిరి తిత్తులలో నీరుగూడ ప్రవేశించెను. నాఅల్లుడును, అతని ముత్తన తల్లిగారు నొకయింటిలోను, నేను, నా సంసారము మరియొక యింటిలోను కాపురముంటిమి. మదనపల్లి చేర్చినతర్వాత అల్లుని ఖర్చులు అతని తండ్రిగారే పంపుచుండిరి. అంతవరకు శ్రద్ధ వహించినందుకు సంతసించితిమి.

నా కుమార్తెను వేసవికాలము గడచువరకు అచటనే యుంచి, ఏవియో మందు లిప్పించుచు పెద్దడాక్టరుగారు క్షీయ కాదని చెప్పినందున మనస్సునకు ధైర్యముతోచినను దగ్గుబాధ ఏమాత్రమును తగ్గకుండుటకు వ్యాకులమునొందుచు, ఈ పిల్ల

సితి యిట్లుండుటయు, అల్లునిసితి అట్లుండుటయు, మేనుందరము వీరితోనుండి కష్టములపాలగుచుండుటయు, నా జీవితమున నది కష్టకాలముగ పరిణమించినది. ద్రవ్యము మాత్రము సంపాదింప బడి యున్నది గనుక అవసరములను బట్టి విరివిగ వ్యయపెట్టుట తటస్థించినది.

మేము వేసవి యెండలు తగ్గినపిమ్మట నా కుమార్తెను తీసుకొని చెన్నపట్టణమునకుబోయి, చెన్నాప్రగడ భానుమూర్తి గారి యింటిలో పరివేశించితిమి. క్షయ వ్యాధి యేమో యను సంశయము గలిగిన పిల్లతో వారియింట చేరుట సాహసమే గాని వారికి నాకుగల స్నేహముచే స్వతంత్రించి, వారిసహాయ్యము నపేక్షించితిని. వారును ప్రేమాతిశయముచే మా పిల్లకు అవకాశములు కల్పించిరి. వారికి మిక్కిలి యిరుకుగ నున్నను మాకు సదుపాయము లేర్పరచిరి. భానుమూర్తిగారి కుమారుడు మెడికల్ కళాశాలలో విద్యార్థిగానుండెను. ఇతనిద్వారా డాక్టరు గురుస్వామిగారికి మాఅమ్మాయిని చూపించితిమి. ఆయన పరీక్షించి ఔషధ మిచ్చుటకు ప్రారంభించెను. మాసమురోజులు ఔషధసేవ చేసినను ప్రయోజనము లేకపోయెను. గురుస్వామి గారును పిల్లను గుంటూరులో నిర్మలమైన వాతావరణములో నుంచుట మేలని సలహాయిచ్చిరి. మలబారువైద్యులు తయారు చేయు ఘృతము నిచ్చుచుండవలసినదని చెప్పి, కాలముచెంట నయముకావచ్చునని ఓదార్పువచనము పల్కిరి.

ఔషధము లేవియు నుపయోగించనందున నెల్లూరులో డిప్యూటీకలెక్టరుద్యోగముచేసి, పెన్షనుపుచ్చుకొన్న శ్రీ ఆది

నారాయణగారు అనునొకరు దివ్యజ్ఞానసమాజసభ్యులు మంత్ర
మూలవలన రోగములను నివారణచేయుచున్నట్లు విని, మేము
మాఅమ్మాయి నటకు తీసుకొనివెళ్ళితిమి. అక్కడ శ్రీ రాయసం
వెంకటశివుడుగారు వెంకటగిరివారి కళాశాలలో ప్రధానోపాధ్యా
యులుగా నున్నందున వారియింటిలో ప్రవేశించితిమి. భాను
మూర్తిగారివలెనే వారును వారిభార్య వెంకటరత్నమ్మగారును
మాయందు అత్యంతసానుభూతితో సౌకర్యము లన్నియు వారి
యింట నేర్పరిచిరి. శ్రీ ఆదినారాయణగారు ప్రతిదినమును వచ్చి
పిల్లదగ్గర కూర్చుండి, ముఖముమీద చేతులు విన్యాసములుచేసి,
తీరమునిచ్చి, రోగనివారణచేయ ప్రయత్నించిరిగాని, ఇందువల
నను ప్రయోజనము లేకపోయెను.

ఇట్లు నెల్లూరులో నెలరోజులు గడపినపిమ్మట నిరాశ
చేసుకొని, గుంటూరు చేరితిమి. పిల్ల చాల కృశించినది. మీదు
మిక్కిలి చేతులు మొగము మంటలని తడిగుడ్డలతో రాత్రిం
బవళ్ళు కప్పుకొనుచుండెను. నిద్రయనునది లేదు. ఆహారము
మిక్కిలి స్వల్పము. బ్రతుకునను ఆశ లేకుండెను. గురుస్వామి
గారు చెప్పినభృతము తెప్పించి యిచ్చుచుంటిమిగాని దానివలన
నేమియు మేలు కనుపడలేదు.

నేను నెల్లూరులో నుండగనే శ్రీ దుగ్గిరాల గోపాల
కృష్ణయ్యగారు నాయొద్దకు వచ్చి, బొంబాయిలో సమావేశ
మైన అఖిలభారత కాంగ్రెసుసంఘము అధ్యక్షులగు శ్రీ సి. ఆర్.
దాసుగారు రాజీనామా నిచ్చినందున నన్ను వారిస్థానే అధ్యక్షు
నిగా ఎన్నుకొనిరని అతీర్మానము తెచ్చి, నాకు చూపి, దాని

నంగీకరించవలసినదని కోరిరి. నేను దాని నంగీకరించుటకు సంశ
యించితిని. తానే కార్యదర్శిగా నియమింపబడినట్లు చెప్పుచు
ననున్ను తప్పక అంగీకరించవలసినదని ఆయన బలవంతపర చెను.
నేను ఆలోచించి చెప్పెదనని వారిని పంపివేసితిని. శ్రీ భోగరాజు
పట్టాభిసీతారామయ్యగారికిని మరి యితరులకుగూడ ఉత్తరములు
వ్రాసి వారి అభిప్రాయములు తెలుసుకొని, పిమ్మట నిర్ణయించు
కొనవచ్చునని తలచితిని. కాని, ఎవ్వరికి వ్రాసినను మీాయిష్టము
వచ్చినట్లు చేయుడందురేగాని నిష్కర్షగా చెప్పెడివారుండరని
మరల యోచించుకొని అదివరకు అఖిలభారత కార్యనిర్వాహక
సంఘములో సభ్యుడనుగా నుంటినిగాన నన్ను ఆసంఘమున
కధ్యక్షునిగ నెన్నుకొనుటలో విశేషములేదని తలచి, నా అంగీ
కారమును రెండవరోజుననో, మూడవరోజుననో తెల్పితిని.
నూతనాధిపత్యము వచ్చినందుకు సంతోషము లేకపోలేదుగాని
ఆపదవికి తగినకార్యముల నెట్లు నెరవేర్చగలుగుదునో యను
జంకుమాత్రము కొంత బాధించుచుండెను. కార్యనిర్వాహక
సభ్యు లందరు అదివరకు పరిచితులగుటచేతను వారితో కలసి
వ్యవహారములు చర్చించుట అభ్యాసపడినదియే యగుటచేతను
అధ్యక్షపదవి నిర్వహించుట దుర్ఘటముగ గాన్పించలేదు.

గాంధీమహాత్ములు చెరసాలలోనే యుండిరి. మహామ్మ
దాలీ విడుదలపొందెను. సరోజినీదేవి, రాజగోపాలచారి, వల్లభ
భాయిపటేలు, గంగాధరదేశపాండ్య మొదలగువారు. కార్య
నిర్వాహకసభ్యులు అప్పుడే జయిళ్ళనుండి విడుదలయై వచ్చిరి.
శ్రీ లజపతిరాయిగారును విడిగానే యుండిరి. వీ రందరును

V.R. NAVA MEMORIAL LIBRARY

అంతకు బూర్వమునుండియు స్నేహముతో మెలగుచుండినవారే గాన వీరిలో నధ్యక్షుడుగా నుండుట క్రొత్తపనిగా తోచలేదు. అప్పుడప్పుడు అఖిలభారత కాంగ్రెసుసంఘ సభలలో అధ్యక్షులు నన్ను తాత్కాలికమున వారిస్థానమున గూర్చుండబెట్టిపోవుటయు గద్దు. కావున ఆవిషయమై కొంత అభ్యాస మేర్పడియుండెను.

కాంగ్రెసుపీఠాధిపత్యము.

శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు అఖిలభారత కాంగ్రెసుసంఘ ప్రధానకార్యదర్శిగా నాతోకలసి పనిచేయవలసి యుండెను. ఆయన సాధారణముగ తనకు తోచినట్లు చేయు స్వభావము కలవాడు. ఇతరులు చెప్పినట్లు నడచుకొనువాడు కాడు. కాంగ్రెసుకార్యస్థానము గుంటూరులో నుండినయెడల పనులుజరుపుటకు సుకరముగానుండునని నేను చెప్పినప్పటికి నా మాట సరకుచేయక బెజవాడలో ఒకయిల్లు అద్దెకుతీసికొని, అచ్చట కార్యస్థానము స్థాపించెను. మరియొక ముఖ్యవిషయమున ఆయనచర్య విపరీతపరిస్థితిని కల్పించెను. నేను అధ్యక్షతను స్వీకరించుటకుమునుపే బంగాళములో కాంగ్రెసుసంఘ ఎన్నికల విషయమై తగాదా ఒకటి ఏర్పడెను. అందులో నొకపక్షమునకు శ్రీ సి. ఆర్, దాసుగారు ముఖ్యులు. రెండవపక్షమునకు బెనర్జీ యనువారు ముఖ్యులు. వీరిద్దరును మిక్కిలి పట్టుదలకలవారు. ఈతగాదానుగూర్చిన సాక్ష్యమును విచారించి, నివేదికసంపుటకు శ్రీ పండిత మదనమోహనమాలవ్యాగారిని అఖిలభారత కార్య

నిర్వాహకవర్గము కమీషనరుగా నియమించెను. నియామకమును గూర్చి అప్పటి కింకను మాలవీయపండితునకు తెలిపియుండలేదు. కనుక నేను ఆవిషయము త్వరగా తెలుపునిమిత్తము నేనే చెప్పి శ్రీ గోపాలకృష్ణయ్యగారిచే తంతివార్త వ్రాయించి, దాని నంపు డని వారితోచెప్పితిని. ఆయన కమీషనరుగా నియమించినట్లు వ్రాయుటకుబదులు విచారించి తీర్పుచెప్పుటకు మధ్యవర్తిగా నియమించినట్లు వ్రాసి ఆతంతివార్తను మాలవీయగారికిపంపెను. వా రుభయపక్షముల సాక్ష్యులను విచారించి తీర్పువ్రాసిపంపిరి. ఆతీర్పు శ్రీ సి. ఆర్. దాసుగారి పక్షమునకు వ్యతిరేకముగా నుండెను. అందువలన అది యొకపెద్దసమస్యగా పరిణమించెను.

ఇది ఇట్లుండ స్వరాజ్యపార్టీ దేశమున ప్రబలసాగెను. దానికి శ్రీ సి. ఆర్. దాసుగారు ముఖ్యనాయకుడు. మోతీలాల్ నెహ్రూ, విఠల్‌భాయిపటేలు మొదలగువారును ఆపక్షమున చేరిరి. దానిలో చేరనివారిని "నోఛేంజి" పార్టీ అని పిలుచు చుండిరి. ఈపక్షములో వల్లభభాయిపటేలు, సి. ఆర్. దాసు, గంగాధరదేశపాండ్య మొదలగువారు చేరియుండిరి. శ్రీ రాజేంద్ర బాబుగూడ నిందు చేరినవారే. గాంధిమహాత్ముడు ఆసమయ మున నింకను జయిలులోనే యుండిరికాన ఆయన విడుదలగాక ముందే సహాయనిరాకరణోద్యమతీరుమానమునకు భంగముగా కాంగ్రెసువాదులు శాసనసభలలో ప్రవేశించవలెనను వాదమును ప్రచారముచేయుట వారికి సరిపడకుండెను. ఆంధ్రులలో పలువురు గాంధిమహాత్ముని సిద్ధాంతమునందే విశ్వాసముకలవారగుటచే నోఛేంజర్లుగనే యుండిరి. కాని గోపాలకృష్ణయ్యగారును, శ్రీ

టంగుటూరి ప్రకాశముపంతులుగారును, మరికొందరును స్వరాజ్య పార్టీపక్షమునే వహించి, ప్రవర్తించుచుండిరి. నేను నోఛేంజరు గనే యుంటిని. స్వరాజ్యపక్షమువారు అసహాయోద్యమము నిరర్థకమైనది గనుక శాసనసభలలో ప్రవేశించి స్వరాజ్యము సాధించనచ్చునని వాదించుచు, గాంధిజీయే జెయిలువెలుపల నుండినయెడల నిందుకు సమ్మతించియుందురు అని చెప్పుచుండిరి.

స్వరాజ్యోద్యమము సాగించునిమిత్తమే శ్రీ సి. ఆర్. దాసుగారు కాంగ్రెసుఅధ్యక్షపదవికి రాజీనామా నిచ్చియుండిరి. ఆవిషయము చర్చించి శాసనసభాప్రవేశము ఆమోదించుటకు ప్రత్యేక కాంగ్రెసుమహాసభ సమావేశపరచవలెననియు, ముందుగా అఖిలభారత కాంగ్రెసుసంఘసభ సమావేశపరచనలసినదనియు నన్ను కోరుచు కొందరు స్వరాజ్యవాదులు ఉత్తరములను పంపిరి. కనుక అఖిలభారత కాంగ్రెసుసంఘసభ కూర్చనలసివచ్చినది. దానిని ఆంధ్రదేశమునందే సమావేశపరచనలసినదని మన ఆంధ్ర నాయకులు పట్టుపట్టిరి. వాల్తేరులో కొందరు అభిముఖులై తగిన ఏర్పాటులన్నియు చేయుటకు పూనుకొనినందున వాల్తేరులో సభజరుపుటకు నిశ్చయించి ప్రకటనగావించితిని. సభకు ఉత్తర ప్రాంతములనుండి వచ్చినవారిలో నెక్కువమంది స్వరాజ్య వాదులు. నోఛేంజర్లలో శ్రీ రాజగోపాలాచారి, శ్రీమతి సరోజినీదేవి మొదలగువారు కొలదిమందిమాత్రమే హాజరైరి. ఆంధ్ర స్వరాజ్యవాదులలో ప్రకాశముపంతులు ముఖ్యులు. గోపాలకృష్ణయ్యగారు ప్రత్యక్షముగా చెప్పకున్నను ఆంతరంగిక ముగ ఆయన స్వరాజ్యపార్టీపక్షమేయని నాకు స్పష్టమయ్యెను.

శ్రీ సి. ఆర్. దాసుగారితో ఉత్తరప్రత్యుత్తరములు రహస్యముగ జరుపుచుండెను. ఒకసారి కలకత్తాకు బోయి, వారితో ముచ్చటించినచ్చెనుగాని ఇది యంతయు గోప్యముగ జరుగుచుండెను. వాల్తేరులో నిట్లు సమావేశమైన సభలో ప్రత్యేక కాంగ్రెసుసభ సమావేశపరచవలెనా లేదా యనువిషయము చర్చించబడెను. సమావేశపరచవలె ననుతీర్మానము రాజగోపాలాచార్యులవారే ప్రవేశపెట్టిరి. సరోజినీదేవి మొదలగువారు ఆతీర్మానమును ఆక్షేపించిరి. తుదకు అధ్యక్షుడనైన నా సమ్మతినిబట్టి తీర్మానము నెగ్గుటయో లేక వీగిపోవుటయో తేలవలసిన స్థితి యేర్పడినది. ఇది నాకు గొప్ప ధర్మసంకటమగుటేగాక కార్యనిర్వాహక సంఘములో నాకు తోడుగనున్న రాజగోపాలాచార్యులు, దేశపాండ్య, సరోజనీదేవి వల్లభభాయిగార్లు స్వరాజ్యపక్షమునకు వ్యతిరేకులు. చివరకు నా సమ్మతికై సభ్యులందరు ఆతురతతో నెదురుచూచుచుండిరి. దీర్ఘముగ నాలోచించుకొనుటకుగాని, మిత్రులతో సంప్రతించుటకుగాని వ్యవధానము లేదు. నాలోనేనే ధైర్యముతో స్వతంత్రబుద్ధివహించి, స్వరాజ్యవాదుల కవకాశమిచ్చుట ధర్మమని మనసా తలంచి,తీర్మానమును అంగీకరించుచు నా సమ్మతిని తెలిపితిని. స్వరాజ్యవాదులు సంతోషించిరి. నోచ్ఛేంజర్లు నేను తెలివితక్కువగ ప్రవర్తించిఅసహాయోద్యమమునకు ముప్పు కల్గించినట్లే ఊహించిరి. కాని ప్రత్యక్షముగ నేమియు పలుకకుండిరి. నేను స్వరాజ్యపక్షమువాడనుకానని వారికిస్పష్టమే గాని మనోదార్ఢ్యబల్యముచేత గోపాలకృష్ణయ్య మొదలగువారి సలహాకు లోబడితినని వారి భావము.

పిమ్మట సభాసమావేశ మెచ్చట జరుపవలెననువిషయము గూడ నిర్ణయించవలసియుండెను. అది సభవారు నిర్ణయించక ఆ భారము నా పైన బెట్టి, తీరుమానను నట్లే అంగీకరించిరి. నేను అందుకు అంగీకరించక తప్పినదిగాదు. సభ ముగిసిన పిదప ఢిల్లీనుండి వచ్చిన ప్రతినిధులు ఢిల్లీలో సమావేశపరచెదమని ఆహ్వానించిరి గాని అంతదూరమున సమావేశపరచుట పలువురకు ఇష్టముగాకుండెను. ఆ విషయముకూడ వెంటనే పరిష్కరించ వలసివచ్చెను. బొంబాయిలో ఏర్పరచుట యుక్తమని కొంత యూహా పొడమెనుగాని సరోజినీదేవి వలనుపడదని కోపదృష్టితో వాక్రుచ్చినది. ఢిల్లీవారు తప్ప మరెవ్వరు నిష్టపడకుండిరి. వెంటనే తమ ఆహ్వానము నంగీకరించిననేగాని తమకు తగిన అవకాశ ముండదని తొందరించిరి. తుదకు ఢిల్లీవారిఆహ్వానము అంగీకరించి ఆ విషయమును సభ్యులందరికి తెలిపితిని.పత్రికలలోఆ విషయము వెంటనే ప్రకటితమయ్యెను. ఢిల్లీప్రాంతములో స్వరాజ్యవాదు లెక్కువగా నున్నందున ఢిల్లీసభలో వారే ఎక్కువగా సమావేశ మగుదురుగాన స్వరాజ్యపక్షమునకు జయము చేకూరు ననుఅభిప్రాయము నోచ్ఛేంజర్లకు కలిగినది. స్వరాజ్యవాదులు సంతోషించిరి.ఢిల్లీలో సమావేశపరచవలసినదని ప్రకాశముపంతులుగారు గోపాలకృష్ణయ్యగారు మొదలగు ఆంధ్రులుగూడ నన్నుమిక్కిలి తొందరించిరి, కనుక ఈ పరిష్కారము వారికి ఇష్టముగనే యున్నది.

వాల్తేరులో కాంగ్రెసుసభ ముగిసిన పిదప కార్యనిర్వాహకసంఘసభ నాగపూరులో సమావేశము గావించుటయ్యెను.

నాగపూరులోజాతీయ పతాకమును గూర్చిన సత్యాగ్రహము ముమ్మరముగ సాగుచుండెను. నాగపుర మొక మహా త్యాగ భూమిగా నేర్పడెను. జమ్నాలాల్ బజాజ్‌గారుకూడ ఇందు పాల్గొని కారాగారమున నిర్బంధింపబడిరి. కొన్నాళ్ళ యుద్యమమును విఠల్ భాయిపటేలుగారు నడిపిరి. పిమ్మట ఆయన తమ్ముడు వల్లభభాయి పటేలుగారు నడిపించుచుండిరి. కనుకనే ఆయన అఖిలభారత కాంగ్రెసుసభ నిమిత్తము వాల్తేరు రాలేదు. ఆయన నిమిత్తమే కార్యవర్గసభ నాగపూరులో జరుపవలసి వచ్చినది. ఢిల్లీలో ప్రత్యేకమహాసభ జరుపుటకు ఆయనకు బొత్తిగ ఇష్టము లేకుండెను. వాల్తేరులో ఆ నాడే పరిష్కరించక రెండు రోజులు ముందుగా తనతో చెప్పినయెడల బొంబాయిలో సభ ఏర్పాటు చేసి యుందునే ఎందుకు అంత తొందరపడవలసి వచ్చెనని ఆయన నన్ను నిందించెను.

నాగపూరులో జరిగిన కాంగ్రెసు మహాసభ నిమిత్తము ప్రజలవలన వసూలు కాబడిన మొత్తములో కాంగ్రెసు సభా వ్యయములు పోను నిల్వ మొత్తమునకు సరియైన లెక్కగాని, నిల్వసొమ్ముగాని కాంగ్రెసు కార్యదర్శిగారికి పంపరైరి. ఉత్తరములు వ్రాసినను సరియైన ప్రత్యుత్తరములు లేనందున ఆ విషయము విచారించి సొమ్ము రాబట్టుటకు ప్రయత్నించుమని కార్యవర్గము నన్ను కోరుచు తీర్మానించెను. దానికై మరియొక సారి నాగపూరుపోయి, ఆ సభకు ఆహ్వానకార్యదర్శియైన డాక్టరు మూంజీగారిని కలుసుకొంటిని. మూంజీగారు అదివరకు కొంత కాలము కాంగ్రెసు కార్యవర్గములో సభ్యుడుగా నున్నందున

వారి తోనాకు బాగుగ స్నేహ మేర్పడియుండెను. నేను నాగపురికి వెళ్ళినప్పుడు ఆయన పాతబడి, కొంత శిథిలమైన పెద్దయింటిలో కాపురముండెను. ఆ రోజులలో ఆయన పలుకుబడి తక్కువగనే యుండెను. గాంధిగారి అహింసా సిద్ధాంతమునిూద ఆయనకు రానురాను విముఖత్వము ఎక్కువగా నుండుటచేత కాంగ్రెసు వారిలోగూడ ఆయనకు ప్రాధాన్యము లేకుండెను. నేను నాగపూరు కాంగ్రెసు మహాసభా సంబంధమైన సొమ్ములవిషయమై ప్రశ్నించగా,వారు తమ దగ్గర నిల్వ యేమియు లేదనియు కాబట్టి తామియ్యనలసినదేమియు లేదనియు ప్రత్యుత్తరము చెప్పెను. కుర్చీలు, బల్లలు మొదలైన సామానులైన తుదకు అమ్మియుండుగదా ఆ బాపతుసొమ్ము కూడ లేదా అని అడుగగా అది యంతయు కాంగ్రెసు నిమిత్తము చేసిన అప్పుల క్రిందనే ఖర్చుపడినదని చెప్పెను. లెక్క లేమైనవని అడుగగా ఇంతకాలమైన పిమ్మట అవి యిప్పుడెక్కడ నున్నవో తనకు తెలియదని అన్నిటికిని వితండముగనే జవాబులుచెప్పెను. ఆయన ధోరణి చూడగా ఎవ్వరేమనుకొందురోయనుచింతయైననుఆయన మనస్సున నున్నట్లు నాకుకనబడలేదు. చేయునదిలేక నేను నాగపూరు నుండి ఊరకనే తిరిగివచ్చితిని.

ఢిల్లీలో ప్రత్యేక మహాసభ సమావేశమయ్యెను. ఆ సభకు శ్రీ అబుల్‌కలామ్ ఆజాద్‌గారు అధ్యక్షుడుగా నెన్ను కొనబడిరి. ఆయనకు ప్రత్యేకముగ విడిది నేర్పరచిరి. నాకును నాతో వచ్చినవారికిని మరియొక భవనము నిచ్చిరి. శ్రీమోతీలాలు గారికిని శ్రీ దాసుగారికిని మరియొకయింట బస ఏర్పరచిరి. నేను మౌలానా ఆజాద్ గారినిచూడబోతిని.వారుఇంగ్లీషుభాషలో

తమ అధ్యక్షోపన్యాసమును వ్రాసిరి. కాబట్టి దానిని నాకు చూపి, అందు భాషా స్థాలిత్యము లున్నవేమో చూడుడని కోరినందున నేనును దానిని చదివి నాకు తోచిన దిద్దుబాటులు చేయించితిని. వారితో నాకు మొదటి పరిచయమదే.

తొలిదినమున కార్యవర్గ సమావేశము నా బసలోనే జరిగినది. ఈ సభలో కలకత్తాకాంగ్రెసు కమిటీ ఎన్నికల విషయమై శ్రీ పండిత మదనమోహనమాలవీయగారిచ్చిన తీర్పు విషయము విచారణకు రానుండెను. ఆయుదయముననే శ్రీపండిత మోతీలాలు నెహ్రూగారు నా యొద్దకునచ్చి ఆ సమస్యను గురించి హెచ్చరిక చేసిపోయిరి. వారిసంభాషణపలన మాలవీయ గారు చేసిన తీర్పు నిలుపవలెననుద్దేశము బయలు పడెను. కాని పొరబాటు వలన మదనమోహనమాలవీయగారు తాము మధ్యస్థి యను విశ్వాసము కలిగించినందున ఆ తీర్పు ఇచ్చుట సంభవించినది కాబట్టి అది నిలువతగినది కా దనుట స్పష్టమే. ఆ విషయము కార్యవర్గసభలో చర్చకు వచ్చినప్పుడు సరియైన సమాధానము చెప్పలేని పరిస్థితి ఏర్పడినది. గోపాల కృష్ణయ్యగారు చేసిన పొరబాటు అని స్పష్టపరచక తప్పినదికాదు. గోపాలకృష్ణయ్యగారును ఏ వితండవాదమునకును దిగక ఊర కుండుటవలన నేనే కొంత తప్పు నాదికూడ కలదు గాన మీరీ విషయమును కఠినముగా యోచించ వలదని చెప్పినమీదట సభ్యులును మనస్సు కుదుర్చుకొని, తీర్పుమాత్రము చెల్లకూడ దనియు, ఆ తగాదా మరల విచారణకు పెట్టవలసినదనియు, తీర్మానించిరి. ఎట్లయినను సిగ్గుబాటు వ్యవహారముగ నుండి నా మనస్సునకు మిక్కిలి వ్యథ కల్పించినది.

ఆ మధ్యాహ్నమునన్నే అఖిలభారత కాంగ్రెసుకమిటీ సమావేశమైనది. ఆ సభలో నేనే అధ్యక్షుడుగా నుండి కొన్ని సాంకేతికాక్షేపణలు వచ్చినందున వానినిగూర్చి పరిష్కారములు చేయవలసి వచ్చినది. అవి స్వరాజ్యపక్షమువారికి అనుకూలముగ నుండుటచే నో ఛేంజరుపార్టీలో నా స్నేహితులైన పక్షము మొదలగువారికే కోపమువచ్చినది. కలకత్తా కమిటీ ఎన్నికలను గూర్చిన తగాదా పరిష్కరించుటకును ఒక ఉపసంఘము ఏర్పరచ వలసినచ్చినది. ఆ సంఘములో మూలానా మహమ్మదాలీని, హకీమ్ అజమల్ ఖాన్‌గారిని సభ్యులుగా నియమించుచు నన్నును వారితో సభ్యుడుగ జేర్చిరి. నాకు సభ్యత్వము వలదని తిరుగుబాటు చేసితినిగాని మోతీలాలుగారు పట్టుబట్టినందున నేను సమ్మతించ వలసివచ్చెను. అందుపై ఉభయపక్షములవారిని విచారించి వెంటనే తీర్పు చెప్పవలసివచ్చెను. మేము ముగ్గురము విచారణ జరిపితిమి. హకీమ్ అజమల్ ఖాన్‌గారు అస్వస్థులుగానుండిరి. విచారణ అయినపిమ్మట తీర్పువ్రాయు భారము మహమ్మదాలీ గారు నా పై బెట్టిరి. తీర్పు నేను వ్రాసిన మీదట చివర కొన్ని వాక్యములు మహమ్మదాలీగారుచేర్చిరి. ముగ్గురము సంతకములు చేసి, ఉభయ పక్షీనాయకులకు చదివి వినిపించితిమి. తీర్పు దాసు పక్షమునకే అనుకూలముగానుండెను. మాలవీయగారి తీర్పునకిది వ్యతిరేకము. దాసుపక్షమునారు సంతోషించిరిగాని ప్రతికక్షులు దూషించిరని చెప్పవచ్చును.

మరునాడే ప్రత్యేక కాంగ్రెసుమహాసభ సమావేశ మయ్యెను. పై నుడివినట్లు శాసనసభాప్రవేశము ఆవశ్యకమను

తీర్మానము అధిక సంఖ్యాకులచే నంగీకరించబడెను. గాంధి మహాత్మని యభిప్రాయము తెలుసుకొనక వారు సాగించిన అసహాయోద్యమమునకు వ్యతిరేకమైన శాసనసభా ప్రవేశము అంగీకరించవచ్చునా యను శంక పలువురకు తోచెనుగాని మహమ్మదాలీగారు ఎట్టివాడజయిలునుండి ఒకపట్టి (మహాత్ముడు గూడ దీనికి సమ్మతించినారని) తన చెవిలో రహస్యముగ చెప్పి పోయినదని ఛలోక్తిగ పలికెను. ఈ తీర్మానము స్వరాజ్యపార్టికి గొప్పబలము చేకూర్చెను.

ఈ తీర్మానము అంగీకరించబడినతోడనే నోచ్చేంజకు మిత్రులగువల్లభభాయిపటేలు, రాజేంద్రప్రసాదు మొదలగువారు మని మింక కార్యవర్గములో సభ్యత్వము వదలుకొనుట యుక్త మని తలచి, నన్ను అధ్యక్ష పదవికి రాజీనామా నీయవలసినదని దేశపాండ్యగారిద్వారాకబురుపంపిరి. శాసనసభా ప్రవేశము అంగీకరించబడుటకు నా పరితాపమును వెల్లడించుచు, మనము కార్యవర్గముతో సంబంధము వదలివేసినయెడల కాంగ్రెసుకు అప్పటికి నిల్వయున్న సొమ్మస్వరాజ్యపక్షమువారేస్వాధీనపరచుకొని, వారి యిష్టమునచ్చినట్లు ఖర్చు పెట్టెదరుకావున మన మిప్పుడు రాజీనామాలిచ్చుట సరికాదని సమాధానము చెప్పినమీదట వారును ఆ ప్రయత్నమును సంక్షేపించుకొనిరి.

———

కాకినాడ కాంగ్రెసు

1923వ సంవత్సరము డిశంబరునెలలో కాంగ్రెసుమహాసభ కాకినాడలో జరిగెను. ఆంధ్రరాష్ట్రమున కాంగ్రెసు మహాసభ

సమావేశమగుట అదియే ప్రథమము. ఈ సభా సమావేశ భారము తూర్పుగోదావరిజిల్లావారు అందుముఖ్యముగ, కాకినాడ ప్రముఖులు పూనిరి. ఈ ప్రయత్నములో మిక్కిలి శ్రమకోర్చి అత్యుత్సాహముతో శ్రీ బులుసు సాంబమూర్తిగారు అనన్య మగు కృషి సల్పిరి. అప్పటికి కొలది మాసములకు ముందే ఇంటర్ మీడియట్‌కు చదువుచుండిన ఆయన యేక పుత్రుడు చనిపోయెను. దుర్భరమగు ఏకపుత్రశోకము దిగమ్మింగి, యశో వంతముగ మహాసభ జరుపవలెనని దీక్షతో పనిచేసి, మిక్కిలి శ్లాఘాపాత్రు డయ్యెను. మూలానా మహమ్మదాలీగారు అధ్యక్షత వహించిరి. నన్ను ఆహ్వాన సంఘాధ్యక్షుడుగ నియమించిరి. పండిత మోతీలాలు నెహ్రూ, కుమారుడు జవాహరలాల్‌తో గూడ సభకు హాజరయ్యెను. చిత్తరంజనదాస్ మొదలగు బంగాళా స్వరాజ్యవాదులు పలువురును, జమ్నాలాల్ బజాజ్, దేశపాండ్య సేలము విజయరాఘవాచార్యులు, శ్రీమతి కస్తూరిబా, సరోజినీ దేవి మొదలగువా రనేకులు సభకు విచ్చేసిరి.

కాంగ్రెసు మహాసభ ప్రతి సంవత్సరమును సమావేశ మైనచోట్ల పెద్దపందిళ్లో, పాకలో, విశేష వ్యయముతో, నిర్మా ణము గావించుచుండిరి. అందువలన ఏ సంవత్సరమున కా సంవ త్సరము విశేష ద్రవ్యము ఈ తాత్కాలిక గృహనిర్మాణమునకు వ్యయము పెట్టవలసి వచ్చుచుండెను. కాన ఒక్కసారిగ గుడ్డతో పెద్దడేరా నిర్మాణము చేసినయెడల అది కొన్ని సంవత్సరముల పాటు మహాసభకు వినియోగింపవచ్చునని యోచించి బంగాళము నుండి యొక నిర్మాతను రప్పించి, దానిని నిర్మింపజేసితిమి. దీనినే బెల్గామ్‌లో జరిగిన మహాసభకు గొనిపోయిరి.

నేను 1922వ సంవత్సరములో కడలూరులో నిర్బంధితుడనై యున్నకాలమున నా స్థానమున శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులుగారు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీకి అధ్యక్షుడుగా నియమింపబడిరి. నేను మరల జయిలునుంచి వచ్చిన పిమ్మట కాంగ్రెసు మహాసభాసమావేశము ప్రారంభమగుటకు ముందుగనే మరల నన్ను ఆంధ్రరాష్ట్రసుహాసభకు అధ్యక్షునిగా నెన్నుకొనిరి.

కాంగ్రెసు మహాసభ వేదపారాయణముతోడను, మహమ్మదీయ ప్రార్థనలతోడను, వందేమాతరగీతముతోడను, ప్రారంభము కాబడెను. బొంబాయిలో గాంధర్వవిద్యాపీఠము నకు అధ్యక్షుడును సుప్రసిద్ధ గాయకులు నగు విష్ణుదిగంబరులు మంగళగీతములుపాడి సభ్యులను ఆనందసాగరమున ముంచివేసిరి. నేను సన్మానసంఘాధ్యక్షోపన్యాసమును హిందీలోను, తెలుగులోను వ్రాసి, అచ్చువేయించితిని. ఇదియే హిందీలో అధ్యక్షోపన్యాసము వ్రాసి చదువుటకు ప్రథమమగుటచేత ఉత్తరహిందూస్థానమునుండి సభకు వచ్చినవారందరికిని పరమానందము కల్పించెను. ఉత్తరహిందూస్థానమునందు పత్రికలలో సయితము దీనిని విశేషముగ ప్రస్తుతించిరి.

ఈ మహా సభలో స్వరాజ్యవాదులే ప్రబలముగనుండిరి. శ్యామప్రసాదముఖర్జీ మున్నగువారు స్వరాజ్యవాదమును తీవ్రముగ ఖండించిరి. కాని స్వరాజ్యవాదులపక్షమే నెగ్గెను. మహాసభకు ఆంధ్రదేశస్త్రీలు పలువురు ప్రేక్షకులుగవచ్చిరి. మహాసభ నిరుపమానముగ సాగెనని యెల్లరును సంతసించిరి. సాంబమూర్తి

గాను పుత్రశోకమును లక్ష్యముసేయక మహాసభాకార్యములందు నిమగ్నుడై కృషి సల్పినందుకు శ్రీమతి సరోజినీదేవి ఆయనను ప్రస్తుతించెను. దాక్షిణాత్యులు బుద్ధిసూక్ష్మతయందు ప్రసిద్ధులనియు, ఆంధ్రులు హృదయపరిపాకమున శ్రేష్ఠులనియు, నామె ప్రసంగించెను. అప్పటికి ఆంధ్రులు స్వతంత్రులు, సమర్థులునగు ప్రత్యేకోపజాతి యను విషయము భారతదేశమున నెల్లరకు తెల్లమయ్యెను.

ఆ సమయమునలో మహాత్మాగాంధి ఎఱవాడజయిలులోనుండెను. అచ్చట నుండగనే అప్పెండిసైటిస్ అను నొక యుపద్రవకరమైన వ్యాధి యేర్పడుటచే శస్త్రచికిత్స చేయవలసి వచ్చినది. ఈ శస్త్రచికిత్స జరిగిన కొలది దినములకు నేను మహాత్మాజీ దర్శనార్థము పునహా ఆస్పత్రికి వెళ్ళితిని. మహాత్మాజీ నన్ను చూచుటతోడనే అసాధ్యమైన కార్యము జరిపివచ్చితిరా యని నన్ను ప్రశ్నించెను. హిందీలో నేను సన్మానాధ్యక్షోపన్యాసము వ్రాసి చదువుటయే ఆ ఘనకార్యము. పిమ్మట కొన్ని ప్రశ్నలు నడచినవి. మీరు మహోపద్రవమునుండి పరమేశ్వరానుగ్రహమునలన తప్పించుకొనుట భారతదేశ భాగ్యమని హిందీలోనే వారి నభినందించితిని. వారు సంతసించిరి. శ్రీమతి కస్తూరిబా కూడ అక్కడనే యుండి నా యోగక్షేమములను విచారించి, మహాత్మాజీని నేను చూడవచ్చినందుకు సంతసించెను.

బెల్గాములో 1923వ సంవత్సరము కాంగ్రెసు మహాసభ జరిగినది. మహాత్మాగాంధి మహాసభకు అధ్యక్షత వహించిరి.

వారి అధ్యక్షోపన్యాసములో డొమినియన్ స్టేటస్సే మన స్వరాజ్యాందోళనకు లక్ష్యమని స్పష్టీకరించిరి. అఖిలభారత కాంగ్రెసు సంఘసమావేశములో జిల్లాబోర్డులు, మునిసిపాలిటీలలో కాంగ్రెసు వాదులు ప్రవేశించి, పరిపాలనాధికారము వహించవలె ననుతీరు మానము చర్చకు వచ్చెను. శ్రీ ఎస్. శ్రీనివాసఅయ్యంగారు శ్రీ వేమవరపు రామదాసు, మరికొందరు అనుకూలముగ మాట్లాడిరి. నేను కార్యనిర్వాహకవర్గములో సభ్యుడుగానుండి వారివాదన ఖండించుచు ప్రసంగించితిని. మహాత్ముడును నాయభిప్రాయముతో నేకీభవించినట్లే తలంచితిని. ఈ విషయమున ఉభయపక్షములును అభినివిష్టులై యున్నవిగాన ఆంగీకరించి పరిష్కరించెదమని చెప్పి, పిమ్మట ప్రవేశించవచ్చుననియే పరిష్కరించిరి.

బెల్గాము కాంగ్రెసు మహాసభ జరిగినపిమ్మట మహాత్మా కార్యనిర్వాహక నర్గ సభ్యులను నిర్ణయించుటలో "నీకు బదులు మరియొకరిని వేయవలసివచ్చిన నీకు సమ్మతమేనా" యని నన్ను ప్రశ్నించిరి. మీ యిష్టము వచ్చినట్లు చేయవచ్చునని నేను సమాధానము చెప్పితిని. అప్పటితో నా కార్యనిర్వాహకవర్గ సభ్యత్వము ఆగిపోయినది. 1925వ సంవత్సరమువరకు ఆంధ్ర రాష్ట్రకాంగ్రెసు సంఘమునకు అధ్యక్షుడనుగానుండి, ఆ సంవత్సరము ఎన్నికలలో ఆ పదవిని బుద్ధిపూర్వకముగ వదలితిని. ఏలనన శ్రీ బులుసు సాంబమూర్తిగారు మొదలగు కాంగ్రెసువాదులకు ఎల్లకాలము నేనే అధ్యక్షుడుగా నుండి, తమవంటివారికి శాశ్వతముగా అడ్డు కలిగించుచున్నానను తాత్పర్యమున్నట్లు సూచనల రూపమున వెలిబుచ్చుటచే నేనిక ఆ పదవిలోనుండుట యుచితము కాదని మానుకొంటిని.

గాంధీమహాత్ముడు ఎఱువాడ జయిలునుండి విడుదలయైన పిమ్మట కొంతకాలమునకు అఖిలభారత చరఖా సంఘమును కట్టుదిట్టములతో స్వతంత్ర సంస్థగా నిర్మాణము గావించిరి. దానికి ఆంధ్రరాష్ట్రమునం దొకశాఖ నేర్పరచి దానికి నన్ను ఏజెంటు గాను, శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారిని కార్యదర్శిగాను నియమించిరి. ఈ శాఖకు కార్యస్థానము గుంటూరు పట్టణము నందే స్థాపించబడెను.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమునకు అధ్యక్షుడనుగా నేను ఉండినప్పుడు శ్రీ శాస్త్రిగారు నా కార్యదర్శిగానే యుండి, దక్షతతో కార్యనిర్వహణము గావించుచుండిరి. చరఖాసంఘ శాఖకు నేను అధ్యక్షుడనుగా నున్నప్పుడును శ్రీ శాస్త్రిగారే కార్యదర్శిగా నేర్పడి, అతి శ్లాఘ్యముగ పనుల నెరవేర్చుచుండిరి. ఈ రెండు సంస్థలలో మేము కలసిమెలసి, ఏకాభిప్రాయముతో మెలగితిమి. ఏనాడుగాని మాలో భేదభావములు కలుగలేదు. నా యందాయనకు ప్రేమగౌరవములు మెండుగానుండెను. నేను వారియెడల ప్రీతియును, లక్ష్యమునుగలిగి ప్రవర్తించుచుంటిని. ఈ ఆంధ్రరాష్ట్ర చరఖాసంఘముక్రింద ఆంధ్రరాష్ట్రములో పలుచోట్ల ఖద్దరుత్పత్తి సంఘములును, విక్రయసంఘములు నేర్పడి పనిచేయుచుండెను. కీర్తిశేషులైన శ్రీ బహ్మశ్రీ సుబ్రహ్మణ్యముగారు గోదావరితీరమున సీతానగరమున ఆశ్రమమును స్థాపించి, అచ్చట తాము మిత్రులును, కుటుంబములతోనుండి, ఖద్దరు ఉత్పత్తిని నిర్మాణకార్యక్రమముతో సంబంధించిన పనులను సాగించిరి. చుట్టుపక్కల గ్రామములలో గొప్పపలుకుబడి సంపాదించి వారివలన దివ్యసహాయమును,

సహకారమును పొందుచుండెను. మహాత్మాగాంధీ 1929వ సంవత్సరములో ఖద్దరునిధి నిమిత్తము ఆంధ్రదేశసంచారము చేసినప్పుడు ఈ గౌతమీ ఆశ్రమము నొకనాడు దర్శించి, చాల సంతసించిరి. అంత వైభవముతో నడిపించిన ఆశ్రమము నేడు రూపు మాసిపోవుట మిక్కిలి శోచనీయము. దానికి ప్రాణలింగముగనున్న సుబ్రహ్మణ్యముగారును, ఇతర సభ్యులును,జయిళ్ళకు పోవుట, వ్యవహారములు అప్పులలో చిక్కుకొనుట, సుబ్రహ్మణ్యముగారు పోలీసువారిచే దెబ్బలుతిని తుట్టతుదకు క్షీయవ్యాధి పీడితులై చాలకాలము బాధలుపడి దరిద్రమునను భవించి, ఈ లోకమును విడిచి పోవుట మున్నగు కారణములచే ఆశ్రమము క్షీణించి, చివరకుఆగిపోయినది.

1923లో నా రెండవకుమార్తె పార్వతికి ఎనేక చికిత్సలు చేయించి, నిరాశచెంది, దైవానుగ్రహము ఎట్లుండిన అట్లు కాగలవని గుంటూరులో స్వగృహము చేర్చితిమి. ఆమె పెనిమిటి క్షయవ్యాధితో మదనపల్లిలోనే చికిత్సపొందుచుండెను. ఇట్లు కుమార్తెయు అల్లుడును వ్యాధిగ్రస్తులై బాధలు చెందుచున్న కాలములోనే నేను కాంగ్రెసు సంఘాధ్యక్షత వహించితిని. ఆ దినములలోనే ఉత్తరహిందూస్థానములో హిందూముసల్మానులలో గోహత్య మొదలగు విషయములనుగూర్చి ద్వేషము లేర్పడి, కొన్నిపట్టణములలో, పరస్పరము హత్యలు చేయుట, కొల్లగొట్టుట మొదలగు దురంతములు నడుచుచుండెను. హిందువులే విశేషముగ ఈ బాధలకు లోనగుచుండిరి. ఈ సాంఘిక కష్టముల విషయమై ఆలోచించుటకు అమృతసరులో

కాంగ్రెసు కార్యనిర్వాహకవర్గసభ సమావేశపరచవలసి వచ్చినది. ఈ సభకు తాను రానని దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు తిరుగుబాటు చేసిరి. అప్పుడు సహాయ కార్యదర్శిగానున్న బారు రాజారావుగారు నాతోడ నుండిరి. ఇంటినుండి బయలుదేరు రోజున నా చిన్నకుమార్తె ఆరోగ్యస్థితి మరింత క్షీణదశలో నుండెను. ఆమె బ్రతుకునను ఆశ లేకుండెను. కాని నేను అమృతసరుకు పోక తప్పదు. ప్రయాణమై, కుమార్తెయొద్దకు బోయి, ఒక్క ద్రాక్షపండు నిచ్చి చెంచాతో కొంచెము తీర్థము త్రిమింగించి, యింతటితో ఋణము తీరినదని, నేను మరల నిల్లు చేరునప్పటికి బిడ్డ యుండదేమో యను సంశయముతో మనస్సు వ్యథనొందుచున్నను లక్ష్యము చేయక భార మంతయు నా భార్యపై వదలి, బయలు దేరితిని. అమృతసరు జేరి, సభ సమావేశ పరచితిని కాని రావలసిన సభ్యులందరు హాజరుకాలేదు. కాబట్టి సంప్రదింపులుతప్ప కార్యక్రమ మేమియు నడవలేదు. ఆ రోజులలోనే సిక్కుల గురుద్వారానగూర్చిన తగాదా జరుగు చుండెను. గురుద్వారాలో సిక్కులకు ప్రవేశములేకుండ మహాంతు అడ్డుపాటు గావించుటయు. అందుకు ప్రభుత్వముగూడ మహాంతు పక్షము వహించుటయు, సిక్కులుసత్యాగ్రహముపూని గురుద్వారాలో ప్రవేశింప యత్నించిరి. పోలీసులు వారిని బలాత్కారముగ అడ్డగించి తీవ్రములగు హింసలుగావించినను సిక్కుసత్యాగ్రహులు శూరులయ్యు, ప్రతీకారముచేయక, పోలీసులు గావించిన ఘాతలన్నియు మిక్కిలి ఓరిమితో సహించి, మహాత్ముడు బోధించిన సత్యాగ్రహ దీక్షను శాంతముతో నిర్వహించుట లోకమునకు ఆశ్చర్యము కల్పించెను.

నేను అమృతసర్ పట్టణమునకు వెళ్ళినదినముననే అకాలీలు శాసనోల్లంఘనమును పూని, ఉత్సవములతో బయలుదేరగూడ దని ప్రభుత్వము చేసిన ఉత్తరువును తిరస్కరించుచు గొప్ప ఉత్సవ మును అమృతసర పురవీధులలో నడుపుటకు నిశ్చయించుకొని, కాంగ్రెసుకార్యనిర్వాహకసభకు వచ్చినవారిని ఆహ్వానము చేసిరి. పండిత జవహరులాల్ గారును, శ్రీ టంగుటూరి ప్రకాశముపంతులు గారును, నేనును ఆయుత్సవములో చేరితిమి. రమారమి పది వేలజనులు పురుషులు, స్త్రీలు, పిల్లలుగూడ అందు వరుసలుదీర్చి సేనలో పటాలముబయలుదేరినట్లే డ్రమ్ములు వాయించుచు బాకాల నూదుచు, నడచుచుండిరి. మధ్యమధ్య నిలిచి, కొందరు నాయకులు తమతమ కెచ్చిన పీఠములమీద నిలువబడి, "ప్రభుత్వ శాసనమును ఇదిగో మా పాదములక్రింద త్రొక్కివేయుచున్నా" మని ఎలుగెత్తి, ధిక్కారములుగావించి, పీఠములను పాదములచే తాడనముగావించుచుండిరి. నల్లజండాలు ఎగురవేయుచుండిరి. ఆ యుత్సవములో మొట్టమొదటివరుసలో మమ్మా నిలువగోరిరి. నేను మధ్యను, నా కిరుప్రక్కలను ప్రకాశముపంతులుగారును జవహరులాల్ గారును చక్రరక్షకులవలె నుండిరి. మమ్మా నెవ్వరును అప్పు డాటంకపరచలేదు. ఉత్సవము ఆటంకములేకుండ పుర వీథులలో నడచినది. మరునాడే ఆ పట్టణమునుండి వెడలివచ్చితిని.

అమృతసరులో బంగారుదేవాలయమును దర్శించితిమి. అది సిక్కుల గ్రంథసాహెబు అనగా వారిమతగ్రంథము లుంచి, ప్రార్థనలుసలుపు భవనము. దానిగోడలు, గోపురమును బంగారు తగడుతో మెరయుచుండును. వెలుపల ముఖద్వారమున కెదు

రుగ చిన్నకోనేరు గలదు. ఇంచు ఏటేట మట్టితీసి, శుభ్రము చేయుదురు. అపనిచుంచు సిక్కు-సంస్థానాధీశులుగూడ సాల్గొనెదరట.

అమృతసరునుంచి మరల నిల్లుచేరునప్పటికి నా కుమార్తె శరీరసితి మరింత క్షీణించెను. ఒక దూరబంధు వామెను చూడ వచ్చినపుడు తానును దగ్గుతో బాధపడుచుండగా నెవ్వరో ఔషధముఇచ్చిరనియు, దానివలన ఆరోగ్యము కలిగినదనియు జెప్పెను. వారియొద్దనుంచి ఆయౌషధము తెప్పించి ఒక్క మోతాదు ఇచ్చినంతనే రాత్రి నిద్రపట్టినది. క్రమక్రమముగ ఆ నెలరోజులకోపల దగ్గు చాలభాగము తగ్గిపోయినది. నామనస్సు నకు కొంత శాంతి కలిగినది. ఈమె అనారోగ్యస్థితి ఇంచుక మేలుగానున్నను ఈమె పెనిమిటి మదనపల్లిలో బాధపడుచున్నం దున ఆఔషధమే ఆయన పుచ్చుకొన్నచో ఆయనదగ్గును నయము కావచ్చునని ఆశ పొడమినది.

నాభార్య యొంటరిగ ప్రయాణముచేసి, మదనపల్లికివెళ్ళి, ఔషధము నందజేసివచ్చినది. ఆయౌషధము పుచ్చుకొన్నమీదట కొన్నిరోజులకు చాలవరకు మేలుగా కనుపడినందున మదనపల్లి డాక్టరుగారియొద్ద సెలవుపుచ్చుకొని ఆతడు గుంటూరు వచ్చి, తండ్రిగారియింటిలో అనుకూలపరిస్థితులు లేనందున మాయింటికి వచ్చియుండెను. ఇందువలన మాకందరికిని సంతోషముకలిగినది.

———

సుఖదుఃఖములు.

ఈపరిస్థితి కాకినాడకాంగ్రెసుమహాసభ జరుగుటకు కొలది మాసములక్రిందటనే సమకూడినది. ఇంతమాత్రముగ కుటుంబపరిస్థితులలో శాంతి యేర్పడుటనలన కాకినాడకాంగ్రెసుకు నాభార్య కూడ ప్రేక్షకురాలుగావచ్చెను. ఇట్లు కొన్నిమాసములుగడచునప్పటికి వేసవియెండలు గుంటూరులో దుర్భరముగా నుండుటచే బెంగుళూరులో నొకయిల్లు నెల 1కి రు 40/- ల చొప్పున అద్దెకు తీసుకొని అచ్చట నేనును నాభార్యయును నాపెద్దకుమార్తెను ఆమెపెనిమిటినిగూడ తీసుకొని వాసముచేయుచుంటిమి. అల్లునకు ఆరోగ్యము చక్కగనే యుండెను. రెండవకుమార్తెసితి యథాస్థితిలోనే యుండెను. కాని శరీరము బలముపట్టి, మంచములో పండుకొనియున్నను ఆరోగ్యముగ నున్నట్లే కనబడుచుండెను. వేసవియెండలు తగ్గి, చల్లనికాలము వచ్చునప్పటికి మరల గుంటూరు చేరితిమి.

పిల్ల కింకను ఆయాసము తాపము నట్లే యుండెను. దగ్గుకు ఔషధము కనిపెట్టినవైద్యుడే తత్త్వమును గనిపెట్టి ఔషధము మరియేదియైననిచ్చి ఈలక్షణములనుగూడ కుదర్చనచ్చునని యోచించి, వారి గ్రామమైన ఐనవల్లికి సమీపమున ముక్తేశ్వరములో కాపురముపెట్టి, ఆవైద్యునినలన చికిత్స ప్రారంభించితిమి. అప్పుడును రెండవకుమార్తె పెనిమిటియును, నాభార్యయు, నాపెద్దకుమార్తెయు వంటమనిషియు నుండిరి. అక్కడనే దాదాపు ఆరుమాసములు ఔషధసేవచేయించితిని. అల్లునను

ఔషధము పుచ్చుకొనుచునేయుండెను. చక్కగ తిని, తిరుగుచు ఆరోగ్యమును క్రమక్రమముగ పొందుచుండెను. నాకుమార్తె కును నానాట ఆయాసముమొదలగునవి తగ్గి, సుఖముగ కాలము గడపుట తటస్థించినది. ఆ ముక్తేశ్వరము గోదావరీతీరము ప్రతి దినము నేను గోదావరిస్నానమునకు ఉదయమునే పోయి, స్నానానంతరము ఏకాంతముగ నొక్కచో నదీతీరముననే దైవ ప్రార్థనచేసికొనుచు కొంతకాలము గడపి, ఇంటికి చేరుచుండు వాడను. ఈ ఏకాంతసేవ మనస్సునకు శాంతియు, ఆనందమును కల్పించుచుండెను.

నేనుముక్తేశ్వరములోనున్నపుడే సహాయనిరాకరణోద్యమ సంబంధులు పోలీసులసహాయమపేక్షింపనచ్చునా యను ధర్మ సంశయ మొకటి తలయెత్తెను. నేనును గాంధిగారి కొక యుత్తరము వ్రాసితిని. అందుకు నాకు సమాధానముగ సమాజములో మనము సభ్యులుగా నున్నంతవరకు వారిసహాయము కోరక తప్పదు. సమాజమును విడిచి, పర్వతగుహలలో నివసించువారికి వారితో జోక్యముండదని తెలిపిరి. ఇంకొకసారిగూడ ప్రభుత్వము వారి ళ్ళు, రోడ్లు మొదలగువానినిగూడ సహాయనిరాకరణ వాదులుపయోగించవచ్చునా అన్న ప్రశ్న యుదయించినపుడు మనము సహాయనిరాకరణసల్ప నిర్ణయించుకొన్న విషయములు తప్ప తక్కినవి ఉపయోగించుకొనవచ్చునని స్పష్టపరచిరి.

నాపెద్దకుమార్తెను నాభార్యతమ్మునకే యిచ్చి, వివాహముచేసితినని పైన వివరించియుంటిని. ఆమెకు సంతానము కలుగనికారణమున 1916వ సంవత్సరమునందే నాయల్లునకు ఆతని

తల్లియు మేనమామ మొదలగు బంధువులును బోధించి, మరల వివాహము చేసిరి. రహస్యముగ సింగరాయకొండకు తీసికొనివెళ్ళి దేవాలయములో వివాహముజరిపిరి. ఈప్రయత్నముసంగతి ఆక స్మికముగ తెలిసినచ్చినందున సరుకులువేయు రైలుబండి నెక్కి, ముహూర్తమునకు ముందుగనే నేను మరి యొక మిత్రునితో నటకు చేరితినిగాని వివాహము నాపలేకపోతిమి. ఈవిపరీతపరిసితికి చింతించుచు మేము వంగోలుకు ప్రయాణమై వచ్చుచుండగా, నాభార్యయు కొమార్తెనుతీసుకొని, సింగరాయకొండకేవచ్చెను. వివాహము ఎప్పటికే ముగిసెనుగాన మే మందరము వంగోలులో దిగి, సత్రములో నుంటిమి. పెండ్లి ముగించుకొని నాఅల్లుడు మొదలగువారును వంగోలు చేరిరి. మేము సత్రములో నుంటి మని తెలుసుకొని, అక్కడికి మాఅల్లుడు వచ్చి, తన అక్కగారిని, భార్యను చూచి, దుఃఖించుచు "నా కితరులు బోధించినందున వివాహముచేసుకొంటినిగాని స్వయముగ పుట్టినబుద్ధికా" దని మిక్కిలి చింతింపసాగెను. అంతట జరిగినదానికి చింతించి ప్రయో జనములేదు నీవు మరియొకపిల్లను వివాహమాడితివిగదా ! ఇది వరకు వివాహమాడిన ఈపిల్లగతి ఏమిచెప్పెద వని అడుగగా, ఆమెకూడ ఎప్పటినలె తనతో నుండవచ్చునని ప్రత్యుత్తరమిచ్చెను. అది సాధ్యపడదని అక్కగారు చెప్పినమీాదట మీాఅభిప్రాయము చెప్పవలసినదని అత డడిగెను. ఏదో కొంతఆస్తి పిల్లపేర వ్రాసి యీాయవలసినదని కోరగా, 24 యకరముల మెట్టభూమిని నా కుమార్తెపేర దానపత్రముగా వ్రాసి యిచ్చెను. ఈ ఏర్పాటుల లో నే నేజోక్యమును కలుగజేసుకొనలేదు. అక్కగారు చెప్పిన ప్రకారము తమ్ముడు బుద్ధిపూర్వకముగా వ్రాసియిచ్చినాడు.

అతని కింకను సుమారు డెబ్బదియకరములభూమి యున్నది. నా కుమార్తెకు వ్రాసియిచ్చిన భూమియైనను నాబావమరదియే అనుభవించుచుండెను. ఎప్పుడో ఒకప్పుడు కొద్దిగా మక్తాక్రింద సొమ్ము పంపుచువచ్చెను. నాకుమార్తె మరల అత్తవారింటికి పోక, నాయొద్దనే యుండనారంభించెను. అప్పుడప్పుడు మాబావమరది యును మాఅత్తగారుమాత్రము చుట్టాలచూపుగ చూచిపోవు చుండువారు. రెండవభార్య కాపురమునకు వచ్చి దాదాపు పది సంవత్సరములు గడచునప్పటికి ఇర్వురు మగపిల్లలను, ఒక ఆడు పిల్లను ఆచిన్నది కన్నది. ప్రథమపుత్రుడు కలిగినపుడు నా బావ మరది నాకు ఉత్తరమువ్రాసెను. నేనును ప్రత్యుత్తరములో మీరు చేసిన ప్రయత్నము ఫలించినందుకు సంతసించుచున్నాను. మీప్రయత్నము పరమేశ్వరునకు సమ్మతమైనదిగనే కనుపడు చున్నదని వ్రాసినాను.

నేను ముక్తేశ్వరమునుండి అవసరమగు పనిమీద గుం టూరునకు వచ్చితిని. మాయింటిలోనే యొంటరిగ రాత్నము వడుకుచుండగా, లింగముగుంటనుంచి నాబావమరది తన రెండవ భార్య పిల్లవానిని కని, మరునాడుదయమునసే చనిపోయినది కాన విపత్సమయమున తప్పకరానలెనని మిక్కిలి ప్రార్థేయపడుచు జాబువ్రాసెను. వానికి రెండవవివాహమైనపిదప ఆయూరు వెళ్ళలేదు. కాని విపత్కాలమున పోకపోవుట న్యాయముకాదని వెంటనే బయలుదేరి, లింగమగుంటకు వెళ్ళితిని. మా బావమరది యును, అత్తగారును "గడచినదానిని మనస్సున ఉంచుకొనక, పెద్దకుమార్తెను వెంటనే పంపి, కాపురమునిల్పవలసిన"దని గట్టిగ పట్టుపట్టిరి. పిల్లను వెంటనే తీసుకొనివచ్చుట సాధ్యపడదుకాని

పసిపిల్లవానిని కాపాడుటకు తెక్కెన పిల్లల నిర్వారను సాకుటకు తాత్కాలికముగ నాభార్యను తీసుకొనివచ్చెద ననియు, నెమ్మది మీద మా అమ్మాయిని తీసుకొని వచ్చునిషయమై ఆలోచించ వచ్చు ననియు చెప్పి నా భార్యను మాత్రము తీసికొని లింగమ గుంట చేరితిని. నా భార్య నచట డించి, నేను మరల ముక్తేశ్వ రము చేరి, కొంతకాలము గడపినపిమ్మట నర్తవు ప్రారంభ మైనది. ఇంకనక్కడనుండుటకు వసతిగా నుండలేదు. ఉండవలసిన అనసరమును లేదు. ఇంటికి వెళ్ళి ఔషధసేవ చేయవచ్చునని వైద్యుడు రామదాసు బుల్లెయ్యగారు చెప్పిరి. ఆయనచేసిన మహోపకారమునకు మే మెంతయు కృతజ్ఞులము. మా వలన విశేషముగ ద్రవ్యముగూడ తీసికొనలేదు. మరియును నక్కడ నున్న కాలములో ఐనవల్లిలంకలో కాపురమున్న కమ్మకుటుం బమువారు నాయందు మిక్కిలి అభిమానముతో ఆవుపాలు ప్రతి దినము మాకు అందజేసి, మిక్కిలి సహాయముచేసిరి. వారి కుటుంబమువారే సత్యనారాయణ అనువారు గుంటూరులోనే మాఇంటిలో గదిలో అద్దెనిచ్చి చదువుకొనుచుండెను. ఇప్పుడు నేత్రచికిత్సలో నైపుణ్యము బడసి చెన్నపట్టణములో సుప్రసిద్ధ వైద్యుడుగా నున్నారు.

ఐనవల్లి వైద్యమునలన నా కుమార్తెకు వ్యాధి చాల భాగము నెమ్మదిగనేయున్నది. కాని పూర్ణముగ రహితము కాలేదు. ఇంకను కొంతకాలము ఔషధసేవచేసినయెడల కుమార గలదని ధైర్యము కలిగినది. ఆమె భర్తయును ఆరోగ్యవంతుడు గనే యుండి, దగ్గుబాధనుండి చాలవరకు విముక్తిచెందినట్లు కన బడుచుండెను. వీరిరువురకును కొలదికాలములోనిమేకముహూర్త

మేర్పరచి, యిద్దరినొకట చేయవలెనని యూహించుకొనుచుం టిమి. దీపావళికి నా బావమరదిలింగమగుంటనుంచి గుంటూరుకు వచ్చెను. అందువలన కొమార్తెలిరువురును వారి భర్తలతో కూడ నా యింటనుండి పండుగ జరుపుట తటస్థించినది 1925న సంవత్సరము నవంబరు మాసములో నిట్లు నడచిన శుభసమయము అంతవరకు నడచిన కష్టములను కొంత మరపునకు తెచ్చెనుగాని స్వల్పకాలముంతోనే అందుకు భంగముకలిగెను. నా రెండవ యల్లుడు తనవ్యాధి స్వభావమును గుర్తించక యథేచ్ఛగ తిరు గుచు, శరీరమును బడలికనొందజేయుటచే వ్యాధితిరుగబెట్టి, 1926 జనవరిలో మృతినొందెను. ఆతని తండ్రియును, అంతకు ఆరుదినములకు ముందే మరణించెను. నా రెండవ కుమార్తెకు అనారోగ్యమట్లుండ యావజ్జీవ మీ దుఃఖము ననుభవించు దౌర్భాగ్యము సంభవించెను. కుటుంబములో అప్పటప్పటికి సంప్రాప్తములగుచున్న యిక్కట్టులను నే నంతగ పాటింపక ప్రవర్తించుచున్నను నా భార్యకు అవి దుస్సహములై, నానాట ఆమె యారోగ్యమునకు భంగము గావింపసాగినవి.

లాభనష్టములు

నేను కాంగ్రెసు వ్యవహారములలో మామూలుగనే పాల్గొనుచుంటిని గాని మహాసభకు ప్రతి సంవత్సరము పోవుటకు ఆటంకములు తటస్థించుచుండెను. నేను వృత్తినివిసర్జించునాటికి రమారమి నలుబదినేలరూపాయలవరకు నా యొద్ద నిల్వసొమ్మి

తేలిసది. దానిమీదను మరికొన్ని భూములమీదను ఆధారపడియే నేను వృత్తిని విసర్జించితిని. నూతనగృహ నిర్మాణము ఆవశ్యకముగ తోచి, పదునైదువేలవరకు వ్యయముచేయవలసివచ్చెను. సుమారు అయిదువేలరూపాయలు నా రెండవకుమార్తె వివాహమున వ్యయపడెను. పిమ్మట వ్యాధుల నిమిత్తము పథ్యములలో నివాసము, ఔషధములు, పథ్యపానముల నిమిత్తము అధికమును మరియొక అయిదువేలు వ్యయమై యుండును. ఇదిగాక సామాన్యముగ ఉత్తరహిందూస్థానములో కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గసభలు, కాంగ్రెసు మహాసభలు, అఖిలభారత చర్కాసంఘ సభలు జరిగినప్పుడు నాకు కావలసిన ప్రయాణప్రఖర్చులు నేను స్వంతముగనే భరించుచూటిని. కొంతకాలము తొలిదినములలో రెండవతరగతి రైళ్ళమీద పయనము చేయుచుంటిని. ఈ న్యయములు నా నిల్వసొమ్మును చాలవరకు హరించినవి.

వేటపాలెములో బంగళాల విక్రయమువలన వచ్చిన ఎనిమిదివేలరూపాయలుగూడ ఇటులనే హతమైనవి. నాన్నృత్తిని విసర్జించినపిమ్మట రు 1800/- లకు నిడమర్రుగ్రామములో అడవిబంజరుబాపతు ఇరువదియొక్కయకరములు వేలములో కొని, రెండువందలరూపాయలతో బాగుచేయించితిని. బాకీదారులవలన పదునేడుయకరములు గుంటూరులో విక్రయమును పొందితిని. కొలకలూరులో నటులనే మరియొక యు 2-25 జరీబు భూమి లభించినది. నిడమర్రు, గుంటూరుభూములు మెట్టభూములు. మొదటమొదట వానివలన మిక్కిలి స్వల్పఆదాయము మాత్ర ముండెను.

నాతండ్రిగారివలన నాకు సంక్రమించిన యు 8-50 గుం టూరులోనిదే. ఇదియును మెట్టభూమియే. ఇదిగాక చేపల్లె తాలూకా అయిలవరములో మాగాణిభూమియును కుటుంబాస్తి బాపతు నాకు హక్కుపడినది. ఇట్లు నాతండ్రిగారివలన లభ్యమైన ఆస్తిఅంతయు 1938 వరకు నాకును నాతమ్ములకును జాయంటుగా భుక్తమగుచువచ్చినది. అప్పుడు నావంతు కొన్ని సంవత్సరములు సుమారు మున్నూరురూపాయలు, కొన్ని సంవత్సరములు ఏనూరురూపాయలును, ఒకటిరెండుసంవత్సరములు వెయ్యిరూపాయలచొప్పున ఆదాయము లభించుచువచ్చినది. ఎన్ని వచ్చినను కుటుంబవ్యయములకే చాలీచాలనట్లు జరిగిపోవుచుండెను. కాని, చాలకాలము అప్పులపాలుగాకుండ నడచిపోయినది.

1930 లో ఉప్పుసత్యాగ్రహోద్యమము సాగకముందే నినుకొండతాలూకా చవటిపాలెముఅగ్రహారముభూమి సుమారు వెయ్యియకరములు ముప్పాళ్ళగ్రామకాపురస్తులు రామలింగయ్యగారును, దేశిరాజు హనుమంతరావుపంతులు, నడింపల్లి వెంకటలక్ష్మినరసింహారావు, మరొకరు, నేనును చేరి, పదునైదువేలరూపాయలకు అయిదు సమానభాగములుగా విక్రయించుకొంటిమి. నావంతు దాదాపు 200 యకరములు శారదానికేతనమునకు ధర్మముగా నిచ్చుటకు ఉద్దేశించితిని. ఇందు రెండుచెరువులు గలవు. కొంత సొమ్ము పెట్టుబడి పెట్టి, వృద్ధిచేయతగిన దని తలంచితిమి. కొంత వృద్ధిచేసినపిమ్మటనే శారదానికేతనమున కీయవచ్చునని యూహించితిని. నాయొద్ద క్రయధనము నిచ్చుటకు

రొక్కము లేకపోవుటచే, శ్రీ ఏకా ఆంజనేయులుగారిపేర ప్రామిసరీ నోటువ్రాసి వెయ్యిరూపాయల నిచ్చితిని. పిదప నేను జెయిలుకు పోవుట సంభవించినది. నేను విడుదలపొంది వచ్చునప్పటికి శ్రీ రామలింగయ్యగారును, హనుమంతరావుగారును ఆ అగ్రహారము భూములలో నితరగ్రామములనుండి రప్పించుకొని తెచ్చిపెట్టిన వారికి వ్యవసాయమునిమిత్తము, పశువులనిమిత్తమును, నివాస గృహములనిమిత్తము చాలధనము ఖర్చుపెట్టినట్లు తేల్చి, నా వంతు క్రయధనమును, పిమ్మట వ్యయపరచిన ధనముక్రింద వడ్డీతోసహా, నాపలన లోగడపుచ్చుకొన్న వెయ్యిరూపాయలు పోను, ఆరువేలరూపాయలునాపైన బాకితేల్చినందున నే నేమియు ఆక్షేపణచేయక అందుకు సమ్మతించితిని. ఒక తాకట్టు దస్తావేజుతాలూకు అసలుషాయిదాలు ఆరువేలు అగ్రహారము బాకీక్రింద చెల్లుపెట్టి, ఆదస్తావేజు శ్రీ రామలింగయ్యగారిపేర ప్రాసాఫకుచేసితిని. ఆంజనేయులుగారి బాకీమాత్రము వడ్డీతో పెరుగుచునేవచ్చినది. ఆఋణము చెల్లించుటకు నాకుఅవకాశము లేకపోయినది. అది వడ్డీతోసహా రు 1600 లైనపిమ్మట ఆంజనేయులుగారు ఒత్తిడిచేసినంతన రేపల్లెభూమి [illegible] పెట్టి బాకీ తీర్చివేసితిని. ఇట్లు సంసారము భూమిలో [illegible] ప్రారంభమైనది.

———

V.R. NARLA MEMORIAL LIBRARY (V.R.NARLA D.P.R.I. Acc. No.)

ఉప్పు పంటలు.

1930లో ఉప్పుసత్యాగ్రహ మారంభించుటకు ముందు వివిధ రాష్ట్రములనుండి ప్రముఖులగువారిని సబర్మతీఆశ్రమమునకు గాంధీజీ పిలువనంపిరి. ఆంధ్రరాష్ట్రమునుండి భోగరాజు పట్టాభి సీతారామయ్యగారును, నేనును పోయియుంటిమి. ఉప్పు శాసన మున్నుల్లంఘించుట సుకరమనియు, ప్రభుత్వమువారికి నష్టము కలుగునుగాన వారు లోబడుటకవకాశము గలదనియు, మహాత్మాజీ వాక్కుచ్చిరి. నాకు మాత్రము ఉప్పు పండించిగాని, సముద్రపుగుంటలలో ఉప్పును ప్రోగుచేసిగాని, అమ్మినటవలన ప్రభుత్వము లోబడుట సంభవించునాయను సంశయము బాధించెను. నా సంశయము మహాత్మాజీకి తెలిపితిని. జనులు వేన వేలుగ సముద్రప్రాంతమున ప్రతిగ్రామములోను ఉప్పుచేసి అమ్మకము ప్రారంభించుటలో మితిలేని సంచలనముకలుగగలదని మహాత్మాజీ నక్కాంక్షించిరి. తెక్కినవారెవ్వరును అనుకూలముగ గాని, ప్రతికూలముగగాని పలుకక యూరకుండిరి. "మీ కెవ్వరికిని ఈ ప్రయత్నమున విశ్వాసము లేకున్నను నాకు అధికమగు విశ్వాసమున్నదని గాంధీజీ చెప్పుచు, "జకిల్ అండ్ హైడ్" అను పుస్తకమును చదివితివా" యని నన్ను ప్రశ్నించిరి. నేను చదువలేదని బదులు పలికితిని. ఆ గ్రంథములో కథానాయకుడు మొట్టమొదట సద్గుణవంతుడై, పలువురమన్ననలకు పాత్రుడగుచునుండి, పిమ్మట విపరీతముగ మారిపోయి, దుష్టస్వభావుడై ప్రవర్తించెను ఆ దుష్టస్వభావము అణచుకొనుటకు దుస్సాధ్యమగునంత బలవత్తరముగ పరిణమించెనని అందువర్ణించబడిన దని

తెలిపి, తనచుంచు నట్టివిపరీతము, బలిష్ఠమునగు ఉద్యోగ కలుగు చున్నదిగాన ఎవరు తనతో కలిసినను కలియకున్నను తానును తన ఆశ్రమవాసులును బయలుదేరి ఉప్పుసత్యాగ్రహము చేయ సమకట్టియున్నారమని గాంధీజీ స్పష్టపఱచిరి. అంతట నేను మరల మహాత్మాజీని ప్రశ్నించితిని. మేము మీరు కోరిన ప్రకారము సత్యాగ్రహము చేయ సమ్మతించినను ప్రజలలో ఈ ఉద్యమవిషయమై ప్రచారము చేయనిదే సత్యాగ్రహము ప్రారంభించు టెట్లని అడిగితిని. ఇంతకాలము ప్రజలలో చేసిన ప్రచారమే చాలుననియు, ఇప్పుడు క్రొత్తగా చేయవలసినది లేదనియు వారు నుడువుచు, ప్రచారమున కెంత వ్యవధి కావలె నని నన్ను ప్రశ్నించిరి. ఆరుమాసములు కావలెనని నేను కొంత ఆలోచనగనే ప్రత్యుత్తరమిచ్చితిని. అందుకు వారు "ఆరు నిముషములుగూడ అవకాశమిచ్చుట లే"దని ఛలోక్తిగ జవాబు చెప్పిరి. రాజగోపాలాచార్యులుగారు ఏదియోఆక్షేపణచేసిరిగాని ఇప్పుడు జ్ఞాపకము వచ్చుటలేదు. శ్రీ పట్టాభిసీతారామయ్యగారు తనకు పూర్ణవిశ్వాసమున్నట్లు ప్రకటించిరి. రెండవనాడు మేము దరము సత్యాగ్రహము సాగించుటకే నిశ్చయించుకొని బయలుదేరుచుండగా, మహాత్మాజీ నన్ను బిలిచి "నీకు అవకాశము కావలెనంటివిగదా, మోతీలాలుగారిప్పుడు వారి గ్రామమునకు వెళ్ళినారు. నాలుగురోజులలో మరల రాగలరు. వారు వచ్చినతర్వాత గవర్నర్ జనరల్ గారికి మన శపథమును లేఖ మూలమున తెలియపర్చవలసియుండును. దానిని సిద్ధము చేయుటకు నాలుగైదు దినములు పట్టును. కావున ఇంతలో నీవు చేయ తగిన ప్రచారము చేయవచ్చునని నాకు సలహానిచ్చిరి.

నే నంతట బయలువెడలి, గుంటూరు వచ్చినప్పటికి, గాంధీజీ ఒక తెల్లవారు ఝామునవే ఆశ్రమములో ప్రార్థనలు జరిపి, పశ్చిమసముద్రతీరమున రెండునందల మైళ్లదూరమున నున్న దండి యను రేవు దగ్గర ఉప్పుసత్యాగ్రహము చేయుటకు ప్రస్థానము సాగించుటయు, సబర్మతీఆశ్రమము చుట్టునుచేరిన అహమ్మదా బాదు పురవాసులు సుమారు డెబ్బదివేలమంది వారితోగూడ పయనమగుటయు, వలదని వారిని వారించి యిండ్లకు పంపివేయు టయు, మహాత్మాజీ దండియాత్రకు- ఆశ్రమవాసులతో కలసి ముందడుగు వేసినకొలది, ఆసేతుహిమాచలమునను ప్రజలలో మహోత్తరమగు ఆందోళనము బయలుదేరుటయు, నాకు అత్యం తాశ్చర్యము కల్పించెను. కాఱుమబ్బులు ఆవరించి, పెనుగాలి వీచుచు, మెరుపులు, ఉరుములు, పిడుగులు పడునప్పుడు దేశ మెల్లను సంచలనము చెందునో అట్టి ప్రచండవాతావరణము అంతట వ్యాపించెను.

గుంటూరు చేరునప్పటికే ఇచ్చోటి కాంగ్రెసువాదులు కొత్తపేటలో నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారి ఇంటియెదుట యడవల్లివారి సత్రమును ఆక్రమించి, దాని చుట్టును పెద్ద పందిళ్లను పాకలునువేసి శిబిరమును స్థాపించిరి. జిల్లాలోని కాంగ్రెసువాదులు గుంపులు గుంపులుగ నచ్చట చేరుచుండిరి. ఉన్నవ లక్ష్మీనారాయణగారు శిబిరనాయకత్వము వహించిరి. అక్కడ ఐచ్ఛికభటులకు భోజనవసతులేర్పరచి, శిక్షణనిచ్చి, తండతండములుగ గ్రామములవెంట పంపుటకు ఏర్పాటులు చేయుచుండిరి. గుంటూరుపట్టణములోని వైశ్యబృందమును,

ఇతర వర్తకులును శిబిరమునకువలయు ద్రవ్యము నిచ్చుచుండిరి. బియ్యపుఫ్యాక్టరీలవారు బియ్యమును పంపుచుండిరి. అది యొక రాజాధిరాజుచే సాగించబడిన రాజసూయసత్రశాలవలె కనుపించెను. ఈ శిబిరమునందుచేరి ప్రచారము చేయబూనినవారు రమారమి రెండువేల వరకు లెక్కకు వచ్చిరి. వీరు గుంపులు గుంపులుగ గ్రామములవెంట తిరుగనారంభించుటవలన ప్రజలలో ఉప్పుసత్యాగ్రహముపట్ల అభిమానము ఉత్తేజితమయ్యెను. ముఖ్యముగ సముద్రతీరవాసుల కిది గొప్ప పండుగ యయ్యెను. పల్లెకారులకు సర్వస్వాతంత్ర్యము లభించినట్లే వారు ఆవేశ పూరితులైరి.

ఆంధ్రరాష్ట్రమున ఉప్పుసత్యాగ్రహ సంబంధమున కార్య క్రమము నిర్ణయించుటకై ఏలూరులో ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సంఘసమావేశము జరుపబడెను. అక్కడికి శ్రీ బులుసు సాంబ మూర్తి, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలగు సభ్యులు పలువురు హాజరైరి. ఈ సత్యాగ్రహోద్యమము సాగించుట కెవ్వరిని నియమించవలెనను ప్రశ్న బయలు వెడలినది. హాజరైన వారిలో నెవ్వరును అందుకు అభిముఖులుగా కనబడనందున నన్ను ఉద్యమము నడిపించనలసినదని అందరును ఏకగ్రీవముగ కోరిరి. దేశమున సంచారముచేసి, సభలలో ఉపన్యాసములిచ్చి పూలదండలు వేయించుకొనినవా రీ నాడు ముండ్ల కిరీటము ధరించవలసివచ్చినప్పుడు వెనుదీయుట సరిగాదని తలంచి, వారి కోరిక నంగీకరించితిని ఆ సమయమున ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు సంఘాధ్యక్షులు భరించవలసినబాధ్యత మరల నాకే విషయమున సంక్రమించినది. నన్ను నియంతగా నేర్పరచి, తీర్మానముచేసిన

పిదప, సభ ముగించి, మరల నేను గుంటూరు చేరునప్పటికిఒక యాలోచన బయలుపడినది. కాంగ్రెసుప్రముఖులును,సభ్యులును కొందరు గుంటూరునుంచి కాకినాడకు, గాంధిగారుసబర్మతినుండి దండికిబయలుదేరినటుబత్తులు దేరి కాకినాడలో సముద్రతీరమున ఉప్పు చేయనలసినట్లు బులుసుసాంబమూర్తి, నడింపల్లి లక్ష్మీ నరసింహారావుగార్లు మొదలగువారు నిర్ణయించినట్లు తెలిసినది. గుంటూరు పురపాలకసంఘమునకు నరసింహారావుగారు అధ్యక్షులుగా నుండిరి. శ్రీ సాంబమూర్తిగారు కాష్ట్రీకాంగ్రెసు కమిటీకి అధ్యక్షులు. ఏలనో వారెవ్వరును పై ఏర్పాటులను గురించి నా కెప్పుడును సూచనయైన చేసియుండలేదు. ప్రస్థానపు పేర్పాటునుగురించి నాతో వారు చెప్పినప్పుడు అదియుక్తముగా నాకు తోచుటలేదనియు, మనము గుంటూరునుండి బయలు దేరుటతోడనే ప్రభుత్వము మనలనుపట్టుకొని నిర్బంధింతురనియు నంతట ఉద్యమము మూలబడుననియు, నేను నా యభిప్రాయ మును స్పష్టపరచితిని. ఏ జిల్లావారు ఆ జిల్లాలో ఉప్పు సత్యా గ్రహ శిబిరముల నేర్పరచి, కార్యక్రమము సాగించవలెననియు, అట్లు సాగించుటనలన ప్రభుత్వమును పలుచోట్ల నెమరొకనుట కవకాశము కలిగి, దేశమున ఉద్యమము బలతరముగ సాగు నని తెలిపితిని. ఇట్లు కొన్నిదినములు జరుగునప్పటికి మహాత్మాజీ ప్రస్థానమార్గమునకు సమీపమున నొకపట్టణములో అఖిలభారత కాంగ్రెసు సంఘసమావేశము జరుపబడునని అప్పుడు కాంగ్రెసు అధ్యక్షులుగా నున్న జవాహర్‌లాల్ గారు ప్రకటించిరి. అప్పుడు ఆ కాంగ్రెసుసంఘములో సభ్యులైన సాంబమూర్తిగారు, నర సింహారావుగారు మొదలగువారము బయలుదేరి ఆ సభలో

పాల్గొన్నపిమ్మట ఆ సమీపగ్రామమున బసచేసిన శ్రీ గాంధి మహాత్ముని దర్శించుటకు మే మందరమును పోయియుంటిమి. ఈ మధ్యనే అవకాశముచేసుకొని శ్రీ సాంబమూర్తిగారు నరసింహారావుగారు మొదలగువారును మహాత్ముని దర్శించి, గుంటూరునుండి కాకినాడకు తాము చేయదలచిన పర్యటనమును గురించి వారికి మనవిచేసి, వారినలన సమ్మతిని పొందిరి, తమ ఏర్పాటునకు గాంధీజీ సమ్మతించినారని నాకు తెలియునట్లు పర్యవరణ గావించిరి. నన్ను కలుపుకొని గాంధిగారియొద్దకు పోక వారు మాత్రమే నాకు తెలుపకుండ పోవుటను తలంచి కొంతవగచితిని. వారందరు భోజనములుచేసి నిద్రావస్థలో మునిగియుండిరి. నేను అప్పుడు గాంధీజీ యొద్దకేగి, నాకు గల అభిప్రాయభేదమును తెలిపి, అన్ని జిల్లాలలోను శిబిరములుపెట్టి ఉద్యమము సాగించుట ఎక్కువఫలప్రయోజనకారి యని మనవి చేసినమీదట మహాత్మాజీ అంగీకరించిరి. అంతటనేను ఆంధ్ర రాష్ట్రములోని జిల్లాసంఘాధ్యక్షులకందరికిని వారివారి జిల్లాలలో శిబిరములు స్థాపించి ఉద్యమముసాగించవలెనని నేనుతంతివార్తల నంపితిని. కొలచెము సేపటికి మిత్రులందరు నిద్రనుండి లేచి, మహాత్ములు తమ ఏర్పాటున కంగీకరించిరిగాన దాని విషయమై మీ రేమి చేయుమురని నన్ను ప్రశ్నించిరి. నేను గాంధీజీతో సంప్రదించి, ఇప్పుడే అందరికి తంతివార్తలను పంపితినని తెలిపితిని. అంతటవారు ఏమనుకొనినారోగాని మిన్నకుండిరి.

గుంటూరు చేరినపిమ్మట కొలదిదినములకు మాయింటి ఆవరణలో పెద్ద పందిరివేయించి, ఆపందిరిలో నూరు పొయిలు పెట్టి నూర్గురుకాంగ్రెసువాదులు ఉప్మా వండునట్లు నిర్ణయించు

కొని, వాడరేవునుంచి సముద్రపునీరు గుండిగలతో మోటారు కారుమీద నేనును శ్రీ సీతారామశాస్త్రిగారును మరికొందరు మిత్రులును గుంటూరు తీసుకొనివచ్చి, ఆపందిరిలో పొయిల మీద మూకుళ్ళలో సముద్రపునీరు కాగబెట్టి ఉప్పుచేసితిమి. అంతకు నాలుగైదురోజులకు ముందుగనే మాయింటిఆవరణలో నూర్గురము ఉప్పుచేయుదుమని జిల్లాకలెక్టరుకు నేనే వ్రాసి సత్యాగ్రహముజరుపు తేదియును గంటయును వినరించుచు నోటీసుపంపితిని. ఈయజ్ఞములో నరసింహారావుగారు, లక్ష్మీ నారాయణగారు, సీతారామశాస్త్రిగారు, లక్ష్మీబాయమ్మ గారు, శీరము సుబ్బారావుగారు మొదలగు వారందరు ఉత్సాహ ముతో పాల్గొనిరి. వండినపిమ్మట తయారైన ఉప్పును పొట్లము లలో గట్టుకొని మున్నూరు ఐచ్ఛికభటులు గాంధిటోపీలు పెట్టు కొని, జాతీయజండాలుచేతపట్టుకొని వీధులవెంట వరుసలుదీర్చి జాతీయగీతములుపాడుచు, జయఘోషములతో వెడలి పుర సంచారముచేసినపుడు గుంటూరుపట్టణము మహోన్నిద్రనిపట్టణము వలె అత్యంతవైభవోత్సాహములతో విలసిల్లినది. ఆనాడు ఉత్సవముతో వెడలిన ఐచ్ఛికభటులెల్లరు దేవతాస్వరూపులు. పురవీధులలో నిట్లు నుడివినట్లు వీరవిహారముసల్పి శివాలయ సమీపమున సున్న కోనేటిమెట్లమీద మున్నూరైచ్ఛికభటులు వరుసలుదీర్చి నిలచిరి. జాతీయగీతములు పాడినపిమ్మట వీర మాత శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు "వీరగంధము తెచ్చినారము వీరు లెవ్వరో తెల్పుడీ!"అని పాట పాడుచుండగా నొక్కొక్కభటుడు ముందుకు వచ్చుటతో వారిచేతికి దీక్షా కంకణము కట్టుభాగ్యము నా కబ్బినది.

ఆసాయంకాలము పౌరమహాసభజరిపి అచట ఉప్పు అమ్మకము చేయబడినది. ప్రభుత్వమువారు తూష్ణీభావము వహించి యూరకుండిరి. నేను జిల్లాలవెంట సంచారముచేసి ప్రతి జిల్లాలోను శిబిరములను దర్శించి అక్కడికార్యక్రమమును గుర్తించి సలహాలనిచ్చి ఉద్యమప్రచారము చేసితిని.

అప్పటికి కొలది సంవత్సరములకిందట కాంగ్రెసు ఉద్యమములో చేరి మిక్కిలి ఉత్సాహముతో ఉపన్యాసములిచ్చుచు ప్రచారము చేయుచున్న దుర్గాబాయమ్మగారు చెన్నపట్టణములో సముద్రప్రక్కొడ్డున మహాసభలో ఉపన్యసించుచు నేను కొందరు ఐచ్ఛికభటులను తీసుకొని చెన్నపట్టణమునకు రాబోవుచున్నానని ప్రకటించినారు. చెన్నపట్టణములో ఉద్యమము చప్పబడినకారణముచే మనరాష్ట్రమునుండి కొందరు ప్రచారకులటకేగి పట్టుబడుచుండిరి. ఆ సమయమునఏలూరునుండికొందరు మిత్రులతో కలసి నేనుగూడ చెన్నపట్టణమునకు వెళ్ళనలెనని యేర్పాటుచేసికొంటిమిగాని మే మెవ్వరికిని ప్రచురించలేదు. దుర్గాబాయిగారి కెట్లు తెలిసెనో! ఆ విధముగా ప్రచురణచేసిన మరునాడే గుంటూరులో నన్ను ప్రభుత్వాధికారులు పట్టుకొని, కారుమీద నంకదారులవెంట వంగోలు సమీపమున చేరిన మీదట మేదరమిట్ల గ్రామసమీపముగ నడ్డదారి త్రొక్కి అమ్మనబ్రోలు స్టేషనుదగ్గర నొక బంగళాకు చేర్చిరి. నా వెనుక నొక బస్సుమీద పోలీసుభటులు తుపాకులు చేతబట్టి ప్రయాణముచేసిరి. నాకు ముందు మరియొక కారుమీద నొందరు పోలీసోద్యోగులెక్కి దారిజూపుచుండిరి. అమ్మనబ్రోలులో శ్రీ

వెంకట్రామను అను మొదటితరగతి మాజస్ట్రేటును జిల్లాకలెక్టరును సిద్ధముగనుండిరి. వెంకట్రామనుగారియెదుట నన్ను విచారణకు పెట్టిరి. ఉప్పుసత్యాగ్రము మాయింటియావరణంలో చేయబోవుచున్నానని నే నిచ్చిన నోటీసును దాఖలుచేసి కలెక్టరు నాక్ష్యమిచ్చెను. నేను ఉప్పుతయారుచేసి అమ్మకము చేసినట్లును ఉద్యమమున నడిపినట్లును నా స్టేటుమెంటులోనే చెప్పియుంటిని. నన్నపూచీపత్రము వ్రాసి యీవలెనని కోరగా నేను నిరాకరించితిని. ఒక సంవత్సరము పిడిఖైదు విధించి, మొదటి తరగతి ఖైదీగా నన్ను పోలీసుహవాలాలో నుంచిరి. ఆ సమీపమున నొక యింటిలో నొకబ్రాహ్మణిచేవంట చేయించి, నాకు కావలిగా వచ్చిన బ్రాహ్మణ ఇన్‌స్పెక్టరులతోపాటు నాకు భోజనము పెట్టించిరి. నన్ను అక్కడి సత్రము పంచలో నుంచి, నాయెదుట కొందరు పోలీసుభటులనుతుపాకులతోనుకత్తులతోనువరుసగనిల్వ బెట్టిరి. ఆరాత్రి వ్యాసింజరులో మూడవతరగతిబండిలో నెక్కించి నన్ను వేలూరు చెరసాలకు కొనిపోయిరి. నన్ను బండి నెక్కించుటకు తీసుకొనిపోవు సమయముననే శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగారిని ఆ స్టేషనుకు తీసుకొనినచ్చిరి. ఒకరినొకరము చూచుకొంటిమేగాని మాట్లాడుట సంభవించలేదు. మరునాడు ఆయనను విచారణ జరిపి విడిఖైదు శిక్షవేసి మొదటి తరగతిలోచేర్చి వేలూరునకు మూడవరోజు తీసుకొనివచ్చిరి. నాకు జయిలులోకూడ ఆయన సాహచర్యము సమకూడి నందుకు సంతసించితిని. ఇప్పుడు మేజరు శాస్త్రిగారైన డాక్టరు శంకరశాస్త్రిగారు వేలూరు జయిలుకు డాక్టరుగా నున్నందున మమ్మును వారు భార్యాసమేతముగ చూడనచ్చిరి. నన్ను పరీ

ఱించి; దేహము చాల వడలిపోయినదనియు, ఇట్టి సమయమున తెప్పచేయుట క్రమము కాదనియు సూచించినారు. మొదటి రోజున అన్నమునూత్రము పెట్టి దానిలో నుప్పుకణమైనను వేయ లేదు. మేము చేసిన ఉప్పునేరమున కిదియే శిక్ష కాబోలు నను కొంటిని.

క్వారంటైనులో నుండగనే సన్నును, సీతారామశాస్త్రి గారిని చెన్నపట్టణములో పెనిపెనిసియరీకితీసుకొనివెళ్ళిరి. అక్కడ రాజగోపాలాచార్యులుగారు డాక్టరు రాజన్ మొదలగు దక్షిణాది వారు మాత్రమేగాక ఆంధ్ర జిల్లాలవారు పలువురు మిత్రులు గూడ అందుండిరి. అచ్చట 'హా' అను నతడు సూపరింటెం డెంటుగా నుండి, రాజకీయ ఖైదీలపై కారిన్యము వహించి, మాటి మాటికి శిక్షలు విధించుచుండుటవలన అతనిపట్ల ఖైదీలలో వైరుధ్యము ప్రబలసాగెను. ఒకనాడు వెన తరగతి ఖైదీలపైఅయిన పాగించిన దౌర్జన్యమువలన బి. తరగతి ఖైదీలు దీపములు పెట్టు వేళకు గదులకు బోక నిరాకరించిరి. వారిని బలాత్కారముగ వార్డరులే మేడమీది గదులలోనికి తీసుకొనిపోయి తాళములు బిగించిరి. ఇందులకు ఏ క్లాసులోనున్నమేము ఏమిచేయనలెనను సమస్య శ్రీరాజన్, రాజగోపాలాచార్యులు మొదలగువారము కలసి ఆలోచించుకొనుచుంటిమి.

ఇంతలోసన్నును సీతారామశాస్త్రిగారు మొదలగువానిని కొందరిని కన్ననూరు జయిలుకు గొనిపోయిరి. అచ్చటికి ప్రకాశముగారినిగూడ తీసుకొనివచ్చిరి. ఆ జయిలు సూపరిం టెండెంటు గుజరాతి. బొంబాయిలో మాస్టరు అను కాంగ్రెసు

నాయకుని మేనల్లుడు. అతడు సౌమ్యుడు. ఆతని భార్యయు సుగుణవతి. ఒకానొకప్పుడు ఏదియో మాకు ఫలాహారవస్తువులు పంపి, కొంత సానుభూతి చూపుచుండెను. సూపరింటెండెంటు మాకు వడకుటకు రాట్నములు ఏకులును సరఫరాచేసి, వడకుట కనకాశ మిచ్చుచుండెను. తయారైనసూత్రాలు అఖిలభారత చరఖా సంఘమువారికి పంపుటకును వీలు కల్పించుచుండెను. ఇట్లు కొంత కాలము జరిగిన పిదప బి. క్లాసువారో, సి క్లాసువారో యొకరు వారుండిన యింటిపై కెక్కి జాతీయజండా నిలువబెట్టిరి. అందుకు అతనిని క్వారంటైను శిక్షవిధించి పంపివేసిరి జయిలులోని రాజకీయఖైదీలలో అలజడి ప్రారంభమయ్యెను. ఒకబి. వార్డులో చాలభాగము మళయాళీయు వారుండిరి. ఆ వార్డుఖైదీలు మామూలు ప్రకారము ఆరుగంటలకు గదులలోనికిపోక తిరుగు బాటు చేసినందున తక్కిన వార్డులలోనివారి నందరిని గదులలో నుంచి, తాళములు బిగించి, తిరస్కారము చేసిన బి క్లాసువార్డు మీద తీవ్రమైన లాటీప్రయోగము చేయుటచే కొందరికిబలమైన దెబ్బలు తగిలినవి అందులో ప్రముఖుడైన నంబూద్రిపాదు అను నాయకునకు తలమీద బలమైనగాయము తగిలి, రక్తము గారి, గుడ్లు తడిసిపోయినవి. ఆ దెబ్బలు కొట్టునప్పుడు బాధపడుచు పడ్డిన పద్యాలు మాకు వినబడినవి. గదులలో బంధింప బడిన వారము ఏమియు చేయలేకుంటిమి. మరునాడు ఇట్టి తీవ్రచర్యను ఖండించుచు ఏ. క్లాసువారము అసమ్మతి తెలుపుట కొక్కదినము నిరశనవ్రతము పూనుచున్నామని సూపరింటెండెంటుకు వ్రాసి పంపితిమి. సూపరింటెండెంటు మాన్పజూచినను మేము పట్టిన పట్టు నదలలేదు. ఆ రోజుననో, మరునాడో, జయిలును పరిశీ

లించే అధికారేతరులు వచ్చి, మమ్మ్ల సూపరింటెండెంటుగారి ఆఫీసుకు పిలిసించి విచారణ ప్రారంభించిరి. బి క్లాసువారిలో కొందరు మూర్ఖముగ తిరుగుబాటు చేసినను నాయకులు బోధించిన పిమ్మట గదులలోకి పోవుటకు సిద్ధమైనవారిని, గదులలోకి పొండని సదోబ్ధచేసినవారిని గూడ పిచ్చత లేక నిష్కారణముగ పశువులనువలె ప్రహరించిరని బి. క్లాసు పట్టునున సాక్ష్యము వచ్చినది. జయిలుగూడ దగ్గిరనుండి కొట్టించెనని సాక్ష్యులు కొందరు చెప్పిరి. అంతట వార్డరులు ఖైదీలే తిరుగబడి తమ్మ్ల కొట్టుటచే ఆత్మరక్షణార్థము తాము కొట్టవలసివచ్చినదని వాదనచేసిరి. అందులో నొకవార్డరు కాలికి బలమైన దెబ్బ తగిలినదనికట్టుకట్టుకొన్నానని చూపించెను. నేను ఆకట్టు విప్పి దెబ్బ చూపింపుమంటిని. దెబ్బ ఏమియును కనబడలేదు. ఎటొసిరా తోనో మడిదేనితోనోరంగుమాత్రము పూయబడినట్లు కనబడినది. కనుక వార్డర్ల వాదము అబద్ధమని స్పష్టమైనది. పిమ్మట విచారణ ఫలిత మేమైనది మాకు తెలియలేదు. వార్డరులెప్పటియట్లు వారి పనులలో తిరుగుచునే యుండిరి. దెబ్బలు దినిన ఖైదీలను కొన్ని దినములు వెలుపలకు రానీయక నిర్బంధములోనే యుంచిరి. పిమ్మట నంబూద్రిపాదు మా దగ్గరకువచ్చి, తలపై దెబ్బనుజూపి రక్తముచే తడసిన గుడ్డను గూడ తెచ్చి, మా చేతి కిచ్చెను. కాని మే మేమియు పరిహారముచేయలేని దుర్బలుల మైనందుకు విచారించితిమి. ఈ జయిలులో నున్నపుడే డాక్టరు కుగ్లరుచనిపోయిన వార్త నాకు తెలియవచ్చెను. ఆమె పెద్దతనమున వ్యాధిగ్రస్తురాలై బాధపడుచున్నను స్వదేశమునకు పోక, ఏ దేశమున జీవిత కాలము ధారపోసినదో, ఆ దేశమునలే ప్రాణములర్పించనలెనని

దీకుబూని, గుంటూరులోనే మృతినొందినది. ఆమె చనిపోయిన వార్త నాకు మిక్కిలి సంతాపము కలిగించినది.

నా కుమార్తె రెలిరువురును నన్ను చూడవచ్చిరి. బెంగుళూరులో వేసవి గడుపునిమిత్తము పక్షవాతముచే బాధపడుచున్న తల్లిని తీసుకొనివచ్చిరి. తల్లిని బెంగుళూరులో నేయుంచి వారిరువురు నన్ను చూడవచ్చిరి. పిమ్మట కొంతకాలమునకు నా శిక్షా పరిమితి పూర్తికాకమునుపే నన్ను విడుదలచేసిరి. ఆ దినము నన్ను సూపరింటెండెంటుగారి యింటిలోనే యుంచుకొని, మరి కొందరినిగూడపిలిచి, విందుగావించి,చాలమర్యాదచేసిరి.సూపరింటెండెంటుగారు జయిలునిబంధనలనుబట్టి కఠినముగా తాము ప్రవర్తించినందుకు మన్నించమనెని చాల సంతాపముతో వాక్రుచ్చెను. ఆయన భార్య నన్ను చాల దయతో చూచెను.

నేను విడుదలయై వచ్చిన కొలదిదినములకే గాంధి-ఇర్విన్ సమాఖ్య సమకూడినది. ఆ విషయమై ఆనందమును వెల్లడించుచు నొక యుత్సవమును బయలుదేరదీసితిని. పురవీధులలో తిరుగుచుండగా పోలీసులుమాకు సలాములు పెట్టియు, దండమునర్పించియు, మర్యాదను ప్రకటించిరి. ప్రజలు సంతోషముతో నుత్సవములో పాల్గొనిరి. కాని ఆ సాయంకాలము సుమారు మూడు గంటలకు నన్ను మా యింటినుంచి పోలీసు అధికారులు తీసుకొనిపోయిరి. ఈ నిర్ణయానము ఊరిలో ప్రాకిపోయెను. నిష్కారణముగ అన్యాయముగ చేసిన ఈ దుండగము నాక్షేపించి ఖండించుటకు కాంగ్రెసువారు పౌరమహాసభ సమావేశపరచిరి.

పోలీసువారు ఆసభనుచెదరగొట్టిరి.అనేకులకుబలమైనలాటీదెబ్బలు తగిలెను. నేతి వెంకటాచలపతిగారికి మూడుమీద దెబ్బతగిలి, రక్తము కారినది. అన్నాప్రగడ కామేశ్వరరావుగారికి మీగాళ్లమీద వాతలు బడునట్లు తీవ్రముగా లాటీతో బాదినందున గాయములుపడినవి. వీరిర్వురిని మరికొందరినిగూడ నిర్బంధించి జయిలులోపెట్టిరి.శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మగారుమొదలగు స్త్రీలు సభకు హాజరైనందున వారినిగూడ అవమానపరచుచు దూషణవాక్యములు పలికిరి.

వెంటనే నన్ను విచారణసల్పి ఆ రాత్రియే బళ్లారిజయిలుకు పంపనలెనని అధికారులు సంకల్పించిరి. ప్రొద్దు గ్రుంకిన పిమ్మట సుమారు ఏడుగంటలప్పుడు విచారణ ప్రారంభించిరి. ఒకరిద్దరు పోలీసువారిని విచారణచేయునప్పటికి ఏదోయుత్తరము మాజిస్ట్రేటుగారికి వచ్చినది. అది చదువుకొన్నతోడనే విచారణ ముగించి మరునాడుదయమునకు వాయిదా వేయుచున్నానని మాజస్ట్రేటు చెప్పెను. నేను "ఇప్పుడే ముగించి, మీరు పంపదలచినచోటికి పంపు" డని పట్టుదలతో పలికితిని. "మీరిచ్చట జయిలులో నుండలేరా" యని మాజస్ట్రేటు ప్రశ్నించెను. ఎలుకలతో ఈ గదులలో ఇబ్బందిపడుటకంటె పెద్దజయిళ్ళకు పోవుటయే మే"లని చెప్పితిని. కాని వాయిదా అని చెప్పి మాజస్ట్రేటు లేచిపోయెను. మాజస్ట్రేటుకు వచ్చినది జిల్లాకలెక్టరుకు నాపైన జరుపుచున్న కేసుసంగతితెలిసి, నన్ను విడుదల చేయవలసినదని ప్రాసిన యుత్తరమని విచారణసమయమునసే కొంచెము బయల్పడినది.ఆరాత్రి తాలూకాజయిలులోనేయుంచి

మరునా డుదయము స్టేషనరీ మాజస్ట్రేటు నచ్చి మమ్మునందరినీ విడుదలచేసెను. గాంధి-ఇర్విన్ సమాఖ్య జరిగినదను వార్తపై అధికారులద్వారా రాలేదు. నేను సాగించినయుత్సవము శాసనధిక్కారము గనుక నన్నును,తక్కినవారినిజయిలులోపెట్టినామని సమాధానము చెప్పిరి. ఇట్టి దౌర్జన్యమార్గములకు అలవాటు పడినవారే ఇప్పటికిని అధికారముసహించియుండుటచే రాష్ట్రీయ సేవాదళ సత్యాగ్రహులనుగాని, కమ్యూనిస్టులనుగాని పట్టి కొనుటలో విపరీతముగకొట్టి, బండబూతులుతిట్టి, అనమాన పరచి దండగములు చేయుచున్నారు.

ఇట్లు రాజకీయములలో పాల్గొనుము నేను కాలము గడుపుచుండ మా యింటి వ్యవహారములుమాత్రము నానాట దుర్భరములు గాసాగినవి. నా భార్యకు అవి మింత దుస్సహ ములైనవి. నష్టమైన సంతానము నష్టముకాగా నిలిచిన పెద్ద కుమార్తె కాపురమట్లగుటయు అంతకు తన తల్లియు మేన మామయే కారకులగుటయు ఆమెను నిరంతరము బాధించు చుండెను. ఇది యిట్లుండగా రెండవకుమార్తెకుభర్తృనియోగము. అల్లుని బ్రదికించుకొనుటకై పడిన వ్యయప్రయాస లన్నియు వ్యర్థమై, ఆ చిన్నది వితంతువై ఆగని చిచ్చు దాకొల్పెను. ఆ మొండి బ్రతుకైన బ్రతుకకుండ దీర్ఘరోగము వెంటబడి ఆమె బ్రతుకుకూడ అనిశ్చితమాయెను.ఇట్టివిపరీతకాలములలో మధ్య మధ్య నేను జయిళ్ళలో పడియుండుటయు, అట్టి సమయములలో కష్టము లన్నియు నొంటరిగ నీదవలసి వచ్చుటయు, ఎంత కష పడినను తుదకు సర్వము నిష్ఫలముగనే పరిణమించుటయు,

ఆమె ఎంత ధైర్యము సహించినను శరీరము ససిచెడి, వధూమేహ వ్యాధిచే కొంతకాలము పీడింపబడి 1929వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో ఆకస్మికముగ పక్షవాతముచే పడిపోయినది. మొదట స్మృతి తప్పి ప్రాణోపద్రవము కలిగినను, రెండుమూడు రోజులలో స్పృహనచ్చినది. ఎడమచేయి, ఎడమకాలు నశించి తప్పిపోయినవి. మూతి వంకరపోయి, కొంత వికారరూప మేర్పడినది. బుద్ధిబలముమాత్రము తగ్గలేదు. ఏమేమో చికిత్సలు చేయించితినిగాని జాడ్యము నయము కాలేదు ఆమెమంచముపై పడియుండుట తప్పినదికాదు

నా గృహస్థితు లిట్లుండగనే గాంధిజీ ఖద్దరునిధి నిమిత్తము ఆంధ్రరాష్ట్రమునందు సంచారము చేయుచుమని ఆంధ్రరాష్ట్ర సంఘమువారికి తెలియపరచుచు, పర్యటన కార్యక్రమమును నేను నిరాకరణచేయవలెనని వారి యభీష్టమును తెలిపిరి. నేను ఆంధ్ర కాంగ్రెసు సంఘమున కధ్యక్షుడను కాను గాని ఖద్దరు శాఖకు ఏజెంటుగా నుంటిని. భారతచరాసంఘములో యావజ్జీవ సభ్యుడనుగాన నన్ను ఆ పనికి నియమించుట సమంజసమే.

నా కది విధ్యుక్తముగ గ్రహించి, ఇంటిలో కనుపెట్టుకొని యున్నంతమాత్రమున నా భార్యకుగాని, మరెవ్వరికిగాని కలుగ జేయగల మేలేదియు లేదని నిశ్చయించుకొని, ప్రతిజిల్లాలోను ప్రముఖులైనవారికి ఉత్తరములువ్రాసి, వారివారి జిల్లాలలో మహాత్మాజీ దర్శించతగిన గ్రామములు నిర్ణయించి, తెలుపనల సినదని కోరియుంటిని. ప్రత్యుత్తరములువ్రాయుట మనవారికి అభ్యాసము లేమగాన సకాలమునకో కార్యక్రమము నిర్ణయించుట నాకు సాధ్యమైనదికాదు. మాటిమాటికి ఉత్తరములు

వ్రాయుట తప్ప మరియొకమార్గము తోచలేదు. మొట్టమొదట కృష్ణాజిల్లాలో బెజవాడకు మహాత్ముడు చేరినపిమ్మట చూడ దగిన గ్రామములు నిర్ణయముచేయుట సాధ్యమైనది. గుంటూరు జిల్లాలోను అట్లే కార్యక్రమము సిద్ధముచేయుకల్గితిని. తక్కిన జిల్లాలలో ఏర్పాటులు నిర్ణయించుటకు సంజాయిషిరాలేదు. బెజవాడనుంచి నడిగూడెమువెళ్ళి అచట జమిందారుగా రొసగిన కట్నమునుతీసుకొన్నపిమ్మట సాయంకాలము గాంధిమహాత్ముడు నన్ను పిలిచి పర్యటన కార్యక్రమము తయారైనదా యని ప్రశ్నించిరి. తయారుకాలేదని తెలియచేసితిని. అంతటవారు మిక్కిలి అసంతుష్టిని ప్రకటించుచు 'ఎథల్ రెడ్ ది అన్ రెడీ' యన్నట్లు 'ఆంధ్ర ది అన్ రెడీ' అని నేను ప్రకటించవలసివచ్చు నని నన్ను హెచ్చరించిరి. కొలదిరోజులలోనే కార్యక్రమము సిద్ధముచేయుదునని చెప్పితిని. అంతట మరునాడు బెజవాడ వచ్చి బెజవాడలో సభ జరిగినపిమ్మట మచిలీపట్టణమునకు బోతిమి. శ్రీ పట్టాభిసీతారామయ్యగారియింట బస ఏర్పరచిరి. ఈ లోపల నేను మరల ఇతరజిల్లాప్రముఖులకు కార్యక్రమము సిద్ధము చేయుటకు తగిన సంజాయిషీ పంపవలసినదనియు, లేదా సంజాయిషీ యీయగలవారిని పంపవలసినదనియు గట్టిగా వ్రాసితిని. శ్రీ హరిసర్వోత్తమరావుమొదలగువారు బందరు చేరిరి. వారితో ఒకరాత్రి కూర్చుండి కార్యక్రమము సిద్ధముచేసి, మహాత్మునికందచేసితిని. వారు సంతసించిరి. బందరులో జాతీయకళాశాల హరిజనవిద్యాలయము మొదలగు సంస్థలను దర్శించి, సాయంత్రము పౌరమహాసభలో ఉపన్యాసముచేసి, అలసియు వారాత్రి చాల ప్రొద్దుపోవువరకు యంగిండియా పత్రికకు వ్యాస

ములు వ్రాసి, మరునాటి పోస్టుకు పంపివేసిరి. చాలప్రొద్దుపోయి నిద్రించినను తెల్లవారుఝామున నాల్గుగంటలకులేచి ప్రార్థనాది నిత్యకృత్యములుతీర్చిరి. నియమపూర్వకముగ గాంధీజీ ఆచరించు ఈ యవిరత కర్మయోగము మా కందరకు గుణపాఠముగ నుండెను.

మరునాడు అవనిగడ్డతాలూకాలోని ముఖ్యగ్రామములు రాత్రి దీపములుపెట్టుటలోపల ముగించునట్లు కార్యక్రమము నిర్ణయింపబడెను. త్రోవలో ఆలస్యమగుటచే అవనిగడ్డకు రాత్రి పదిగంటలకు చేరగలిగితిమి. కాని అనుకొన్నయూళ్లు కొన్ని పదలనలసివచ్చెను. అక్కడ సభ ముగించుసరికిను ప్రొద్దు పోవుటచే నేనును పట్టాభిగారుగూడ యోచించి, మిగిలిన యూళ్ళను పదలివైచి అవనిగడ్డతోడనే ముగించితిమి. మహాత్మునితోమాత్ర మామాట చెప్పమైతిమి. అచ్చట నారాత్రి వారు విశ్రమించిరి. ఇంతలో పదలివేయబడిన గ్రామప్రముఖులు కొందరు వచ్చి, ప్రజలు సాయంత్రము నాలుగుగంటలనుండి మహాత్ముని రాకనిమిత్తము ఎదురుచూచుచు ఇప్పటికిని వేచి యున్నారుకాబట్టి మహాత్ముని తీసుకొనివెళ్లుటకు వచ్చినామనియు, రాకతప్పదనియు, పట్టుపట్టిరి. అప్పు డేమిచేయుటకును తోచక, కొంత వ్యాకులతనొంది, చివరకు మహాత్మాజీతో పదలివేయుబడినగ్రామవిషయమై తెలిపి, అక్కడనుండి కొందరు వచ్చి, రమ్మని పట్టుపట్టుచున్నారని తెలిపితిని. అప్పు డింకను నిద్ర పట్టియు పట్టకుండ విరమణ నపేక్షించుచున్న మహాత్మాజీ మాగుపలుకక, వినుగుకొనక, లేశమైనను అసంతృప్తిచూపక నా మాటలు వినుటతోడనే మంచమునుండి లేచి పయనమైరి.

మహాత్మాజీతో పట్టాభిగారును, నేనును ప్రయాణము చేసి, ఆ గ్రామము రాత్రి పండ్రెండుగంటలవేళ చేరితిమి. సాయంకాలము నుంచి వేచియుండిన స్త్రీ బాల వృద్ధులందరు మహాత్ముని దర్శించుటతోడనే ఆకర్షము నంతయు మరచి, మహదానందపరవశులైరి. తిరిగి అవనిగడ్డ చేరుసరికి రెండుగంటలరాత్రిఅయినది. ఇట్టి అతికష్టమగు కార్యక్రమముచే వారి కాయాసము కల్పించవలసి వచ్చెనని నేనును, పట్టాభిగారుకూడ మిక్కిలి నొచ్చుకొంటిమి. గాంధీజీ మమ్ములను నిద్దరిని సంబోధించి, "మీశిరముపై మహా భారము వహించినారు. ఈసమయమున నా కేమైన యుపద్రవము సంభవించెనేని యావదాంధ్రదేశము మిమ్ము శపించును" అని వాక్రుచ్చిరి. పిమ్మట సంచారములో కాలనియమముల నతిక్రమించుచునచ్చినను మరియొక్కచోటతప్ప ఇంతటి కాలాతిక్రమణ మరి యెక్కడను జరుగలేదు.

కృష్ణాజిల్లా ముగించుకొని, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరిజిల్లాలలోని ప్రధానపట్టణములును ముఖ్యగ్రామములును దర్శించుటయ్యెను. పశ్చిమగోదావరిలో రాజులు అత్యుత్సాహముతో మహాత్మని సన్మానించి, భూరివిరాళముల నొసంగిరి. దండు నారాయణరాజు, డాక్టరు మూలూ్పారి రంగయ్య మొదలగువారు ఈమండలములో గొప్ప కృషిసల్పిరి. తూర్పు గోదావరిజిల్లాలో బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యముగారును, బులుసు సాంబమూర్తిగారును గొప్పప్రయత్నములు గావించి సంచారము జయప్రదముగావించిరి. రాజమహేంద్రవరములో ఉదయము సభ ముగించుకొని రైలుమీద మరియొక్కచోటికి పోవలెనని సిద్ధమగునప్పటికి మోటారుకారు చిక్కకపోయెను.

అంతట గుర్రపుబట్కా నెక్కి మేము ప్రయాణమైతిమి. బండి త్వరితముగనే పోవుచుండెను. ఇంకను త్వరగా తోలవలసినదని బండిమనుష్యుని గాంధీజీ మాటిమాటికి హెచ్చరించిరి. ఆబండిలో కుదుపు నించుకయు లెక్కింపకుండుట గాంచి నాకు మనస్సు నీరైపోయెను. పశ్చిమగోదావరిజిల్లాలో పాలకొల్లు వెళ్ళినపుడు పాఠశాలాభవనములో బస యేర్పాటుగావించిరి. శ్రీమంతులగు సచటి నర్తకులు మహాత్మాజీనిమిత్తమై యొకగది ఏర్పాటు చేసిరి. దాని ప్రక్కనున్న గదిలో మాకందరికి వంటనిమిత్తము కూరగాయలు మొదలగుసామానులు గుట్టలుపోసియుంచిరి. కొంచెముసేపటికి గాంధిజీ ఆగదిలోనికి వచ్చి, కుప్పలుకుప్పలుగ నున్న కూరగాయలను జూచి, "యింతసొమ్ము వ్యర్థముగ వ్యయముచేయుట వెఱ్ఱితన" మని చెప్పి, ఆకూరగాయలను వారు మరల ఎత్తుకొనిపోవువరకు విడువరైరి.

గూడూరి రామచంద్రరావుగారు గుడివాడలో హరిజనులయందు మిక్కిలి యభిమానము గలిగి, వారినిమిత్తము విద్యాశాలను, వసతిగృహమును ఏర్పరచి, పాటుపడుచు సంఘ బహిష్కారమునకుగూడ లక్ష్యముచేయుక పనిచేయుచుండిరి. వీరు మహాత్మునితో తాను చేయుచున్న హరిజనోద్ధరణ కార్యములనుగూర్చి చెప్పి ఆపనులనిమిత్తము పదునారువేల రూపాయలను గొనివచ్చిరి. అదిగాక కర్నూలుజిల్లాలో ఖద్దరుత్పత్తిస్థానమును స్థాపించి, దానినిమిత్తము దాదాపు రు 60000/- అఖిల భారత చరాసంఘమువారియొద్దనుండి తీసుకొనివచ్చి ఖర్చు పెట్టిరి. ఈ ప్రకారము సాగించినపనులు కొలదికాలములోనే అంతమొంది, చాలవరకు నిష్ప్రయోజనముగ పరిణమించినవి. ఈ

విషయమైన సంజాయిషీ మహాత్మాజీకిగాని అఖిలభారతచర్కా సంఘమువారికిగాని వారు చెప్పకపోయిరి. రామచంద్రరావుగారు తమతాలూకు ఆస్తినికూడ చాల వ్యయముచేసి, ఆర్థికముగ దైన్యస్థితిని పొందిరి. కృష్ణాజిల్లాలో పర్యటనచేయునప్పు డెచ్చటనైన రామచంద్రరావుగారు కనపడకుండునా యని మహాత్మాజీ వారినిగురించి పలుమారు ప్రశ్నించుచుండిరి. తుదకు గుడివాడలోనేకాబోలు రామచంద్రరావుగారు మహాత్మాజీయొద్దకువచ్చిరి. ఆయనపై మహాత్మాజీ ఎంత కోపింతురో యని మే మనుకొంటిమి. కాని ఆయన కనుబడి, నమస్కరించి, నిలువబడినతోడనే మిక్కిలి శాంతవచనములతో "మిమ్ము చూడవలెనని ఎదురుచూచుచుంటిని. ఇంతకాలము దాగియుండనేల? అలవిగాని పనులు పైన బెట్టుకొనినేల? ఆపనులు నెరవేర్చలేనందుకు తగిన సంజాయిషీ ధైర్యముగా చెప్పకపోవుటేల?" యని మృదువచనములతోడనే హెచ్చరించి ఆయన భయమును తీర్చెను.

విశాఖపట్టణములో నొకరాత్రి పండువెన్నెలగాయుచుండ చల్లనిగాలి మెలమెల్లగ వీచుచుండ సముద్రతీరమున గాంధిగారును, నేనును షికారుచేయుచుంటిమి. మేముతప్ప మాతో మరెవ్వరు నప్పుడు లేరు. శరీరపరిస్థితులు, మనఃపరిపాకము, ఆత్మనిగ్రహము మొదలగువిషయములు ముచ్చటించుచు ఆత్మనిగ్రహమునకు అపక్వాహారము గొప్పసాధనమని మహాత్ముడు నుడివెను. రాజమహేంద్రవరములో సరికిలి సుందరగోపాలరావుగారను వారు తొట్టిస్నానమునందు విశేషానుభవము సంపాదించిరి. వారు మహాత్మాజీని కలుసుకొని, అపక్వాహారులకు కొన్ని మొక్కలు, ఆకులుగూడ ప్రయోజనకారులని చెప్పిరట.

కావున ఆయాహారమును తా మప్పుడు అభ్యసించుచుంటిమని గాంధీజీ వివరించిరి. నన్నుగూడ శాకాహారము ననలంబింపుమని ప్రోత్సహించిరి. మనునాటినుండి నేనుగూడ అపక్వశాకాహార మును తినుట కారంభించితిని. కొబ్బరియును, మరికొన్నిపదార్థ ములను కలిపిచేసినముద్ద వారితోగూడ తీసుకొనివచ్చిరి. అది కొంచెము మహాత్మాజీ ప్రతిదినము పుచ్చుకొనుచుండిరి, అది యును నా కిచ్చుచుండిరి.

తూర్పుగోదావరిలో రాజోలుకు పోయినప్పు డొకపెంకు టింటిలో మహాత్మాజీకి బస ఏర్పాటుచేసిరి. ఆయింటిలో నేల గచ్చుచేసినదికాదు. పేడతో అలికి శుభ్రపరచియుంచిరి. గాంధిజీకి మలవిసరనార్థ మవసరమగు కమ్మోడులేకపోవుటచే రాళ్ళతో నొక పొయిగా నమర్చిరి. ఈఏర్పాటులు బాగుగ నుండలేదని మహాత్మాజీ పరివారములోనివారు సణుగనారంభించిరి. అంతట మహాత్మాజీ వారిని పిలిచి, ఇంతవరకు ఇంటివారు చేసినవసతు లకు మనము సంతసించి, వారికి కృతజ్ఞులమై యుండనలెను. వారు చేయగలిగినంత చేసి ఎంతయో దాక్షిణ్యమును చూపిరి. మీరు అసంతుష్టిచూపుట న్యాయముగాదని వారిని గట్టిగ మందలించిరి.

మరియొకచోట బస చేసిన యింటిలో మహాత్మాజీతో వచ్చినవారు వంటలుచేసికొని, భోజనములు ముగించినపిమ్మట, పయనమునకై సామానులు సర్దుకొని మోటారుకా రెక్కబోవు చున్నప్పుడు మహాత్మాజీ తిరుగ ఆ యింటిలో వంటగదిలోనికేగి అక్కడ వంటచేసినచోటును శుభ్రపరచక యుండుటచూచి, తమ వారినిపిలిచి "మన కీ వంటిల్లు నిచ్చినప్పు డెట్లుండెనో

ఇప్పుడు దాని నెట్లుంచివెళ్లుచున్నారోచూడుడు?ఇంతఅపరిశుభ్ర ముగ వదలి వెళ్లుట న్యాయమా ?'' యని హెచ్చరించి, ఆ స్థలమును బాగు చేయించిన పిమ్మటనే పయనమైరి. గుంటూరు జిల్లా సంచారములో రెంటచింతల గ్రామమందు గాంధీజీకి తగిన సదుపాయము లొనర్పలేకపోతిమి.

ఇదిగాక వారికి బసగా నేర్పరచిన తాటియాకుల వసారా ఖద్దరుతో కప్పివేయుటయు, కాళ్లక్రింద సయితము ఖద్దరును పరచుటయు చూచి ఖద్దరు నంత నిర్లక్ష్యముగా భావించినందుకు గాంధీజీ మమ్మ తీవ్రముగా మందలించిరి. ''మీ ఆధిపత్యమున జరుగుచున్న ఖద్దరు సంస్థ ఇట్లు ప్రవర్తింపదగునాయని హెచ్చరించిరి. అచట గాంధిగారు స్నానముచేసి, భుజించి, విశ్రమించు నప్పటికి సాయంకాలము దాదాపుమూడుగంటలయ్యెను. నేనును సీతారామశాస్త్రిగారును మాపేర్పాటుల లోపముచే మహాత్మాజీకి, పరివారమునకు కలిగిన కష్టమునకు పరితపించి, ఆరోజు మేమిర్వురము ప్రాయశ్చిత్తముగ నిరశనముంటిమి. మే మేమి చేయుచున్నామో చూచిరమ్మని మహాత్మాజీ కార్యదర్శిని పంపిరి. ఆయన మేము పరుండియుండుటజూచి, వారితో చెప్పెను. మేము కొంతవడి నిద్రించి లేచి, మహాత్మాజీయొద్దకు పోతిమి. ''మీ రీదినము భోజనము చేయలేదా'' యని ప్రశ్నించిరి. లేదని ప్రత్యుత్తరము చెప్పితిమి. ఇతరుల లోపములకు తాను నిరశన వ్రతము బూనువాడగుటచే మేము గావించిన తప్పిదమునకు మేము నిరశనవ్రతము బూనుట సహజమని తలంచి కాబోలును, వారు మరేమియు ప్రస్తావించలేదు. పల్నాడులో సంచారమిట్లు ముగిసినది.

వినుకొండ తాలూకా ముప్పాళ్ల వైశ్యులు గాంధీజీ ఎన్ని పాటులు తూసుదురో ఊహించి అంత బరువుగల రూపాయలను కానుక సమర్పించిరి. ఆంధ్రవైశ్యులు గాంధీజీయంతటి మహానుభావుడు తను కులములో జన్మించెననిగర్వించుచుందురు. కొందరికి గాంధీజీ తమయింట కాలిడినయెడల తమ వ్యాపారము కలిసివచ్చునని విశ్వాసము. 1921లో గాంధీజీ గుంటూరుకు వచ్చినపుడు వద్ది వెంకటసుబ్బయ్యగారియింట బస చేసెను. ఆ నాడు వారు ఉపవాసముండినందున నీళ్ళుతప్ప ఏమియు గ్రహించలేదు. కాని ఆ సంవత్సరము వెంకటసుబ్బయ్యగారికి వ్యవహారములో గొప్పలాభము లభించినదని వారు చెప్పుకొను చుండెడివారు. ఖద్దరునిధి వసూలు నిమిత్తము గుంటూరువచ్చి నప్పుడు సయిత్రము తన యింటనే మహాత్ముని నిలుపుకొనవలె నని వారు చాలప్రయత్నము చేసిరి. పట్టణములోసంపన్నులమధ్య నిట్టి పోటీలువచ్చినందున రాధారి బంగళాలో బస ఏర్పరచితిమి. ఒకనాటిరాత్రి గుంటూరుచేరునప్పటికెప్రొద్దుపోయినది. మహాత్మ డెక్కిన కారు వద్ది సుదర్శనముగారిదేయగుటవలనదానినిరాధారి బంగళాకు కొనిపోవుటకు బదులు డయిసరు వెంకటసుబ్బయ్య గారియింటినద్ద నిలిపెను. ఇచ్చటదిగవలసినదని సుదర్శనముగారును వెంకటసుబ్బయ్యగారును కోరుటకు వచ్చుచుండిరి. గాంధిగారును దిగుటకు సంసిద్ధులగుచుండిరి. నేను మాత్రము వలనుపడదని నిరోధించితిని. నేను వలదనుటతోడనే గాంధిగారు కారునుండి దిగుట మానుకొనిరి. వెంకటసుబ్బయ్యగారు ప్రాధేయపడసాగిరి. నేను "ఈ యిల్లుకార్యక్రమములో లేదుగనుక అచ్చట ఆగుటకు వీలు లేదని" "పట్టుపట్టినమీదట చేయునదిలేక, మోటారును

రాధారిబంగళాకే తీసుకొని వెళ్ళిరి. మహాత్మాజీ "అంతగా వారు ప్రాధేయపడినప్పుడు దిగకపోవుటేల"యని నన్ను పిమ్మట ప్రశ్నించిరి. "పట్టణములో పౌరులు వెంకటసుబ్బయ్యగారివంటి వారు పలువురు గలరు. వారునుతమయిల్లకు మీరాకిక్కోరుదురు. ఈ స్పర్ధను పరిహరించుటకే రాధారిబంగళాలో బసఏర్పరచితిమి. ఈ రాత్రి వెంకటసుబ్బయ్యగారియింట దిగినచో వారి యందు పక్షపాతము వహించిన ట్లగును. అని వినరించిన మీదట మహాత్మాజీ నా అభిప్రాయము లెస్సగా నున్నదనిరి. కాని ప్రజలలో నిట్టి దురభిమానము లుండుటకు వగచిరి. ఇదిగాక, సంచార భారము నాపై నుంచిన కారణమున నా అభిప్రాయ మును పాటించనలయునను భావమును అప్పుడప్పుడు ప్రకటించు చుండిరి. ఇది వారి గొప్పతనమునకు నిదర్శనమై, నా యట్టి వారికి మార్గదర్శకముగ నుండెను.

నెల్లూరు మండలసంచారములో బుచ్చిరెడ్డిపాలెమువెళ్ళి నప్పుడు గోపాలరెడ్డిగారి సమీపబంధువొక యువతి క్షయ వ్యాధిచే మంచమెక్కి చాల కృశించియుండెను. ఆమె మహాత్ముని దర్శించవలెననిచాల ఆశతోనున్నదని మనవిచేయగా మహాత్మాజీ దర్శనమొసగి ఆమెకు మహదానందము గూర్చెను. ఆమె తనకు మరణ మాసన్నమైనదనుటగు ర్తించి, ధైర్యము వీడని యుండెను. రూపవతి విద్యావతి బుద్ధిమతియునగు నా యువతి దురవస్థకు మహాత్మాజీ వగచి "సద్గతికై పరమేశ్వరునిధ్యానింపు" మని ఆమెకు బోధించెను. ఆ దృశ్యముచే బుద్ధదేవుడును ఏసు క్రీస్తును ఎదుట మెరసినట్లయి నా కనులు చెమ్మగిలినవి.

శ్రీమతి దుర్గాబాయిగారు కాకినాడనుండి గాంధీజీతో సంచారముచేయుచు, గాంధీజీ ప్రసంగముల నామె తెలుగు చేయుచుండెను. నెల్లూరులో గాంధీజీ "ఆమె మనతో వచ్చుట కొక కారణమే" యని నన్ను ప్రశ్నించిరి. నాకు తెలియదనియు నన్ను అడిగి రాలేదనియు నేను తెలిపితిని. ఇక మనతో వచ్చుట మానునట్లు చెప్పనలసినదని నాకు చెప్పిరి. ఆ ప్రకారమే నేను ఆమెకు తెలియజేసితిని. నెల్లూరునుండి ఆమె మరలిపోయిన పిమ్మట ఉపన్యాసములను మిడిమిడి హిందీజ్ఞానముతో నేనే తరుమాచేయుచుంటిని. వారునా అల్పజ్ఞానమునుకనిపెట్టి సులభ శైలిని హిందీలో భాషించుచుండిరి.

ఈ సంచారమునందు మొదటికోజులలో నేను రాత్రులు ఎసూ్టలైనసొమ్మ్ము లెక్కచూచి, మొత్తము తేల్చి, మహాత్మునకు స్వాధీనముచేసి, మరునాటిప్రయాణమునకు కావలసిన ఏర్పాటులు ముగిసినపిమ్మటగాని పరుండుటకు అవకాశము లేకపోవుటచే ఉదయమున నిద్ర లేచుట ఇంచుక ఆలస్యమై పది పండ్రెండు నిముషములు జాగగుచుండెను. గాంధీజీ తన గడియారము చూచి యిన్ని నిముషము లాలస్యమైనదని హెచ్చరించెడి వారు. కొన్నిదినములు గడచునప్పటికి వారు సిద్ధమగుటకు నాలుగు నిముషములు ముందుగనే వారియొద్దహాజరై సర్వమును సిద్ధముగ నున్నదని తెలుపసాగితిని. "అప్పుడే వచ్చితివా" యని నవ్వేడివారు. అది నాకు సంతోషము కల్పించుచుండెను. నెల్లూరినుండి కాళహస్తిచేరి, చిత్తూరుమండలము ప్రవేశించితిమి. కాళహస్తిలో పెద్ద కంచుమరచెంబును కానుకగ సమర్పించిరి.

ఆ సంచారములో వస్తురూపమగు కానుకలెల్ల వేలముపాడి, నిధికి జమకట్టుచుండెడివారు. కాని ఈ వరచెంబు స్వంతముగ వినియోగించుకొండని ప్రాధేయపడగా నంగీకరించిరి.

చిత్తూరు, అనంతపురమండలములు సంచరించి కర్నూలు చేరితిమి. అచట ఉదయమున పదునొకండు గంటలకోపలనే మహాసభ ముగించుట, మహమ్మదీయులతో సంప్రదించుట మొదలగునవి ముగిసినవి. భోజనానంతరము గాంధిగారు విశ్రమించిరి. కర్నూలునుంచి బళ్లారికి తొంబదిమైళ్లు మోటారుపై పయనముచేసి, ఆరుగంటలకు బళ్లారి మహాసభలో పాల్గొనవలెనని ఏర్పాటు. మధ్యాహ్నము సుమారు ఒంటిగంటకు కారుల విషయమై విచారించగా, నమ్మకముగా అంతదూరము పోదగిన కారు లేదని తేలినది. కావున ఆరుగంటలకు బళ్ళారి సభకుపోవుట యసంభవమని ధృష్టమైనది. విశేషముగ శ్రమపడి అప్పుడప్పుడే నిదురించుచున్న మహాత్ముని మేల్కొలిపి, ఈ వర్తమానము తెల్పుటకు వెంటనే సాహసించక ఇంచుక యోచించి, నిద్రాభంగము కావించియైన వారికీపరిస్థితి తెల్పుట అవసరమని మేల్కొలిపి, బళ్లారికి పోవుటకు మోటారు లభ్యముకాలేదని మెల్లగ తెల్పితిని. రేపటిఉదయము చేరుదుమని బళ్లారికి తంతి పంపవచ్చునని సలహానిచ్చితిని. వారు "కాదు కాదు. ప్రజలు మన రాకకు నిరీక్షించుచుందురు. వారికి ఆశాభంగము చేయ కూడదు. ఈ నాడు బళ్లారి చేరుటకు రైలులేదాయని ప్రశ్నించిరి. ఇమగో కొలది నిముషములలో రైలుబండి కర్నూలు స్టేషనులో కూతవేయుటకు సిద్ధముగానున్నదని చెప్పుటతోడనే మూట

ముల్లెలు కట్టివేయుడని తొందరించి, రైలుప్రయాణము ఖాయ
పరచిరి. అంతట సామానులు తీసుకొని బండ్లనెక్కి రైలుస్టే ష
నులో వాలితిమి. రైలధికారులు మారాకనుచూచి రైలుబండినిం
చుక ఆపిరి. మేము రైలు నెక్కితిమి. బళ్ళారికి రైలుమీదవచ్చు
చున్నామని తంతి పంపితిమి. బళ్ళారి చేరునప్పటికి ఆ రాత్రి
రమారమి పండ్రెండు గంటలు మీరినది. దాదాపు నలుబదివేల
ప్రజలు రైలుస్టేషను దగ్గర క్రిక్కిరిసియుండిరి. ఈ ప్రజావ్యూ
హము మీందుకుతోసుకొనిపచ్చుచుండ మహాత్మునికారుదగ్గరకు
తీసుకొనిపోవుట చాలకష్టముగనుండెను. గాడిచర్ల హరిసర్వోత్తమ
రావుగారును మరికొందరు వాలంటీరులును గాంధిగారిని కారు
నెక్కించి మహాసభకు గొనిపోయిరి. వారివెనుక స్టేషనులో
ప్రజలలో నేను చిక్కుకొనిపోతిని. ఆ యొత్తిడిలో నా దేహము
నలిగి శిథిలమైపోవు పరిస్థితియేర్పడెను. పైనవేసుకొనిన ఉత్తరీయ
మెక్కడనో జారిపోయినది. కట్టుకొనిన ధోవతియును వదలి,
పడిపోవుటకు సిద్ధమైనది. ప్రజలతోపిడిలో నా ప్రాణములు
నిలుచుటయే దుర్భరముగ తోచినది. ఇంతలో నెవ్వరో దయా
పరుడు నన్ను గుర్తించి తన చేతులతో నన్నెత్తుకొని, ప్రజలు
పోవువైపునకుగాక వెనుకకు తీసుకొనిపోయెను. వెనుకకు నడచుట
సులభముగ నుండెను. ఆయన నన్ను సభాస్థానమునకుమరియొక
దారిని చేర్చి, అదృశ్యుడయ్యెను. ఆయన ఎవ్వరో నే నెరుగను.
వివరములు తెలుసుకొనుటకు ముందే ఆయన నాకు కనపడక
పోయెను. ఎవ్వరో పరమేశ్వర ప్రేరితుడై నన్ను ఆపదనుండి
తప్పించుటకు వచ్చిన మహానుభావుడని ఆయనను కృతజ్ఞతతో
తలచుకొందును. నేను సభావేదికయొద్దకు చేరునప్పటికి పౌరులు

సన్మానపత్రము లర్పించుచుండిరి. లింగాయతు లొకటియు, తక్కినహిందువులు మరియొకటియు మహమ్మదీయులింకొకటియు విడి విడిగ సమర్పించిరి. వానిలో నొక సమ్మానపత్రమున ఖద్దరు తుండుమీద అచ్చొత్తించియిచ్చిరి. నేను సభావేదిక నెక్కుట తోడనే గాంధీజీ "ఆహా! నచ్చితివా?" అని నన్ను సంబోధించి చొక్కాగాని, ఉత్తరీయముగాని లేక బడియొట్టితో నున్న నాపైని ఆ ఖద్దరుతుండును విసిరివేసిరి. నేనుదానిని కప్పుకొంటిని.

బళ్ళారినుండి మరునాడుదయము ఆదోని చేరనలయు నని ఆ రాత్రి రెండుగంటలకు రైలు సేషనుకుచేరితిమి. సేషనులో మహాత్మాజీకి, వారిపరివారమునకువిశ్రమించుటకు వసతులేర్పరచి, నేను నా పక్కచుట్టును సేషనులో మరియొకచోట పరుచుకొని పరుంటిని. మహాత్మాజీ నన్ను వెదకికొనుచు వచ్చి, నేను పరుంటినో లేదోయని చూచి ఆ పిమ్మట తాను విశ్రమింప బోయెను. అనుచరులయెడ మహాత్మాజీకిగల శ్రద్ధకు ప్రేమాతిశయమునకు నిట్టి నిదర్శనము లెన్నో కలవు.

రైలులో రెండవతరగతిబండి ఖాళీగా లేకపోవుటచే మహాత్మాజీనిమి త్తము ఖాళీ చేయవలసినదని కోరగా అందున్న వారు వెంటనే ఖాళీచేసి, ఇతరబండ్లలో నెక్కిరి. మహాత్ముని ఆ పెట్టె చెంతకు తీసుకొనిపోయినప్పుడు "ఇతరులెవ్వరు నిందు లేరా" యని ప్రశ్నించిరి. ఎక్కిన బాటసారులు మా కోర్కెపై ఖాళీచేసి"రని తెలిపితిమి. అట్లు ఖాళీచేయించుట న్యాయము కాదని చెప్పుచు మూడవతరగతి బండిమీదనే పయనమైరి. మహాత్మాజీని పట్టుకొని నిర్బంధింతురని బళ్ళారిస్టేషనులో నంద

రును చెప్పుకొనసాగిరి. కొందరు పోలీసధికారులు స్టేషనులోకి రాగా, మహాత్మాజీని పట్టుకొనుటకే వచ్చిరనిమేము తలంచితిమి కాని. వారు మా పెట్టె వెనుకనున్న మరియొక పెట్టె నెక్కి-గుంతకలుకు వచ్చిరి. అక్కడ పట్టుకొందురనుకొంటిమిగాని అటు జరుగలేదు. బండిలోనే తమరిని పట్టుకొన్నయెడల మే మేమి చేయవలె నని ప్రశ్నించితిమి. మీరు వెనుదీయుక ఉద్యమము సాగించుటయేకర్తవ్యమనినొక్కివక్కాణించిరి. ఇట్లుసంభాషించుచు గుంతకల్లుచేరునప్పటికి ఆదోనికిపోవుబండి సిద్ధముగ నుండెను. మా సామానులను తీసుకొనిపోవుటకు కూలీలను పిలిచితిని గాని ఎవ్వరును రాలేదు. అంతట గాంధీజీ తామొక మూట చేతపట్టుకొని బండిదిగుటతోడనే తల కొక సామాను చేతబట్టు కొని పరివారము బయలుదేరెను. వెంటనే ఆదోనిపోవు బండినెక్కితిమి. ఆదోని సభలో నుపన్యసించుచు గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర సంచారము చాల సంతృప్తికరముగ నున్నదని చెప్పి, సంచారము జయప్రదముగ సాగించినందుకు నన్ను శ్లాఘించిరి. పర్యటనములో తమకు రాజోపచారములు జరిగి నట్లును, నాకు సమయమునకు భోజనములేక, రాత్రులు తగినంత నిద్రలేక, సౌకర్యములు విచారించువారులేక నేను అనేక బాధ లకు లోనై ఆ భారమును నిర్వహించినట్లును, ఇటు నే నంగరక్షకుడుగా నున్నచో ఎన్నిసారులైన తాము పర్యటనమునకు సిద్ధమగుచుమనియువాక్రుచ్చిరి. ఆ ప్రశంసకునిజముగా నాకుతోడైన కాంగ్రెసువాదులును మరియితరులు నగుదురుగాని నేను గానని నా మనస్సున తలంచితినికాని, నా ప్రక్క నన్ను తినుకొని యున్న దివానుబహద్దరు రంగనాధముదలియారుగారు ఆనందిం

చుచు నన్నభినందించసాగిరి. గాంధీజీ అంతటితో పిదుపక నా వలన వారికొక సద్గుణ మలవడెనుగాన నన్ను తమకు గురువుగా భావించుకొనుచుంటినని చెప్పి ముగించిరి.

పిమ్మట మహాత్మాజీతో ముచ్చటించుచు నన్నింతగా శ్లాఘించుట కనస్థానమనియు నేను వారికి గురువని చెప్పుట విపరీతముగ నున్నదనియు మనివిచేసితిని. తాముతమకు తోచిన సత్యమును బలికిరిగాని అతిశయమేమియు లేదనియు,తమకు నేను గురువనునిషయమున సందేహము లేదనియు, నొక్కి పల్కి నన్ను బహూకరించిరి, నాకు సత్యవాదులనుటకు సంశయము లేదుగాని నే నెంత ఆలోచించిన వాకు నావలన క్రొత్తగ నెరుగదగిన విషయమేదియు లేదని హృదయమున నాకు విస్పష్ట ముగనే యున్నది. అల్పుడనైన నేను మహాత్మునకు గురువునగుట అసంభవము. "దీనిభావమేమి తిరుమలేశ" అని అజ్ఞానము ప్రకటించుటతప్ప వేరొక సమాధానము కుదురుటలేదు.

ఆదోనితో ఆంధ్రరాష్ట్రపర్యటనము ముగిసినది. మరునాడుదయమునబొంబాయికిగాంధిగారుప్రయాణమగుచుండగనేనును సీతారామశాస్త్రిగారును సెలవుగైకొనబోయినప్పుడుమాయిద్దరిని తప్పక బొంబాయిరానలెనని కోరిరి. అంతట మేమును వారితో ప్రయాణమైతిమి. బొంబాయిలో మహాత్మాజీ తోడనే మేమును బసచేసితిమి. మేము మేడమీద డాబాపైనపరుంటిమి. మహాత్ముడును ఆ డాబా మీదనే పరుండెను. మేము సుఖముగ పరుంటిమని తెలుసుకొన్న పిమ్మటనే వారు పరుండబోయిరి. మహాత్మాజీని బొంబాయిలో పట్టుకొందురను వార్త

బలముగ నుండెను. మహమ్మదాలీషౌకత్ ఆలీగార్ల నంతకుముందే బంధించిరి. ఆ సోదరులు సైనికులకు రాజద్రోహము బోధించుచు చేసిన ఉపన్యాసమే అందుకు కారణము. ఆ ఉపన్యాసమునే డెబ్బదిమంది కాంగ్రెసువాదులు బలపరచుచు సంతకములు చేసి, ప్రభుత్వమునకంపిరి. ఆ ప్రకటనక్రింద నేనును సంతకము చేసితిని. ఈ కాంగ్రెసు ప్రముఖులసభ యొకమేడమీద జరిగినది. మేడ నుండి దిగుటకోడనే గాంధీగారిని పట్టుకొందురని పెద్దపులుకారు బయలుదేరెను. ఆ సభలో లజపతిరాయిగారు మహాత్మాజీని సంబోధించుచు మిమ్ము పట్టుకొన్నయెడల మేమేమిచేయునలేనని యడిగిరి. ప్రభుత్వ సేనాశిబిరముపై దాడివెడలి, తుపాకిదెబ్బలకు గురియగుటయే మీకు కర్తవ్యమనిగాంధీజీ సలహానిచ్చిరి. "మహాత్మా! మాకు ఇంతకంటె సుకరమైనమార్గము చూపలేరా" యని మిక్కిలి వినయముతో లజపతిరాయి ప్రార్థించిరి. శిబిరములో ప్రవేశించినంతమాత్రమున మిమ్ము కాల్చి చంపబోరని నవ్వుచు వాక్రుచ్చి,జరుగుచున్న ఉద్యమమును ఉత్సాహముతోనడిపించుటయే కర్తవ్యమని నుడివిరి. అంతటి సభముగిసినది. అందరు అనుకొన్నట్లు మహాత్మని ప్రభుత్వము పట్టుకొనలేదు. ఆ ప్రకటనపై సంతకములు చేసినందుకు ప్రభుత్వము మా జోలికిని రాలేదు.

మేము మూడు నాలుగు దినములు బొంబాయిలోనే యుంటిమి.ఒకసాయంకాలము దీపములు పెట్టినపిమ్మటమహాత్మాజీ షికారుబోవుచు నన్ను తమతో రమ్మనిరి. నేను వెంట బయలు దేరితిని. మేము కలసి నడుచుచుండగా "మీరు నడుపుచున్న

ఖద్దరు కేంద్రవ్యవహారములు చక్కగ నడుచుటలేదని తీవ్రముగ నాక్షేపించుచు బెజవాడలో ఖద్దరుత్పత్తిదారులు తీర్మానములు చేసి, నాకు పంపి" రని తెలిపి, "వాని విషయమై నీకు తెలియునా"యని ప్రశ్నించిరి. నాకు ఎరుకలేదని తెలియజేసి, రాష్ట్రములో ఖద్దరువ్యాపారము జరుపు కాంగ్రెసువాదులు రాష్ట్రఖద్దరు కేంద్రమునుంచి గుడ్డతీసుకొనివెళ్ళి దాని ఖరీదు ఎంత కాలము గడచినను ఈయక కాలముగడుపుచున్నందున కార్యదర్శియైన సీతారామశాస్త్రిగారు వారికి లోగడబాకీ చెల్లించిననేగాని మరల గుడ్డ ఈయనని గట్టిపట్టు పట్టుటవలన కొందరికి కోపమునచ్చి, శాస్త్రినిగూర్చి అక్రమముగ నిందలు మోపుట మాత్రము నే నెరుగుదును. అట్టివారే మీకు తీరు మానములు పంపియుందురని నేను సమాధానము చెప్పితిని.

మరునాడు మహాత్మాజీ సబర్మతీకి ప్రయాణమైరి. మేము వారి వలన సెలవుపుచ్చుకొని గుంటూరు వెళ్ళదలచితిమిగాని వారు సబర్మతికి రాసలసినదని మమ్మబలవంతపరచిరి. మేమును వారితో సబర్మతికి వెళ్ళితిమి. అక్కడికిచేరిన మరునాడు గుంటూరు పోయెదము. అనజ ఇండనికోరగా "నేను మీ రాష్ట్రమున ముప్పది రోజులుంటినిగదా, మీరు సబర్మతిలో మూడురోజులైన నుండలేరా" యనిరి, అంతట మేమచ్చటనే నిలచితిమి. ఇంతలో అచ్చటికి డాక్టరు బ్రహ్మజోశ్యులసుబ్రహ్మణ్యముగారును, శ్రీ జేశోద్ధారక నాగేశ్వరరావుపంతులుగారును, డాక్టరు పట్టాభిసీతారామయ్యగారును వచ్చిరి. వారు మహాత్ముని కలుసుకొని ఏమియో మాట్లాడినపిదప గాంధీజీ

నన్ను పిలువనంపిరి. గాంధీగారిగదిలో నొకప్రక్క వారు మువ్వురును వరుసగ కూర్చుండియుండిరి. నేను వెళ్ళి గాంధీగారికి ఎదుట కూర్చుంటిని. మరి ఏ విషయమును చెప్పకయే సీతా రామశాస్త్రి ఆంధ్రఖద్దరు శాఖకు కార్యదర్శిగా నుండు విషయమున నీ అభిప్రాయమేమి" యని మొదట కూర్చుండిన సుబ్రహ్మణ్యముగారిని గాంధీగారు ప్రశ్నించిరి "శాస్త్రిగారు పనికిరారు. వారిస్థానే డాక్టరుపట్టాభిగారిని నియమించుటయుక్త" మని వారు ప్రత్యుత్తర మిచ్చిరి. పట్టాభిగారి నడుగగా శాస్త్రి గారు పనికిరారనియే వాక్రుచ్చిరి. పిమ్మట నాగేశ్వరరావు పంతులుగారిని ప్రశ్నించగా, శాస్త్రిగారుగాని, పట్టాభిగారుగాని ఇరువురిలో నెవ్వరైన కార్యదర్శిగా నుండనచ్చునని జవాబు చెప్పిరి. "శాస్త్రిగారి విషయమై ఖచితముగా మీ అభిప్రాయ మడిగినప్పుడు మీ రిట్లు సందిగ్ధమైన జవాబుచెప్పుట మీ మనోదౌర్బల్యమును స్పష్టీకరించుచున్నదని నాగేశ్వరరావుగారిని గాంధిమహాత్ముడు మందలించెను. శాస్త్రిగారు పనికిరాకనుటకు కారణము లేవి యని నేను ప్రశ్నించితిని. సుబ్రహ్మణ్యము గారును, పట్టాభిగారును శాస్త్రిగారెంత మాత్రము పనికిరాని గట్టిగ వాదించిరి. శాస్త్రిగారిపై ఏవో చాడీలు చెప్పి వారిని కార్యదర్శి పదవినుండి తొలగించవలెనని వారుపూనియుండిరని తెలుసుకొన్నమీదట నాకు ఏలనో పట్టరానిదుఃఖము కలిగి, కండ్లనిండ నీరు కారసాగెను. గాంధీగారి ఎదుట ఇట్లు నా బల హీనత బయల్పరచినందుకు చింతించితిని. గాంధీగారు నన్ను చూచి, "మీ పైన వీరేమియు దోషములారోపించలేదు" అని చెప్పుచుండగనే, సుబ్రహ్మణ్యముగారును పట్టాభిగారును

"మీ మీద మా కేమియు ఆక్షేపణలులేవు. మీరు ఎప్పటివలె ఆంధ్రశాఖకు ఏజెంటుగనే యుండుట మాకు సమ్మతము" అని చెప్పిరి. పట్టాభిగారు "మీ క్రింద కార్యదర్శిగ సంతోషముతో పనిచేసెదను. మీరు ఏజెంట్లుపదవిని మానవల" దని చెప్పిరి. గాంధీగారు "నీ వేల న్యాసనపడెద"వని నన్ను ప్రశ్నించగా "ఎంతయో త్యాగముచేసి. నిష్కల్మష హృదయముతోడను, సమర్థతతోడను, ఒడలువంచి పనిచేయు శాస్త్రి పనికిమాలిన వాడని వీరు మాట్లాడినందుకు నేను దుఃఖించు చున్నానుగాని నా మిత్తముకా"దని పల్కితిని. అంతట చరాశాఖకు నిన్ను ఏజెంటుగానుండుమని కోరుచున్నారుగదా, దాని కేమనెదవని. నేనుండజాలనని బదులుపల్కితిని. సీతారామశాస్త్రి లేకపోయినచో వెంకటప్పయ్యగూడ ఉండడని మహాత్మాజీయే చూచోక్తిగాపల్కెను. ఖద్దరుసంస్థ దినదినాభివృద్ధిచెంది, అవయవవ్యాప్తిపొందుచున్నది గాన ఇట్టి మార్పులు సహజమేయని గాంధీగారు వాక్రుచ్చిరి. ఈ మాట న న్నొకదార్చుటకు వచించినదని తలంచితిని. అంత మాత్రమున నాకు సంతుష్టి కలుగలేదు. గాంధిగారు ఈ విషయమున న్యాయము గ్రహించలేదో, గ్రహించియును సందర్భములను బట్టి డాక్టరు సుబ్రహ్మణ్యము డాక్టరు పట్టాభిగార్లవలిన ప్రముఖుల సహాయము లేనిచో నది అభివృద్ధి పొందజాలదని తలంచిరో తెలియజాలకుంటిని.

తరువాత నేను శాస్త్రిగారును మహాత్మాజీయొద్ద సెలవుపుచ్చుకొని, సబర్మతినుండి బయలుదేరి, గుంటూరుచేరితిమి. మేము గుంటూరు చేరిన కొలదిదినములకే పట్టాభిసీతా

రామయ్యగారు గుంటూరువచ్చి, అక్కడిఖద్దరుశాఖలోని వస్త్ర ములు మొదలగు ఆస్తినంతయు నొప్పజెప్పుకొని కార్యస్థానమును గుంటూరునుంచి యెత్తివెచి, మచిలీపట్టణములో అనగా, వారి స్వగ్రామమునందు స్థాపించిరి.

పిమ్మట సీతారామశాస్త్రిగారు కొంతకాలమునకు గుంటూరులో కొందరు ప్లీడర్లు మొదలగు పెద్దలతో సంప్రదించి, కొందరు వేయేసి రూపాయలచొప్పున భాగములువేసి, ఒక ఖద్దరు వ్యాపార సంఘమున చేరునట్లును, అట్లు చేరు వాడు నష్టిగాని, లాభముగాని కోరకుండు సంస్థ నడిపించుచుండునట్లును ఆ సంస్థలో మానేజరు, గుమాస్తాలుగా చేరినవారుగూడ కొంత మూలద్రవ్యము క్రింద ఇచ్చునట్లును, వారికి మాత్రము లాభ ములో కొంత వారివారి పెట్టుబడులనరుస నిచ్చుచుండునట్లును కట్టుబాటు లేర్పరచి, గుంటూరుజిల్లా ఖద్దరు సంఘమునేర్పరచిరి. ఈ సంఘము కొన్ని సంవత్సరములు చాల జయప్రదముగ పని చేసినది. ఒకొక్కసంవత్సరము లక్షరూపాయల విలువగల ఖద్దరు ఉత్పత్తిగావించి, అమ్మకములు జరిపినది. ఈ సంఘము ఆంధ్రరాష్ట్రములో తక్కిన ఖద్దరు సంఘములతోపాటు మచిలీ పట్టణములోని ఆంధ్రశాఖకు అనుబంధముగా చేరియో, లేక ఆ శాఖవారివలన యోగ్యతాపత్రమునుపొందియో వ్యాపారము సాగించవలెనని నిబంధన ఏర్పడియుండెను. ఇది స్వతంత్ర సంస్థగనే ఏర్పడినదిగనుక దీనికి యోగ్యతాపత్రము మాత్రమవసరము. ఈ యోగ్యతాపత్రము నిచ్చినందుకు ఆంధ్రశాఖకు రుసుము కొంత వార్షికముగా చెల్లించవలసియుండెను. ఆ రుసుము మచిలీపట్టణ

శాఖవారే ఈ జిల్లా సంఘములోనిఉత్పత్తి అమ్మకముల విలువ
లను బట్టి నిర్ణయించవలసియుండెను. ఆంధ్రశాఖవారు తమ తనిఖీ
దారులను పంపి, ఈ సంఘముయొక్క ఉత్పత్తిస్థానములందు
కల్తీ లేకుండ నిజమైన ఖద్దరు తయారగుచున్నదనియు, నడుకు
వారికిని, మగ్గములమీద నేయువారికిని ఆంధ్రశాఖవారేర్పర
చిన మజూరీలు చెల్లుచున్నవనియు, వడుకువారు, నేతగాండ్రు
ఖద్దరు కట్టుకొనుచుండిరనియు,సంతృప్తిచెందిననేగాని,యోగ్యతా
పత్రము లభించదు. ఈ నియమములను రాష్ట్రములోని అన్ని
సంఘములు పూర్ణముగ పాటించి, నడుపుచున్నవా లేదా యను
విషయము ఎట్లున్నను మొత్తమున దాదాపు అన్ని కేంద్రము
లకును యోగ్యతాపత్రము లిచ్చుచున్నను గుంటూరు జిల్లా
ఖద్దరు సంఘమునకు యోగ్యతాపత్రము నిచ్చువిషయములో
పలుమారు లాక్షేపణలు ఆటంకములు కలిగించుటయు, తుద
కెట్లో కష్టముమీద కొన్ని సంవత్సరములిచ్చుటయు సంభవించి
నది. ఇతర కేంద్రములలోని లోపములను చూచి చూడక అధి
కారుల ఇష్టప్రకారము యోగ్యతాపత్రము లిచ్చుచున్నను,
గుంటూరుజిల్లా సంఘవిషయములో శల్యపరీక్షచేసి, చికుఱ్ఱులు
పెట్టుట తటస్థించుచుండెను.

నేను ఆంధ్రశాఖకు ఏజెంటుగా నుండుట మానుకొన్నను
అఖిలభారతచరఖాసంఘ కార్యనిర్వాహకవర్గములో యావజ్జీవ
సభ్యుడుగానుండి, వారి సభలలో పాల్గొనుచుంటిని. ఆ సభ
జరిగినప్పుడు వారితో ఈ గుంటూరుజిల్లా సంఘమువారు
గొప్పగా ఖద్దరు పనిచేయుచున్నను, యోగ్యతాపత్రము లభిం

చుట చాల కష్టముగానున్నదని తెలియచేయుచుంటిని. ఈ యోగ్యతాపత్రమువిషయమై పడుచున్న బాధలను ఆలోచించుకొని, నేను శాస్త్రిగారును ఒకపదతి నిర్ధారణ చేసికొంటిమి. గుంటూరుజిల్లా సంఘమునకు ఉత్పత్తిస్థానములు నెల్లూరుజిల్లాలో గూడ నొకటిరెండు కలవుగావున గుంటూరు నెల్లూరు జిల్లాలు రెండును ఆంధ్రరాష్ట్రములో నంతర్గతమైన ప్రత్యేకఖండముగ నేర్పరచి, ఈ ఖండమునకు మచిలీపట్టణము ఆంధ్రశాఖవారితో సంబంధము లేకుండ సరాసరి అఖిలభారత చరఖాసంఘమువారి క్రింద స్వతంత్రశాఖగ యోగ్యతాపత్రములు మొదలగునవి పొందు నట్లేర్పరచినయెడల ఆ రెండుజిల్లాలలో ఖద్దరు ఎక్కువగ వ్యాప్తి యగునట్లు చేయవచ్చునని తలంచితిమి.

వర్ధాలో నొకసారి అఖిలభారతచరఖాసంఘ సభ సమావేశమైనప్పుడు నేను వెళ్ళితిని. నాతోగూడ శాస్త్రిగారును వచ్చిరి. ఆ సభలో మేము తలంచినవిషయమును చెప్పి, గుంటూరుజిల్లా ఖద్దరుసంఘమువారికిని, మచిలీపట్టణములోని ఆంధ్రశాఖవారికిని ప్రకృతముండిన మనస్పర్థలకు అనకాశముండదు. జిల్లాఖద్దరు సంఘమువారు స్వతంత్రముగ పనిచేసి ఖద్దరు వ్యాప్తి ఉత్సాహముతో చేయగలరని తెలిపినమీదట, ఈ సంకల్పము బాగుగనేయున్నదని ఆచర్యాసంఘసభ్యులు ఆమోదము తెలుపుచు, ఆంధ్రశాఖకార్యదర్శి పట్టాభిసీతారామయ్యగారికి తెలిపి, వారి అభిప్రాయమును తెలుసుకొనెదమని వాక్రుచ్చిరి. పిమ్మట విచారించగా, పట్టాభిసీతారామయ్యగారు మేము కోరిన ప్రకారము గుంటూరు నెల్లూరు జిల్లాలను ప్రత్యేకించిన యెడల

తక్కిన జిల్లాలవారును ఇట్లే విడిపోవలెనని కోరుదురు. అట్లయిన ఆంధ్రశాఖ తుదకు మూసివేయవలసివచ్చునని తీవ్రముగ మా సలహా నాక్షేపించుటయు మా ఆలోచన భంగమగుటయు సంభవించినది. గుంటూరుజిల్లా సంఘమునకు యోగ్యతాపత్రము నిచ్చువిషయము నానాటి మరింత కష్టసమస్యగాపరిణమించెను.

ఒకతూరి నేనును, శాస్త్రిగారును, గుంటూరుజిల్లాఖద్దరు సంఘమేనేజరు హనుమంతరావుగారును కలుసుకొని, మనకును శ్రీ పట్టాభిగారికిని వివాదములుండనేల ? మనము ఆయనయొద్దకు బోయి, వారు నియమించిన నియమములన్నియు సాధ్యమైనంత వరకు చక్కగనే అమలు జరుపబడుచున్నను యోగ్యతాపత్రము లభించుట కష్టసాధ్యముగా నున్నదిగాన స్వల్పలోపములున్నను వానిని పాటింపవలదని సౌమ్యముగా చెప్పివారితో సఖ్యము నొడగూర్చుకొనవలెనని యుద్దేశించుకొని, మచిలీపట్టణము వచ్చుదపు గనుక తారీఖు నిర్ణయించవలసినదనికోరగా, కొలది రోజులలో బెజవాడకు వత్తుమనియు, అచ్చటకలుసుకొనవలసిన దనియు, ప్రత్యుత్తరము వ్రాసిరి. వారు తెలియజేసిన రోజున మేము బెజవాడకు వెళ్ళి వారిని కలుసుకొంటిమి. వారిని కలుసు కొన్నతోడనే "రాజ్యములో నింకొక స్వతంత్రరాజ్యము కావలెనని కోరితిరిగదా" యని ఆక్షేపణచేయుచు తీవ్రభాషణ చేయ నారంభించినందున ఇక వారితో ఏ విషయము మాట్లాడినను ప్రయోజనము లేదని మేము మరలివచ్చితిమి. తుదకుయోగ్యతా పత్రము లభింపకపోవ్రటవలనఉత్పత్తియు,అమ్మకములు పడిపోయి జిల్లాఖద్దరు సంఘము మూసివేయవలసియేవచ్చెను. అంతియేగాక

ఖద్దరు ఉత్పత్తి పోటీ సంఘములు యోగ్యతాపత్రము లేనివే అనేకములు బయలుదేరెను. కల్తీలేకుండను, ఆంధ్రశాఖవారు నిర్ణయించిన మజూరీలిచ్చియు, ఉత్పత్తిగావించిన ఖద్దరుధర హెచ్చగుటచే, ఆంధ్రశాఖవారి నియమములను పాటింపక, వారి యిష్టమునచ్చినట్లు తక్కువ మజూరీ లిచ్చి, కల్తీగాతయారు చేయించిన గుడ్డ చౌక ధరలకు బజారులో అమ్మకమగుచుండగా ఖద్దరును కట్టుకొనవలెనని దీక్ష వహించినవాకు సయితము కల్తీ విషయముగాని, యోగ్యతాపత్రవిషయముగాని పాటింపక, చౌక గదా యని ఆ కల్తీ ఖద్దరునే కొని, ధరించుచుండుటచే, జిల్లా ఖద్దరుసంఘము వ్యాపారము నానాటి వెనుకబడెను. సంఘమున కు మానేజరుగా నున్న హనుమంతరావుగారే వేరేఖద్దరుకొట్టు పెట్టి, పోటీగా వ్యాపారము సాగించెను. ఈ మొదలగు కారణ ముల వలన గుంటూరు జిల్లా ఖద్దరు సంఘము మూలబడెను.

అఖిలభారతచరఖాసంఘ కార్యవర్గమున నేను యావజ్జీవ సభ్యుడనైనను ఆ సభలకు దూరము పోవలసినచ్చినందునను ధన లోపమునల్లనుగూడ నా సభ్యత్వమును మానుకొనదలచి, మహోష్మానకు నేను సభలలో పాల్గొనజాలనప్పుడు సభ్యత్వమును వహించుట సమంజసముగలేదనియు మరియొకరి కెడమిచ్చుట యుక్తముగా తోచుచున్నదనియు తెలిపితిని. వారు నా యోచన యుక్తముగనే యున్నదని ఆమోదించిరి. అంతట ఆ సభ్యత్వము నకు రాజీనామా నిచ్చితిని.

నా చిన్నకుమార్తె పార్వతీదేవికి దేహము ఆరోగ్యస్థితికి వచ్చిన పిదప ఇంటిలోనే ఉపాధ్యాయుని నియమించి,ఇంగ్లీషును,

లెక్కలును సంస్కృతమును గూడ చెప్పించితిని. ఆమె కలకత్తా విశ్వవిద్యాలయమువారి మెట్రిక్యులేషన్ పరీక్ష నిచ్చి, సంస్కృతములోగూడ గణ్యతగాంచెను. ఆమెను మరల వివాహము చేసుకొనవలసినదని నేనును, తల్లిగారును, అక్కగారునుగూడ సలహా నిచ్చితిమిగాని తనకు మరల వివాహముచేసుకొనవలెనను కోర్కె లేదనెను. "ఏదియో జీవితములో నొకసారివివాహమను పేర కొంత తంతు నడిచినది, ఆ సంసార సుఖము ననుభవించు ప్రాప్తిలేక భంగమైపోయినది. మరల దాని నిమిత్తము యత్నించుట ఇష్టము లే" దని చెప్పుచు వచ్చినందున మేమును ఆమెను బలవంతపెట్టుట మానివేసితిమి. ఇట్లుకొంతకాలము గడచునప్పటికి 1936వ సంవత్సరము డిశెంబరునెలలో తల్లిగారు మృతినొందెను. తరువాత కాలేజీలో ప్రవేశించి చదువనలెనని ఆమెకు కోర్కె పుట్టినది. మగపిల్లలు చదువుకొను కళాశాలలో ప్రవేశించుట ఆమెకు ఇష్టము లేకుండెను, నాకును ఆమె అక్కగారికిని సమ్మతిలేకుండెను. ఇంతియేగాక, కళాశాలలో చేరి, ఈ కాల విద్యావిధానపరికారము విద్యనేర్చుట ఆడపిల్లలకు అనవసరమేగాక చెరుపుగూడ జేయుననియు నా యభిప్రాయము. సంస్కృతములో నెట్లును ప్రవేశమున్నదిగనుక అందే ఎక్కువ పరిశ్రమ చేసి, వేదాంతగ్రంథములు చదివి, నైతికముగ ఆధ్యాత్మికముగ స్త్రీలలో మార్గదర్శినిగా నుండుట యుచితమనియు, శాస్త్రజ్ఞత మనదేశమున నానాట నరిదియై స్త్రీలలో మొదలేశూన్యముగా నున్నదిగాన నా కుమార్తె శాస్త్రజ్ఞురాలు కావలెననియు నా ముఖ్యాశయము. ఐనను ఆమెకును, అక్కగారికినిగూడ ఇప్పటి కళాశాలవిద్యయందే అభిమానము బలీయముగానుండి, నా

అభిప్రాయము నంగీకరించక గట్టిపట్టు పట్టిరి. బాలవితంతువై, సంసారాపేక్షకు దూరమైన పరిస్థితులలో తల్లినిగూడ గోల్పోయి నందున, నేనుగూడగతించినపైనసిస్సహాయురాలగుననిఆలోచించి, ఆమె కిష్టమగువిద్య నేర్పుటే యుక్తమని తలంచి, బనారసు హిందూ విశ్వవిద్యాలయములో మహిళాకళాశాల ప్రత్యేక ముగ నుండుటచే నా కుమార్తె నా మహిళా కళాశాలలో ప్రవేశపెట్టితిని.

1928వ సంవత్సరమున లాహోరు కాంగ్రెసుమహాసభలో స్వాతంత్ర్యనిశ్చయముచేసినది మొదలుగా ప్రతిసంవత్సరము భారతభూమి యందంతట స్వాతంత్ర్యదినముపేరట మహాసభలు గావించి, అస్వాతంత్ర్యతీర్మానమునుసభలలోచదివి వినిపించి,దాని అర్థమును వివరించుచుంటిమి. ఇది ప్రభుత్వాధికారులకు రుచింప కుండినను సభలు శాంతముగ నడచుచు బహుజనాంగీకారమును బడసినకారణముచే ఏమియును చేయక ఊరకుండిరి. ఏమాత్ర మైనఅవకాశమున్నచోటఏదియో మిషతో కాంగ్రెసువాదులను కారాగారబద్ధులను గావించుచుండిరి.

ఉప్పుసత్యాగ్రహఫలితముగా మమ్ము చెరసాలలోనుంచి రని చెప్పితిని. ముఖ్యులను నిర్బంధించిన పిదప వారు నడపుచుం డిన శిబిరములపై పోలీసధికారులు దాడివెడలి, కంటికి కనుపడిన వారినెల్ల తారుమారుగ లాటీలతో కొట్టి కొందరిని బంధించి శిబిరములను అచటి వస్తువులను ధ్వంసముచేసి, మహారాక్షసుల వలె ప్రవర్తించిరి. ఈ సత్యాగ్రహశిక్షల పరిమితి ముగియకుండ గనే 1931 మార్చి 5వ తేదీన గాంధిఇర్విన్‌లమధ్య తాత్కాలిక

సంధి యొడగూడినది. ఈ సంధి షరతుల ప్రకారము సముద్ర తీరవాసులు ఉప్పు స్వంతముగ తయారుచేసుకొనుటకును సముద్రపు గుంటలలో పండెడి ఉప్పునుస్వంతవినియోగమునిమిత్తము వాడుకొనుటకును సమీపగ్రామములలో నెత్తిమూటలమీద అమ్ముకొనుటకును స్వతంత్రము లభించెను. విల్లుగుడ్డల దుకాణములయొద్దను, కల్లు సారాయి అంగళ్ళయొద్దను శాంతముగ పికెటింగు చేయుటకుగూడ అనకాశమీయబడెను. శాసనోల్లంఘనోద్యమము కట్టిపెట్టబడలెసని నిర్ణయించబడినది.

ఈ సంధి నిరంకుశులగు అధికారులకు కంటకముగా, నుండెను. వేసవియెండలకు ఎండిపోయి రూపుమాసినట్లు కనబడినను, తొలకరివానలు పడుటతోచెట్లు చిగిర్చి, పచ్చనిఆకులతో నలరారినట్లు కాంగ్రెసు సంఘములన్నియు దేశమంతట ఉత్సాహముతోలయెత్తెను. కాంగ్రెసు సభలునిర్విఘ్నముగ సాగనారంభించెను. శాంతిసైనికులుపికెటింగుచేయనారంభించిరి. నిన్నమొన్నటివరకు నిరంకుశముగ నణచివేసిన ఈ ప్రచారములన్నియు నేడింతలోయధేచ్ఛగ నిర్భయముగ సాగుచుండుట అధికారులకు దుస్సహముగ నుండెను. కాబట్టి ఏదియో మిషతో కాంగ్రెసు వాదులను నిరల లాటీచార్జీలు చేయుట, పట్టుకొని జయిల్లలో పెట్టుట అక్కడక్కడ జరుగనారంభించెను. క్రమముగ నీయలజడి పెరిగిపోయెను.

ఇంతలో ఇర్విను ప్రభువు ఉద్యోగకాలము ముగిసినందున స్వదేశమునకు వెడలిపోయెను. ఆయనస్థానే లార్డురీడింగ్ రాజప్రతినిధిపదవి స్వీకరించెను. గాంధిమహాత్మ డాయనకు

వివిధభ్రాంతములలో జరుగు అలజడులనుగూర్చి తంతివార్తలు పంపినను అవి వ్యర్థమాయెను. గాంధీజీయంతట కౌండుబేబిల్ సభకు తాను పోనని భీష్మించెను. అందుకు గాంధి ఇర్విసంధిని ప్రభుత్వము మన్నించునా, లేదాయని విల్లింగ్డనుకు లేఖ్రవాసి ప్రశ్నించిరి. వారు గాంధిగారిని సంప్రదింపుకు పిలిచిరి. ఆసంప దింపుల ఫలితముగ గాంధీజీ లండనుకు ప్రయాణమైపోయెను.

హరిజనులకు శాసనసభలలో ప్రత్యేకప్రాతినిధ్యమేర్పరచి ఆ సంఘమును హిందనసంఘమునుండి వేరు పరచుట తాను సహించజాలననియు, అట్టి ప్రయత్నము జరిగినయెడల దానిని తన ప్రాణమే పందెముపెట్టి ధిక్కారముగావించెదననియు తెల్లము చేసెను. వారు డిశంబరు 1931 సంవత్సరము ఇంగ్లాండునుండి భారతదేశమునకు మరలివచ్చిరి.

ఈ లోపల భారతదేశపరిస్థితులు మిక్కిలి దుర్భరమయి ప్రభుత్వ నిర్బంధములకు లోబడవలసివచ్చెను. గాంధిగారిని ఇంగ్లాండుకు ప్రయాణముచేసి పంపునప్పుడు లోగడ గుజరాతు దేశములో బీదప్రజలను కాటకసమయమున హింసించి బలాత్కారముగా పన్నులు వసూలుచేసిరను వివాదమును గూర్చి తగిన విచారణచేసి పరిష్కరించెదమని ప్రభుత్వమువారు వాగ్దానము చేసిరి. ఆ ప్రకారమే విచారణజరుపుట ప్రారంభించగా కాంగ్రెసు అధ్యక్షుడైన సర్దారువల్లభాయిపటేలు, కాంగ్రెసు పక్షమున న్యాయవాదిశ్రీభూలాభాయి దేశాయి అనుబొంబాయి హైకోర్టు బారిస్టరును విచారణలో హాజరైరి. కొంతవరకు విచారణ జరిగిన పిమ్మట గ్రామములవెంట రెవిన్యూఅధికారులు

పోలీసువారినిగూడ తీసుకొనివెళ్ళి రహితులను భయపెట్టి బలా
త్కారముగ పన్నులు వసూలుచేసిరను విషయమును కొంత
రుజువు పరచిరి. ప్రభుత్వాధికారు లీ సందర్భమున అప్పుడప్పుడు
జారీ చేసిన ఉత్తరువులనువిచారణలో హాజరు పెట్టించవలసినదని
కోరగా విచారణాధికారి ఆ ప్రకారము ఉత్తరువు కాగితములను
తెప్పించుటకు వీలు లేదని నిరాకరించినందున న్యాయవాదిని
విచారణలో పాల్గొనక లేదివచ్చిరి. అంతటితో ఆ విచారణ
ఆగిపోయినది. మరియు బంగాళాదేశములో ప్రభుత్వాధికారులను
హత్యగావించబడుచున్నారను మిషమీదను, సంయుక్తరాష్ట్ర
ములలో కాంగ్రెసు వాదులు జమీందారులకు మకాలు చెలిం
చకుండా రహితులచేత సమ్మెకట్టించుచున్నారను మిషమీదను
సరిహద్దురాష్ట్రములలో శ్రీ అబ్దుల్ గఫూరుఖానుసాహేబ్ గారు
ప్రభుత్వాధికారమును చేయుచు ఉపన్యాసములిచ్చి రాజద్రో
హము గావించుచున్నారను మిషమీదను అచ్చటి కాంగ్రెసు
ఐచ్ఛికభటులు స్వాతంత్ర్యతీరుమానములు గావించు సభలు
సమావేశపరచుచున్నారనుమిషమీదను మిక్కిలి కఠినములగు
నిర్బంధములనుప్రజలపై ప్రయోగించుటకు అనకాశము కలిగించు
ఆర్డినెన్సులు నిరంకుశతాత్కాలిక ఉత్తరువులను జారీచేయించి
సంయుక్త కాంగ్రెసు అధ్యక్షుడు షేర్వానీ సాహెబుగారిని
కాంగ్రెసు మహాసభాకార్యదర్శి పండిత నెహ్రూగారిని శ్రీ అబ్దుల్
గఫూరుఖానుగారినిపట్టి చెరసాలలో నిర్బంధితులను గావించిరి.

కాబట్టిగాంధిగారు ఇంగ్లాండునకు పోవునప్పుడు ఇర్విను
ఒడంబడికను అమలుపరచెదనని రాజప్రతినిధి విల్లింగ్డన్ చేసిన
వాగ్దానమునకు భంగము గావించబడెను. గాంధిగారు భారత

దేశమున మరల కాలుబెట్టకమునుపే ఈ నిర్బంధవిధానము సాగించబడిన కారణమున గాంధిగారికి మనస్సువిభ్రాంతిచెందెను. వారు ఇంగ్లాండునుండి తిరిగి భారతభూమిచేరిన కారణమున గాంధిగారికి బొంబాయిలో గొప్పస్వాగత మొసంగబడెను. పెద్ద మహాసభలో లక్షలకొలది ప్రజలు హాజరైయుండ మహాత్ముడు లండనులో జరిగిన విషయములు క్లుప్తముగ విశదపరచిరి. స్వరాజ్యము ప్రజలు ఆత్మబలముచేత సంపాదించవలసియున్నదని హెచ్చరించెను. ఆ సభకు నేనును శ్రీ రాజాగోపాలాచారి, దేశపాండ్య మొదలగువారము హాజరైతిమి. గాంధిగారిని పట్టుకొని చెరసాలలో పెట్టుసరనువాడుక బలముగా వ్యాపించెను. దేశమున ప్రభుత్వమువారు నాగించిన నిర్బంధవిధానముచేతతనకు తోడుగ రాజకీయములలో పనిచేయుచున్న ప్రముఖనాయకులను పట్టి చెరలో పెట్టినందునను అశాంతి ప్రబలుచున్నదిగావున దీనికి కారణములను విని మాతో సంప్రదించి పిమ్మటకాంగ్రెసు తానియ్యవలసిన సలహాను ఇయ్య నుద్యమించుకొన్నాననియు కాబట్టి మీతో సంప్రదించి సలహాను పొందుటకు అవకాశ మియ్యవలసినదని రెండుసార్లు వ్రాసినను రాజప్రతినిధి విల్లింగ్డన్ సంప్రదించుటకు అవకాశమియ్యక పోయెను.

కాంగ్రెసుకార్యనిర్వహకసభవారు సమావేశమై దేశపరిస్థితులను గమనించి ప్రభుత్వము చేయుచున్న నిర్బంధవిధానమును ఖండించుచు దాని నెదురొక్కనుటకు మరల శాసనోల్లంఘన విధానము అవలంబించక తప్పదని యూహించి ఆ విధానము సంపూర్ణరూపమున అమలుపరచుటకు దేశమును గొప్పదీక్ష మానము గావించిరి.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.N.M.L.
D.P.R.I.
Acc. No.

ఈ తీరుమానమును రాజప్రతినిధికి పంపి మీతో సంప్రదించి మీ నలన వినదగినదంతయు వినినపిమ్మటగాని ఆ తీరుమానములు అమలులో పెట్టబడవుకావున సంప్రపదించుటకు అనకాశమియ్యమని గాంధిగారు మరల కోరినను రాజప్రతినిధి అందుకు అంగీకరించలేదు.

అంతట శాసనోల్లంఘన ఉద్యమము పూర్వముకంటెను తీవ్రరూపమున సాగించబడినది. గాంధిమహాత్ముని, సర్దారు వల్లభాయిపటేలునుగూడ చెరసాలలో పెట్టిరి. కాంగ్రెసు సంఘములు దేశమునందెక్కడున్నను వానినన్నిటిని అక్రమసంఘములుగా ప్రభుత్వమువారు నిర్ణయించి ఆసంఘముల యొక్క కార్యస్థానములపై పోలీసువారిచే దాడిచేయించి లెక్కలపుస్తకములు మొదలగునవి నశపరచుకొని అందలి కుర్చీలు, బల్లలు పెట్టెలు మొదలగుసామానులను కొన్నిచోట్ల తీసుకొనిపోయి కొన్ని చోట్ల నాశనము చేసియు కొన్ని కార్యస్థానములను కాల్చి భస్మీభూతము గావించియు ఖద్దరు సంస్థలను సయితము కొన్ని పట్టణములలో ధ్వంసముచేసియు ఆ కార్యస్థానములలో పని చేయుచున్న కాంగ్రెసు ప్రచారకులను బంధించి చెరసాలలో బెట్టియు మిక్కిలి దారుణమగు దౌర్జన్యకాండను సాగించిరి. కాని కాంగ్రెసు విచ్ఛితిమగు జీవశక్తిగల మహాబలిష్ఠసంఘముగ పరిణమించి ప్రభుత్వమెంత కఠిన దౌర్జన్యము ప్రయోగించినను లక్ష్యము చేయక మరింత విజృంభింపసాగెను. కాంగ్రెసు సంఘ మూలధనమును ప్రభుత్వమువారు స్వాధీనముచేసుకొని సంఘములను నిస్సహాయములు గావించినను కార్యకలాపములు సాగించుటకు వలయు ద్రవ్యమెట్లనో యెవ్వరో ఇచ్చుచు శాస

నోల్లంఘనోద్యమము దేశమునందంతట తీవ్రరూపమెత్తించిరి. కాంగ్రెసు కార్యసాధనములు రహస్యమార్గములందు అతినిపుణతతో నడిపించబడెను. వివిధభ్రాంతములలో కాంగ్రెసు నాయకులందరిని నిర్బంధించి కారాగృహవాసులను గావించినను కాంగ్రెసు ప్రచారకులు రహస్యముగ ద్రవ్యము సమకూర్చుచు దానిని అవసరమగు చోట్లకు పంపుచు తపాలా కచ్చేరీలద్వారా ప్రభుత్వమువారు ఉత్తరములు పట్టుకొని అందకుండచేయుచు అట్టి ఉత్తరములు వచ్చినవారిని నిర్బంధించు చున్నందునరహస్య వార్తాహరులు కాంగ్రెసు పక్షమున నేర్పరుపబడి ఉత్తర ప్రత్యుత్తరములు సాగుటకు తగిన ఏర్పాటులు చేయబడెను. ఒక కాంగ్రెసు సంఘమును భంగపరచి అందలి సభ్యులను చెరలో బెట్టుటతోడనే మరియొక సంఘము ఏర్పరుపబడి జయులు కేగుటకు సిద్ధమగుచుండెను. ఇట్లు దేశమున నిర్బంధితులైన కాంగ్రెసు ప్రచారకులు నానాట పెరిగిపోవుచున్నంచున అంతనరకు కట్టబడిన కారాగృహములు చాలక బహిరంగసలములలో చేకుల పాకాలలో చుట్టును ముండ్లతీగలు కట్టిన ఆవరణములమధ్య నిర్బంధితులకు నివాసము లేర్పరచుచుండిరి. కాన ఎండకాలమున ఎండగాడ్పులకును చలికాలమున చలిగాడ్పులకును బోనై వారు బాధలు చెందుచుండిరి. 1921 సంవత్సరమున నిర్బంధితుల సంఖ్య ముప్పదివేలుగను 1923లో తొంబదివేలుగను లెక్కించబడినదిగాని ఈ సారి లక్షకు మించిపోయినది.

కాంగ్రెసు మహాసభయును అక్రమసంఘముగనే ప్రభుత్వమువారు నిర్ణయించినందున బహిరంగముగ మామూలు

ప్రకాశము సమావేశపరచుట దుస్సాధ్యముగనే యుండెను. అయినను ఢిల్లీలో మహాసభ జరుపుటకు ప్రయత్నములు సాగించిరి. సభకు ప్రయాణమైపోవువారనేకులను మార్గమధ్యముననే పట్టుకొని చెరసాలలో పెట్టిరి. 1932వ సంవత్సరములో కాంగ్రెసు మహాసభ కలకత్తాలో జరుపబడునని బహిరంగప్రకటనలు గావింపబడెను. వివిధప్రాంతములనుండి ప్రతినిధులు రహస్యమార్గములనవలంబించి, కలకత్తా చేరి కొన్నిగృహములలో ముందుగనే నివాసమేర్పరచుకొనిరి. మహాసభకు హాజరైన వారిని ప్రభుత్వసైనికులు గుఱ్ఱములచేత తొక్కించెదరనియు, తుపాకులతో కాల్చి చంపెదరనియు, భయంకరవార్తలు బయలువెడలెను. నేనును మరికొందరమిత్రులతో కలకత్తాకు పయనమైతిని. నా భార్య పక్షవాతముతో బాధపడుచుండెను. మరల జీవించి వచ్చెదనను ఆశ నాకుగాని మా యింటిలో నెవ్వరికిగాని చాల వరకు నిరాశగనే తోచుచుండెను. కాని నా భార్యగాని నా కుమార్తెలుగాని నన్ను పోనలదని పిరికివాక్యములుపలికి ఆటంకములు గావించక దైవమెట్లుచేయునోగదాయని భయమును మాత్రము వెల్లడించిరి. కొందరు మిత్రులు రైలుస్టేషను దగ్గిర వీడ్కోలు నొసంగిరి. పత్రికలలో నా పయనము ప్రకటింపబడెను. నేనును మిత్రులును ఢిల్లీపట్టణము చేరునరకు మమ్మల్నిప్రశ్నించువారెవ్వరు లేకుండ ప్రయాణము నిరాటంకముగ సాగిపోయెను. కాని ఢిల్లీపట్టణములో రైలుస్టేషనులో బండి దిగుటతోడనే మీ రెచ్చటికి బోవుచున్నారని ప్రశ్నించిరి బొంకుపలుకుటకు సహింపలేక కాంగ్రెసుమహాసభ నిమిత్తము వచ్చినారమని మారుపల్కితిని. అట్లయిన మీకు ఇది దారిఅని మమ్మల వారు

సేషనుదగ్గిరకుగొనిపోయి అక్కడ కూర్చుండబెట్టి భోజనము
లపెట్టించి బస్సునెక్కించి సాయంకాలమునకు ఢిల్లీలో పూర్వమున
నెప్పుడో స్మశానముగ నున్న విశాల స్థలములో నేర్పరుపబడిన
రేకుల పాకాలకు మమ్మును చేర్పించిరి. అప్పటికి సూర్యాస్తమ
యము గావచ్చినది. మట్టినేలపై జనపనారపట్టాలపై రోమముల
దుప్పట్లు పరచిన పడకలు మాకు నియమించబడినవి. మాకు
నిర్ణయించిన రేకుల పాకాలో మరికొందరు అన్నాము కాంగ్రెసు
వాదులుగూడ నుండిరి. వారితో ముచ్చటలు మాకు ఆనందకర
ముగ నుండెను. చీకటి పడెను. దీపములు లేవు. కనుక అంధకార
ములో పశువులవలెనే మేము కాలము గడుపనలసిన చ్చెను.
సమీపమున మంచినీళ్లకొళ్లాయి యొకటి యుండుట చేతస్నానము
నకు పానీయములు తెచ్చుకొనుటకు కొంత అనుకూలముగనే
యుండెను. కాని చీకటిలో దాగుడుమూతలాటగా మా జీవితము
నడచిపోయెను. ఆ రాత్రి భోజనము నిమిత్తము భోజనపాత్రలకు
ఇనపమూకుళ్లు ఇయ్యబడినవి. ఆ ఇనపమూకుళ్లలో అన్నము
బెట్టి దానిలో పలచని పప్పుపోసిరి. చీకటిలోనే అది కలుపుకొని
నోట పెట్టుకొనగనే సిరాపలె వెగటుతోచెను. అది తినుటకు
లాకు సాధ్యముగాకపోయినందున దానినివిడిచివేసిఆ రాత్రి మంచి
నీళ్లు త్రాగినిమరించితిని.

మరునాడు జయిలు సూపరింటెండెంటుగారును జయిలరు
గారును మా పాక యొద్దకు వచ్చినప్పుడు ఇనుపమూకుళ్లలో
అన్నము తినుట కష్టముగా నున్నదనియు అన్నము నల్లబడి
సిరా వాసన వేయుచున్నదనియు మూకుళ్లను చూపించితిమి.

అందుకు సూపరింటెండెంటుగారు తాను కొంతకాలము దక్షిణ దేశమున ఉద్యోగము చేసితిననియు అరటాకులలో భోజనము చేయుట మాకు అభ్యాసమనుట తనకు తెలుసుననియు చెప్పిమాకు అరటియాకులు సప్లయిచేయుటకలసినదని జయిలరుతో చెప్పిరి. ఆ జయిలరుగారును ఆ ప్రకారము సప్లయి చేయుదుమని మిక్కిలి శ్రద్ధతో ప్రత్యుత్తరమిచ్చిరి. మేమును మిక్కిలి సంతసించితిమి. కాని ఆ రోజు అరటియాకులురాలేదు. మరల ఇనుపమూకుళ్లు తప్పినవిగావు. రెండుమూడు రోజులు అట్లే గడచిపోయినవి. మరల జయిలరుగారిని అడుగగా అరటాకులు కావుగాని చీనాపేటు సళ్లెరములు సప్లయి చేసెదనని వాగ్దానముచేసెను. అదియును బొల్లిమాటగనే పరిణమించెను. మరియొకసారిసూపరింటెండెంటు వచ్చినప్పుడు చెప్పుకొనినను ప్రయోజనము లేకపోయెను సూపరింటెండెంటును జయిలరును గూడకలసి ఆడిననాటకమని తుదకు గ్రహించితిమి.

ప్రతిదినమున ఉదయముననే వేయించిన ముడిశనగలు జయిలులో ప్రతివారికిని ఫలాహారముక్రింద పంచిపెట్టుచుండిరి. ఆ శనగలు తిని నీరు త్రాగితే కడుపు నిండి తృప్తికరముగ నుండెనుగాన నాకు భోజన సదుపాయము లేదను కొరతమాత్రము బాధించలేదు. ఆ శనగలే రెండుసార్లుతినుటకు తగినంతమాత్రము గనే సప్లయి చేయుచున్నందున నాబోటివానికి తగినంత ఆహారముగనే యుండెను.

ఇట్లు అయిదురోజులు గడచిపోయెను. ఈ లోపల ఆ జయిలులోనే సరిహద్దురాష్ట్రమునుండివచ్చిన కాంగ్రెసు ప్రచార

కులు అగువడియుండిరి. వారి నందరి నొక్కపాకలో పెట్టి
వారు ప్రత్యేకముగ వంటచేసుకొని భుజించుటకు సదుపాయము
ఆ జయిలులోనే ఏర్పరచబడినది. ఇట్లుండ ఆ ప్రచారకులలో
కొందరిని మాత్రము ఢిల్లీ సెంట్రల్ జయిలుకు తీసుకొని పోవుటకు
ఉత్తర్వు కాబడినందున కొందరిని ఆ సెంట్రల్ జయిలుకు తీసు
కొనిపోయిరి. కాని తక్కినవారును తమనందరినిగూడ సెంట్రల్
జయిలుకు తీసుకొనిపోవలసినదని మొరపెట్టుకొనసాగిరి. వారిని
తీసుకొనిపోవుటకు వీలుకాదని జయిలుఅధికారులు చెప్పుచుండిరి.
ఇందువలన ఆ శిబిరములో కల్లోలము పెరిగిపోవుచుండెను.
జయిలుఅధికారులనుధిక్కరించిపలుకుటయేగాక జయిలుఆవరణకు
చుట్టు నమర్చబడిన ముళ్ళతీగలను కటకిటాలను తెంచుకొని
పోవుదుమని శపథము చేయుచుండిరి. దీనిపైన జయిలు అధికారు
లకు కోపము పెరిగిపోయెను. ఈప్రచారకులు ఈ తీగలకటకిటాలకు
పెట్టబడిన ద్వారపు పెండెను దగ్గిర గుమిగూడి ఆ పెండెము
నూడబెరికెదమని బెదరించుచుండిరి. జయిలు సూపరింటెండెంటు
పోలీసుభటులను తుపాకులతో పెండెము వెలుపల బారుగా
నిల్వబెట్టెను. ఆ సమయమున జయిలులోని ఇతర ప్రచారకులు
వచ్చి నన్ను సూపరింటెండెంటుతో మాట్లాడి ఏదియైన సమా
ధాన పరచవలసినదనియు లేనియెడల అన్యాయముగ పోలీసుల
గుండుబారులకు కొందరు హతులగుదురుగావున నన్ను అచటికి
పోయి ఎట్లయిన పరిస్థితిని శాంతింపజేయవలసినదనియు బలవంత
పెట్టసాగిరి. ఇట్లు నన్ను బలవంతపెట్టిన ప్రచారకులలో తమిళులు
మహారాష్ట్రులు, కన్నడులును, బంగాళీయులును మొదలగు
వివిధప్రాంతములవారును ఉండిరి. ఇందరు చెప్పుచున్నమాటను

తిరస్కరించుటకు సాధ్యము కాదయ్యెను. అంతకుముందు ఆ సరిహద్దుకాష్టగ్రప్రచారకులను అంతపట్టుపట్టవలదని పత్రమానము పంపియుంటిని. వారిలో నాయకులు నా యొద్దకు వచ్చినాతోముచ్చటించిరి వారు తమలో కొందరిని తీసుకొనిపోయి కొందరిని తీసుకొని పోకపోవుట తమకు అవమానకరమని ఒక కొంతకారణముగను తీసుకొని పోబడినవారికి తమతో తమ శిబిరములో నున్నప్పటివలె వారికి భోజన సౌకర్యము కుదరదని మరియొక కారణమును వారి పటుదలకు కారణములుగా చెప్పిరిగాని నాకు ఆ కారణములు యోగ్యములైనవిగా గనుపించలేదు. కాబట్టి యిప్పుడు సూపరింటెండెంటు దగ్గిరకుపోయి ఏమి సమాధానము చెప్పదగిన దను సమస్య నా మనస్సును బాధించుచుండెను. అయినను ఆ నిమిషము నెమ్మదిగ యోచించుటకనకాశముగా గనుపించలేదు. ఆ ప్రచారకులు మూర్ఖముగ పెండెముదగ్గిరచేరి పెండెము తెరవండని కేకలు వేయుచుండిరి. ఆ ప్రక్కన అధికారులు తుపాకులతో కాల్చుటకు సిద్ధముగ నుండిరి. కానినేను వారిని శెంట్రలు జయిలుకు తీసుకొనిపోయి వారియిష్టము నెరవేర్చినయెడల ఈ కిష్టపరిస్థితి మారిపోవునుగదా అందువలన ప్రభుత్వము వారికి కలుగు నష్టము లేదనియు ఇందరిప్రాణములు తీయుటకంటె వారిని ఇక్కడినుండి ఖైదీలను తీసుకొని పోవుట యుక్తముకాదాయెనని మాత్రము ఒక్కమాటసూపరింటెండెంటు గారితో చెప్పనలెనని సంకల్పించుకొని అచ్చటికిపోయి అవతల ప్రక్కనున్న సూపరింటెండెంటుగారిని సంబోధించి నా సలహా చెప్పనారంభించితినిగాని ముందువీరిమాట పరిష్కరించి తర్వాత మీతో ముచ్చటించెదనని సమాధానము చెప్పుచు వారి నందరిని

పెండెము తెరచి శెంట్రలు జయిలుకు నడిపించుకొనిపోయెను. నేను మాట్లాడకపోయినను నా సంకల్పము నెరవేరెనని సంతోషించితిని.

ఈ లోపల అనగా మేము ఢిల్లీకిచేరిన రెండుమూడు రోజులలోనే ఢిల్లిపట్టణములో చాందినీచౌకులో గడియారపు గోపురము (Clock-tower) దగ్గిర కాంగ్రెసు మహాసభ ఉదయమునే నడచిపోయినది. ప్రభుత్వాధికారులందరును మరెక్కడనో జగుగునని తలంచి గడియారపు గోపురము మీద కన్ను ఉంచలేదు. ఈమహాసభకు మదనమోహనమాలవ్యాగారు అధ్యక్షులుగా నుందురని ముందుగనే ప్రకటింపబడెను కాని మాలవ్యాగారు ఢిల్లీ సమీపించులోపలనే వారిని పట్టుకొని ఢిల్లీసెంట్రల్ జయిలులో నిర్బంధించిరి. అంతకు మునుపే డాక్టరు అన్సారీ గారిని బంధించియుండిరి. మౌలానా అబుల్‌కాలామ్ ఆజాద్ గారినిగూడ ఆ జయిలులోనే యుంచిరి. ఢిల్లీ నగరములో మహాసభ జరుగునని ప్రభుత్వమునకు అనుమానముగనున్నచోట్ల సైనిక భటులను అశ్వదళమువారిని పోలీసులను కావలిపెట్టిరి గాని వీరి కాపలాలేని చాందినీచౌక్‌లో రవిచోడ్‌దాసు అను నొక మిల్లుఖామందు కాంగ్రెసు అభిమాని ఆధిపత్యమున సభ జరిగిపోయెను. శాసనోల్లంఘనము గట్టిగా సాగించవలెనని పూర్ణ స్వరాజ్యము రాబట్టవలెనని దేశమును ప్రబోధించి సంపూర్ణ స్వాతంత్ర్యమే భారతీయుల ఆదర్శమని తీరుమానించిరి. తీరుమానములు పూర్తియగునప్పటికిప్రభుత్వోద్యోగులుమేలొకొనిరి. సైనికులు అశ్వదళమువారు పోలీసులుగూడ మహాసభను ముట్ట

డించిరి. అచ్చట సమాచేశమైన మహాజనులలో ననేకులను పట్టు
కొని జయిలులో పెట్టిరి. గుంటూరునుంచివచ్చిన మాడభూషి
వేదాంతం నరసింహాచార్యులును, గుండ్లపల్లి రామకృష్ణయ్య
గారిని శెంట్రల్ జయిలులోనే ఖైదుచేసిరి. మేమున్న జయిలులో
కూడ కొందరిని కొనివచ్చిరి. ఇట్లు కొలదిరోజులు గడచినపిదప
నెమ్మదినెమ్మదిగ కొందరి ప్రచారకులను నిర్బంధమునుండి వదలి
వేయుచుండిరి. ప్రముఖులని ప్రభుత్వము తలచినవారిని నిలిపి
తక్కినవారిని క్రమముగ వదలివేయుదుగనియు ప్రముఖులైన
వారికి శిక్షలను విధించుదురను మొదలైనవాదుకలు జయిలులో
సాగినవి. మేము ఉన్న జయిలునుండి కొందరిని వదలిపెట్టిరి.
ఎనిమిదనరోజు మధ్యాహ్నము నన్ను ప్రత్యేకించి శెంట్రలు
జయిలుకు తీసుకొనిపోయిరి. ముఖ్యులని ప్రభుత్వముతలచిన
వారికి శిక్షలు విధించుదురను వాదుకను బట్టి నన్ను ప్రత్యేక
ముగ శిక్షాపాత్రుని చేయవలెనని తీసుకొనివెళ్ళుచున్నారనిమిత్రు
లనుకొనిరి. శెంట్రలు జయిలులో దేశములోని వివిధప్రాంతముల
నుండి వచ్చిన కాంగ్రెసువాదులు, నాయకులు, ప్రచారకులు
గూడ వేలకొలదిగ అందు నిర్బంధితులైయున్నారనివినియుంటిని.
గాన వారి నందరిని చూడవచ్చునని కొంతసంతసించితిని. కాని
నన్ను శెంట్రల్ జయిలుకు కొనిపోయిన కారణము పిమ్మట
తెలియవచ్చినది. డాక్టరు అన్సారీగారు ఆ జయిలులో కొన్ని
మాసములనుండి నిర్బంధితులైయుండిరి. వారికి నేను ఢిల్లీకి వచ్చి
నట్లును రేకులపాకాల జయిలులో ఉన్నట్లును, విని జయిలు
సూపరింటెండెంటుగారితో నన్ను శెంట్రల్ జయిలుకు తీసుకొని
రమ్మనమని చెప్పినారట అన్సారీ గారికి నా యందు స్వతహా

యెక్కువ అభిమానము కలదు. గుంటూరుజిల్లా పెదనంది పాడులో జరిగిన పన్నులనిరాకరణోద్యమ సమయమున ఉద్యమము ఆపజాలము ఆపవలసిన యెడల అగ్నిధారాష్ట్రమును కాంగ్రెసునుండి తొలగించవచ్చునని నేను గాంధిమహాత్మునకు పంపిన తంతివార్తనుగూర్చి నన్ను ఒకప్పుడు గట్టిగ ఆలింగనము చేసి అభినందించెను. నాయందుగల అభిమానమును బట్టి నన్ను సెంట్రల్ జయిలుకు తీసుకొని రమ్మనమని సూపరింటెండెంటుకు చెప్పినను ఆయన అశ్రద్ధగనే యుండెనుగాని అన్సారీగారు పలుమారు చెప్పుటనలన నన్ను సెంట్రల్ జయిలుకు గొనిపోయిరి. నేను అక్కడ చేరిన సంగతి విని అన్సారీగారు నాయొద్దకు వచ్చి బహూకరించుచు ఆనందింపజేసెను. జయిలు భవనము నిండి పోవుటచేత వెలుపల ఆవరణలో డేరాలలో పలువురను ఉంచిరి. నన్ను మాడభూషి నరసింహాచార్యులుగారిని, గుండ్లపల్లి రామకృష్ణయ్యగారిని ఉన్న డేరాలోనే యుంచిరి. మా కందరికిని ప్రత్యేకముగ రుచిపాకములతో వంటచేసిపెట్టునట్లు అన్సారీ గారు ఏర్పాట్లుగావించిరి. జయిలులోనున్నను ఢిల్లీలో ప్రఖ్యాత పౌరులలో చేరినవారమగుటచేత వారి మాటలకు లక్ష్యము కలదు. మాకు కావలసిన భోజనపదార్థములు ఆయన స్వంత వ్యయమువిూద తెప్పించియుండునని తలంచుచున్నాను. మంచి గడ్డపెరుగు తెప్పించినారు. ఆంధ్రులు నెయ్యివిశేషముగవాడుమరనునది వాడుకగా వినియుండుటచేత కాబోలును అన్నము ఉడుకునప్పుడే నేయిపోసిదించిరి. మాకువడ్డించినఅన్నము అంతా నేతితో నిండియుండెను. దానిని తినుటకే సాధ్యముగాకపోయెను. కాని అన్సారీగారికి మా యందుగల ప్రీతియింత హెచ్చుగా

నున్నదని స్పష్టమయ్యేను. నన్ను సెంట్రల్ జయిలుకు తీసుకొని వచ్చినారనిన వార్త జయిలులోని తక్కిన భాగములలోనున్న వారికిని తెలిపినందున నన్ను దయతో కొందరు చూడవచ్చిరి. మాలవీయపండితుని కార్యదర్శిగానుండు ఆయన కుమారులలో నొకరైన శ్రీ గోవిందమాలవీయగారును, పునహాపట్టణ వాస్తవ్యులు ఇప్పుడు ఇండియా కేంద్రప్రభుత్వములో మంత్రులలో నొకరుగానుండిన శ్రీ గాడ్గిల్ గారును వచ్చినేను ఢిల్లీకి వచ్చినందుకు ప్రస్తుతించి చాలసేపు ముచ్చటించుచుండిరి. ఆ సాయంకాలము జయిలులో తిరుగబోయినపుడు మాలవీయపండితులును వెలుపలకు షికారుగా వచ్చిరి. అప్పుడు వారినినేనుసమీపించుట తోడనే పెద్దవాడవు నీవు గూడ వచ్చితివాయని నన్ను కౌగలించుకొనెను. మౌలానాఅబుల్‌కలామ్ ఆజాద్ గారినికూడ ఆసాయంకాలమే కలుసుకొని కొంతసేపు ఆయనతో ముచ్చటించుచు కాలము గడపితిని. మరునాడు అక్కడనే నిర్బంధింపబడియున్న శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మగారిని గూడ చూచి ఆమె ధైర్యమునకు ఆశ్చర్యము నొందితిని. ఇట్లు కాంగ్రెసు నాయకాగ్రేసరులు, ఉపనాయకులు, ప్రచారకులునుచేరి యొక్కచోట జయిలుభవనములందును, చుట్టును ఆవరణములో డేరాలలోను నిర్బంధితులైయున్నవారు మొత్తమున ఆరువేలుగా నుందురని లెక్కించబడిరి. ఇట్టి అత్యుత్సాహపరులు ప్రాణములు పోవుటకైన తెంపుచేసి సమావేశమైన త్యాగమూర్తులతో కలసియుండుట స్వర్గసౌఖ్యముననుభవించుచున్నట్లు మహదానందముకల్పించినది. దేశమునందు ముఖ్యులగు స్వరాజ్యసేనానీకముయొక్క మహా శిబిరమువలె చూపట్టినదిగాని అది చెరసాలగా గాన్పించలేదు.

ఎవ్వరిముఖముచూచినను ఎవ్వరి వచనములు విన్నను
మహోత్సాహ పూరితములగు వీరులవలెనే కనుపించిరి.
వీరినందరి నేమి చేయుచుర్రను విషయము నెవ్వరికిని స్పష్టముగ
తెలియకపోయినను ఏమిచేసినను లక్ష్యము చేయక జంకుగొంకు
లేని ప్రతాపవంతులుగా త్యాగము చేయుటకు సిద్ధముగానుండిరి.
ఇట్లు మూడురోజులు గడచునప్పటికి మాలవీయ పండితుని తీసు
కొనిపోయి ఖైదీగనే రైలు ఎక్కించి అల్లాబాదు మార్గమున
నేదియో నొక చిన్నస్టేషనుయొద్ద దించి వదలివేసిరను వార్త
జయిలు నందంతట ప్రాకిపోయెను. కాబట్టి ఈ రీతిగనే ఒక్కొక్క
రిని వదలివేయుదురను భావము వ్యాపించెను. ఆ ప్రకారముగనే
దినదినము కొందరిని వదలివేయుటకు నుద్దేశించి,జయిలుగేటులో
ఆనుకొనియున్న నొకగదిలోని మాజస్ట్రేటుగారియొద్దకు మమ్మ
గొనిపోయిరి. వారు మిమ్మలను వదలివేయుచున్నాము గనుక
మీరు వెళ్ళవచ్చునుగాని మీరు ఈ పట్టణములో నివాసము
చేయుక వెంటనే వెళ్ళిపోవలసినదని షరతుపర్వరచిరి. మేము అట్టి
షరతు అంగీకరింపజాలమనియు మాలో కొందరుఢిల్లీకి క్రొత్తగా
వచ్చినవారమగుటచేత ఢిల్లీ పట్టణమునకు చుట్టుప్రక్కలనున్న
కట్టడములను ప్రఖ్యాతస్థానములను చూడ నుద్దేశించుకొని
యున్నారు. కాబట్టి మేము కొన్నిరోజులుఢిల్లీలోనుండువారమే
గాని వెంటనే వెడలిపోవువారము కామని చెప్పుచుమీకు ఇష్టము
లేని యెడల నిర్బంధితులమై యుండెదమని స్పష్టీకరించితిమి.
అంతట కొంచెముసేపు నిదానముగ నాలోచించి మీరు వెడలి
పోవచ్చునని మీ ఇష్టమువచ్చినట్లు తిరుగవచ్చునని చెప్పి వదలి
వేసెను. మే మంతట రెండురోజులు ఢిల్లీలోనేయుండి కొన్ని

పురాతన కట్టడములనుదగ్గించి లాలీకోటకు వెళ్ళి కుతుబ్ మైనారు చూచి మూడవనాడు బయలుదేరి కొలది దినములకు ఇల్లు చేరితిమి.

ఇట్లు రహస్యముగ కాంగ్రెసు మహాసభ జరుపబడిన పిదప విధరాష్ట్రములలో ప్రాంతీయరాష్ట్రమహాసభలు సదుపబడిన . ఆంధ్రదేశములో గుంటూరులో నట్టి మహాసభ జరుగునియు కాకినాడ వాస్తవ్యులైన కమలాదేవిగారి ఆధిపత్యమున జరుపబడునియు ప్రతినిధులు రానలసినదనియు పత్రికలలో బాహాటముగ ప్రకటనలు గావింపబడెను. సభాసమావేశము నిమిత్తము ప్రయత్నములు రహస్యముగ సాగించబడుచుండెను. గుంటూరు అగ్రహారములో సంపత్కుమారాచారిగారిఅధ్వర్యము క్రింద ఈ ప్రయత్నములు సాగుచుండెను. కాని ప్రభుత్వోద్యోగుల కెవ్వరికిని ఈ రహస్యము తెలియలేదు. ఈ మహాసభ జరుగుటకు నునూరు పదునైదురోజులకు ముందుగనే నన్నును నేతి వెంకటాచలపతి, చావలిసూర్యప్రకాశరావు, గుండ్లపల్లిపున్నయ్యశాస్త్రి మొదలగువారి సనేకులను పట్టి గుంటూరు సబుజయిలులో నిర్బంధించిరి. పట్టణములో వీధివీధిరవేగుల నాంద్రుగ పనిచేయు పోలీసులు దుస్తులులేకుండ మామూలు వస్త్రములు ధరించి తిరుగుచు ఖద్దరు కట్టుకొనిన బజారున తిరుగుచున్న ప్రతి వారిని పట్టి బంధించుచుండిరి. ఇట్లు మేము ఉండిన జైలులో రెండువందలమంది రాజకీయఖైదీలు చేరిపోయిరి. మరియు పట్టణమునకు ఇతర గ్రామములనుండి చేరబారుచున్న కాంగ్రెసు వాలంటీరులనేకులను వందలకొలదిగ చెరసాలలో నిర్బంధింపసాగిరి.

గుంటూరులోని జయిలుఖానా చాలకపోయినందున మంగళగిరి నరసరావుపేట, బాపట్ల తెనాలి, వంగోలు, మొదలగుచోట్ల జయిళ్ళలోగూడ నుంచుటచేత అవి యస్నియు ఖైదీలతో నిండి పోయెను. ఇట్టివారు చాలాభాగము ఖద్దరుధరించు కాంగ్రెసు వాదులే. ఇట్లు రాత్రింబవళ్లు ప్రభుత్వభటులు దుస్తులుతొడుగు కొని వీథులలో సంచారము చేయువారు, బస్సులనెక్కి తిరుగు వారు, రహస్యముగ తిరుగు వేగులవారు. ఇట్లు పట్టణమంతయు ప్రభుత్వమువారి కావలిగాండ్రతో నిండియుండెను.ఇంత భద్రము లగు నేర్పాటులుగావించి ప్రజలకు భయము కల్పించుచున్న దినములలో రాష్ట్రీమహాసభ జరుగుననుట అసంభవముగనే తోచెను. మేము జయిలులో నున్నందున రహస్యప్రయత్నము లేమి జరిగినవో అప్పుడు తెలియలేకుగాని పిమ్మట తెలియ వచ్చినవి. రహస్యముగ నితర జిల్లాలనుండియు మన జిల్లాలలో ఇతర గ్రామములనుండియువచ్చినవారిని కొందరిని సంపత్కుమా రాచార్యులు ఎప్పుడు నివాసము చేయుచుండు వ్యాయామ శాలావరణమునందును మరికొందరిని సమీపముననున్న యిండ్లలోను రహస్యముగ చేర్చిరి. సభ సమావేశదినము స్పష్టముగ పత్రికలలోను గోడలకంటించబడిన ప్రకటన పత్రములవలనను తెలుపబడెను. సభాధ్యక్షురాలగు కమలాదేవిగారు మరికొందరి స్త్రీలతోగూడ కలసి కాకినాడనుండి బయలుదేరి తెనాలి మీదుగ మరికొంతదూరము రైలుమీదనే పట్టణము వెలుపునకే ప్రయాణముచేసి మధ్యనొక గ్రామములో దిగి తిరుగ వచ్చు బండిలో నెక్కి పెండ్లిచేసుకొనివచ్చు ముత్తయిదువులవలెక్రొత్త వస్త్రములు ధరించి తెనాలి మీదుగనే గుంటూరులోచేరి

యెవరివలన నే యాటంకము లేకుండ గ్రామములలోప్రవేశించిరి. పిమ్మట ఈ ముత్తయిదువులు కొన్నికొన్ని యిండ్లలో తమ తమకు వీలైన చోట్ల సంపత్కుమారాచార్యులవారి వ్యాయామ శాలా సమీప గృహములలోనే రహస్యముగనే రాత్రివేళనో ఏ సందు గొంది మారములనో ఏ దొడ్డిగోడలమీదుగనో దాటి ప్రవేశించిరి. పోలీసు భటులు మిక్కిలి జాగ్రత్తగ పెద్దవీధివైపున కావలికాయుచు మాటిమాటికి సంపత్కుమారాచారివ్యాయామ కళాశాలకు వచ్చి పోవుచు ఆ శాలయందు దృష్టి నిలిపియే యుండిరి. సంపత్కుమారాచార్యులుగాచును వారి మామూలు శిష్య నర్గమును మహాసభసమావేశ దినమునకు మొగడ రాత్రి ఆ వ్యాయామశాలానరణములో నొక పీఠమునిాద రామ పట్టాభిషేకపటము పెట్టి పూజ గావించుచు భజనలుచేయుచు నాలుగుజాములు జాగరణజేసి వ్రతము సాగించిరి. ఈ వ్రతోత్స వము జూచుటకు చుట్టుపక్కలవారు వచ్చుచు బోవుచుండిరి. కావలిగాయుచున్న పోలీసు భటులును వేడుకను జూచి ప్రసాద మును పుచ్చుకొని ఆనందించుచు భజనకాలక్షేపమును వినుచు చాలప్రొద్దుపోయిన పిమ్మట ఆ వ్యాయామకళాశాలానరణము నకు పోవు గలీకే యెమరు బజారులో నున్న యింటి అరుగుల మీాద పండుకొని రాత్రియంతయు భజనలు జాగరణలు చేసిన వారును వారివారి స్థానములకు వెడలిపోయిరి. ఇక నక్కడ అప్పుడు జరుగబోవు కార్యకలాపమేమియు లేనట్లే కొంతవడి నిశ్శబ్దముగనే యుండెను. బొజారు అరుగులమీాద పడుకొని నిద్రించిన పోలీసుకావలివారును లేచి కాలకృత్యములు తీర్చు కొనుటకు వెడలిపోయిరి. పుష్కరముహూర్తమున వ్యాయామ

శాలా సమీప గృహములనుండి నలుబదియేబది కాంగ్రెసు ప్రచారకులు తెల్లని ఖద్దరు దుస్తులు ధరించి గాంధీటోపీలు పెట్టుకొని సభాధ్యక్షురాలగు శ్రీమతి కమలాదేవిగారితోగూడ వెలుపల బజారునకువచ్చి సమీపమున బాజారునకు ఆనుకొనియున్న శ్రీ నరసింహాస్వామివారి ఆలయమునకెదుట, నున్న స్థలములో వందేమాతరగీతమునుబాడి, అధ్యక్షురాలి నెన్నుకొని ఆమె అచ్చొత్తించితెచ్చిన ఉపన్యాసమును పంచిపెట్టి ఆమె ఉపన్యాసమును చదివి ముగించిన పిదప కొన్నితీరుమానములు చేసి సభ వేగముగ ముగించుకొని వారందరును కలసి ఊత్సనమునబయలు దేరినట్లు జాతీయగీతములు పాడుచు శ్రీ నరసింహాస్వామివారి కోవెల వీధి పడమట కొనవరకుపోయి అక్కడనుండి స్థలచేగువు నకు ప్రక్కగ కేతరాజు జగన్నాథము పంతులుగారి కోనేటి ప్రక్కను శివాలయమువీధిగుండ నడచి శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవాలయమున కెమరుగానున్న పెద్దబజారున కొంతవరకు పోవు వరకు నిరాటంకముగ ఊత్సనము సాగినది. ఈలోపల సభ సనూ వేశము గావించుకొని కాంగ్రెసు ప్రచారకులు బాజారున ఊత్సన ముతో బయలుదేరినారను వార్త పట్టణమంతట ప్రాకిపోయినది. అప్పుడు పోలీసు సూపరింటెండెంటు, ఇన్స్పెక్టర్లు, సబుఇన్స్పెక్టర్లు, పోలీసు భటులుపరుగులిడుచువచ్చి ఈ ఊత్సనములో చేరినవారి నందరిని పట్టుకొని మేమందరము ఉన్న కారాగృహమునకే తీసుకొనివచ్చి వారి నందరిని ప్రక్కగదులలో నిర్బంధించి పెట్టిరి. ఈ వర్తమానము విని మే వందరమును మిక్కిలి సంతసించితిమి. ప్రభుత్వమువారు మహాసభ జరుగకుండ చేయవలెనను మహత్తర ప్రయత్నములు భగ్నములు గావించి

మిక్కిలి యుక్తిగ మహాసభను జరిపి ఉత్సవముతో వెలుపల పట్టణములో కొంతనడచి పట్టుబడిన తోడికాంగ్రెసువాదుల త్యాగశీలము ఆశ్చర్యము కల్పించెను. అందుకు ముఖ్యముగ ఈ సభను జయప్రదముగ నడిపించుటకు అత్యంత రహస్య ప్రయత్నములుగావించిప్రభుత్వమువారిఅడ్డుబాటుకు అవకాశము లేకుండజేసిన శ్రీ సంపత్కుమారాచారిగారియొక్కయు వారి అనుచరులయొక్కయు ప్రభావమును మెచ్చుకొంటిమి.ఇట్లుమహా సభాసమావేశము గావించిన వారినందరిని నొక్కజట్టుగముంచు విచారణచేసి వారినందరి నొక్కసంవత్సరము కఠినశిక్షవిధించి బళ్లారి కారాగృహమునకు పంపినేసిరి. వారందరును మహాసభ గావించినట్లు స్వయముగ నొప్పుకొని వాజ్మూలములు నిచ్చిరి.

ఇకను అంతకు ముందు ఇరువదిరోజులక్రిందటనే నిర్బంధి తులమైన మా మీద నేమి నేరము ఆరోపించుటకును పోలీసు వాడికి ఆలోచన తోచలేదు. వాస్తవమున మాలో పలువురు ఆ మహా సభా సమావేశవిషయములో పాల్గొనినవారముగ నుండ లేదు. పలువురు వినినట్లు ఆట్టి సభ జరుపుటకు ప్రయత్నములు జరుగుచున్నని తెలిసినవారుమాత్రముగనే యున్నారు. కాబట్టి గుంటూరులో జరుగుమహాసభకు తోడ్పాటు లేకుండజేయుటకే ప్రభుత్వాధికారులు మమ్ము కారాగృహమున నిర్బంధించిరి. కావున గుంటూరు మహాసభతో మాకు సంబంధము కలదను నేరము మామీద ఆరోపించుటకుఅవకాశములేకపోయెను. కాని ఈ రాష్ట్రీమహాసభ ముగిసిన పిమ్మట గుంటూరుజిల్లామహాసభ తెనాలిలో జరుపుమని వాడుకయొకటి సాగించబడినది. ఆ

సభ సమావేశవిషయమున కొందరెవ్వరో జయులులో నున్న
మాతో వచ్చి సంప్రదించి మా వలన సలహాలు పొంది సభ
సమావేశపరచుటకు యత్నించు చున్నట్లు ఒక చిత్రకథ కల్పించి
దానిని ఆధారముగ మా మీద విచారణ డిప్యూటీమాజిస్ట్రేటు
న్యాయముగారి యెదుట ప్రారంభించిరి. మమ్మ ఫుమారు
ఇరువ్వగుమందిని నేరస్తులుగనే చెప్పుచు ప్రాసిక్యూటింగు
ఇన్స్పెక్టరుగారు మా మీద కేసు ముందు వివరించిపిమ్మట ఒక
పోలీసుజవానును సాక్షిగావిచారణచేసియుండిరి. ఆసాక్షిమాత్రో
కొందరితో తెనాలివా రెవ్వరో తెనాలి మహాసభను గూర్చి
సంప్రదింపులు జరుపుచుండగా తాను దగ్గిరఉండివినినట్లుచెప్పెను.
మేము అడుసవాళ్ళు వేయుక మానుకోటివి. మేము డిసైన్సు
పెట్టుకొనదలచలేదని మాజస్ట్రేటుగారికి ముందుగనే తెలిపితిమి
కాని మా వలన స్టేషియతులు (Statements) తీసుకొనుట అవ
సరము గనుక స్టేషియతు లియ్యవలసినడని ఒక్కొక్కరి నడుగ
నారంభించెను. అంతట ముద్దాయి లందరును కలసి నేను ఇచ్చిన
సేటుమెంటే తమ రందరిచ్చిన సేటుమెంటుగా సమ్మతించు
చున్నాము గనుక నా యొక్కనివలన మాత్రమే సేటుమెంటు
పుచ్చుకొనుట సంభవించెను. నేను మేమెన్నారమును నేరస్తులమని
ప్రభుత్వము తరపున తేబడిన సాక్ష్యమునలన రుజువు కాలేదని
స్పష్టపరచుచు మమ్మ ముందు గుంటూరులో జరుగబోవు
మహాసభలో పల్గొనకుండ చేయుటకై పట్టుకొని
చెరలోపెట్టి యింతకాలము మా పైని ఎట్టినేరము మోపుటకు
అవకాశము లేనందున మమ్మ వదలి వేయుటకు బదులు ప్రభు
త్వమువారు తమ ప్రతిష్టనిలుపుకొనుటకు అబద్ధపు కల్పనకల్పించి

మేము తెనాలిలో మహాసభ సమావేశపరచుటకు సలహాలిచ్చినా
మనియు అందు నిమిత్తము ఎవ్వరో ఇతరులు మాతో సంప్ర
దింపులు జరిపినారనియు సాక్ష్యము ఇచ్చినారు. ఈ సాక్ష్య
మిచ్చినవారు పోలీసు జవాను. ఈయన ఎవ్వరికైన ఈ
సంప్రదింపులను గురించి ఏ అధికారికైన రిపోర్టు పంపినట్లు
గాని, సంప్రదింపులు చేసినవారు, ఎవరిఅధికారమును పొంది
యెప్పుడు సంప్రదింపులు జరిపినదియు తెలుపుటకు తగిన రికారు
గాని కోర్టులో దాఖలుచేయలేదు. ఇంతకుముందు దాఖలుచేయ
లేదనిన మాట యేల? అట్టిరికార్డు వారు తేజాలకు ఏలననగా
అట్టి సంప్రదింపులు జరిగినవికావు. అధికారుల ఉత్తరువు పొంద
నిది వెలుపలి వారెవ్వరైన జయిలులోనున్న ఖైదీతో సంప్రదించు
టకు అవకాశము లేదనుట స్పష్టము. అట్టి సంప్రదింపులుగాంచి
నట్లు ప్రమాణమేదియు లేదు గావున ఈ రెండువందలమందిలో
నెవ్వరితో సంప్రదించినారో ఎవ్వరు సలహా యిచ్చినారో వారి
వివరణలు సాక్ష్యము చెప్పియుండలేదు. ముద్దయిలందరితోడను
సంప్రదించినారనుట కేవలము అసంభవము, అభూతకల్పనకాబట్టి
మా పైన నేరము మోపుటకు అవకాశములేదని స్పష్టీకరించితిని.
ఇందుకు సమాధానమేమి చెప్పుదురని మాజస్ట్రేటుగారు ప్రాసి
క్యూటింగు అధికారిని ప్రశ్నించిరిగాని వారేమియు సమాధానము
చెప్పలేకపోయిరి. ఇట్టిసిత్తిలో వీరి నే నేరమునకు శిక్షించనలసి
నదో చెప్పవలసినదని మరల మాజస్ట్రేటుగారు ప్రాసిక్యూషను
ఇన్స్పెక్టరుగారిని అడిగిరికాని తాను పలికించిన సాక్ష్యము చెప్పిన
వాక్యములను బట్టి తేలిన నేరమునకే శిక్షించనలెనని మొండి
వాదము గావించిరి. అంతట మాజస్ట్రేటుగారు మమ్మునందరిని

జయిలుగదులలోనికి తీసుకొని పొమ్మని ఉత్తరువు చేసి కోర్టు ముగించి లేచిపోయెను. మరునాడు జిల్లాకలెక్టరును కలుసుకొని మా పైన మోపబడిన నేరము రుజువుపరచుటకు తగిన సాక్ష్యము బొత్తుగా లేనప్పుడు వారిని శిక్షించుటెట్లని వాదించిన మీదట ఉభయులు ఏదియో యొక ఆలోచన గావించుకొనిరి. ఆ సాయంకాలము వరల మమ్మునందరిని కోర్టుకరప్పించిమిమ్మల నందరిని ఒక ప్రశ్న వేయుదును దానికి జవాబు చెప్పవలసినదని కోరుచు తెలుగులో జరుగబోవు మహాసభకు మీరు హాజరగు దురా లేదా తెలుపవలసినదని నన్ను ప్రశ్నించిరి. ముందెప్పుడో జరుగునో జరుగదోయని సంశయాస్పదమగు సభకు మీరు హాజరగుదురా లేదా యను ప్రశ్న ఎంతమాత్రమును సహేతుక ముగ లేదనియు ఆ ప్రశ్నకు ప్రత్యుత్తరము చెప్పజాలము, సందర్భములనుబట్టి పోవచ్చును లేక పోకపోవచ్చును. ఇప్పుడే మియును నిర్ధారణముగ చెప్పజాలమని స్పష్టీకరించితిని. తక్కిన నా తోడి ముద్దాయిలందరు అట్లే పలికిరి. స్పష్టముగ మేము సభకు పోవుటలేదని ప్రత్యుత్తరము చెప్పలేదుగనుక మీరు పోవుటకు నిశ్చయించుకొన్నారని నిర్ణయించి మిమ్మిప్రూచీఖత్తు లిమ్మనిన మీరు ఇయ్యలేదు గనుక మిమ్మి పోలీసులు సంవత్సరము శిక్ష విధించమని కోరుచున్నారుగాని నేను ఆరుమాసములు మాత్రమేనిడితిని నిర్ణయించుచున్నానని మాజస్ట్రేటు గారు తీర్పు చెప్పిరి. మేము జైలుకుపోవ సంసిద్ధులముగనేయున్నారము కాని ఈ సబ్ జయిలులో ఇరువదిరోజులనుండి వేసవి కాలములో చాల బాధపడినాము గనుక యిండ్లకుబోయితలంటి స్నానములుచేసి భోజనములుచేసి మరలి వచ్చెదముగావున

మమ్మ్మ తాత్కాలికముగ విడుదల చేయువలసినదని కొందరు ముద్దయిలు కోరగా అందరికిని ఆ ప్రకారము తెలవిచ్చి సాయం కాలము ఆరుగంటలకు తప్పక ప్రతివారును హాజగు కావలెనని ఆజ్ఞాపించెను. అందుకు సమ్మతించి అందరును వారివారి యిండ్లకు బోయి మరల ఆరుగంటలకు తప్పక అందరును జయిలుదగ్గిర మాజస్ట్రేటుగారియెదుట హాజరైరి. ఆ రోజులలో నా భార్య పక్షవాతముతో మంచము మీద బాధపడుచుండెను. రెండు రోజులకు మా పై విచారణ ప్రారంభమగుననగా ఒకడుదయము లోగడ రాత్రి నా భార్య రక్తము గ్రక్కినంచున చాల ప్రమాద స్థితిలో నున్నదని తెలిసినందున ఆమెను చూడవలెనని నేను కోరినందున నన్ను ఇంటికిబోవుటకు అనుజ్ఞ యిచ్చిరి. ఆయనుజ్ఞ ప్రకారము విచారణరోజున మరల హాజరైతిని విచారణపూర్తి యైన పిదప తక్కినవారివలె నేనును ఇంటికిబోయి మరల ఆరు గంటలకు హాజరైతిని. మాకు నోటిమాటలతో తెలవులిచ్చుటయే గాని మా వలన ప్రాతరూపకమైన హామీ ఆయన కోరకుండ గనే యిండ్లకుబోవుట కనుమతియిచ్చెను. ఆ రోజులలో కాంగ్రెసు వాదులు మాట చెప్పినప్రకారము జగుపుదురను విశ్వాసము సర్వజనులకు కలిగియుండెను. ఇట్టి విశ్వాసము ఎంతయుండినను మాజస్ట్రేటు స్వతంత్రముతో నట్టి అనకాశమిచ్చుట మా కందరి కిని ఆయన యుదారభావమునుగూర్చి మిక్కిలి ఆశ్చర్యము కలిగెను. మాకు శిక్ష విధించుటకు ఆయనకు సమ్మతిలేకపోయి నను కలెక్టరుగారి నిర్బంధమువలనను ఉద్యోగమును వదల జాలకను శిక్షవేయుటకు నిశ్చయించెను. మేము అందరము హాజ రైనతోడనే మాలో కొందరికి ఏ. క్లాసులు, కొందరికి బి. క్లాసులు,

గొందరికి సి. క్లాసులును నిర్ణయించి పోలీసుల అధీనము చేసి వేసెను. వారు గొలుసులుమాకు తగిలించవలెనని గొలుసులు తీసుకొనివచ్చిరి. గాని మాజస్ట్రేటుగారే నలదని వారించెను. అంతటమమ్మునందరిని కైలు ఎక్కించి రాజమహేంద్రవరమునకు గొనిపోయిరి.

జయిలువారి శెలవును పొంది నా భార్యనుచూడవచ్చి రోజున నా భార్యను చూచుటకు నా తమ్ముడు హరినారాయణ మా యింటికి వచ్చియుండెను. నా భార్యకు ప్రమాదము తప్పినది. ఎప్పటినలెనే పక్షపాతవ్యాధిచేత మంచములో నున్నది. నేనును నా తమ్ముడు హరినారాయణగారును భోజనము చేసి మా యింటికి వెలుపల సరండాలోకి వచ్చునప్పటికిమా తమ్ముడు గారు కాపురముండు పాతగుంటూరునుంచి ఒక మనుష్యుడు వచ్చి ఆయన భార్యకు కలరా తగిలి ప్రమాదముగ నున్నదను వార్త తెచ్చెను. నా యొద్ద కలరావ్యాధికి పండితగోపాలాచార్యులనారి యౌషధములు కొంతకాలము క్రిందట తెప్పించి నవి యున్నవి. ఆ ఔషధములుతీసికొని నేనును నా తమ్ముడును బయలుదేరి పోవుచు మేము నడచిపోవునప్పటికి కాల హరణమగునని నడచుచుండ దారిలో నొకమోటారుకారు శ్రీ నడింపల్లి లక్ష్మీనరసింహారావుగారి నిలబెట్టియున్నది. అదిచూచి మా అవసరమును తెలుపుచు మోటారుకారు పాతగుంటూరువరకు ఇయ్యవలసినదని ప్రార్థించుచు నము పంపగా వారు వెంటనే సమ్మతించిరి. ఆ రోజులలో నర సింహారావుగారు కాంగ్రెసుకు వ్యతిరేకముగా ప్రవర్తించుచుండి

V.R. LIBRARY
V.R. COLLEGE MEMORIAL
ACC. NO.
DATE

నందున నాకును వారికిని సరియైన స్నేహసంబంధము లేకుండెను. అయినను ఈ వర్తమానము వినుటతోనే వారు సహాయము చేసినందుకు నే నెంతయు వారి సహాయమునకుకృతజ్ఞతభావము నా మనస్సున తోచెను.

మోటారుమీద పాతగుంటూరు చేరునప్పటికి వాంతులు చనములగుచుండుటచేత మిక్కిలి హీనస్థితిలో నున్న నా మరదలిని చూచితిని. ఇంకొక తమ్ముని భార్యఆమె దగ్గిరనేయుండి యుపచారము చేయుచుండెను. నేను వెంటనే నా యొద్దనున్న మందులు వాడుచు సాయంకాలమువరకు అచ్చటినే యుంటిని. వ్యాధి తగ్గి ఇకను ప్రాణభయము లేదని ధైర్యముతోచినపిమ్మట మరల ఇంటికిబోయి అచ్చటనుండి జయిలుసకు బోతిని. ఇట్లు ఆ రోజు నేను శలవు పుచ్చుకొని వెలుపలకు వచ్చినందుకు ప్రాణో పద్రవములో నున్న నా మరదలికి సహాయము చేయుటకు పరమేశ్వరుడు అవకాశము కల్పించెనని సంతసించితిని.

మువసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA101B134
పుస్తకం పేరు	దేశభక్త కొండ వేంకటప్పయ్య పంతులు స్వీయచరిత్ర02
తారీఖు	31 December 2025
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	234
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	Nagamalleswari
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good.